

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 47

శుక్రవారం 9-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | G UNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నూతన పోప్.. రాబర్ట్ ప్రివోస్ట్

- పోప్ లియో–14 పేరుతో క్యాథలిక్ గురువుగా పట్టం
- అమెరికా నుంచి పోప్‌గా ఎన్నికైన తొలి వ్యక్తిగా రికార్డు..

16 లో



రాజస్తాన్‌లోని జైసల్మేర్‌పై పాకిస్తాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను ధ్వంసం చేస్తున్న ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్

దాయాది దుస్సాహసం..

దీటుగా బదులిచ్చిన భారత్

యుద్ధం మొదలైంది

లాహోర్ నుంచి కరాచీ దాకా ముప్పేట దాడులు

అంతకుముందు సరిహద్దుల్లో దాడులతో కవ్వించిన పాక్



సైనిక, పౌర లక్ష్యాలపై హమాస్ తరహాలో పాక్ క్షిపణులు, డ్రోన్లు

ఆపరేషన్ సిందూర్‌తో కూడా దాయాది బుద్ధి తెచ్చుకోలేదు. పైపెచ్చు పనిగట్టుకుని యుద్ధ జ్వాలలను రగులుస్తోంది. భారత్‌పై భారీ స్థాయిలో సైనిక దాడులకు తెగించింది. హమాస్ ఉగ్ర సంస్థను తలపిస్తూ పౌర లక్ష్యాలపై ఎడాపెడా క్షిపణి, డ్రోన్ దాడులకు దిగింది. రాజస్తాన్ నుంచి కశ్మీర్ దాకా సరిహద్దుల వెంబడి దాడులకు పాక్ చేసిన యత్నాలను భారత్ పూర్తిస్థాయిలో తిప్పికొట్టింది. భారీ ప్రతి దాడులతో ముచ్చెమటలు పట్టించింది. ఇస్లామాబాద్, కరాచీ, లాహోర్, పెషావర్, రావల్పిండిలపై 24 గంటల వ్యవధిలోనే రెండుసార్లు విరుచుకుపడి కీలక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు తదితరాలను తుత్తునియలు చేసింది. దాడుల ధాటికి ప్రధాని షహబాజ్ షరీఫ్ బంకర్లో తలదాచుకున్నారు! కరాచీ నౌకాశ్రయంపై మన నేవీ బాంబుల వర్షం కురిపించింది. పరిస్థితులు ఇరు దేశాల నడుమ పూర్తిస్థాయి యుద్ధం దిశగా సాగుతున్నాయి...

వివరాలు, మరిన్ని వార్తలు 6,7 పేజీల్లో

ప్రతి ప్రయత్నాన్నీ పూర్తిస్థాయిలో తిప్పికొట్టిన మన సైన్యం

- 3 పాక్ ఫైటర్ జెట్లకూల్చివేత, ఇద్దరు పైలట్ల పట్టివేత
- పాక్ నగరాలపై క్షిపణుల వర్షం, ఎయిర్ డిఫెన్స్ తుత్తునియలు
- పాక్ ప్రధాని నివాస పరిసరాలు నేలమట్టం, బంకర్లోకి షహబాజ్
- రంగంలోకి నేవీ, కరాచీ నౌకాశ్రయంపై బాంబుల వర్షం
- పాక్‌వైపు కదులుతున్న 20కి పైగా భారత యుద్ధ నౌకలు
- సరిహద్దుల్లో భారీగా కాల్పులు, విమానాశ్రయాల మూసివేత
- తారస్థాయికి ఉద్రిక్తతలు, పూర్తిస్థాయి యుద్ధం దిశగా పరిస్థితులు
- ప్రధానితో ఎన్ఎస్ఏ దోవల్ అత్యవసర భేటీ

సుదర్శన చక్రమే రక్ష

- దాయాది దాడులను తుత్తునియలు చేసిన గగనతల రక్షణ వ్యవస్థ
- పాక్ క్షిపణులు, డ్రోన్లను గాల్లోనే పేల్చేసిన అధునాతన ఆయుధ వ్యవస్థ

అప్రమత్తంగా ఉండండి



+ మంత్రిత్వ శాఖలు, సంస్థల మధ్య సమన్వయం కీలకం
+ ఉన్నతస్థాయి సమీక్షలో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

ఐపీఎల్ వాయిదా?

- ఆటగాళ్ల భద్రతకే ప్రాధాన్యం
- ముందు దేశం... తర్వాతే వినోదం
- జీసీసీఐ నిర్ణయం నేడు

15 లో

ఇదంతేనట్



'సాక్షి'పై కక్ష సాధింపు

ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో సోదాలు

- సెర్చ్ వారంట్ లేకుండా ఇంట్లోకి చొరబడి బెదిరింపులు
- దాదాపు నాలుగు గంటలపాటు హల్‌చల్
- సంబంధం లేని విషయాలపై ప్రశ్నలు
- న్యాయస్థానాల తీర్పులు బేఖాతరు.. పోలీసుల దాష్టీకంపై మండిపడ్డ పాత్రికేయులు

2లో



విజయవాడలో 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంలోకి చొరబడి సోదాలు చేస్తున్న పోలీసులు

ప్రశ్నించే గొంతు నొక్కేస్తారా?

ఎడిటర్ ఇంట్లోకి దౌర్జన్యంగా చొరబడి సోదాలా?

ఇది వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమే

సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి ఆగ్రహం

2 లో

మందుపాతర్లు పేల్చిన మావోయిస్టులు

- ముగ్గురు గ్రేహౌండ్స్ కమాండోల మృతి
- ఆర్ఎస్ఐకి గాయాలు..హైదరాబాద్‌కు తరలింపు
- ములుగు జిల్లా వాజేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన
- మాటు వేసి మందుపాతర్లు పేల్చారు: డీజీపీ

- 5లో

భారత్‌వైపు కన్నెత్తి చూస్తే

నూకలు చెల్లినట్లే

- ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిక
- ఆడబిడ్డల సిందూరాన్ని తుడిచేయాలనుకొనే వారికి ఆపరేషన్‌సిందూరే సమాధానం

2 లో

ఇది పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమే

- 'సాక్షి'దినపత్రిక ఎడిటర్ ఇంట్లో ఏపీ పోలీసుల సోదాలు సరికాదు
- టీయూడబ్ల్యూజే నేతలు అల్లం నారాయణ, మారుతి సాగర్

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఎలాంటి నోటీసులు లేకుండా 'సాక్షి'దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి ఇంటికి వెళ్లి సోదాలు చేయడాన్ని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ ఖండించారు. ఇది పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని గురువారం వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల పక్షం నిలిచే వారి విషయంలో సోదాలు, నిర్బంధించడం ఎంత మాత్రం సమంజసం కాదని హితవుపలికారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి..

సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సోదాలు చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు విరాహత్ అలీ తీవ్రంగా ఖండించారు. ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి అని ఆయన అభివర్ణించారు. ఎడిటర్ ఇంట్లో ఎవరినో దాచిపెట్టారని వెతకడానికి వచ్చినట్లు పోలీసులు ఆ తర్వాత చెప్పడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ఈ విషయంపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేస్తామన్నారు.

కావాలని తప్పుడు కేసులు..

'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి ఇంటిలో ఏపీ పోలీసులు సోదాలు చేయడాన్ని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం తీవ్రంగా వ్యతిరేకించింది. కావాలని సాక్షి ఎడిటర్‌పై తప్పుడు కేసులు నమోదు చేశారని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏపీ ప్రభుత్వం కక్ష సాధిస్తోంది..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'సాక్షి'ఎడిటర్ ధనంజయరెడ్డిపై కక్ష సాధిస్తోందని, అందులో భాగంగానే ఆయన ఇంటిపై పోలీసులు దాడి చేశారని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాదిగ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛకు భంగం కలిగితే జర్నలిస్ట్ యూనియన్‌లన్నీ ఒకటై పోరాడుతాయని పేర్కొన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రజాస్వామికవాదులు, మేధావులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ధనంజయరెడ్డికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏపీ పోలీసుల సోదాలు అనుచితం

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్

సాక్షి, హైదరాబాద్: 'సాక్షి'దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టడం, ఎలాంటి నోటీసులు లేకుండానే ఆయన ఇంటికెళ్లి ఏపీ పోలీసులు సోదాలు చేయడం అనుచితమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఖండించింది. సాక్షి ఎడిటర్‌తో పాటు మరికొందరు సాక్షి విలేకరులపై గత నెలలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులు పెట్టిందని.. ఇప్పుడు సెర్చ్ వారెంట్ లేకుండా ఎడిటర్ ఇంటికి వెళ్లి పోలీసులు సోదాలు చేయడం, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడమేనని విమర్శించింది. జర్నలిస్టులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పని చేసేందుకు వీలైన పరిస్థితిని కల్పించాలని టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బస్వపున్నయ్య, ఐఎఫ్‌డబ్ల్యూజేఎఫ్ జాతీయ కార్యదర్శి పి.ఆనందం, టీపీజేఏ అధ్యక్షులు పి.రాధిక, ప్రధాన కార్యదర్శి జ్యోతిబసు, హెచ్‌యూజే అధ్యక్షుడు అరుణ్ కుమార్, కార్యదర్శి బి.జగదీశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆసుపత్రుల రూఫ్ టాప్‌లపై 'రెడ్‌బ్యాండ్'

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పౌర సంరక్షణ చర్యలు



సంగారెడ్డి జిల్లా ప్రభుత్వాసుపత్రి రూఫ్‌టాప్‌పై ఏర్పాటు చేసిన రెడ్‌బ్యాండ్ పెయింటింగ్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరిట చేపట్టిన దాడుల నేపథ్యంలో పౌర సంరక్షణ సంసిద్ధతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల రూఫ్ టాప్‌లపై రెడ్ బ్యాండ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆసుపత్రి భవనంపై 12 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పు సైజుతో తెల్లటి ఫ్లోర్ పెయింట్ వేశారు. తర్వాత దీని మధ్యలో నాలుగు అడుగుల వెడల్పుతో రెడ్‌క్రాస్ పెయింట్‌ను వేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రులపై ఈ రెడ్ బ్యాండ్ పెయింటింగ్ వేస్తున్నట్లు తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఎంఐడీసీ) అధికారులు తెలిపారు. తెలుపు, ఎరుపు రంగుల్లో ఉండే ఈ ఫ్లోర్ పెయింట్ వల్ల హెలికాప్టర్లు, విమానాల నుంచి చూస్తే అవి ఆసుపత్రులని తెలుస్తుందని వివరించారు.





1. ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లోకి అనుమతిలేకుండా పోలీసుల చొరబాటు
2. పోలీసులను ప్రశ్నిస్తున్న ధనంజయరెడ్డి



సాక్షి ప్రధాన కార్యాలయం వద్ద ధర్నాలో ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, ఎడిటోరియల్ డైరెక్టర్ వర్ధెల్లి మురళి, జర్నలిస్టులు

సాక్షిపై కక్ష సాధింపు

ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో సోదాలు

సెర్చ్ వారెంట్ లేకుండా ఇంట్లోకి చొరబడి బెదిరింపులు

సాక్షి, అమరావతి: ప్రజల గొంతుకగా నిలుస్తున్న 'సాక్షి'పై చంద్రబాబు కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు, వేధింపులకు బరితెగిస్తోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తుండటంతో కక్షకట్టి పోలీసులను ఉసిగొలిపి బెదిరింపులకు దిగుతోంది. రాజ్యాంగాన్ని కాలరాస్తూ, పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తూ ఎమర్జెన్సీ నాటి దురాగతాలకు పాల్పడుతోంది. ఏకంగా సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి విజయవాడ నివాసంలో గురువారం సోదాల పేరుతో బెదిరింపు చర్యలకు పాల్పడటం ప్రభుత్వ కుట్రకు పరాకాష్టగా నిలుస్తోంది. కనీసం సెర్చ్ వారంట్ కూడా లేకుండా, నోటీసు కూడా ఇవ్వకుండా గురువారం ఉదయం 9 గంటలకే విజయవాడ ఏసీపీ దామోదర్‌తోపాటు పలువురు పోలీసు అధికారులు సాక్షి ఎడిటర్ నివాసంలోకి ప్రవేశించి సోదాల పేరుతో హల్‌చల్ చేశారు. అసలు పోలీసులు ఎందుకు వచ్చారని ఆయన ప్రశ్నించినా సరైన సమాధానం ఇవ్వలేదు. తన నివాసంలో సోదాలు చేసేందుకు సెర్చ్ వారంట్ చూపించాలని అడిగితే పట్టించుకోకుండా అన్ని గదుల్లో తనిఖీలు కొనసాగించడం గమనార్హం. ఏ కేసులో సోదాలు చేస్తున్నారు.. ఏం కావాలని ఎడిటర్ ధనంజయ రెడ్డి ఎంతగా అడిగినా ఏసీపీ దామోదర్ కనీస సమాధానం కూడా ఇవ్వలేదు. సమాచారం తెలిసిన పాత్రికేయ సంఘాల ప్రతినిధులు, పాత్రికేయులు హుటాహుటిన ఆయన నివాసానికి చేరుకున్నారు. కానీ వారిని పోలీసులు లోపలికి అనుమతించలేదు. ఇంటి తలుపులు వేసి.. ధనంజయ రెడ్డిని ఎవరూ కలవకుండా అడ్డుకున్నారు. ధనంజయ రెడ్డికి ఏమాత్రం సంబంధం లేని అంశాలపై ప్రశ్నించారు. ఇంట్లో ఎవరెవరు ఉంటారు... మీరు ఎప్పుడు వచ్చారు.. అంటూ ప్రశ్నలు వేయడం గమనార్హం. ఎందుకు అలా ప్రశ్నిస్తున్నారని అడిగితే సమాధానం మాత్రం చెప్ప లేదు. తమను లోపలికి అనుమతించాలని పాత్రికేయులు ఎంతగా కోరినా పోలీసులు పట్టించుకోలేదు. పోలీసులు అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక వైఖరి, దౌర్జన్యపూరిత తీరుకు నిరసనగా పాత్రికేయులు అక్కడే ఆందోళన చేపట్టారు.

> **సెర్చ్ వారంట్ ఇవ్వకుండానే ఇచ్చినట్లు**

ఉదయం 11 గంటల సమయంలో తాము సోదాలు చేసినట్టు ఓ కాగితంపై రాసి సంతకం చేయాలని ధనంజయ రెడ్డికి చెప్పారు. సిట్ దర్యాప్తు చేస్తున్న మద్యం కేసులో నిందితులు ఉన్నారేమోనని తెలుసుకునేందుకు తాము సెర్చ్ వారంట్‌తో వచ్చి సోదాలు నిర్వహించినట్టు పేర్కొనడం గమనార్హం. దీనిపై ఎడిటర్ ధనంజయ రెడ్డి అభ్యంతరం తెలిపారు. అసలు మద్యం కేసులో నిందితులు తన నివాసంలో ఎందుకు ఉంటారని ఆయన పోలీసులను నిలదీశారు. కొంత కాలం నుంచి హైదరాబాద్‌లో ఉంటున్న తాను బుధవారం రాత్రే విజయవాడ వచ్చానని తెలిపారు. కేవలం సాక్షి పత్రికను బెదిరించేందుకే ఎడిటర్ నివాసంలో సోదాల పేరుతో హడావుడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు సెర్చ్ వారంట్ ఇవ్వకుండానే ఇచ్చినట్టు.. అనంతరమే సోదాలు నిర్వహించినట్టు ఎలా రాస్తారని.. తాను ఎందుకు సంతకం చేయాలని ఆయన ప్రశ్నించారు. తన న్యాయవాదితో సంప్రదించిన తర్వాతే సంతకం చేస్తానన్నారు. దాంతో న్యాయవాది మనోహర్ రెడ్డిని పోలీసులు లోపలికి అనుమతించారు. పోలీసుల తీరును న్యాయవాది మనోహర్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు.

ఏదైనా సరే నిబంధనల ప్రకారం చేయాలని, పోలీసులు ఇష్టారాజ్యంగా చేయడానికి వీల్లేదని న్యాయస్థానాలు స్పష్టం చేస్తూ ఇచ్చిన తీర్పులను ఆయన ఉదహరించారు. వ్యక్తి స్వేచ్ఛే అత్యున్నతమైందన్న న్యాయస్థానాల తీర్పులను కూడా ఖాతరు చేయరా అని పోలీసులను నిలదీశారు. కాసేపు తర్జనభర్జనల అనంతరం పోలీసులు సెర్చ్ వారంట్‌ను అప్పటికప్పుడు పెన్‌తో రాసి ఇచ్చి.. తాము సోదాలు చేసినట్టు పంచనామా నివేదికను సమర్పించి వెళ్లిపోయారు. దాదాపు మూడు గంటలపాటు పోలీసులు సోదాల పేరుతో సాక్షి ఎడిటర్ నివాసంలో హల్‌చల్ చేశారు. కేవలం సాక్షి గొంతు నొక్కేందుకే ఇలా బెదిరింపులకు పాల్పడినట్టు స్పష్టమవుతోంది.

వాస్తవాలు రాయకుండా అడ్డుకునే ప్రయత్నమే.. సోదాలు

ఎడిటర్ ఇంట్లో సోదాలు పత్రికా స్వేచ్ఛకు విఘాతం

- ఐజేయూ మాజీ అధ్యక్షుడు, స్టీరింగ్ కమిటీ సభ్యుడు అమర్
- సాక్షి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా

సాక్షి, హైదరాబాద్: పత్రికలు రాసే వాస్తవాలు రుచించక అడ్డుకునే ప్రయత్నంలో భాగంగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జర్నలిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఏకంగా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసులచే సోదాలకు తెగబడినట్టు కనిపిస్తోందని ఐజేయూ మాజీ అధ్యక్షుడు, స్టీరింగ్ కమిటీ సభ్యుడు అమర్ ధ్వజమెత్తారు. విజయవాడలో ధనంజయరెడ్డి నివాసంలో పోలీసులు సోదాలు చేయడాన్ని నిరసిస్తూ గురువారం హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించిన జర్నలిస్టుల నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎడిటర్ ఇంట్లో పోలీసులు జరిపిన సోదాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది పత్రికా స్వేచ్ఛకు విఘాతమన్నారు. పత్రికలు రాసే వాస్తవాలు కొన్నిసార్లు ప్రభుత్వాలకు రుచించవని, వారిని ఒత్తిడికి గురిచేసి సత్యాలు రాయకుండా చేసే ప్రయత్నమే పోలీసుల సోదాలుగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని మెప్పించే క్రమంలో పత్రికాస్వేచ్ఛపై దాడి చేయడం, ఏకంగా ఎడిటర్, జర్నలిస్టులపై ఇలాంటి చర్యలకు పాల్పడటం ద్వారా పోలీసుశాఖ ప్రతిష్ట మరింత దిగజారుతోందన్నారు. రాజకీయ పక్షాలు అధికారంలోకి వస్తుంటాయి..పోతుంటాయి..అధికారం శాశ్వతం కాదని, ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్నవారు రేపు ఉండకపోవచ్చన్నారు.

రక్షణరేఖ దాటి పత్రికా స్వేచ్ఛపైకి వచ్చారు: వి.మురళి

అధికార పక్షాన్ని సంతృప్తిపర్చేందుకు ఏపీ పోలీసులు రక్షణరేఖ దాటి పత్రికా స్వేచ్ఛపైకి వచ్చారని సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ వి.మురళి దుయ్యబట్టారు. ఏపీ ప్రభుత్వ అసహనం ఏ స్థాయిలో ఉందంటే...ఎడిటర్ ఇంట్లో సోదా ఘటన తీరు స్పష్టం చేస్తుందన్నారు. పోలీసుల తీరు ఎంత హాస్యాస్పదంగా ఉందంటే.. నిందితుడి కోసం వెతుకుతున్నారట.. సాక్షి ఎడిటర్ ఇంట్లో దాక్కున్నాడేమో అని సోదాలు చేశారట అని దుయ్యబట్టారు. ఏమైనా అది లష్కరే తోయబా క్యాంపా.. అపార్ట్‌మెంట్. అందులో 50 ఫ్లాట్లు. ఒక ఫ్లాట్‌లో సాక్షి ఎడిటర్ ఉంటున్నారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాయెుద్దు.. నిజాలు బయటకు రావొద్దు.. వారు చేస్తున్న కుంభకోణాలు బయటకు రావొద్దు... అలా రాయకుండా ఉండాలంటే అటువంటి వార్తలు రాసే సంస్థలో పనిచేసే సిబ్బందిని భయపెట్టడమే మార్గమన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఎడిటర్ ఇంటిపై దాడి చేసి సోదాలు చేసి ఆ మెసేజ్‌ను కింది స్థాయికి పంపించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. పోలీసులు ఏడాది కాలంగా ప్రభుత్వంలో ఉన్నవారిని, అధికారంలో ఉన్నవారిని సంతృప్తిపర్చేందుకు చేపడుతున్న చర్యలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జర్నలిస్టులు, సాక్షి సిబ్బంది పాల్గొన్నారు. కాగా, సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసుల సోదాలను నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలువురు జర్నలిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నాలకు దిగి కలెక్టర్లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ వినతిపత్రాలు అందజేశారు.

ప్రశ్నించే గొంతు నొక్కేస్తారా?

- ఎడిటర్ ఇంట్లోకి దౌర్జన్యంగా చొరబడి సోదాలా?
- సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి ఆగ్రహం
- ఇది వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమే
- నోటీసుల్లేకుండా భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించారు



సాక్షి, అమరావతి: ఎలాంటి నోటీసులు లేకుండా ఓ పత్రిక ఎడిటర్ ఇంట్లోకి పోలీసులు దౌర్జన్యంగా చొరబడి సోదాలు చేయడం దేశ చరిత్రలో ముందెన్నడూ జరగలేదని, ప్రశ్నించే గొంతును నొక్కేస్తారా.. అని సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డి కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇది వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమే కాకుండా, ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగానే భావిస్తున్నానని చెప్పారు. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ రాజకీయ కుట్రలో భాగంగా సోదాల పేరిట పోలీసులు వ్యవహరించిన నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తామని, న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. విజయవాడలోని తన నివాసంలో గురువారం పోలీసుల సోదాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇసుక, లిక్కర్, మైనింగ్, విద్యుత్ స్కామ్‌లతో పాటు విజయవాడలో వరదలు, తిరుమలలో తొక్కిసలాట, సింహాచలంలో ప్రభుత్వ నిర్లక్ష్యం.. రైతులకు మద్దతు ధర కల్పించకపోవడం వంటి వరుస వైఫల్యాలను ఎండగడుతున్న సాక్షి గొంతునొక్కాలనే యత్నమిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటడంలో, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడంపై ప్రజల మూడ్‌ను రిఫ్లెక్ట్ చేసే ప్రయత్నంలో సాక్షి తన బాధ్యతను నిర్వర్తిస్తోందని చెప్పారు. దాన్ని ఓర్వలేకనే ఇలాంటి దుర్మార్గపు చర్యలకు ఒడిగడుతున్నారని, దీనిని ఖండించకపోతే ఎవరింట్లోకైనా సరే ఇలాగే చొరబడతారన్నారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరి మీదా కేసు పెట్టకూడదని సుప్రీం కోర్టు, హైకోర్టులు స్పష్టంగా చెబుతున్నప్పటికీ.. పోలీసులకు చట్టం, న్యాయం, రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం లేనట్టుగా కన్పిస్తోందని చెప్పారు. 'ఉదయం ఉన్న ఫళంగా పది మంది పోలీసులు ఇంట్లోకి చొర బడ్డారు. ఎలాంటి నోటీసు ఇవ్వలేదు. ఒక డీఎస్పీ, సీఐలతో పాటు పెద్ద ఎత్తున పోలీసులు లోపలికి వచ్చి, ఇల్లు సెర్చ్ చేస్తాం.. ఇది ఓపెన్ చేయండి.. అది ఓపెన్‌చేయండి.. ఇంట్లో ఉన్న వాళ్లను వాళ్లెవరు.. వీళ్లెవరు.. అంటూ ఆరాలు తీయడం దుర్మార్గం' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఏమన్నారంటే..

నాపై ఇప్పటికే 3-4 కేసులు పెట్టారు

ఇప్పటికే నాపై మూడు నాలుగు కేసులు పెట్టారు. ఒకటి సభా హక్కుల ఉల్లంఘన కేసు అన్నారు. ఒక వార్త రాస్తే గవర్నమెంట్ దగ్గర నుంచి కాటమనేని భాస్కర్ ద్వారా ప్రాసిక్యూషన్ చేయడానికి అనుమతి జారీ చేశారు. మొన్నటికి మొన్న తెలంగాణ, ఏపీ ఎడిషన్‌లో ఒకే వార్త వేర్వేరుగా రిపోర్టు అయ్యిందని మరో కేసు పెట్టారు. జర్నలిజం మౌలిక నియమాలు, ఓనమాలు తెలిసిన వారెవరికైనా ఇదేంటని తెలుసు. ఎక్కడన్నా ఒక ఘటన జరిగితే ఆ ప్రాంత రిపోర్టర్ స్పాట్ రాస్తారు. సొంత ఊళ్లో ఉన్న రిపోర్టర్‌కు మరిన్ని వివరాలు తెలుస్తాయి కాబట్టి మరింత లోతుగా ప్రజంట్ చేస్తారు. దాన్ని అడ్డం పెట్టుకొని నాపై కేసు పెట్టారు. కొంత మంది సాక్షి పాత్రికేయులపై కూడా కేసులు పెట్టారు. ఇదంతా సాక్షి గొంతునొక్కే ప్రయత్నంగా చూడాల్సి వస్తుంది.

రాజకీయ ఒత్తిళ్లతోనే సోదాలు

ఎందుకొచ్చారు.. సెర్చ్ నోటీసు ఉందా? దాంట్లో నా పేరు ఏమైనా ఉందా? అని సోదాలకు వచ్చిన పోలీసు అధికారులను చాలా స్పష్టంగా అడిగాను. 'లేదు సర్.. ఇన్ అండ్ అరౌండ్ సెర్చ్ చేస్తున్నాం.. జస్ట్ ఊరికే మీ ఇల్లు చూసేసి పోతాం' అని చెప్పారు. కానీ వాళ్లు వ్యవహరించిన తీరు చూస్తుంటే రాజకీయ ఒత్తిళ్లతోనే సోదాల పేరిట వచ్చారని స్పష్టంగా కన్పించింది. నా కార్ నంబర్, నా ఫోన్ నంబర్లు తీసుకున్నారు. వారు స్పష్టమైన లక్ష్యం, ఉద్దేశంతోనే వచ్చినట్టుగా స్పష్టమైంది. వారు చెబుతున్న లిక్కర్ కేసులో నిందితులు నా ఇంట్లో ఎందుకు ఉంటారు? వారికి నాకు ఏమైనా సంబంధం ఉందా? ఇక్కడకు ఎందుకు వస్తారు? ఏమైనా అడిగితే పై నుంచి ప్రెజర్స్ ఉన్నాయని చెబుతున్నారు. ఇదంతా పొలిటికల్ మోటివేషన్‌తో జరుగుతోందని అర్థమవుతోంది.

భారత్ వైపు కన్నెత్తి చూస్తే నూకలు చెల్లినట్లే

ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిక

- ఆడబిడ్డల సిందూరాన్ని తుడిచేయాలనుకొనే వారికి ఆపరేషన్ సిందూరే సమాధానమని స్పష్టీకరణ
- 140 కోట్ల మంది భారతీయులంతా సైన్యానికి అండగా నిలబడతారని వ్యాఖ్య
- దేశ సార్వభౌమాధికారంపై ఎవరు దాడి చేసినా వదలబోమనే సందేశాన్ని ఇస్తున్నట్లు వెల్లడి
- సైన్యానికి సంఘీభావంగా సచివాలయం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ



సంఘీభావ ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, రవిగుప్తా, సీవీ ఆనంద్ తదితరులు

ఖైరతాబాద్: ఉగ్రవాదాన్ని పెంచి ప్రోత్సహిస్తూ భారత సార్వభౌమాధికారంపై దాడి చేయాలనుకొనే వారికి ఈ భూమిపై నూకలు చెల్లినట్లేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. అలాంటి వారు భూమ్మీద నివసించేందుకు అర్హత కోల్పోయినట్లేనని తేల్చిచెప్పారు. 'పాక్ ఉగ్రవాదులు, పాక్ పాలకులు సహా అంతర్జాతీయ ముఖచిత్రంలో ఉన్న ఏ దేశమైనా సరే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారతదేశ సార్వభౌమత్వంపై దాడి చేయాలనుకొని భారత్ వైపు చూస్తే వారికి ఈ భూమిపై నూకలు చెల్లినట్లే'అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా కేంద్రం ఆపరేషన్ సిందూర్‌కు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు నిర్వహించిన జాతీయ సంఘీభావ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా మంత్రులు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ర్యాలీ పొడవునా సీఎం జాతీయ జెండాను పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పహల్గాం ఉగ్రదాడి మృతుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ ప్రసంగించారు.

ఆపరేషన్ సిందూర్‌తోనే సమాధానం..

భారతదేశ శాంతి ఆకాంక్షను చేతకానితనంగా భావించి ఎవరైనా భారత భూభాగంలో కాలుమోపి ఆడబిడ్డల సిందూరాన్ని తుడిచి వేయాలనుకొనే వారికి ఆపరేషన్ సిందూరే సమాధానమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా శత్రుమూకను నేలమట్టం చేసే శక్తి మన జవాన్లకు ఉందన్నారు. వీర జవాన్లకు 140 కోట్ల మంది భారతీయులు అండగా నిలబడతారని రేవంత్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా... పార్టీలు, జెండాలు, ఎజెండాలకు అతీతంగా 140 కోట్ల భారతీయులంతా భరతమాత రక్షణలో ఏకమై... దేశ సార్వభౌమాధికారంపై ఎవరు దాడి చేసినా వదలబోమనే సందేశాన్ని తెలంగాణ నడిగడ్డ నుంచి వీర జవాన్లకు ఇస్తున్నామన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీని కలిసి సంపూర్ణంగా అండగా నిలబడతామని.. ఉగ్రవాదుల పీచమణచాలని మద్దతిచ్చారని సీఎం చెప్పారు.

గాంధీజీ శాంతియుత పోరుతోనే పాక్‌కూ స్వాతంత్ర్యం..

భారత్‌తోపాటు స్వేచ్ఛను అనుభవిస్తున్న పాకిస్తాన్ సైతం స్వాతంత్ర్యాన్ని పొందిందంటే అందుకు జాతిపిత మహాత్మా గాంధీ చేపట్టిన శాంతియుత పోరాటమే కారణమని సీఎం రేవంత్ గుర్తుచేశారు. ఈ విషయాన్ని పాక్ తెలుసుకోవాలన్నారు. భారత్ తలుచుకుంటే పాక్ ప్రపంచ పటంలో ఉండదని హెచ్చరించారు.

రాష్ట్రంలో పరిస్థితులపై కేంద్ర హోంశాఖ ఆరా

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, శాంతిభద్రతలు, సీఐడీ చీఫ్‌లు

సాక్షి, హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లో తాజా పరిస్థితులపై కేంద్ర హోంశాఖ వర్గాలు ఆరా తీస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో పరిస్థితులను రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు కేంద్ర హోంశాఖ అధికారులకు వివరించారు. ఈ మేరకు గురువారం కేంద్ర హోంశాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ కార్యాలయం నుంచి రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం డీజీ శివధర్‌రెడ్డి, సీఐడీ డీజీ శిఖాగోయల్, శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ పాల్గొన్నారు. బుధవారం నిర్వహించిన మాక్‌డ్రిల్ గురించి వివరించారు. హైదరాబాద్ నగరంలో రేపటి నుంచి మిస్‌వరల్డ్ పోటీలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా దేశాల నుంచి వచ్చిన అతిథులకు కల్పిస్తున్న భద్రత, వారు బసచేసే హోటళ్ల వద్ద రక్షణ చర్యలు, మిస్‌వరల్డ్ పోటీలు నిర్వహించే వేదికల వద్ద, పోటీదారులు పర్యటించే ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ సూచించినట్టు తెలిసింది.

ప్రజాసంబంధాలు మెరుగుపర్చుకోండి

- యువ ఐపీఎస్‌లతో సమీక్షలో డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: విధి నిర్వహణలో రాణించాలంటే ప్రజాసంబంధాలను మెరుగుపరుచుకోవాలని డీజీపీ డాక్టర్ జితేందర్ అసిస్టెంట్ ఎస్పీలకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అసిస్టెంట్ ఎస్పీలు, శిక్షణలో ఉన్న అసిస్టెంట్ ఎస్పీల పనితీరును డీజీపీ తన కార్యాలయంలో సమీక్షించారు. వారు విధులు నిర్వహిస్తున్న ప్రాంతాల పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పరిస్థితులు, తన అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ చట్ట పరిధిలో వివిధ శాఖల అధికారులు, ఉన్నతాధికారులతో సత్సంబంధాలను కలిగి ఉండాలని.. తద్వారా ఉత్తమ పోలీసు అధికారులుగా గుర్తింపు పొందవచ్చన్నారు. విధులు నిర్వర్తించే ప్రాంతాల్లోని ఆచారాలు, కట్టుబాట్ల గురించి తప్పక తెలుసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్, ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, వి.సత్యనారాయణ, శాంతిభద్రతల ఏఐజీ రమణకుమార్ తదితరులు తమ అనుభవాలను ఏఎస్పీలతో పంచుకున్నారు. సమావేశానికి అసిస్టెంట్ ఎస్పీలు బి. చైతన్య, రాహుల్‌రెడ్డి, కాజల్, అవినాష్, శివ ఉపాధ్యాయ, చేతన్ నితిన్, శుభం, పి. మౌనిక, శేషాద్రినిరెడ్డి, వసుంధర, మానం భట్, రిత్విక్ సాయి, సాయికిరణ్ హాజరయ్యారు.



నియామక పత్రాలు అందజేస్తున్న పొన్నం

ఉద్యోగ నియామకాలతో సమర్థ పాలన

మంత్రి పొన్నం ప్రభాకర్

- 132 మంది హెచ్‌డబ్ల్యూఓలకు నియామక పత్రాల అందజేత

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామకాలతో పాలన మరింత సమర్థవంతంగా సాగుతోందని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ పరిధిలో కొత్తగా ఎంపికైన 132 మంది వసతి గృహ సంక్షేమాధికారులకు గురువారం సచివాలయంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ వసతి గృహాల్లోని విద్యార్థుల భవిష్యత్‌ను తల్లిదండ్రుల మాదిరిగా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్రంలోని 703 సంక్షేమ గురుకులాల్లో హెచ్‌డబ్ల్యూఓ పోస్టులను భర్తీ చేశామన్నారు. వృత్తిలో అడుగుపెడుతున్న అందరికీ పొన్నం అభినందనలు తెలిపారు. బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ కొత్త అధికారుల రాకతో అన్ని హాస్టళ్లు మరింత పురోగతి సాధిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలమాయాదేవి, గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ చేస్తే గొప్ప... మేం చేస్తే తప్పా?

గుజరాత్, యూపీల్లో నదుల పునరుద్ధరణ జరుగుతోంది

- అదే పని ఇక్కడ మూసీలో చేస్తుంటే కొందరికి నచ్చట్లేదు
- ఆక్రమణల్ని తొలగిస్తుంటే రియల్ ఎస్టేట్ డౌన్ అంటారు
- ఆ 400 ఎకరాలను అభివృద్ధి చేద్దామంటే ప్రకృతి విధ్వంసం అంటున్నారు
- హైడ్రా ఠాణా ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు



హైడ్రా వాహనాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మేయర్ విజయలక్ష్మి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: గుజరాత్‌లో సబర్మతి, యూపీలో గంగా, ఢిల్లీలో యమునా నదుల పునరుద్ధరణ కొందరికి గొప్పగా వినిపిస్తోందని.. అలాంటప్పుడు తెలంగాణ ప్రజల కోసం మూసీ నదిని ప్రక్షాళన చేస్తే వచ్చే ఇబ్బంది ఏమిటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మనం గొప్పగా బతకవద్దా? అని నిలదీశారు. ప్రధాని మోదీ చేస్తే గొప్ప ఎలా అవుతుందో.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తే తప్పు ఎలా అవుతుందో ప్రజలు ఆలోచించాలని కోరారు. హైదరాబాద్‌లోని బుద్ధభవన్ వద్ద ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పోలీసుస్టేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాల వల్ల తలెత్తుతున్న వరదలు, హైడ్రా ఆవశ్యకత సహా వివిధ అంశాలపై స్పందించారు.

హైడ్రా కూల్చడానికే కాదు...

రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది కేవలం కూల్చడానికి మాత్రమే కాదని.. నిర్మాణాలు చేపట్టేందుకు కూడానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు పాల్పడే వాళ్లు ఎంత గొప్ప వాళ్లయినా చట్టం ముందు సమానులేనని నిరూపించడానికే హైడ్రా తీసుకుకొచ్చినట్లు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో 940 చెరువులకుగాను 491 చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. పెద్దపెద్ద నాలాలు మూసుకుపోయాయి. చిన్న వర్షానికే కాలనీలు మునిగిపోతున్నాయని.. రోడ్లపై వరదనీటితో గంటల తరబడి ట్రాఫిక్‌జామ్‌లు ఏర్పడుతున్నాయన్నారు. వాటి నుంచి ప్రజల్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా? అని ప్రశ్నించారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా అంటారేంటి?

చెరువులను కాపాడినా, నాలాల ఆక్రమణలు తొలగించినా, అక్రమ నిర్మాణాలను పడగొట్టినా, మూసీని పునరుద్ధరించాలని చూసినా రియల్ ఎస్టేట్ పడిపోతోందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. 'రియల్ ఎస్టేట్ పెంచుదామని ఐఎంజీ భారత్ అనే ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టిన 400 ఎకరాలను 20 ఏళ్ల తర్వాత వెనక్కు తెచ్చాం. రూ. 50 వేల కోట్ల పెట్టుబడితో లక్ష ఉద్యోగాలు వచ్చేలా అభివృద్ధి చేయాలనుకున్నాం. కానీ అక్కడ చెట్టు ఉంది, పుట్ట ఉంది, పాము ఉంది, పిట్ట ఉంది... అవి ఎలా బతుకుతాయి అంటూ ఆ 400 ఎకరాల అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. అసలు మీ బాధ ఏంటి? చెరువులను కాపాడి, మూసీని ప్రక్షాళించి నాలాలు, రోడ్లపై ఆక్రమణల్ని తొలగిస్తే ప్రకృతిని కాపాడినట్లు కాదా? ఆక్రమణలను తొలగిస్తుంటే రియల్ ఎస్టేట్ పడిపోతుంది అంటున్నారు. మరోవైపు రూ. వేల కోట్ల పెట్టుబడులతో ఐటీ, ఫార్మా కంపెనీలను తీసుకొచ్చి లక్షలాది ఉద్యోగాలు ఇప్పించి ఒక ఇన్ఫర్మేషన్ నాలెడ్జ్ సెంటర్‌ను తయారు చేద్దామంటే ప్రకృతి నాశనం అయిపోతోందంటున్నారు. అలాంటి వాళ్ల ఆలోచనల్లో ప్రభుత్వాన్ని ముందుకు వెళ్లనీయద్దు, ప్రజలకు మేలు జరగనీయద్దనేది స్పష్టంగా కనిపిస్తోంది. కబ్జాల్లో ఉన్న చెరువులను కాపాడాల్సిన అవసరం ఉందా లేదా? అనేది ప్రజలే ఆలోచించాలి' అని సీఎం రేవంత్ సూచించారు.

మూసీని పునరుద్ధరించి తీరుతాం...

ప్రతిపక్ష నేతలు మాత్రం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ జన్వాడ, ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లలో విశాలమైన భవంతుల్లో బతుకుతున్నారని.. పేదలు మాత్రం మూసీలోనే, మురికిలోనే చావాలా? అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం మూసీని పునరుద్ధరించి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు. త్వరలోనే అధికారులు, ప్రజాప్రతినిధులు మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజలతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తారని వివరించారు. నిర్వాసితులకు వేరే ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు ఇస్తామని.. అవసరమైతే ప్రతి 5 కి.మీ. ప్రాంతాన్ని ఒక క్లస్టర్‌గా తీసుకొని అపార్ట్‌మెంట్లు కట్టిస్తామన్నారు.

మానవీయ కోణంలో వ్యవహరించాలి..

హైడ్రా మానవీయ కోణంలో వ్యవహరించాలని సీఎం రేవంత్ సూచించారు. పేదలపట్ల సానుభూతితో, పెద్దలపట్ల కఠినంగా ఉండాలని స్పష్టం చేశారు. పేదలకు ప్రత్యామ్నాయం చూపించాలని అధికారులను ఆదేశించారు.

నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు కట్టిస్తాం

భూభారతి చట్టం దేశానికే రోల్‌మోడల్: పొంగులేటి



నమూనా ఇంటిని ప్రారంభిస్తున్న పొంగులేటి

నకిరేకల్: రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేద వారందరికీ కట్టించి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేశామని, ఇంకా మూడు విడతలుగా మంజూరు చేస్తామని చెప్పారు. గురువారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం దేశానికి రోల్ మోడల్‌గా కానుందన్నారు. ధరణిపై గొప్పలు చెప్పిన కేసీఆర్‌ను ఆ ధరణియే బంగాళాఖాతంలో పడేసిందన్నారు. కేసీఆర్ కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు దోచుకున్నారని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొద్దికాలంలోనే ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. జూన్ 2 నుంచి ప్రతి రెవెన్యూ గ్రామానికి తహసీల్దార్ స్థాయి అధికారులు వచ్చి భూసమస్యలను పరిష్కారం చేస్తారన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధ్యక్షతన జరిగిన ఈ సభలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేలు, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంబురం లేకుండా చేస్తున్నరు: హరీశ్

సాక్షి, హైదరాబాద్: ఇరిగేషన్ శాఖలో 224 ఏఈ, 199 జేటీవోలుగా ఎంపికైన అభ్యర్థుల పరిస్థితి గందరగోళంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన సంబురాన్ని లేకుండా ఈ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. పది రోజుల్లో ఐదుసార్లు నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని వాయిదా వేసి, వారి జీవితాలతో ఆడుకోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.



మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇది ప్రజల ప్రభుత్వం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

- మంత్రులు దామోదర, తుమ్మల, పొంగులేటితో కలిసి ఖమ్మంలో మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దొరలు, నాయకుల కోసం కాకుండా ప్రజల అవసరాలను తీర్చేలా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నూతన భవనాల నిర్మాణానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆపై కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్యశాఖపై సమీక్షించారు.

ఏడాదిలోనే రూ.11,482 కోట్లు

బీఆర్‌ఎస్ పాలనలో వైద్య రంగానికి ఏటా సగటున రూ.5,950 కోట్లు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే రూ.11,482 కోట్లు వెచ్చించిందని భట్టి వెల్లడించారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ బిల్లులు సైతం తాము చెల్లిస్తూ, పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో ఇప్పటివరకు 90 లక్షల కుటుంబాలకు లబ్ధి జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు చిలువలు పలువలుగా ప్రచారం చేస్తున్నారని, గత పాలకులు రూ.ఏడు లక్షల కోట్లు అప్పు చేసినా ఏనాడూ ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేదని భట్టి ఎద్దేవా చేశారు.

ట్రామా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం: మంత్రి దామోదర

రాష్ట్రంలో ప్రతీ 35 కి.మీ.కు ఒకటి చొప్పున మొత్తం 84 ట్రామా సెంటర్లు ఏర్పాటు చేయనున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. ప్రపంచ బ్యాంక్ మంజూరు చేసిన రూ.4,100 కోట్ల నిధులలో రూ.37 కోట్లతో వరంగల్‌లో రీజినల్ కేన్సర్ సెంటర్, ఖమ్మంలో ఆర్గాన్ రిట్రీవల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల ప్రజలు హైదరాబాద్ వెళ్లే పని లేకుండా స్థానికంగానే సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు బలోపేతం చేస్తున్నామన్నారు.

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్య, వైద్యానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా మెడికల్ కళాశాలలు, అనుబంధంగా నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు అవుతున్నాయన్నారు.
- రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా స్థల సేకరణ చేసి ఖమ్మంలో వైద్య కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. గత ప్రభుత్వం మెడికల్ కళాశాలలను మధ్యలో వదిలేస్తే వాటిని పునఃప్రారంభించే దిశగా చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్ దత్, రాయల నాగేశ్వరరావు, డాక్టర్ నరేంద్రకుమార్, ఫణీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీట్ల పెంపు నిర్ణయం సర్కార్‌దే

- ఇంజనీరింగ్ కాలేజీలకు తేల్చిచెప్పిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల పెంపుపై నిర్ణయం తీసుకొనే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదేనని హైకోర్టు తేల్చిచెప్పింది. సీట్లకు సంబంధించి గతంలో హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులను ఈ ఏడాదికి కూడా వర్తింపజేయాలన్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల విజ్ఞప్తిని తోసిపుచ్చింది. ప్రభుత్వ నిర్ణయంలో వివక్ష కనిపించట్లేదని.. అందువల్ల జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది.

సీట్ల పెంపు, విలీనం కోరుతూ..: బీటెక్, బీఈలో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ తదితర కోర్సుల్లో సీట్ల పెంపునకు ప్రభుత్వం నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ పలు ఇంజనీరింగ్ కాలేజీలు గతేడాది హైకోర్టుకెక్కాయి. తమకు నిరాకరించి.. కొన్ని అన్‌ఎయిడెడ్ విద్యాసంస్థలకు మాత్రం అనుమతి మంజూరు చేయడాన్ని ప్రశ్నించాయి. ప్రభుత్వానిదే తుది నిర్ణయమంటూ సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేయడంతో కాలేజీలు అప్పీల్‌కు వెళ్లాయి. విచారణ చేపట్టిన ద్విసభ్య ధర్మాసనం పెంచిన సీట్లకు మాప్ అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మాప్ అప్‌లో పెంచిన సీట్లను 2024–25 విద్యాసంవత్సరానికి కూడా వర్తింపజేయాలని, బీటెక్ (సీఎస్ఈ) సీట్లను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాలేజీలు అభ్యర్థించాయి. కానీ ఈ విజ్ఞప్తిని ప్రభుత్వం తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ సీఎంఆర్, మల్లారెడ్డి, ఎంఎల్‌ఆర్, మర్రి లక్ష్మారెడ్డి, సెయింట్ మార్టిన్స్ తదితర కళాశాలలు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్.. పిటిషనర్లు చేసిన వాదనలకు ఎలాంటి ఆధారాలు సమర్పించనందున పిటిషన్లను కొట్టేశారు.

మూడోదశ 'టెలిమెట్రీ'కి ఒప్పుకోం

కృష్ణా బోర్డుకు లేఖలో తేల్చిచెప్పిన ఏపీ ప్రభుత్వం

- దీనిపై తెలంగాణ అభిప్రాయాన్ని కోరిన బోర్డు

సాక్షి, హైదరాబాద్: తమ రాష్ట్ర పరిధిలో కృష్ణా పరీవాహకంలోని 11 ప్రాజెక్టులపై మూడో విడత కింద అదనపు టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటుకు అంగీకరించబోమని ఏపీ ప్రభుత్వం తేల్చిచెప్పిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. తెలంగాణ చేసిన ప్రతిపాదనలను ఒప్పుకోబోమంటూ ఏపీ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మార్చి 10న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు లేఖ రాయగా ఈ లేఖపై అభిప్రాయాన్ని తెలియజేయాలంటూ బోర్డు ఈ నెల 6న తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శికి లేఖ రాసింది.

11 చోట్ల అదనంగా టెలిమెట్రీలు పెట్టాలన్న తెలంగాణ

శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఎస్ఆర్ఎంసీ కాల్వకు విడుదల చేస్తున్న నీటిని బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలించి అక్కడి నుంచి తెలుగుగంగ, హంద్రీనీవా, కేసీ కాల్వ వంటి వేర్వేరు ప్రాజెక్టులకు ఏపీ మళ్లిస్తోందని తెలంగాణ జనవరి 21న జరిగిన 19వ సమావేశంలో బోర్డుకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి నీటిని తరలించే తెలుగుగంగ రెగ్యులేటర్, ఎస్కేప్ రెగ్యులేటర్, ఎస్ఆర్‌బీసీ రెగ్యులేటర్ (బనకచర్ల), జీఎన్ఎస్ఎస్ రెగ్యులేటర్ వద్ద టెలిమెట్రీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. అలాగే శ్రీశైలం జలాశయం వెనక భాగం నుంచి నీటిని తీసుకొనే హంద్రీనీవా (ముచ్చుమర్రి), కేసీ కాల్వ (ముచ్చుమర్రి), హంద్రీ నీవా–కేసీ కాల్వ (న్యాలాల)తో పాటు చెన్నముక్కపల్లి (ఆఫ్‌టేక్), గురురాఘవేంద్ర ఎత్తిపోతల, తుంగభద్ర ఎగువ కాల్వ, పోలవరం కుడి కాల్వ–సాగర్ ఎడమ కాల్వ అనుసంధానం వద్ద సైతం టెలిమెట్రీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరింది.

కుదరదన్న ఏపీ

తెలంగాణ ప్రతిపాదనలను జనవరి 21 నాటి భేటీలోనే తిరస్కరించినట్లు బోర్డుకు మార్చిలో రాసిన లేఖలో ఏపీ స్పష్టం చేసింది. ఇప్పటికే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద టెలిమెట్రీ కేంద్రం ఉన్నందున తెలంగాణ ప్రతిపాదించిన ప్రాజెక్టులన్నీ దాని పరిధిలోకే రానున్నాయని.. అందువల్ల వాటికి ప్రత్యేకంగా టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటు అవసరం లేదని పేర్కొంది. తెలుగుగంగ, బనకచర్ల, జీఎన్ఎస్ఎస్, వెలిగోడు, హంద్రీ నీవా (ముచ్చుమర్రి), తుంగభద్ర హెచ్ఎల్‌సీ, పోలవరం కాల్వ–నాగార్జునసాగర్ ఎడమ కాల్వ అనుసంధానం వద్ద టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటు అవసరం లేదని ఆ సమావేశంలో నిర్ణయించినట్లు గుర్తుచేసింది. 2018 అక్టోబర్ 16న జరిగిన 9వ బోర్డు సమావేశంలో తొలి, రెండో విడతల కింద 27 ప్రాజెక్టుల వద్ద టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం జరిగిందని గుర్తుచేసింది.

భూమ్యాకాశాల విశ్వ సామ్రాజ్యాధిపత్యం ఆయనకే చెందుతుంది.
ఆయన ఎవ్వరినీ సంతానంగా చేసుకోలేదు.
విశ్వసామ్రాజ్యాధిపత్యంలో ఆయనకు భాగస్వాములెవ్వరూ లేరు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 9 మే 2025

ఎట్టకేలకు స్వేచ్ఛా వాణిజ్యం

భారత్‌–బ్రిటన్‌ల మధ్య ప్రస్తుత వాణిజ్యాన్ని అనేక రెట్లు పెంచగలదని భావిస్తున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై రెండు దేశాలూ గురువారం ఒక అంగీకారానికి రావటం ద్వైపాక్షిక వాణిజ్యంలో కీలక మలుపు. త్వరలో న్యూఢిల్లీలో రెండు దేశాల ప్రధానులూ సమావేశమై లాంఛనంగా ఈ ఒప్పందాన్ని ఖరారు చేసుకుంటారు. వివిధ అంశాలపై ఇద్దరి దృక్పథాలూ వేర్వేరు కావటం, ఇద్దరూ పట్టువిడుపులు ప్రదర్శించకపోవటం తదితర కారణాల వల్ల ఒప్పందంపై మూడేళ్లుగా ఎడతెగని చర్చలు సాగాయి. వాస్తవానికి ఇరు దేశాల వాణిజ్యమూ 2004 నుంచి ఊపందుకుంది. ముఖ్యంగా ఔషధాలు, దుస్తులు, వాహనాల విడిభాగాలూ, సర్వీసు రంగాల్లో మన దేశం నుంచి బ్రిటన్‌కెళ్లే ఎగుమతుల పరిమాణం బాగా పెరిగింది. అదే సమయంలో బ్రిటన్‌నుంచి మన దిగుమతులు కూడా చెప్పుకోదగ్గ స్థాయికి విస్తరించాయి. నిరుటి గణాంకాల ప్రకారం బ్రిటన్‌ మన నుంచి 3,300 కోట్ల డాలర్ల మేర దిగుమతులు చేసుకుంటుండగా, బ్రిటన్‌కు మన ఎగుమతులు 2,300 కోట్ల డాలర్ల వరకూ వున్నాయి. ఈ వాణిజ్యాన్ని మరింత విస్తరించుకోవటానికీ, సరుకుల నాణ్యతను పెంచటానికీ ఈ ఒప్పందం మార్గ నిర్దేశం చేయబోతోంది. ఒప్పందం అమల్లోకి రాగానే 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం 12,000 కోట్ల డాలర్లకు చేరుతుందని ఇరు దేశాలూ అంచనా వేస్తున్నాయి.


యూరోపియన్‌ యూనియన్‌ (ఈయూ) నుంచి బయటికొచ్చినప్పటి నుంచీ కష్టాలు పడుతున్న బ్రిటన్‌ను గోరుచుట్టుపై రోకటి పోటులా కరోనా మహమ్మారి కాటేసింది. దాంతో అంతంత మాత్రంగా వున్న ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ఈయూ సభ్యదేశంగా ఆ ప్రాంత దేశాలకు ఎలాంటి అవరోధాలూ లేకుండా సాగిపోయిన ఎగుమతులు ఇప్పుడు ఎన్నో సమస్యల్ని ఎదుర్కొనాల్సి వస్తోంది. ఈయూ నుంచి వెలుపలకు రావటంవల్ల 2022 మధ్యకల్లా ఉత్పాదకత 5.5 శాతం మేర తగ్గింది. ఇక అప్పటి నుంచీ వాణిజ్యాన్ని మెరుగుపరుచుకోవటానికి గల అవకాశాల అన్వేషణ ఎక్కువైంది. ముఖ్యంగా చురుకైన ఆర్థిక వ్యవస్థలతో ఒప్పందాలు కుదిరితే పరిస్థితి మెరుగవుతుందని అక్కడి ప్రభుత్వం భావిస్తోంది. భారత్‌ ఇప్పటికే ప్రపంచంలో అయిదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. 2028 నాటికి మూడో స్థానానికి ఎగబాకవచ్చన్న అంచనాలున్నాయి.

అయితే కుదరబోయే ఈ ఒప్పందంపై రెండు దేశాల్లోనూ సహజంగానే విమర్శలున్నాయి. బ్రిటన్‌ కార్మికవర్గ ప్రయోజనాలను ప్రభుత్వం భారత్‌కు తాకట్టు పెట్టిందని అక్కడి విపక్షాల ఆరోపణ. ముఖ్యంగా స్వల్పకాలిక వీసాలపై బ్రిటన్‌ వచ్చే భారతీయ కార్మికులకూ, వారి యాజమాన్యాలకూ జాతీయ బీమా సంస్థ ఎన్‌ఐసీకి చేసే చెల్లింపుల నుంచి మూడేళ్లపాటు మినహాయింపు ఇవ్వటాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ రాయితీ వల్ల బ్రిటన్‌ ఖజానా ఏటా పది లక్షల పౌండ్ల ఆదాయం నష్టపోతుందనీ, ఈ వెసులుబాటు వినియోగించుకోవటానికి కంపెనీలు భారతీయ కార్మికులకు అధికంగా అవకాశాలిస్తాయనీ, దాంతో ఇక్కడివారి ఉపాధి దెబ్బతింటుందనీ వారి వాదన. ఇది కేవలం తాత్కాలిక ఉద్యోగాలకే వర్తిస్తుందని, బయటివారికి శాశ్వత ఉద్యోగాలిచ్చే అవకాశం ఉండబోదని ప్రభుత్వ జవాబు. ఇప్పటికే అమెరికా, కెనడా, జపాన్‌లతో సహా 50 దేశాలకు ఇదే తరహా వెసులుబాట్లు ఇస్తుండగా భారత్‌తో కుదిరే ఒప్పందం వల్లే ఏదో జరిగిపోతుందని ఎలా అంటారని ప్రశ్నిస్తోంది. నిజానికి భారత్‌కు ఎన్‌ఐసీ వెసులుబాటు ఇవ్వకూడదని బ్రిటన్‌ భావించటం వల్లే ఒప్పందంపై ప్రతిష్టంభన ఏర్పడింది. మన దేశంలో సైతం ఈ మాదిరి ఒప్పందాలపై వ్యతిరేకత వుంది. ఎఫ్‌టీఏల వల్ల మన ఎగుమతులకన్నా అటునుంచి దిగుమతులు పెరుగుతాయనీ, అవి స్థానిక ఉత్పత్తులను దెబ్బతీస్తాయనీ విమర్శకుల వాదన. పర్యవసానంగా ఏర్పడే వాణిజ్యలోటు దేశ ప్రయోజనాలను దెబ్బతీస్తుందని వారి విమర్శ. అలాగే ఈ ఎఫ్‌టీఏల వల్ల ఔషధ పేటెంట్లు, డేటా వినియోగం వంటి అంశాల్లో దేశీయ పరిశ్రమలకు అన్యాయం జరుగుతుందన్న ఆరోపణ మొదటి నుంచీ వుంది. ముఖ్యంగా జెనెరిక్‌ ఔషధ పరిశ్రమ దెబ్బతిని సాధారణ జనం నష్టపోతారన్న విమర్శ. అక్కడి ఉత్పత్తులతో పోటీపడటం మనవాళ్లకు కష్టమవుతుందన్న వాదన సరేసరి.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల నష్టాలున్నట్టే లాభాలూ వుంటాయి. ఉదాహరణకు మన ఔళి ఉత్పత్తులు, దుస్తులపై బ్రిటన్‌లో ఇంతవరకూ 12 శాతం సుంకాలుండేవి. ఒప్పందం అమల్లోకొస్తే ఆ బెడద వుండదు. బ్రిటన్‌ మార్కెట్లలో మనతో పోటీపడే చైనాకు ఇది సమస్యాత్మకం. మన దుస్తులపై సుంకాలు పెంచుతామని అమెరికా బెదిరిస్తున్న వర్తమానంలో ఇది మనకు కలిసొచ్చే అంశం. బ్రిటన్‌కు దుస్తులు, తెరలు, దుప్పట్లు వగైరాల ఎగుమతులు కనీసం 4 శాతం వరకూ పెరుగుతాయని అంచనా. అదే సమయంలో బ్రిటన్‌ కార్లు, విస్కీ, వైద్య ఉపకరణాలు వగైరాలు చవగ్గా లభిస్తాయి. ఉదాహరణకు ఇప్పుడు రూ. 5,000 పలికే విస్కీ ధర రూ. 3,500కు పడిపోతుంది. రాగల పదేళ్లలో మరింత తగ్గుతుంది. ఇది ఇక్కడి మద్యం పరిశ్రమకు చేటు కలిగించేదే. కార్ల పరిశ్రమలకూ జరిగేది ఇదే. ప్రస్తుతం బ్రిటన్‌ తయారీ కార్లపై వంద శాతం సుంకాలు విధిస్తున్నారు. అవి కాస్తా పది శాతానికి పడిపోతాయి. గ్రామీణ, పట్టణప్రాంతాల్లోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు గిరాకీ పెరుగుతుందని వాణిజ్య నిపుణుల భావన. లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ రంగాలు ఎగుమతులు విస్తరిస్తే మరింతగా ఎదుగుతాయని వారంటున్నారు. ఐటీ రంగానికి కూడా ఇది వర్తిస్తుంది. ఏటా బ్రిటన్‌ ఐటీ సంస్థల్లో కనీసం 60,000 మంది నిపుణులకు అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారు. అయితే లాభనష్టాలేమిటో ఒప్పందంపై సంతకాలయ్యాక తెలుస్తుంది.

‘కగార్‌’పై జనాంతిక ఆలోచనలు

విశ్లేషణ



టంకశాల అశోక్‌

కొన్ని విషయాలు సున్నితంగా ఉంటాయి. విషయాలు పూర్తి బహిరంగమైనవే. అందు గురించిన చర్చలు హోరాహోరీగా సాగినవే. కానీ పరిస్థితులు ఒక దశ నుంచి ఒకానొక దశకు మారినపుడు అంతా సున్నితం అవుతుంది. ‘ఆపరేషన్‌ కగార్‌’ సందర్భంగా ఆపరేషన్‌ విషయాలు కాదుగానీ నక్సలైట్ల గురించి, నక్సలిజం గురించిన చర్చ సున్నితంగా మారింది. పక్షం రోజులకు పైగా సాగుతున్న కర్రె గుట్టల ఉదంతం, ఎప్పటినుంచో జరుగుతున్న ఆ చర్చకు ఒక తక్షణ లక్షణాన్ని తీసుకు వచ్చింది. ఇది సున్నితం కావటానికి కారణం ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తన ‘ఆపరేషన్‌’ను ఒక భీషణ సమరంగా మార్చటం కాదు. అందుకు నేపథ్య పరిస్థితులు ఇదమిత్థంగా ఫలానా అప్పటి నుంచి మొదలయ్యాయని చెప్పలేముగానీ, సుమారు మూడు దశాబ్దాలుగా కావచ్చు. అవి, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినాక మాత్రం తీవ్రం కావటం మొదలైంది.

ప్రస్తుత ప్రభుత్వం తన నక్సలైట్‌ వ్యతిరేక చర్యలకు ‘ఆపరేషన్‌ కగార్‌’ అనే పేరు పెట్టింది. ‘కగార్‌’ అనే హిందీ మాటకు నిఘంటు అర్థం ‘అంచు’ లేదా ‘చివరి స్థితి’, ‘చివరి దశ’ అని. రాజకీయ అర్థం ‘అంతిమ దాడి’ అని! ఇది ఇతరుల నిర్వచనం కాదు. నక్సలైట్లను, నక్సలిజాన్ని 2026 మార్చ్‌ చివరి నాటికి అంతం చేసి తీరగలమని హోంమంత్రి అమిత్‌ షా పదేపదే ప్రకటిస్తున్నారు. అది సాధ్యమా కాదా అన్నది కాదు ఇక్కడ చేస్తున్న ఆలోచన. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, సుమారు 57 సంవత్సరాలుగా సాగుతున్న నక్సలైట్‌ ఉద్యమాన్ని పలువురు సమీక్షిస్తుండవచ్చు. అందులో భాగంగా, పైన ప్రస్తావించిన ఇటీవలి మూడు దశాబ్దాల కాలాన్ని కూడా. అంటే నక్సలిజం బలహీనపడుతూ వస్తున్న మూడు దశాబ్దాలను!

ఎముకలు మెడలో వేసుకోని కాంగ్రెస్‌

సూటిగా చెప్పుకోవాలంటే, మొదటి సగకాలం బలంగా సాగిన ఉద్యమం, తర్వాత సగకాలం నుంచి బలహీనపడుతూ వస్తున్నది. ఆ బలహీనతలు నాలుగు విధాలు. ఒకటి – సైద్ధాంతికంగా. రెండు – నాయకత్వ పరంగా. మూడు – ఉద్యమ నిర్వహణలో. నాలుగు – జనాదరణ విషయమై!

ప్రభుత్వ అణచివేతలు ఎప్పుడూ ఉన్నవే. అణచివేతకు ఆరంభం తెలంగాణ రైతాంగ పోరాట కాలంలోనే జరిగినపుడు నక్సలిజం తర్వాతి కాలంలో అంతకు భిన్నంగా ఉండగల ఆస్కారమే లేదు. పైగా 1948కి 1968కి మధ్యకాలం 20 సంవత్సరాలు మాత్రమే. అప్పటినుంచి మరో 20 ఏండ్లు గడిచేసరికి నక్సలైట్‌ ఉద్యమ క్షీణతకు అంకురార్పణ జరిగింది. గమనించదగినదేమంటే, ఆ కాలమంతా పాలించింది బీజేపీ కాదు... కాంగ్రెస్‌. కొన్ని రాష్ట్రాలలో ఇతర పార్టీలు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి, రాజ్యాంగం రాసుకుని, చట్టాలు చేసుకుని, ప్రణాళికలు రూపొందించుకుని, ఎన్నికల మేనిఫెస్టోలు ప్రకటించుకున్నప్పటి నుంచి అన్నీ కపటమైన రీతిలో అరకొరగానే అమలయ్యాయి. అందుకే 1947 నుంచి 20 ఏండ్లయేసరికి నక్సలైట్లు అవతారమెత్తారు. అన్ని మలుపులూ 20–20–20 గానే కనిపిస్తు న్నాయి. అదొక విచిత్రం.

‘ఆపరేషన్‌ కగార్‌’ తరహా మాటలను కాంగ్రెస్‌ ఉపయోగించలేదు, బీజేపీ ఉపయోగిస్తున్నది. చేతలు అవే, మాటలు వేరు. మాటలు వేరవటానికి మంచి కారణాలే ఉన్నాయి. కాంగ్రెస్‌కు 1885 నుంచి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. అందులో సామాజిక సమ్మిళితత్వం, ఉదారవాద మధ్యే మార్గం, కొంత అభ్యుదయ ధోరణి, దేశవ్యాప్తమైన జాతీయత వంటివి ఉన్నాయి. అవి కాలం గడిచినకొద్దీ బలహీనపడుతూ అనేక అవలక్షణాలు ప్రవేశించినా, కనీసం ఎముకలను మెడలో వేసుకునే ధోరణి ఇంకా రాలేదు. ఆ కారణంగా, నక్సలిజం వెనుక పేదరికం ఉన్నమాట నిజమనీ, అది కేవలం శాంతి భద్రతల సమస్య కాదనీ, పేదల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయగలమనీ మాటలు, ప్రకటనల రూపంలో చెప్పటం ఎన్నడూ మానలేదు. అణచివేతలకు సాయుధబలాల ఉపయోగమైతే యథావిధిగా సాగించారు గాని, ‘కగార్‌’ తరహా ‘అంతిమ దాడి’ అనకుండా జాగ్రత్తపడ్డారు. పౌరహక్కుల సంస్థలను అనేక ఇబ్బందులకు గురిచేసినా, వారికి ‘అర్బన్‌ నక్సల్స్‌’ అనే ముద్ర వేయలేదు.

నాగరిక, ప్రజాస్వామిక, ఆధునిక సమాజాలలో ఉదారవాద, ప్రగతిశీల భావనల సంప్రదాయం గురించి తెలిసిందే. ముఖ్యంగా రినైజాన్స్‌, ఫ్రెంచ్‌ విప్లవం, పారిశ్రామిక విప్లవం, బ్రిటన్‌లో రాజ్యాంగ ఆవిర్భావ కాలాల నుంచి ఉన్నత తరగతులపై, మధ్యతరగతిపై ఈ ప్రభావాలు మొదలయ్యాయి. ఈ వర్గాలు ప్రగతిశీలమైనవేగానీ, వ్యవస్థలో సంస్కరణలను కోరటం మినహా వ్యవస్థలను కూలదోయాలనేవి కావు. ఆ పరిమితులను తెలిసినందువల్లనే ఇక్కడ పౌరహక్కుల సంస్థల పాత్రను కాంగ్రెస్‌ ప్రభుత్వాలు కనీసం ఒక మేర గౌరవించటం, ఒకోసారి వారిని సంప్రదించటం చేస్తుండేవి. ఆ ధోరణి గత పదేళ్లుగా ఎట్లా మారిందో కనిపిస్తున్నదే. ఇది అంతిమంగా వ్యవస్థకు మేలు చేసేది కాదని ప్రభుత్వం గ్రహించవలసిందే తప్ప ఎవరూ చెప్పగల స్థితి కనిపించటం లేదు.

మారిన సమాజ ధోరణులు

ఉద్యమాలకు ఎగుడు దిగుడులు సహజమేగానీ, నక్సలైట్‌ ఉద్యమం పైన చెప్పిన నాలుగు బలహీనతలలో దేని నుంచి కూడా నిజమైన అర్థంలో బయటకు రాలేక పోయింది. లేనట్లయితే, వారు కర్రె గుట్టల సందర్భంలో ఈ విధంగా చిక్కుకు పోవటం, చర్చల కోసం పది రోజుల్లో నాలుగుసార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేయటం, తెలంగాణ ప్రభుత్వాన్ని కోరటం, పౌర హక్కుల సంస్థలను కదలించేందుకు ఇంతగా ప్రయత్నించటం వంటి పరిస్థితులు ఏర్పడేవి కావు.



◆ ‘ఆపరేషన్‌ కగార్‌’ తరహా మాటలను కాంగ్రెస్‌ ఉపయోగించలేదు, బీజేపీ ఉపయోగిస్తున్నది. చేతలు అవే, మాటలు వేరు!

◆ ఒకపుడు మధ్యతరగతిలో గణనీయమైన భాగానికి ఆదర్శవాదాలు, అభ్యుదయ ధోరణులు చెప్పుకోదగిన స్థాయిలో ఉండేవి. ఆ తరహా మధ్యతరగతి ఇపుడు పిడికెడుగా మిగిలింది.

ఇంత జరుగుతున్నా సమాజం నుంచి ఒకప్పటివలె స్పందనలు లేవు. ప్రస్తుత తరాలు వివిధ కారణాల వల్ల మారిపోయాయి. వారి దృష్టి ఇప్పుడు తమ కెరీర్‌పై, ఇతర అంశాలపై ఉంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఒకప్పుడు ఉద్యమానికి పెద్ద బలం. ఇపుడు కొద్ది ప్రాంతాలలోని కొంతమంది ఆదివాసీలు మాత్రం స్థానిక పరిస్థితులనుబట్టి నక్సలైట్లతో కదులుతున్నారు. స్వయంగా ఆదివాసీలైన ప్రజాప్రతినిధులు గతంలో కన్నా ఎక్కువగా స్వప్రయోజనాల కోసం రాజకీయ పార్టీల వెంట ఉంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే, వెనుకటి తరాలకు ఉద్యమం పట్ల గురి తప్పి నిరాశ ఏర్పడగా, కొత్త తరాలకు ఒక అగాథం వచ్చి కొత్త ప్రపంచంలో తమ జీవితాలను వెతుక్కుంటున్నారు. ఒకపుడు మధ్యతరగతిలో గణనీయమైన భాగానికి ఆదర్శవాదాలు ఉండేవి. అది సోవియెట్‌ యూనియన్‌కు, ఇక్కడ కమ్యూనిస్ట్‌ పార్టీలకు, విప్లవకారులకు, సాహిత్య–కళాకార్యకలాపా లకు పచ్చని కాలం. ఆ తరహా మధ్యతరగతి ఇపుడు పిడికెడుగా మిగిలింది. వామ పక్షాల గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది.

నక్సలైట్లకు కొత్త రిక్రూట్‌మెంట్లు తగ్గటం ఎప్పటినుంచో ఉన్నది. ఎన్‌కౌంటర్లలో ఒకపుడు ఒకరు చనిపోయినా వార్తలు, ప్రజలలో చర్చలు ఉండేవి. ఇపుడు చాలామంది చనిపోవటం వరుసగా జరిగితే తప్ప వార్తలు, చర్చలు కనిపించటం లేదు. మరొకవైపు సిద్ధాంతాలు, పోరాట పద్ధతులు, సంస్థ నిర్మాణాలు, నాయకత్వాలు ప్రస్తుత ఆధునికమైన, బలమైన ప్రభుత్వ వ్యవస్థలను ఎదుర్కొనగల విధంగా ఉన్నాయనే అభిప్రాయం వారి సానుభూతిపరులలోనైనా ఉందా అన్నది అనుమానమే. పౌరహక్కుల సంఘాల స్పందనలు సైతం స్వీయ సంశయాల మధ్య మందకొడిగానే కనిపిస్తున్నాయి. నక్సలైట్లు, నక్సలిజం భవిష్యత్తు అగమ్యగోచరం కావటానికి వెనుక ఈ పరిస్థితులు, దీర్ఘకాలిక పరిణామాలు అన్నీ ఉన్నాయి.

విషయాన్ని జనాంతికంగా చర్చించుకోవటం ఎందుకంటే, ఒక వైపు పేదరికం, పీడన కొనసాగుదల, ధనిక–పేద తారతమ్యాల పెరుగుదల అనే వాస్తవ స్థితి ఎంత కనిపిస్తున్నదో, ఆ పరిస్థితులను మార్చే సంస్కరణల కోసం లేదా కొత్త వ్యవస్థ ఆవిష్కరణ కోసమని చెప్పేవారు విఫలం కావటం కూడా అంత కనిపిస్తున్నది. ఈ విషయాలు ముఖ్యంగా ‘కగార్‌’ వంటి సందర్భంలో దాపరికం లేకుండా మాట్లాడటం సున్నితమైనదే!

వ్యాసకర్త సీనియర్‌ సంపాదకుడు

సోషల్‌ మీడియా

సరైన దాడి



ఆపరేషన్‌ సిందూర్‌లో భాగంగా పాకిస్తానీ ఉగ్రవాద స్థావరాలపై ఇండియా దాడి చేసిందనగానే నాకు ఒక్క నగరమే గుర్తొచ్చింది: బహావల్‌పూర్‌. ఇండియా దాన్ని కూడా కొట్టిందా? కొట్టింది. అయితే సరైన స్థావరాల మీదే దాడి చేస్తోందనుకున్నాను. పాకిస్తానీ గూఢచారులు, మిలిటరీ నాయకులు తాము పెంపు చేసిన ఉగ్రవాదులకు స్థావరంగా ఈ నగరాన్ని ఎలా వాడుకుంటున్నారో 23 ఏళ్లుగా నేను కథనాలు ఇస్తున్నాను. ఆ నగరం పేరు వింటేనే నాకు ఒంట్లో వణుకు పుడుతుంది.

– ఆస్రా నోమానీ, కాలమిస్ట్‌

న్యాయం జరిగింది!



అమెరికన్‌ యూదు పాత్రికేయుడు డేనియల్‌ పెర్ల్‌ను అపహరించడం, హింసించడం, తల తీయడం (2002)లో ప్రధాన కుట్రదారు అయిన జైష్‌ ఎ మహమ్మద్‌ కమాండర్‌ అబ్దుల్‌ రవూఫ్‌ అజహర్‌ను చంపడం ద్వారా ఇండియా పెర్ల్‌కు న్యాయం చేసింది.

– ఎమీ మెక్‌, సంపాదకురాలు

ఏది పరిష్కారం?



నిజానికి ఇండియా సైన్యం ప్రపంచానికి మేలు చేస్తోంది. ప్రపంచ వ్యాప్త ఉగ్రవాదానికి మూలకేంద్రం పాకిస్తాన్‌. ఒసామా బిన్‌ లాడెన్‌కు ఆశ్రయం, తాలిబన్లకు శిక్షణ, డేనియల్‌ పెర్ల్‌ పాశవిక హత్య, ఐసీ 814 హైజాక్‌, 26/11 దాడులు... ఎన్నని! యుద్ధం పరిష్కారం కాదంటున్నవాళ్లకు– నిజమే, కాదు – కానీ ఈ ఉగ్రదాడుల్లో అమాయకులు మళ్లీ మళ్లీ ప్రాణాలు పోగొట్టుకోవాల్సిందేనా?

– స్వాతీ చతుర్వేది, జర్నలిస్ట్‌

మేము వేరే!




మా మిలిటరీ అకాడెమీకి 80 మీటర్ల దూరంలో ఒసామా బిన్‌ లాడెన్‌ తలదాచుకోలేదు. మా సైనిక ఆసుపత్రుల్లో మసూద్‌ అజహర్‌కు మూత్రపిండాల చికిత్స జరగలేదు. మా నగరాల్లో దావూద్‌ ఇబ్రహీం విహరించడం లేదు. పాకిస్తాన్‌తో మాకు పోలికెక్కడ? (ఇంకో కామెంట్‌కు స్పందనగా.)

– సునీమ్‌ ఖాన్‌, వైద్యుడు

ఇన్‌ బాక్స్‌

రైతాంగ విప్లవ వీరుడు

ఆయన పేరు వినగానే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్మృతులు ఉప్పెనలా ఎగిసిపడతాయి. ఆయనే కామ్రేడ్‌ భీమిరెడ్డి నర్సింహా రెడ్డి (బీఎన్‌). భూమి కోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం జరిగిన మహత్తర వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయుధం చేబూని ఉద్యమాన్ని నడిపిన నాయకులలో కామ్రేడ్‌ బీఎన్‌ ఒకరు. ఆయన 1922లో నేటి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం, కర్విరాల కొత్త గూడెం గ్రామంలో ఓ భూస్వామ్య కుటుంబంలో పుట్టారు. అయినా రైతాంగ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. హైదరాబాద్‌ సంస్థానానికి తెలంగాణలో 2,600 మంది జమీందార్లు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు ఉండేవారు. వీరి అధీనంలో 10 వేల గ్రామాలు, కోట్లాది ఎకరాల సాగుభూమి ఉండేది. ప్రజల్లో అత్యధికులు పెత్తందారీ భూస్వాముల కింద వెట్టిచాకిరీ చేసి బతకవలసి ఉండేది. ఈ వాతావరణం రైతు కూలీలలో అసంతృప్తిని రగుల్కొల్పి ఉద్యమానికి దారి తీసింది.



బీఎన్‌ రెడ్డి

కమ్యూనిస్టు పార్టీ స్ఫూర్తితో ఎర్రజెండా నీడన గ్రామాలలో గ్రామ రక్షక దళాలు ఏర్పడ్డాయి. శత్రువు మూకలను ఎదిరించడానికి ‘గుత్పల సంఘాలు’ ఏర్పడ్డాయి. పాత సూర్యాపేట, దేవరుప్పల, ఆలేరు; అలాగే కరీంనగర్‌, ఖమ్మం జిల్లాల్లో అనేక ప్రాంతాలలో బీఎన్‌ నిజాం రైఫిల్‌లను ఎదిరించి ఉద్యమాన్ని ముందుకు నడిపారు. ఆయన ఆధ్వర్యంలో రావుల పెంట, కోటపాడు, చివ్వెంల గ్రామాలలో జరిగిన దాడుల ద్వారా సేకరించిన ఆయుధాలతో పోరాటం ముందుకు సాగింది. 1947 అధికార మార్పిడి తరువాత ఇటు నిజాం సైన్యాలతో, అటు యూనియన్‌ సైన్యాలతో తలపడవలసి వచ్చింది. దళాలను మైదాన ప్రాంతాల నుండి అడవి ప్రాంతాలకు మలిపి గోదావరి పరివాహక ప్రాంతంలో నదికి రెండు వైపుల సుమారు 200 గ్రామాలలో ఉద్యమాన్ని విస్తరింప జేశారు బీఎన్‌.

1946 నుండి 1951 అక్టోబర్‌ వరకు విరామం ఎరుగక జరిగిన ఈ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చివరగా ఆయుధం కిందకు దించింది ఆయనే. రెండుసార్లు సూర్యాపేట నుండి రాష్ట్ర శాసనసభకు, మూడుసార్లు మిర్యాలగూడ నుండి భారత పార్లమెంటు సభ్యునిగా ఎన్నికై ప్రజల హక్కులపై, సమస్యలపై చట్టసభలలో తన గళాన్ని వినిపించారు. ఒకానొక దశలో స్వయంగా సీపీఎం (బీఎన్‌) పార్టీని స్థాపించి దానిని తరువాత ఎమ్‌సీపీఐలో కలిపారు.

– వనం సుధాకర్‌ I ఎమ్‌సీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు
(నేడు బీఎన్‌ రెడ్డి వర్ధంతి)

పూర్తిస్థాయి యుద్ధమే వస్తే...

అభిప్రాయం



మేజర్‌ (రిటైర్డ్‌) శ్రీనివాస్‌

పాకిస్తాన్‌ దుశ్చర్యల కారణంగా ‘ఆపరేషన్‌ సిందూర్‌’ను భారత్‌ అనివార్యంగా చేపట్టింది. అయితే దీనికి ప్రతిచర్యగా పాకిస్తాన్‌ ఉత్తర, పశ్చిమ భారత్‌లలోని 15 లక్ష్యాలపై దాడికి ప్రయత్నించింది. భారత్‌ ఈ దాడులను దీటుగా ఎదుర్కొని పాక్‌ ప్రయోగించిన మిస్సైళ్లను కూల్చివేసింది. అలాగే పాక్‌ గగనతల రక్షణ వ్యవస్థలను భారత్‌ లక్ష్యంగా చేసుకోవడంతో లాహోర్‌లోని ఎయిర్‌ డిఫెన్స్‌ వ్యవస్థ నిర్వీర్యమయ్యింది. భారత్‌ కేవలం ఉగ్రవాద శిబిరాలనే లక్ష్యంచేసుకుని ఆపరేషన్‌ సిందూర్‌ను చేపట్టింది. కానీ పాక్‌... తన పౌరులపై దాడి చేసినట్లు దుష్ప్రచారం మొదలు పెట్టింది. నిజానికి పాకిస్తానే సరిహద్దు గ్రామాలపై కాల్పులు జరిపి 16 మంది భారత పౌరులను పొట్టన పెట్టుకుందని విదేశాంగ, రక్షణ మంత్రిత్వ శాఖలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌ ఆపరేషన్‌ సిందూర్‌ కొనసాగుతుందని ప్రకటించడం గమనార్హం.

పాక్‌ ఆక్రమిత కశ్మీర్‌తో సహా పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్రవాద శిక్షణ శిబిరాలపై భారత్‌ దాడి చేయడంతో ఇరుదేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. నియంత్రణ రేఖ వద్ద పాకిస్తాన్‌ విచ్చలవిడిగా కాల్పులు ప్రారంభించింది. ఈ దాడిలో అమాయకులైన సరిహద్దు గ్రామాల ప్రజలు చనిపోతున్నారు, గాయపడుతున్నారు. శ్రీనగర్‌, జమ్మూల లెఫ్టినెంట్‌ గవర్నర్లు సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటువంటి పాకిస్తాన్‌ దుశ్చర్యలు దానికి మరిన్ని కష్టాలు తీసుకువస్తాయి తప్ప పరిస్థితి సద్దుమణిగే అవకాశం లేదు. ఈ దాడుల్లో జైష్‌ ఏ మహమ్మద్‌కు చెందిన మౌలానా మసూద్‌ అజార్‌ కుటుంబ సభ్యులు చనిపోవడంతో అతడు ఆగ్రహావేశాలతో రగిలిపోతూ మన ప్రధానికి ఒక హెచ్చరిక లేఖను పంపాడు. అంతర్జాతీయ సమాజంలో పాకిస్తాన్‌ తిరిగి తన పరువును నిలబెట్టుకోవడం కోసం మూడు స్థాయిలలో భారత్‌పై దాడి చేస్తోంది. ఇవి: ఒకటి, భారత సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర చర్యలు చేపట్టడం, రెండు, భారత్‌పై ఆక్రమణ చర్యలకు పూనుకోవడం, మూడు, ప్రతీకారంతో ఉగ్రవాద కార్యకలాపాలను పెంచడం.

గతంలో ఈ ఉగ్రవాద దాడుల్ని ఎదుర్కోవడానికి మాత్రమే మనం వ్యూహాన్ని రచించేవాళ్ళం. అయితే గత కొన్ని దశాబ్దాలుగా మన వ్యూహం కూడా మారింది. రాజ్యాంగ అధికరణ 370ను రద్దు చేయడంతో కశ్మీర్‌లో 90 శాతం తీవ్రవాదం తగ్గిపోయింది. అక్కడ సాధారణ జనజీవన స్రవంతి నెలకొంది. దీనిని ఈర్ష్యతో, పగతో రగిలిపోతున్న పాకిస్తాన్‌ ఏమాత్రం జీర్ణించుకోలేకపోయింది. అందుకే కొత్తగా ఉగ్ర దాడులకు తెరలేపింది. ఈసారి జరిగిన దాడులకు ఇజ్రాయెల్‌ తరహాలో భారత్‌ ప్రతిస్పందించింది. భారత్‌ తన యుద్ధతంత్రం మార్చి దౌత్యపరంగా, ఆర్థికంగా, సాంకేతికంగా, మానసికంగా, వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ అంతర్జాతీయ సమాజంలో పాక్‌ను ఒక ఉగ్రవాద దేశంగా నిరూపించడంలో కొంత విజయం సాధించగలిగింది. 53 దేశాలు భారత్‌కి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మద్దతు తెలియజేయడం విశేషం. అమెరికా పాత్ర పాకిస్తాన్‌, భారత్‌ల విషయంలో గోడ మీద పిల్లిలా కనిపిస్తోంది.



ఇదే మంచి అవకాశం

ఈ సమయంలో పాకిస్తాన్‌ ఏ ఒక్క చిన్న పొరపాటు చేసినా అది పూర్తిస్థాయి యుద్ధంగా మారే అవకాశం ఉంది. ఉగ్రవాద స్థావరాలకు నెలవుగా మారిన పాక్‌ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌ తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఇది ఒక సువర్ణ అవకాశం అవుతుంది. అయితే యుద్ధం తలెత్తితే చైనా కచ్చితంగా పాకిస్తాన్‌కు సహాయం చేస్తుంది. కారణం భారత్‌ను చైనా చిరకాల శత్రువుగా భావించడం. అలాగే బంగ్లాదేశ్‌ను మతం పేరుతో పాక్‌ దగ్గర తీసుకునే అవకాశం లేకపోలేదు. అంటే యుద్ధం వస్తే భారత్‌ మూడు వైపుల నుంచి ముప్పు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నమాట. కేవలం పంజాబ్‌, రాజస్థాన్‌, కశ్మీర్‌, గుజరాత్‌ రాష్ట్రాలు మాత్రమే కాకుండా ఉత్తర, ఈశాన్య రాష్ట్రాలు కూడా ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈశాన్య రాష్ట్రాలకు ముఖద్వారమైన ‘చికెన్‌ నెక్‌’ లేదా సిల్‌గురి కారిడార్‌పై చైనా ఎప్పటి నుంచో కన్ను వేసిన విషయం గుర్తుంచుకోవాలి.

భారత్‌పై అణ్వాయుధాలను ప్రయోగిస్తామని పాక్‌ పదేపదే హెచ్చరిస్తోంది. ఇదే జరిగితే భారత్‌కు ఎక్కువ నష్టం కలగకపోవచ్చు కానీ పాకిస్తాన్‌ ‘మరుసటి రోజు సూర్యోదయం చూడదు’ అనే మాట అతిశయోక్తి కాదు. మనం అణ్వాయుధాల విషయంలో ‘మొదట మేం ప్రయోగించం’ అని చెప్పాము గాని ‘ఇతర దేశాలు ప్రయోగించినా మేం ప్రయోగించం’ అని ఎప్పుడూ చెప్పలేదు. ప్రపంచంలో నాలుగవ రక్షణ శక్తిగా ఉన్న భారతదేశం అన్ని రకాలుగానూ పాకిస్తాన్‌ను ఎదుర్కోగలుగుతుంది. పౌరులు ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో మరింత జాగ్రత్తతో వ్యవహరించి, అనుమానాస్పదమైన సంఘటనలను ప్రభుత్వ యంత్రాంగానికి ఎప్పటికప్పుడు తెలియచేయాలి. అవసరమైతే కదనరంగంలో కాలు పెట్టాలి. అప్పుడే ఉగ్రవాదంపై చేస్తున్న పోరులో విజయం సాధించగలుగుతాం.

వ్యాసకర్త అంతర్జాతీయ వ్యవహారాలు, రక్షణ రంగ నిపుణులు

రాహుకేతువుల కథ

భారతీయ సంస్కృతిలో సూర్య, చంద్రగ్రహణాలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఇందుకు ఈ కథ ఒక కారణం: విష్ణువు జగన్మోహినిగా దేవతలకు అమృతాన్ని పంచిపెడుతుంటాడు. రాక్షసులకు సుర మాత్రం ఇచ్చి తాగిస్తుంటాడు. దీనిని దక్షప్రజాపతి శాపవశంతో రాహువు తెలుసుకుని అసురుల వైపు నుంచి లేచొచ్చి సూర్యచంద్రుల మధ్య కూర్చుంటాడు. ఈ విషయాన్ని సూర్య చంద్రులు కనుసైగలతో విష్ణువుకి తెలియ జేస్తారు. అయితే అప్పటికే రాహువుకి విష్ణువు అమృతం ఇవ్వడం వల్ల అతడు అమృతాన్ని తాగుతాడు.

తర్వాత విషయం తెలుసుకున్న విష్ణువు వెంటనే తన చక్రాయుధాన్ని ప్రయోగించి రాహువు కంఠాన్ని ఖండిస్తాడు. కానీ అప్పటికే రాహువు అమృతాన్ని సేవించడం వల్ల అతని తల, మొండెం కూడా సజీవాలై ఉంటాయి. తల విష్ణువుతో ‘మహాత్మా! అకారణంగా నా కంఠాన్ని తెగగొట్టావు. నువ్వు ఇస్తేనే కదా నేను అమృతం తాగాను. నువ్వే ఇలా చేయడం మంచిదా’ అని అడుగుతాడు.

రాహువు మాటలు విన్న విష్ణువు మనసు కరుగుతుంది. ‘సరే జరిగిపోయిన దానినే తలచి బాధ పడడం తగదు. అది విధివిధానం. నీకేం కావాలో కోరుకో’ అంటాడు విష్ణువు. అప్పుడు రాహువు ‘దేవా! సూర్యచంద్రులు చెప్పబట్టే కదా నువ్వు నా మీద ఈ చర్యకు పాల్పడ్డావు. కనుక వారిద్దరిని మింగడానికి నాకు అనుమతి ఇవ్వు’ అంటాడు.

అందుకు విష్ణువు ‘ నువ్వు సూర్యచంద్రులను మింగితే లోకాలన్నీ సంక్షోభంలో చిక్కుకుంటాయి. ఏడాదిలో ఏదైనా ఓ అమావాస్యనాడు సూర్యుడిని, పౌర్ణమినాడు చంద్రుడిని మింగి వెంటనే విడిచిపెట్టు. నువ్వు విడిచిపెట్టకపోతే నీ తల వెయ్యి ముక్కలయి చనిపోతావు. సూర్యచంద్రులు నీకు చేసిన తప్పుకు వారికీ శిక్ష చాలు’ అంటాడు.

రాహువుకు తల, మొండెం వేర్వేరు అయినప్పటికీ అమృతం సేవించిన కారణంగా ఒకరిద్దరయ్యారు. తల కేతువుగా సూర్యుడిని మింగడానికి, మొండెం రాహువుగా చంద్రుని మింగడానికి ఏర్పాట్లు జరిగాయి. ఈ విధంగా సూర్యచంద్రులు రాహుకేతువుల పాల్పడి గ్రహణాలు మొదలయ్యాయని పురాణ కథ.

అయితే గ్రహణాలు ఏర్పడడానికి శాస్త్రీయ కారణాలు ఉన్నాయన్నది గమనించాలి.

– యామిజాల జగదీశ్‌

గ్రహం అనుగ్రహం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.ద్వాదశి ప.3.10 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** హస్త రా.12.20 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** ఉ.7.16 నుండి 9.01 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.56 వరకు, తదుపరి ప.12.21 నుండి 1.12 వరకు, **అమృత ఘడియలు:** సా.5.46 నుండి 7.32 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.34, **సూర్యాస్తమయం:** 6.17.

క్లుప్తంగా...

మార్కులు తక్కువ వచ్చాయని..

- బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య


సంజనరెడ్డి

జగిత్యాల క్రైం: మార్కులు తక్కువ వచ్చాయని బీటెక్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. వివరాలివి. జగిత్యాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కన్నవేని మల్లారెడ్డి కుమార్తె సంజన రెడ్డి (20).. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో తక్కువ మార్కులు రావడంతో నిరుత్సాహంగా ఉంటోంది. దీంతో తండ్రి మల్లారెడ్డి హైదరాబాద్ నుంచి బుధవారం రాత్రి కూతురిని జగిత్యాలకు తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులంతా భోజనం చేసి నిద్రిస్తున్న సమయంలో.. సంజనరెడ్డి చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ మన్మథరావు తెలిపారు.

అనుమానం.. పెనుభూతమై..

- భార్యను గొడ్డలితో నరికిన భర్త
- ఆపై రైలు కిందపడి ఆత్మహత్య


రాజేశ్


సరిత

మహబూబ్‌నగర్ క్రైం: భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త ఆమెను అతి కిరాతకంగా గొడ్డలితో నరికి హత్య చేశాడు. ఆపై భర్త సైతం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్‌లో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జానంపేటకు చెందిన రాజేశ్ (35), మహబూబ్‌నగర్ మండల పరిధిలోని బొక్కలోనిపల్లికి చెందిన సరిత (30)కు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. భార్య స్వగ్రామమైన బొక్కలోనిపల్లిలోనే నివాసం ఉంటూ.. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. అయితే కొంతకాలంగా సరిత ప్రవర్తనపై రాజేశ్ అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య పలుమార్లు గొడవలు సైతం జరిగాయి. ఈ క్రమంలోనే గురువారం ఉదయం ఇద్దరూ కలిసి ఓ పెళ్లికి వెళ్లి వచ్చిన తర్వాత ఇంట్లో మరోసారి గొడవపడ్డారు. ఆగ్రహంతో రాజేశ్ ఇంట్లో ఉన్న గొడలితో భార్యపై విచక్షణారహితంగా దాడి చేసి తల, మెడపై దారుణంగా నరికాడు. దీంతో సరిత రక్తపుమడుగులో పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆ తర్వాత రాజేశ్ కూడా బొక్కలోనిపల్లి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

మౌనమే మారణ హోమం

కర్రిగుట్టల్లో నేల కూలింది ఎవరు?

- బడికెళ్లిన బాలుడు బుల్లెట్ గాయాలతో వస్తున్నాడు
- నోరెత్తితే నక్సలిజం ముద్ర వేస్తున్నారు
- దీనిపై సమాజ మౌనం ప్రమాదకరం
- గిరిజనుల హక్కులపై అందరూ స్పందించాలి
- అన్ని పక్షాలకు వాస్తవాలు చెబుతాం
- శాంతి చర్చల దిశగా కదిలిస్తాం
- 'సాక్షి'తో ప్రొఫెసర్ హరగోపాల్



సాక్షి, హైదరాబాద్: సమాజ మౌనం మారణహోమం సృష్టిస్తుంది.. పౌరులు అప్రమత్తంగా లేకపోతే మానవ హక్కులు హననం అవుతాయి.. కర్రిగుట్టల్లో తుపాకుల మోతను నక్సలిజం, పోలీసులకే పరిమితం చేయకూడదు.. దీని వెనుక దాగున్న వాస్తవాలను ప్రజలు తెలుసుకోవాలి.. సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్ ఉద్వేగంగా చెప్పిన మాటలివి. నక్సలిజాన్ని నిర్మూలిస్తామని చెబుతున్న ప్రభుత్వాలు.. ముందుగా గిరిజన పల్లెల హక్కులను, అక్కడి ప్రజల ఆవేదనను అర్థం చేసుకోవాలని సూచించారు. తుపాకుల మోత ఆపేసి, శాంతి చర్చలు జరపడం మానవీయ కోణంగా పేర్కొంటున్న హరగోపాల్.. 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

వణికిపోతున్న గిరిజనం

కాల్పులు జరిగిన కర్రిగుట్టే కాదు. గిరిజనం ఉండే పల్లెలకు వెళ్లండి. అక్కడి పరిస్థితులు చూడండి. భయం, అభద్రత, ఆందోళన, ప్రతి ఒక్కరి కళ్లలో కనిపించేది ఇదే. స్కూలుకెళ్లిన పిల్లలు బుల్లెట్ గాయాలతో వస్తున్నారు. కాలకృత్యాలకు వెళ్లిన వృద్ధులు, మహిళలు తుపాకీ శబ్దాలతో వణికిపోతున్నారు. పొలం పనులకు వెళ్లాలన్నా సాహసించడం లేదు. అసలు మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా? స్వేచ్ఛగా జీవిస్తున్నామా? అమాయక గిరిజనులు అంత హాని చేసేవాళ్లా? ఒకసారి ప్రభుత్వాలు వాళ్ల దగ్గరకు ఎందుకు వెళ్లవు? కర్రిగుట్టల్లో భారీగా నక్సల్స్‌ను చంపామంటున్నారు. ఇది నిజమైతే శవాలు చూపించాలిగా? సామాజిక మాధ్యమం ఇంతగా పెరిగినా నిజాలు బయటకు రావా?

సమస్య మూలాలు గుర్తించరేం?

హక్కుల పేరెత్తితే నక్సలైట్ అంటున్నారు. రూల్స్ లేవనెత్తితే ద్రోహిగా చిత్రీకరిస్తున్నారు. కబ్జాదారులే పాలకులైన నేటి రాజకీయాలు పేదవాడికి పెనుశాపంగా మారుతున్నాయి. నక్సలిజాన్ని అంతం చేస్తామంటున్నారు. అసలీ సమస్య ఇప్పుడు పుట్టింది కాదు. 200 ఏళ్ల నుంచి ఉంది. సమస్యకు మూలాలు ఎక్కడో గుర్తించకుండా అంతం చేస్తామనే ప్రకటనలు ఎంతవరకు సరైనవి? ఇక్కడో విషయాన్ని మరిచిపోకూడదు. ఆదివాసీ గిరిజనులంతా నక్సలైట్లు కాదు. వాళ్ల హక్కులను కాపాడుకునేందుకు మాత్రమే గొంతు ఎత్తుతున్నారు. ఈ సమస్యను మానవీయ కోణంలో చూడాలి. ప్లానింగ్ కమిషన్‌లో పనిచేసిన యుగంధర్ 2004లో గిరిజన సమస్యలపై అధ్యయనం చేశారు. ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. సమస్యలను పరిష్కరించే మార్గాలు చెప్పారు. కానీ ఇవేవీ ఆచరణకు నోచుకోలేదు. భారత రాజ్యాంగం ఆదివాసీలకు ఇచ్చిన హక్కుల మాటేంటి? వాటిని అమలు చేస్తామని పదేపదే చెప్పే ప్రభుత్వాలు చేస్తున్నదేమిటి?

గనుల కోసమే ఈ యుద్ధం

భారతదేశంలోని గిరిజన ప్రాంతాల్లో నక్సలిజం పేరుతో హింస జరగడానికి కారణం మైనింగ్. అక్కడి గనులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివాసీల హక్కులను హరిస్తున్నాయి. గనుల పేరుతో ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించాలని చూస్తున్నాయి. దీనికి అభివృద్ధి అని కొత్త పేరు పెడుతున్నాయి. నిజంగా అభివృద్ధి చేయాలంటే మార్గం ఇదా? గనుల తవ్వకాన్ని ఎన్ఎండీసీకి అప్పగించవచ్చు కదా? కార్పొరేట్ సంస్థలకే ఎందుకు కట్టబెడుతున్నారు? ఎన్ఎండీసీకి ఇస్తే అక్కడ ఉద్యోగ కల్పన జరుగుతుంది. గిరిజనుల పునరావాసానికి మార్గం ఏర్పడుతుంది. ఈ దిశగా ప్రభుత్వాలు ఎందుకు ఆలోచించడం లేదు? మైనింగ్ కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. జాతీయ ప్రతిపక్ష పార్టీలకూ నక్సలిజంతో సంబంధాలున్నాయని ప్రచారం చేయడంలో అర్థమేంటి? దీన్నిబట్టే పాలకులు ఎంతగా తెగించారో అర్థం చేసుకోవచ్చు.

శాంతి చర్చలే పరిష్కారం

ముందుగా గిరిజన ప్రాంతాల ప్రజల సమస్యలను ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి. నక్సల్స్‌తో శాంతి చర్చలు జరపాలి. కాల్పులను ఇరు పక్షాలు నిలిపివేయాలి. గిరిజన హక్కుల హననం మానుకోవాలి. చంపుకుంటూ పోతే సమస్య ఎంతమాత్రం పరిష్కారం కాదు. శాంతి దిశగా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. మేధావులు, చదువుకున్నవాళ్లు మౌనంగా ఉంటే సమాజానికే నష్టం. భావి తరాలకు ముప్పు వాటిల్లుతుంది. సామాజిక మాధ్యమాలు పెరిగిన ఈ తరుణంలో వాస్తవాలు ప్రజలకు తెలియజెప్పేలా ప్రతి ఒక్కరూ స్పందించాలి. సమాజ శాంతి దిశగా అందరూ అడుగులేయాలి. ప్రభుత్వాలు తెరవెనుక కుట్ర విధానాలను పక్కనబెట్టాలి. మానవీయ కోణంలో నక్సల్స్ సమస్యను చూడాలి. దీనిని గిరిజన పల్లెల హక్కుల కోణంలో ఆలోచించాలి. అప్పుడే శాంతి సాధ్యమవుతుంది.

మందుపాతర్లు పేల్చిన మావోయిస్టులు

- ముగ్గురు గ్రేహౌండ్స్ కమాండోల మృతి
- ఆర్ఎస్ఐకి గాయాలు.. హైదరాబాద్‌కు తరలింపు
- ములుగు జిల్లా వాజేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన
- మాటు వేసి మందుపాతర్లు పేల్చారు: డీజీపీ


వరంగల్‌ఎంజీఎం ఆస్పత్రికి తీసుకువచ్చిన కమాండర్ మృత దేహం


పవన్ కల్యాణ్


రణధీర్


వడ్ల శ్రీధర్

వాజేడు/ఎంజీఎం/సాక్షి, హైదరాబాద్: కర్రిగుట్టలు మరోసారి దద్దరిల్లాయి. ములుగు జిల్లా వాజేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుట్టల పైనున్న పెనుగోలు గ్రామ సమీపం నూగూరు అటవీ ప్రాంతంలో అమర్చిన మందుపాతరలను మావోయిస్టులు పేల్చేశారు. అనంతరం కాల్పులు జరిపారు. ఈ ఘటనలో గ్రే హౌండ్స్‌కు చెందిన కమాండోలు వడ్ల శ్రీధర్ (జేసీ4973/పీసీ1785), ఎస్.పవన్‌కల్యాణ్ (జేసీ10541/పీసీ) టి.సందీప్ (జేసీ 4638/పీసీ8124) అక్కడికక్కడే మృతి చెందారు. పైడిపల్లికి చెందిన ఆర్ఎస్ఐ సీహెచ్ రణధీర్ గాయపడ్డారు. మరో ఇద్దరు జవాన్లు కూడా గాయపడినట్లు సమాచారం. కాగా మెరుగైన వైద్యం కోసం రణధీర్‌ను హైదరాబాద్‌కు తరలించినట్లు తెలంగాణ డీజీపీ జితేందర్ ప్రకటించారు. ఆయన ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. మృతదేహాలను ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించారు.

భారీ ఎన్‌కౌంటర్ మరుసటి రోజే..

కర్రిగుట్టల్లో చేపట్టిన కగార్ ఆపరేషన్ 17 రోజులకు చేరుకుంది. కర్రి గుట్టలను చుట్టు ముట్టిన భద్రతా బలగాలు మావోయిస్టుల కోసం కూంబింగ్‌ను ముమ్మరం చేశాయి. ఈ క్రమంలోనే బుధవారం ఎన్‌కౌంటర్ చోటు చేసుకోగా భారీ సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో కూంబింగ్ కోసం వచ్చే దళాలను మావోయిస్టులు లక్ష్యంగా చేసుకుని ముందే అమర్చిన మందుపాతరలను రిమోట్ల సహాయంతో పేల్చివేసినట్లు తెలుస్తోంది. 35 – 40 మందితో కూడిన మావోయిస్టుల బృందం (మహిళలు కూడా ఉన్నారు) ఇందులో పాల్గొన్నట్టు సమాచారం.

మృతదేహాలు పరిశీలించిన మంత్రి, డీజీపీ

గ్రేహౌండ్స్ కమాండర్ల మృతదేహాలను రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క, డీజీపీ జితేందర్, గ్రే హౌండ్స్ ఏడీజీ స్టీఫెన్ రవీంద్ర, ఎమ్మెల్యేలు నాగరాజు, రాజేందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ మార్చురీ వద్ద పరిశీలించారు. ఈ ఘటనపై వాజేడు పోలీస్‌స్టేషన్‌లో సెక్షన్ 62, 148, 191(1), 191(3), 103, 109 ఆర్/డబ్ల్యూ 190 బీఎన్ఎస్, సెక్షన్ 25(1–బీ)(ఏ), 27 ఏఆర్ఎమ్ఎస్ యాక్ట్, సెక్షన్ 10, 13 ,18,20, కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు. కాగా మందుపాతర్ల పేలుడులో మరణించిన కామారెడ్డి జిల్లా పాల్వంచ మండల కేంద్రానికి చెందిన వడ్ల శ్రీధర్ (30)కు 9 నెలల క్రితమే వివాహమైనట్లు తెలిసింది.

నాలుగు గంటల పాటు పోస్టుమార్టం

మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో వరంగల్ ఎంజీఎం మార్చురీకి చేరుకున్న పోలీసుల మృతదేహాలకు ఫోరెన్సిక్ నిపుణులు నాలుగు గంటల పాటు పోస్టుమార్టం జరిపారు. బుల్లెట్ల గాయాలతోనే జవాన్లు మృతి చెందినట్లు ఫోరెన్సిక్ డాక్టర్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు: డీజీపీ

ములుగు జిల్లా వాజేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఐఈడీల కోసం సెర్చ్ ఆపరేషన్ చేస్తున్న పోలీసులపై దూరంలో మాటేసిన మావోయిస్టులు మందుపాతరలు పేల్చారని డీజీపీ తెలిపారు. సెర్చ్ బృందాన్ని లక్ష్యంగా చేసుకుని విచక్షణా రహితంగా భారీ కాల్పులకు తెగబడ్డారని చెప్పారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురు కాల్పులు జరపడంతో మావోయిస్టులు కాల్పులు ఆపేసి పారిపోయారన్నారు.

ప్రజలెవరూ కర్రిగుట్టల వైపు రావొద్దు: మావోయిస్టులు

పోలీసుల వలలోపడి ప్రజలెవరూ కర్రిగుట్టల వైపు రావొద్దని మావోయిస్టులు మరోమారు హెచ్చరించారు. ఈ మేరకు మావోయిస్టు వెంకటాపురం–వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట గురువారం ఒక లేఖ విడుదల అయ్యింది. 'పోలీసు బలగాల కగార్ దాడి నుంచి రక్షణ పొందడానికి కర్రిగుట్టలపై బాంబులు అమర్చాం. ఈ విషయం ప్రజలకు వివిధ రూపాల్లో తెలియజేశాం. అయినా కొంత మంది ఆదివాసీ, ఆదివాసీయేతర ప్రజలకు పోలీసులు మాయ మాటలు చెప్పి నమ్మిస్తూ, డబ్బులు ఇస్తూ ఇన్‌ఫార్మర్లుగా మార్చుకుంటున్నారు. షికారు పేరుతో వారిని కర్రిగుట్టల వైపు పంపిస్తున్నారు. మా రక్షణ కోసం అమర్చిన బాంబులు పేలి వారు చనిపోతున్నారు. కాబట్టి ప్రజలెవరూ కర్రిగుట్టల వైపు రావొద్దని విజ్ఞప్తి చేస్తున్నాం..'అని ఆ లేఖలో పేర్కొన్నారు.

6 నెలలు కాల్పుల విరమణ ప్రకటిస్తున్నాం..

- మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్
- సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న లేఖ

సాక్షి, హైదరాబాద్: శాంతిచర్చల కోసం తాము ఆరు నెలలపాటు కాల్పుల విరమణ పాటిస్తున్నామని మావోయిస్టులు ప్రకటించారు. ఈ మేరకు మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరిట ఒక లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈనెల 7న రాసినట్టుగా ఉన్న ఆ లేఖలో పలు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు శాంతిచర్చల ప్రతిపాదనలు తేవడాన్ని స్వాగతిస్తూ.. కాల్పుల విరమణ ప్రకటిస్తున్నట్టుగా ఉంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఆ లేఖలో పేర్కొన్న ప్రకారం..'ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు, ప్రజాస్వామికవాదులు. ప్రజా సంఘాలు, మెజార్టీ రాజకీయ పార్టీలు మావోయిస్ట్ పార్టీకి, ప్రభుత్వానికి నడుమ శాంతి చర్చలు జరగాలనే డిమాండ్‌పై ప్రముఖంగా ప్రకటనలు చేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మా నుంచి 6 నెలల వరకు కాల్పుల విరమణ ను పాటిస్తున్నామని ప్రకటిస్తున్నాము. గత కొంత కాలంగా మా పార్టీకి, ప్రభుత్వానికి నడుమ శాంతి చర్చలు జరగాలనే డిమాండ్‌ను మొదట తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించారు. దానిలో భాగంగా శాంతి చర్చల కమిటీ ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ చర్చల విషయాన్ని పార్టీలో అంతర్గతంగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని చెప్పింది. కగార్ ఆపరేషన్‌ను రద్దు చేసి, శాంతి చర్చలు జరపాలని సీపీఐ ముందుగానే రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ కూడా తమ రజతోత్సవ సభలో శాంతి చర్చలు జరపాలని తీర్మానం చేసింది. కొద్ది రోజుల క్రితం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా శాంతి చర్చలు జరపాలనే డిమాండ్ చేశారు. మాజీ సీఎం చంద్రశేఖర్‌రావు కూడా ఇదే డిమాండ్‌ను ప్రస్తావించారు. ఇది హర్షించదగిన విషయం. చర్చల ప్రక్రియను రాష్ట్రంలో, దేశంలోనూ ఒక ప్రజాస్వామిక వాతావరణాన్ని తీసుకువచ్చే ప్రయత్నంగా అర్థం చేసుకోవాలి. ఈ ప్రయత్నాలకు సానుకూలతను కలిగించేందుకు మా నుంచి కాల్పుల విరమణను ప్రకటిస్తున్నాం'అని ఉంది.

మా మొదటి పోరాటం వడ్డీ వ్యాపారులపైనే చేశాం



- వడ్డీలతో పీడిస్తుంటే ప్రజలను చైతన్యపరిచి తిరగబడ్డాం : మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: 'నేను విప్లవ సంఘంలో పనిచేసినప్పుడు మా మొదటి పోరాటం వడ్డీ వ్యాపారులపైనే చేశాం. బారు, చక్రవడ్డీలతో పీడిస్తుంటే ప్రజలను చైతన్యపరిచి తిరగబడ్డాం'అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. 'పేదరిక నిర్మూలనలో బ్యాంకర్ల పాత్ర కీలకం. బ్యాంకులు రుణాలివ్వకపోతే ప్రజలు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారు. అడ్డగోలు వడ్డీలతో ప్రజలు అప్పులపాలవుతూ ఆస్తులు అమ్ముకుంటున్నారు'అని చెప్పారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి 3,55,138 స్వయం సహాయక సంఘాలకు రూ.19,838.58 కోట్ల బ్యాంకు రుణాల మంజూరు లక్ష్యంగా.. గురువారం గ్రామీణ దారిద్ర్య నిర్మూలన సంస్థ (సెర్ప్)– బ్యాంకు లింకేజీ వార్షిక కార్యాచరణ ప్రణాళికను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థిక అక్షరాస్యత సమాచార దీపికను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ 'ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలు తీసుకుబోయే మొత్తం రుణాలను తిరిగి చెల్లిస్తామని బ్యాంకర్లకు హామీ ఇస్తున్న'అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బ్యాంకర్లు, పీఆర్ ఆర్డీ కార్యదర్శి లోకేశ్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏమరపాటుతో భారీ మూల్యం!

- రాష్ట్ర పోలీసు బలగాలకు ఊహించని షాక్
- తెలంగాణ వచ్చిన తర్వాత తొలిసారి మావోయిస్టుల పైచేయి

సాక్షి, హైదరాబాద్: కొద్దిపాటి ఏమరపాటుతో తెలంగాణ గ్రేహౌండ్స్ భారీ మూల్యం చెల్లించుకుంది. కూంబింగ్‌తో పాటు మావోయిస్టులు అమర్చిన బాంబులను తొలగించేందుకు సెర్చ్ ఆపరేషన్ కోసం వెళ్లిన గ్రేహౌండ్స్, పోలీస్ బృందాలను మావోయిస్టులు మాటువేసి దెబ్బకొట్టారు. ఐఈడీలు పేల్చడంతో పాటు మెరుపుదాడితో తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి మావోయిస్టులు తెలంగాణ గ్రేహౌండ్స్‌పై పైచేయి సాధించారు. ముగ్గురు కమాండోలు మరణించిన నేపథ్యంలో చిన్నపాటి తప్పిదాలతోనే వీరిని కోల్పోవాల్సి వచ్చిందన్న చర్చ జరుగుతోంది.

పక్కా వ్యూహంతో..

కూంబింగ్ ఆపరేషన్‌కు వెళ్లే తెలంగాణ గ్రేహౌండ్స్, స్థానిక పోలీసు బలగాలు ఇటీవల కాలంలో ఒకే దారిలో వెళుతున్నట్టు గుర్తించిన మావోయిస్టులు దాన్ని అవకాశంగా మార్చుకున్నట్టు తెలుస్తోంది. ములుగు జిల్లాలోని వెంకటాపురం, వాజేడు, పేరూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని అటవీ ప్రాంతాలలో బాంబులు (మందుపాతరలు) అమర్చినట్టు మావోయిస్టులు ఇప్పటికే ప్రకటించారు. ఆదివాసీలు, ఇతరులు ఈ ప్రాంతంలోకి వెళ్లవద్దని హెచ్చరించారు. మావోయిస్టులు అమర్చిన ఐఈడీలను వెలికితీసేందుకు, ములుగు పోలీసులు, గ్రేహౌండ్స్ యూనిట్లతో కూడిన గస్తీ బృందం బుధవారం రాత్రి ఆ ప్రాంతంలో గాలింపు ప్రారంభించింది. అయితే పక్కా వ్యూహంతో ఐఈడీలను రిమోట్‌తో పేల్చిన మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులు ప్రారంభించారు. ఇప్పటివరకు ఇలాంటి ఆకస్మిక దాడులతో మావోయిస్టులను మట్టుబెడుతూ వచ్చిన తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలకు ఇది ఊహించని షాక్ అని అంటున్నారు.

వడదెబ్బతో ముగ్గురి మృతి

సాక్షి, నెట్‌వర్క్: వేర్వేరు జిల్లాల్లో వడ దెబ్బతో ముగ్గురు మృతి చెందారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి కాసీంపల్లి గ్రామానికి చెందిన రైతు చిత్తారి చిన్నరాజయ్య (68), వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కాంటా వేస్తున్న హమాలీ కార్మికుడు శివరాత్రి శ్రీనివాస్ (35) వడదెబ్బతో మృతి చెందారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం మిడతనపల్లి గ్రామానికి చెందిన పాశం జానమ్మ (80) ఎండల తీవ్రతతో అస్వస్థతకు గురై మృతి చెందింది.

బండి సంజయ్ ఆఫీస్‌కు బెదిరింపులు

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి కార్యాలయ ఆర్థిక సలహాదారుడినని...తాను చెప్పిన పని చేయని పక్షంలో మీ సంగతి చూస్తానంటూ... కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయానికి ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్లో హెచ్చరికలు చేశాడు. ఫోన్ చేసి బెదిరించిన వ్యక్తి ఆదిభట్ల పరిధి నాదర్‌గుల్‌లోని జయసూర్యనగర్‌కు చెందిన కేపీరావుగా పోలీసులు గుర్తించారు. ఆ వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

ఈ ఏడాదిలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలివే
పూర్తి వివరాలు : సాక్షి ప్లస్‌లో

సీఎం అలా.. డిప్యూటీ సీఎం ఇలా..

- ఎన్‌కౌంటర్‌లో 22 మందికిపైగా చనిపోయారన్న ఛత్తీస్‌గఢ్ సీఎం
- ఆ ప్రచారంలో వాస్తవం లేదంటున్న డిప్యూటీ సీఎం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న కర్రిగుట్టలపై మిషన్ సంకల్ప్ పేరుతో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం యాంటీ నక్సల్స్ ఆపరేషన్ చేపట్టిందంటూ జరుగుతున్న ప్రచారం ఉత్త భ్రమేనని ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం (హోంశాఖ) విజయ్ శర్మ గురువారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లలో ఒకటి కర్రిగుట్టల దగ్గర కొనసాగుతోంది తప్పితే, మరే ప్రత్యేకత లేదన్నారు. అంతేకాదు ఎన్‌కౌంటర్‌లో 22 మంది మావోయిస్టులు చనిపోయారంటూ జరుగుతున్న ప్రచారంలోనూ వాస్తవం లేదని చెప్పడం గమనార్హం. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోందని, పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. కర్రిగుట్టల దగ్గర కొనసాగుతున్న ఆపరేషన్స్‌లో భద్రతా దళాలకు భారీ విజయం దక్కిందని, ఎదురు కాల్పుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు చనిపోయారని, ఇప్పటివరకు 22కి పైగా మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్ బుధవారం ప్రకటించారు. ఆ మరుసటి రోజే ఎన్‌కౌంటర్‌లో 22 మంది చనిపోయారని జరుగుతున్న ప్రచారమంతా మీడియా సృష్టేనంటూ డిప్యూటీ సీఎం విజయ్‌శర్మ ప్రకటించడం గమనార్హం.

ఆంక్షల వలయంలో..

బుధవారం నాటి ఎన్‌కౌంటర్‌పై ఛత్తీస్‌గఢ్ సీఎం, డిప్యూటీ సీఎంల నుంచి పరస్పర విరుద్ధ ప్రకటనలు వచ్చాయి. మరోవైపు బీజాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి గురువారం తెల్లవారుజామున 19 మృతదేహాలు చేరుకున్నట్టు సమాచారం. మృతుల్లో 8 మంది మహిళలు, 11 మంది పురుషులు ఉన్నట్టు తెలుస్తోంది. మరో 3 మృతదేహాలు కూడా ఇక్కడికి తరలించారనే ప్రచారం జరుగుతోంది. బీజాపూర్ ఆస్పత్రి ప్రాంగణాన్ని కేంద్ర బలగాలు తమ అధీనంలోకి తీసుకున్నాయి. మీడియాతో స హా ఎవరినీ లోపలికి అనుమతించలేదు. దీంతో ఎన్‌కౌంటర్‌కు సంబంధించి కనీసం ఆస్పత్రి ఫొటో తీసుకునే వీలు కూడా చిక్కలేదు. దీనిపై ఇప్పటివరకు పోలీసుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి కన్నుమూత

- సీఎం రేవంత్, పలువురు ప్రముఖుల సంతాపం
- శుక్రవారం అంత్యక్రియలు


రాజిరెడ్డి పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



కాప్రా (హైదరాబాద్): ఉప్పల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి(79) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం తెల్లవారుజామున హబ్సిగూడలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. రాజిరెడ్డి మృతి పట్ల పలువురు నేతలు సంతాపం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు హబ్సిగూడలోని రాజిరెడ్డి నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభమవుతుందని, సాయంత్రం 4 గంటలకు చీర్యాలలోని బండారి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రాజిరెడ్డి జీవితం కాంగ్రెస్‌కే అంకితం..

రాజిరెడ్డి రాజకీయ జీవితం మొత్తం కాంగ్రెస్ పార్టీకే అంకితం చేశారు. 1945లో మల్లాపూర్‌లో రాజిరెడ్డి జన్మించారు. కాంగ్రెస్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి కాప్రా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. టీటీడీ బోర్డు సభ్యుడిగానూ పనిచేశారు. 2009లో ఉప్పల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు.

సీఎం రేవంత్ సంతాపం..

రాజిరెడ్డి మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి, ఉప్పల్ నియోజకవర్గానికి రాజిరెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రాజిరెడ్డి మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, వివేకానందగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు భేతి సుభాష్ రెడ్డి, ఉపేందర్‌లు సంతాపం తెలిపారు.



యుద్ధం మొదలు!

తారస్థాయికి భారత్, పాక్ ఉద్రిక్తతలు
పూర్తిస్థాయి యుద్ధం దిశగా పరిస్థితులు

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్: అవమాన భారంతో విచక్షణ కోల్పోయిన దాయాది దిద్దుకోలేని పొరపాటు చేసింది. బుద్ధి తెచ్చుకోవాల్సింది పోయి పూర్తిగా బరితెగించింది. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారం చేయబోయి మరోసారి పరువు పోగొట్టుకుంది. భారత్‌ను సైనికంగా రెచ్చగొట్టే దుస్సాహసానికి పూనుకుని అభాసుపాలైంది. బుధవారం అర్ధరాత్రి దాటినప్పటి నుంచీ భారత్‌పై ఎడాపెడా వైమానిక దాడులకు దిగింది. క్షిపణులు, డ్రోన్ దాడులతో సరిహద్దు రాష్ట్రాల్లో పలు పౌర, సైనిక లక్ష్యాలను ధ్వంసం చేసేందుకు విఫలయత్నం చేసింది. వాటన్నింటినీ మన సైన్యం పూర్తిగా తిప్పికొట్టడమే గాక మూడు పాక్ యుద్ధ విమానాలను కూల్చేసింది. ఇద్దరు పాక్ పైలట్లను బందీలుగా పట్టుకుంది. రాజధాని ఇస్లామాబాద్‌తో పాటు కీలక పాక్ నగరాలపై ఒకే రోజు రెండుసార్లు క్షిపణి దాడులతో విరుచుకుపడింది. అక్కడి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు తదితరాలను నేలమట్టం చేసింది. రెండు రోజుల వ్యవధిలో దాయాదికి వరుసగా రెండో పరాభవం రుచిచూపి మర్చిపోలేని గుణపాఠం నేర్పింది. మరోవైపు నౌకాదళం కూడా రంగంలోకి దిగింది. పాక్‌కు జీవనాడి వంటి కరాచీ నౌకాశ్రయంపై ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధనౌక బాంబుల వర్షం కురిపించి 10కి పైగా నౌకలను ధ్వంసం చేసినట్టు సమాచారం. 1971 పాక్ యుద్ధం తర్వాత కరాచీ నౌకాశ్రయంపై దాడి ఇదే తొలిసారి. అంతేగాక ఏకంగా 20కి పైగా భారత యుద్ధ నౌకలు పాక్ వైపు కదులుతున్నట్టు చెబుతున్నారు. ఎల్లలు దాటిన ఉద్రిక్తతల నడుమ పరిస్థితులు పూర్తిస్థాయి యుద్ధం దిశగా సాగుతున్నాయి. ఇరువైపుల నుంచీ కాల్పుల మోతతో సరిహద్దులు దద్దరిల్లిపోతున్నాయి. పౌర లక్ష్యాలపై పాక్ సైన్యం విచక్షణారహిత కాల్పులకు తెగబడుతోంది. అందుకు మన సైన్యం దీటుగా బదులిస్తోంది. ఇరు దేశాల్లోనూ సరిహద్దు రాష్ట్రాలు ఎయిర్ సైరన్లు, బాంబుల మోతతో దద్దరిల్లిపోతున్నాయి. పలు విమానాశ్రయాలు మూతబడ్డాయి. ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు నెలకొన్నాయి. అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిందిగా భద్రతా బలగాలను కేంద్రం ఆదేశించింది. సైనికులకు సెలవులు రద్దు చేశారు. కీలకమైన సైనిక తదితర మౌలిక వ్యవస్థల వద్ద రక్షణను కట్టుదిట్టం చేశారు. పాక్ అత్యంత అనాగరికంగా వ్యవహరిస్తోందంటూ కేంద్రం మండిపడింది. పౌర ఆవాసాలపై విచక్షణారహితంగా డ్రోన్లు, మిసైళ్లు ప్రయోగిస్తూ హమాస్ ఉగ్ర సంస్థను తలపిస్తోందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు దుయ్యబట్టాయి. జమ్మూ, పఠాన్‌కోట్, ఉద్ధంపూర్‌ల్లో పాక్ క్షిపణి, డ్రోన్ దాడి యత్నాలను పూర్తిగా తిప్పికొట్టినట్టు సైన్యం ప్రకటించింది. పరిస్థితి అదుపు తప్పుతున్న నేపథ్యంలో అమెరికా రంగంలోకి దిగింది. సంయమనం పాటించాల్సిందిగా ఇరు దేశాలకూ సూచించింది.


దాయాది దుస్సాహసం, దీటుగా బదులిచ్చిన భారత్
లాహోర్ నుంచి కరాచీ దాకా ముప్పేట దాడులు

పేట్రేగిన పాక్

సరిహద్దుల వెంబడి 15 సైనిక స్థావరాలపై దాడి యత్నాలు విఫలం కావడంతో గురువారం పాక్ మరింతగా పేట్రేగిపోయింది. రాత్రివేళ పాక్ ఫైటర్ జెట్లు భారత్‌పై తీవ్రస్థాయిలో దాడులకు తెరతీశాయి. రాజస్తాన్ మొదలుకుని జమ్మూ కశ్మీర్ దాకా సరిహద్దుల పొడవునా పలుచోట్ల సైనిక లక్ష్యాలతో పాటు విచక్షణారహితంగా పౌర ఆవాసాలపైనా గురిపెట్టాయి. శ్రీనగర్, జమ్మూ విమానాశ్రయాలను ధ్వంసం చేసేందుకు విఫలయత్నం చేశాయి. జమ్మూ–శ్రీనగర్ హైవేపై భారీ పేలుడు చోటుచేసుకుంది. రాజౌరీ జిల్లాలో పలుచోట్ల పేలుళ్లు విన్పించాయి. పాక్ దాడులన్నింటినీ సైన్యం సమర్థంగా అడ్డుకుంది. సత్వారీలోని జమ్మూ విమానాశ్రయం, సాంబా, ఆర్ఎస్ పుర, అర్నియా తదితర ప్రాంతాలపైకి కనీసం 8కి పైగా క్షిపణులు దూసుకొచ్చే ప్రయత్నం చేయగా మధ్యలోని అడ్డుకుని కూల్చేసినట్టు ప్రకటించింది. మన 'ఆకాశ్', ఎంఆర్ఎస్ఏఎంతో పాటు అత్యాధునిక ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ పాక్ క్షిపణులు, డ్రోన్లను ఎక్కడివక్కడ కూల్చేశాయి. పఠాన్‌కోట్‌లో రెండు, జమ్మూలో ఒక పాక్ యుద్ధ విమానాన్ని ఎస్–400 వ్యవస్థ నేలకూల్చింది. వాటిలో రెండు జేఎఫ్–17, ఒక ఎఫ్–16 ఉన్నాయి. రెండు యుద్ధ విమానాలను నష్టపోయినట్టు పాక్ కూడా అంగీకరించింది. పఠాన్‌కోట్‌లో ఇద్దరు పైలట్లు మన బలగాలకు చిక్కినట్టు సమాచారం. ఆ వెంటనే పాక్‌పై సైన్యం విరుచుకుపడింది. ఇస్లామాబాద్, లాహోర్, సియాల్‌కోట్, కరాచీ, రావల్పిండిలపై దీర్ఘశ్రేణి క్షిపణులతో రెండోసారి భారీస్థాయిలో దాడులకు దిగింది. లాహోర్ తదితర నగరాల్లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలన్నింటినీ సమూలంగా నాశనం చేసేసింది. పాక్‌లోని పంజాబ్ ప్రాంతంలో నెలకొన్న కీలక ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టం (ఏడబ్ల్యూఏసీఎస్)ను తుత్తునియలు చేసింది. పాక్ నగరాలు బాంబు పేలుళ్లతో దద్దరిల్లినా పౌర ఆవాసాలు, వ్యవస్థలకు నష్టం కలగని రీతిలో సైనిక వ్యవస్థలను మాత్రమే ఎంచుకుని అత్యంత కచ్చితత్వంతో దాడులు నిర్వహించినట్టు సైన్యం పేర్కొంది.


జమ్మూ నగరం మీదకు దూసుకొస్తున్న పాక్ క్షిపణులు, డ్రోన్లు


కరాచీలో భారత డ్రోన్ దాడిలో ధ్వంసమైన ప్రాంతం వద్ద గుమిగూడిన జనం


బ్లాకౌట్ కారణంగా గురువారం రాత్రి రాజస్తాన్‌లోని జైసల్మేర్‌లో అలముకున్న చీకట్లు

పలుచోట్ల బ్లాకౌట్

పాక్ దాడుల నేపథ్యంలో గురువారం రాత్రి సరిహద్దు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో సైరన్ల మోత మోగింది. జమ్మూ కశ్మీర్, పంజాబ్, హరియాణా, రాజస్తాన్, గుజరాత్‌ల్లో పలుచోట్ల వైమానిక దాడుల హెచ్చరికలు జారీ అయ్యాయి. దాంతో పంజాబ్‌లోని పఠాన్‌కోట్, జలంధర్, అమృత్‌సర్, హోషియార్‌పూర్, మొహాలీ, చండీగఢ్ మొదలుకుని రాజస్తాన్‌లోని జైసల్మేర్ దాకా పలు నగరాల్లో కరెంటు సరఫరా నిలిపేశారు. ఆయాచోట్ల రాత్రిపూట పలు డ్రోన్లతో పాటు పేలుడు శబ్దాలను గమనించినట్టు భద్రతా బలగాలు తెలిపాయి. ప్రజలు లైట్లన్నీ ఆర్పేసి ఇళ్లకే పరిమితం కావాలని పేర్కొన్నాయి.

సుదర్శన చక్రమే రక్ష

దాయాది దాడులను తుత్తునియలు చేసిన గగనతల రక్షణ వ్యవస్థ ● పాక్ క్షిపణులు, డ్రోన్లను గాల్లోనే పేల్చేసిన అధునాతన ఆయుధ వ్యవస్థ

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముష్కరమూకల శిబిరాలు, స్థావరాలను భారత సాయుధబలగాలు నేలమట్టం చేయడంతో వెర్రెక్కిపోయి పాకిస్తాన్ ప్రయోగించిన క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లను మన గగనతల రక్షణ వ్యవస్థ 'సుదర్శన చక్ర' అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొంది. రక్షణ చట్రంగా యావత్ భారతగగనతలాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చేసింది. పాక్ మిస్సైళ్లను క్షణాల్లో పేల్చేసి దాని వైమానిక బలగాలను అయోమయానికి గురిచేసిన ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ 'సుదర్శన చక్ర' గురించే ఇప్పుడు అంతటా చర్చ మొదలైంది. విభిన్నమైన రాడార్లు, క్షిపణుల సమన్వయంతో పనిచేసి ప్రత్యర్థుల ఫైటర్ జెట్స్, రాకెట్లు, మానవ రహిత విమానాలను కూల్చేసే వ్యవస్థగా ప్రపంచంలోనే గొప్ప ఆయుధ వ్యవస్థగా పేరొందింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే వివిధ రకాల ఆయుధాలను సమ్మిళితం చేసిన సమష్టి ఆయుధ వ్యవస్థ ఇది. శత్రు క్షిపణులు కనీసం నేలనైనా తాకకుండా మార్గమధ్యంలోనే ముక్కలుచెక్కలు చేసేస్తున్న ఈ సుదర్శన చక్ర విశేషాలు ఓసారి చూద్దాం...

ఏమిటీ చక్ర?

రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్‌కు భారత బలగాలు 'సుదర్శన చక్ర' అని నామకరణం చేశాయి. పురాణాలు, ఇతిహాసాల ప్రకారం విష్ణుమూర్తి సుదర్శన చక్రం మహాశక్తివంతం. ఒకసారి ప్రయోగిస్తే శత్రుసంహారం జరగాల్సిందే. సుదర్శన చక్రం అమేయ శక్తికి, విజయానికి, అసాధారణ వేగానికి, శత్రు వినాశకానికి మారుపేరు. అందుకే ఎస్–400 గగనతల రక్షణ వ్యవస్థకు ఈ పేరు పెట్టారు. శత్రుసైన్యం నుంచి దూసుకొస్తున్న క్షిపణులను 'సుదర్శన చక్ర'లోని క్షిపణులు విజయవంతంగా అడ్డుకుంటాయి. మార్గమధ్యంలోనే పేల్చేస్తాయి. ఒకేసారి వేర్వేరు ప్రాంతాలపై రక్షణచట్రంగా నిఘా పెట్టడం 'సుదర్శన చక్ర' ప్రత్యేకత.

వాయుసేనతో అనుసంధానం

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వారి కమాండ్ అండ్ కంట్రోల్ నెట్‌వర్క్‌తో ఈ వ్యవస్థ అనుసంధానమై ఉంటుంది. ఒక చోట నిలిపి ఉంచిన ఈ వ్యవస్థలో రెండు ఆయుధసహిత వాహనాలు(బ్యాటరీలు) ఉంటాయి. ఒక్కో దాంట్లో ఆరు లాంఛర్లు ఉంటాయి. వీటితోపాటు అధునాతన రాడార్ వ్యవస్థ, కంట్రోల్ సెంటర్ ఉంటాయి. ఒక్కో వాహనం నుంచి గరిష్ఠంగా 128 క్షిపణులను ప్రయోగించవచ్చు. ఇలాంటి పెద్ద వ్యవస్థలను ఐదింటిని ఇప్పటికే రష్యా నుంచి కొనుగోలు చేసి సరిహద్దుల వెంట అత్యంత వ్యూహాత్మక ప్రదేశాల్లో భారత్ సంస్థించేసింది. ఈ వ్యవస్థలే బుధవారం అర్ధరాత్రి దాటాక పాకిస్తాన్ నుంచి దూసుకొచ్చిన పలు రకాల క్షిపణులు, డ్రోన్లను నేలకూల్చాయి. సుదర్శన చక్ర లాంఛర్ వాహనాలను ఎప్పటికప్పుడు అవసరమైన చోటుకు సులభంగా తరలించవచ్చు. వీటి జాడను శత్రు దేశాల రాడార్‌లు అస్సలు కనిపెట్టలేవు.

అన్ని రకాలుగా రక్షణ

శత్రు దేశాల స్టెల్త్ విమానాలు, యుద్ధ విమానాలు, ఆత్మాహుతి డ్రోన్లు, క్రూజ్, బాలిస్టిక్ క్షిపణుల రాకను గగనతలంలో ఉండగానే ఈ సుదర్శన చక్ర వ్యవస్థ పసిగడుతుంది. ఆ క్షిపణులు, డ్రోన్లు ఏ మార్గంలో వస్తున్నాయి? ఎంత వేగంతో వస్తున్నాయి? ఒకేసారి ఎన్ని వస్తున్నాయి? ఏఏ ప్రాంతాలపై పడొచ్చు? అనే వివరాలను కొన్ని సెకన్ల వ్యవధిలోనే ఇవి అత్యంత ఖచ్చితత్వంతో అంచనావేయగలవు. వెంటనే వాయుసేన అధికారులు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా లాంఛర్‌ల నుంచి క్షిపణులను ఈ వ్యవస్థ ప్రయోగిస్తుంది. ఈ క్షిపణులు శత్రు ఆయుధాలను గాల్లోనే తుత్తునియలు చేస్తాయి. ఒకే దిశ నుంచి వచ్చే శత్రు క్షిపణులను మాత్రమే కాదు వేర్వేరు దిశల నుంచి దూసుకొచ్చే క్రూజ్, బాలిస్టిక్ క్షిపణులను ఈ వ్యవస్థ ఒకేసారి పసిగట్టి ఒకేసారి వాటిని నిలువరించేందుకు ఎక్కువ సంఖ్యలో క్షిపణులను భిన్న దిశల్లో ప్రయోగించగలదు.


ఎక్కడ మోహరించారు?

పాక్‌తో సరిహద్దు పంచుకుంటున్న రాష్ట్రాల్లో ఈ ఆయుధ వ్యవస్థను భారత్ మోహరించింది. నాలుగు 'సుదర్శన చక్ర' వ్యవస్థలను భారత్ మోహరించింది. వందల కిలోమీటర్ల విస్తీర్ణంపై కేవలం ఒక్క స్క్వాడ్రాన్ నిఘా పెట్టగలదు. జమ్మూ కశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల గగనతల నిఘాపై ఒకటి, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలపై మరొటి మోహరించినట్లు తెలుస్తోంది. చైనా సైతం తరచూ కయ్యానికి కాలు దువ్వుతున్న నేపథ్యంలో అరుణాచల్ ప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లోనూ సుదర్శన చక్రను సిద్ధంగా ఉంచినట్లు రక్షణ రంగ వర్గాలు వెల్లడించాయి. ఏకంగా 600 కిలోమీటర్ల దూరం నుంచి దూసుకొచ్చే శత్రు క్షిపణులను ఇది ముందే పసిగట్టగలదు. వెంటనే ప్రయాణం మొదలెట్టి గరిష్ఠంగా 450 కిలోమీటర్ల దూరంలోనే వాటిని నేలకూల్చగలదు. ఒకేసారి భిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని అత్యంత వేగంగా, చాకచక్యంగా పని పూర్తిచేయగలదు. తికమకపెట్టే శత్రుదేశాల 'ఏమార్చే' వ్యవస్థలు ఈ సుదర్శన చక్రను మభ్యపెట్టలేవు. గగనతలంపై 360 డిగ్రీల కోణంలో ఇది నిఘా పెట్టగలదు. తన కనుసన్నల్లోకి ఏ చిన్నపాటి వస్తువు ఆకాశంలోకి ప్రవేశించినా దాని పరిమాణం, పథాన్ని పసిగట్టి వెంటనే క్షిపణిని ప్రయోగించి ధ్వంసంచేయగలదు. ప్రపంచంలోని అత్యంత అధునాతన గగనతల రక్షణ వ్యవస్థల్లో ఇదీ ఒకటి.

సుదూరాలు సురక్షితం

జామింగ్ వంటి వ్యతిరేక వ్యూహాలను తట్టుకోగలదు. ఒకేసారి బహుళ లక్ష్యాలను ఎంచుకుని పనిచేస్తుంది. అత్యంత సుదూరాలు, సువిశాల ప్రాంతాలకు రక్షణగా నిలుస్తుంది. గగనతల లక్ష్యాలను కేవలం భూతలం మీద నుంచే గురిపెట్టి ఛేదించగలదు. ముఖ్యంగా దీర్ఘశ్రేణి అస్త్రాలను నిర్వీర్యంచేయగలదు. రష్యా నుంచి కొనుగోలు తర్వాత వీటి రాకతో భారత గగనతల రక్షణ వ్యవస్థ మరింత పటిష్టమైంది.

- సాక్షి, నేషనల్ డెస్క్



అజర్ సోదరుడు హతం

- ఆపరేషన్ సిందూర్‌లో గాయపడి మరణించిన రవూఫ్
- విమానం హైజాక్ సహా పలు దాడులకు సూత్రధారి



న్యూఢిల్లీ: భారత ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన ఉగ్రవాదుల్లో జైషే మహ్మద్ చీఫ్ మౌలానా మసూద్ అజర్ సోదరుడు, ఐసీ–814 విమానం హైజాక్ సూత్రధారి అబ్దుల్ రవూఫ్ కూడా ఉన్నట్టు బీజేపీ తెలిపింది. 'ఎలిమినేటెడ్' అని రాసిన రవూఫ్ ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్‌కు రవూఫ్ రెండో చీఫ్. భారత్ దాడుల్లో తన కుటుంబానికి చెందిన 10 మంది, నలుగురు సన్నిహితులు చనిపోయారని జైషే మహ్మద్ చీఫ్ ప్రకటన చేసిన విషయం తెలిసిందే. మృతుల్లో అజర్ అక్క, ఆమె భర్త, మేనల్లుడు, అతని భార్య, మరో మేనకోడలు, ఐదుగురు పిల్లలు, అహర్ తల్లి, నలుగురు ముఖ్య సహాయకులు ఉన్నారు. ఈ దాడిలో రవూఫ్ కూడా మరణించాడని బీజేపీ పేర్కొంది. అబ్దుల్ రవూఫ్ 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసీ–814 హైజాక్‌కు సూత్రధారి. కఠ్మాండు నుంచి ఢిల్లీకి 190 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఆ ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని కాందహార్‌కు దారి మళ్లించాడు. ప్రయాణీకులను విడుదల చేయాలంటే.. భారత జైలులో ఉన్న ముగ్గురు ఉగ్రవాదులను విడుదల చేయాలని డిమాండ్ చేశాడు. అలా మసూద్ అజర్‌ను విడిపించుకున్నాడు. భారత్‌పై ఉగ్రదాడుల ప్రణాళిక, అమలులో రవూఫ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. పార్లమెంటుపై దాడి సమన్వయకర్త. 2016లో పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై దాడికి సూత్రధారి. అదే ఏడాది అతని నాయకత్వంలో జరిగిన ఉరి దాడిలో 19 మంది సైనికులు బలయ్యారు. 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను పొట్టనబెట్టుకున్న పుల్వామా ఆత్మాహుతి దాడి ప్రణాళికను కూడా రవూఫే పర్యవేక్షించాడని భావిస్తున్నారు.

సరిహద్దు భద్రతా చీఫ్‌లతో అమిత్ షా భేటీ

న్యూఢిల్లీ: ఇరువైపులా పరస్పర దాడుల వేళ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) సహా వేర్వేరు సరిహద్దు భద్రతా చీఫ్‌లతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమావేశమయ్యారు. గురువారం రాత్రి ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో బీఎస్ఎఫ్, ఐటీబీపీ, సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ) బలగాల అధినేతలు పాల్గొన్నారు. అంతర్జాతీయ సరిహద్దుల వెంట తాజా పరిస్థితిని అడిగి తెల్సుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ, జాతీయ విమానాశ్రయాల వద్ద భద్రతా పరిస్థితులపై సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) చీఫ్‌తో అమిత్ షా చర్చించారు. ఇండో–పాక్ సరిహద్దుసహా బంగ్లాదేశ్ సరిహద్దు వెంట భద్రతను బీఎస్ఎఫ్ బలగాలు చూసుకుంటున్నాయి. ఇక చైనాతో సరిహద్దు వెంట పహారా బాధ్యతలను ఐటీబీపీ, నేపాల్, భూటాన్‌లతో సరిహద్దు భద్రతను సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ) బలగాలు పర్యవేక్షిస్తున్న విషయం విదితమే.

15 భారత సైనిక స్థావరాలపై గురి

- తిప్పికొట్టిన సైన్యం, క్షిపణులు, డ్రోన్లు కూల్చివేత
- లాహోర్‌లో గగనతల రక్షణ వ్యవస్థ ధ్వంసం

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్: ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారం తీర్చుకోబోయి పాక్ బొక్కబోర్లా పడింది. భారత్‌లోని 15 సైనిక స్థావరాలను ధ్వంసం చేసేందుకు విఫలయత్నం చేసింది. బుధవారం అర్ధరాత్రి దాటాక అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, లూధియానా, ఉదంపూర్, భటిండా, చండీగఢ్, నాల్, ఫలోడీ, ఉత్తర్‌లాయ్, భుజ్ సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడికి తెగబడింది. అందుకు మన సైన్యం దీటుగా బదులిచ్చింది. అత్యాధునిక ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ పాక్ క్షిపణులు, డ్రోన్లను తుత్తునియలు చేసింది. గురువారం మధ్యాహ్నం పాక్‌పై ప్రతి దాడులకు దిగింది. ఇస్లామాబాద్, సియాల్‌కోట్, లాహోర్, రావల్పిండిలపై విరుచుకుపడింది. లాహోర్‌లోని పాక్ గగనతల రక్షణ వ్యవస్థను ధ్వంసం చేసింది. చైనా నుంచి పాక్ కొనుగోలు చేసిన హెచ్‌క్యూ–9 మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్ యూనిట్లను హర్పీ కామికాజ్ డ్రోన్లతో నేలకూల్చింది. ఈ దాడులను పాక్ కూడా ధ్రువీకరించింది. ''లాహోర్ సమీపంలో ఒక డ్రోన్ నేలకూలింది. గుర్జన్‌వాలా, చాక్వాల్, బహవల్‌పూర్, మియానో, కరాచీ, ఛోర్, రావల్పిండి, అతోక్ ప్రాంతాల్లో మరో 12 డ్రోన్లు ధ్వంసమయ్యాయి'' అని అంగీకరించింది. లాహోర్‌లో నలుగురు సైనికులు గాయపడ్డారని, ఒక పౌరుడు మరణించాడని చెప్పింది. ''పాక్ దుశ్చర్యకు అదే స్థాయిలో బదులిచ్చాం. ఎస్–400తో పాటు ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్‌తో పాక్ క్షిపణులు, డ్రోన్లను కూల్చేశాం'' అని సైన్యం ప్రకటించింది. పాక్ ఎయిర్ డిఫెన్స్ రాడార్లు, వ్యవస్థలను నాశనం చేసినట్లు కేంద్రం పేర్కొంది.

యుద్ధ వాతావరణం

భారత దాడులతో లాహోర్‌లో యుద్ధ వాతావరణం కనిపించింది. వాల్టన్ ఎయిర్‌పోర్టు సమీపంలో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. సైరన్లు మోగడంతో జనం భయభ్రాంతులయ్యారని తెలిపింది. గాల్లో దట్టమైన పొగ వ్యాపించినట్లు వెల్లడించింది. యుద్ధ భయంతో పాక్‌లో సియాల్‌కోట్, కరాచీ, లాహోర్ సహా పలు ఎయిర్‌పోర్టులను తాత్కాలికంగా మూసివేశారు. పాక్ నగరాల్లోని తమ పౌరులు తక్షణం దేశం వీడాలని, లేదా సురక్షిత ప్రాంతాలకు తరలాలని అమెరికా సూచించింది.

పీఎంఓ భేటీ జరుగుతుండగానే!

ఇస్లామాబాద్‌పై భారత్ దాడుల సమయంలో ప్రధాని షహబాజ్ షరీఫ్ తన కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షలో ఉన్నారు. ఆ సమయంలో పేలుళ్లతో నగరమంతా దద్దరిల్లిపోయింది. దాంతో సమీక్షను అర్ధంతరంగా నిలిపేసి ప్రధాని బృందం సురక్షిత ప్రాంతానికి తరలినట్టు సమాచారం. కాసేపటికే షహబాజ్ నివాస పరిసరాలు నేలమట్టం కావడంతో ఆయనను హుటాహుటిన పాతిక కి.మీ. దూరంలోని బంకర్‌లోకి తరలించినట్టు చెబుతున్నారు.



రక్త సిందూరం

దయచేసి ఘర్షణలు ఆపండి

ట్రంప్ సూచన

న్యూయార్క్/వాషింగ్టన్: భారత్–పాకిస్తాన్ మధ్య ఘర్షణలు పూర్తిగా ఆగిపోవాలని కోరుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని కోరారు. కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నట్టుగా భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయని వెల్లడించారు. మొదట ఉగ్రవాదులు దాడి చేశారు కాబట్టి తర్వాత భారత సైన్యం ప్రతిదాడి చేసిందని పరోక్షంగా అంగీకరించారు. ఇప్పటిదాకా జరిగింది చాలు, ఇకనైనా ఘర్షణలకు తెరదించాలని భారత్, పాక్‌లకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో తన వంతు సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నానని సూచించారు. భారత్, పాక్ మధ్య శాంతి కోసం తాను చేయగలిగినదంతా చేస్తానని ప్రకటించారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం వైట్ హౌస్ ఓవల్ ఆఫీసులో ట్రంప్ ఓ కార్యక్రమంలో మాట్లాడారు. తన విజ్ఞప్తిని మన్నించి దాడులకు తెరదించాలని భారత్, పాక్‌లకు సూచించారు.

ఉద్రిక్తతలు చల్లారాలి

యూకే పార్లమెంట్ విజ్ఞప్తి

లండన్: పహల్గాం ఉగ్ర ఘాతుకం, భారత్–పాక్‌ల మధ్య తీవ్రరూపం దాల్చిన ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్‌పై బ్రిటిష్ పార్లమెంట్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఉద్రిక్తతలను రూపుమాపేందుకు కృషి చేయాలని పార్టీలకతీతంగా సభ్యులు యూకే ప్రభుత్వాన్ని కోరారు. యూకే విదేశాంగ మంత్రి హమిష్ ఫాల్గొనెర్ బుధవారం హౌస్ ఆఫ్ కామన్స్‌లో చర్చను ప్రారంభించారు. సంయమనంతో వ్యవహరిస్తూ వెంటనే చర్చలకు ముందుకు రావాలని ఇరు దేశాలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. దౌత్యం, చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ప్రధాని కెయిర్ స్టార్మర్ ఒక ప్రకటన చేశారు. భారత దేశానికి తనను తాను రక్షించుకునే హక్కుందని విదేశాంగ శాఖ సహాయ మంత్రి, భారత సంతతికి చెందిన ప్రీతీ పటేల్ చెప్పారు. అందుకు తగ్గ చర్యలు తీసుకునే అధికారముందని ఆమె భారత ప్రభుత్వ చర్యలను సమర్థించారు.అణు పాటవం కలిగిన ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెచ్చరిల్లడంపై పాక్ సంతతికి చెందిన ఎంపీలు ఆందోళన వెలిబుచ్చారు.

జమ్మూకశ్మీర్‌కు వెళ్లొద్దు

పౌరులకు యూఎస్, యూకే, ఇతర దేశాల విజ్ఞప్తి

న్యూఢిల్లీ: భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న దృష్ట్యా జమ్మూకశ్మీర్‌కు వెళ్లొద్దని యూఎస్, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాలు తమ పౌరులకు సూచించాయి. ఆపరేషన్ సిందూర్ తరువాత ఘర్షణ వాతావరణం నెలకొడంతో ఆయా దేశాలు కొత్త ట్రావెల్ అడ్వైజరీని జారీ చేశాయి. 'భారత్–పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో పరిణామాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటికే ఘర్షణాత్మక ప్రాంతాల్లో ఉన్నవారు అక్కడి నుంచి వెళ్లిపోవాలి. కొత్తగా అక్కడికి ప్రయాణించకపోవడం మంచిది'అని న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం పౌరులకు విజ్ఞప్తి చేసింది. యూకే, సింగపూర్ కూడా ఇదే తరహా సూచనలు చేశాయి.

ఓ దేవుడా.. మా దేశాన్ని కాపాడు!

పార్లమెంటులోనే ఏడ్చేసిన పాక్ ఎంపీ

న్యూఢిల్లీ: భారత సైన్యం దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్తాన్‌లో సామాన్యులతోపాటు చట్ట సభల సభ్యులు కూడా బెంబేలెత్తిపోతున్నారు. సైనిక రిటైర్డ్ మేజర్, సీనియర్ ఎంపీ అయిన తాహిర్ ఇక్బాల్ ఆ దేశ పార్లమెంటులోనే ఏకంగా ఏడ్చేశారు. అధికార పార్టీ ఎంపీ అయిన ఇక్బాల్.. పార్లమెంటులో మాట్లాడుతూ కన్నీళ్లు పెట్టుకున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 'భగవంతుడా.. మేమంతా నీముందు మోకరిల్లామ్.. దయచేసి ఈ దేశాన్ని కాపాడు'అని ఇక్బాల్ మొరపెట్టుకున్నాడు. 'మనదేశం ఇప్పుడు ఎంతో వేదనలో ఉంది. ప్రజాప్రతినిధులంతా ఏకమై, ఈ దేశాన్ని కాపాడాలని భగవంతున్ని ప్రార్థిద్దాం'అని సహచర ఎంపీలకు సూచించారు. అధికార పార్టీ ఎంపీనే ఏడ్చేయటం ఆ దేశంలో ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోందని నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు.

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో 90 విమానాలు రద్దు

న్యూఢిల్లీ: ఢిల్లీ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే 90 విమానాలను వివిధ విమానయాన సంస్థలు గురువారం రద్దు చేశాయి. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లోని 27 విమానాశ్రయాలను ఇప్పటికే మూసివేశారు. దీంతో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు పలు విమానాలు రద్దయ్యాయి. మొత్తం 46 దేశీయ ప్రయాణాలు, 33 రాకపోకలు రద్దయ్యాయి. అలాగే, 5 అంతర్జాతీయ నిష్క్రమణలు, 6 రాకపోకలను రద్దు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

లద్దాఖ్‌లో డ్రోన్లు, యూఏవీలపై నిషేధం

లేహ్: లేహ్, కార్గిల్ జిల్లాల్లో డ్రోన్లు, మానవ రహిత వైమానిక వాహనాలను (యూఏవీ) ఎగురవేయడాన్ని గురువారం నిషేధించారు. స్థానికులు, పర్యాటకులు, ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా ఎగరవేయొద్దంటూ సంబంధిత జిల్లా మేజిస్ట్రేట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా భద్రత దృష్ట్యా నిషేధించినట్లు లేహ్ జిల్లా మేజిస్ట్రేట్ సంతోష్ సుఖదేవే, కార్గిల్ జిల్లా మేజిస్ట్రేట్ శ్రీకాంత్ బాలాసాహెబ్ సూసే తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్' ఆగలేదు

100 మంది ముష్కరులు, వారి మద్దతుదారులు హతమయ్యారు

- పాకిస్తాన్ ఉగ్రవాదులపై సైనిక చర్య కొనసాగుతోంది
- అఖిలపక్ష సమావేశంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి
- కేంద్రానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన విపక్ష నేతలు

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌లో కనీసం 100 మంది కరడుగట్టిన పాకిస్తాన్ ఉగ్రవాదులు, వారి మద్దతుదారులు హతమయ్యారని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టంచేశారు. ఈ ఆపరేషన్ ఆగిపోలేదని, ఇంకా కొనసాగుతూనే ఉందని వెల్లడించారు. భారత్ ఘర్షణలు కోరుకోవడం లేదని, పాకిస్తాన్ దాడి చేస్తే మాత్రం గట్టిగా బుద్ధిచెప్పడం ఖాయమని అన్నారు. రెచ్చగొడితే ఎదురుదాడి చేయక తప్పదని తేల్చిచెప్పారు. రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన గురువారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, ఎస్.జైశంకర్, బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా, కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సహా వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు. పాకిస్తాన్‌పై భారత్ చేపట్టిన సైనిక చర్యకు పార్టీలకు అతీతంగా వారంతా మద్దతు పలికారు. ఇది రాజకీయాలకు సమయం కాదని, మనమంతా ఐక్యంగా ఉండాలని నిర్ణయానికొచ్చారు. భారత సైనిక దళాల పరాక్రమాన్ని ప్రశంసించారు. అన్ని పార్టీల నాయకులు ఏకగ్రీవంగా అభినందనలు తెలియజేశారు. పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి అండగా ఉంటామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ గురించి రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. విపక్ష నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ ఆపరేషన్ ద్వారా ఇప్పటిదాకా అనుకున్న లక్ష్యాలు సాధించినట్లు తెలిపారు. ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది కాబట్టి పూర్తి వివరాలు వెల్లడించడం సాధ్యం కాదని అన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజల భద్రత కోసం చేపట్టిన చర్యలను అఖిలపక్ష భేటీలో రాజ్‌నాథ్ వెల్లడించారు.

టీఆర్‌ఎఫ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలి

జాతీయ భద్రత విషయంలో ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, బీజేడీ, జేడీ(యూ), ఎంఐఎం, సీపీఎం తదితర నేతలు ప్రకటించారు. లష్కరే తోయిబా ముసుగు సంస్థ ద రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్‌ఎఫ్) అరాచకాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్లాలని హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. టీఆర్ఎఫ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి విజ్ఞప్తి చేశారు. పహల్గాం ఉగ్రదాడిలో మృతిచెందిన వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి నర్వాల్‌పై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరుగుతుండడం పట్ల ఒవైసీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో మత సామరస్యం కోసం అందరూ కలసికట్టుగా కృషి చేయాలని విపక్ష నేతలు పిలుపునిచ్చారు. భారత వైమానిక దళానికి చెందిన ఐదు యుద్ధ విమానాలు కూల్చివేసినట్లు పాకిస్తాన్ చెబుతోందని, ఈ తప్పుడు ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టాలని పలువురు నాయకులు కేంద్రాన్ని కోరారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని, దేశమంతా ఐక్యంగా ఉందన్న సందేశాన్ని ప్రపంచానికి అందించాలని సూచించారు. అఖిలపక్ష సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కాకపోవడం పట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అసంతృప్తి వ్యక్తంచేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌నాథ్ సింగ్. హాజరైన మంత్రులు అమిత్ షా, నిర్మల, జైశంకర్, జె.పి.నడ్డా, కాంగ్రెస్ నేతలు ఖర్గే, రాహుల్ గాంధీ


నిరంతరం అప్రమత్తంగా ఉండండి



- మంత్రిత్వ శాఖలు, సంస్థల మధ్య సమన్వయం కీలకం
- ఉన్నతస్థాయి సమీక్షలో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిస్థితుల నేపథ్యంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించారు. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల మధ్య స్పష్టమైన సమాచార వ్యవస్థ, సంసిద్ధత అత్యంత కీలకమని స్పష్టం చేశారు. జాతీయ భద్రత పట్ల ప్రభుత్వం పూర్తి అంకితభావంతో ఉందని పునరుద్ఘాటించారు. గురువారం వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల కార్యదర్శులతో ప్రధానమంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేబినెట్ కార్యదర్శి, ప్రధానమంత్రి కార్యాలయ సీనియర్ అధికారులు, రక్షణ, హోం, విదేశాంగ వ్యవహారాలు, సమాచార, విద్యుత్, ఆరోగ్యం, టెలికమ్యూనికేషన్స్ వంటి కీలక మంత్రిత్వ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు. జాతీయ భద్రత, మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలను ప్రధాని మోదీ సమీక్షించారు. పాకిస్తాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖల సన్నాహాలు, ప్రణాళికలను ఆరా తీశారు. కార్యదర్శులు తమ మంత్రిత్వ శాఖల కార్యకలాపాలను సమగ్రంగా సమీక్షించాలని పేర్కొన్నారు. అత్యవసర ప్రతిస్పందన, కమ్యూనికేషన్ ప్రొటోకాల్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు. పౌర రక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేయడంతోపాటు తప్పుడు సమాచారం, నకిలీ వార్తల వ్యాప్తిని సమర్థంగా నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. రాష్ట్రాల అధికారులతో పాటు క్షేత్రస్థాయి సంస్థలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ప్రధానమంత్రి స్పష్టంచేశారు. ఎలాంటి విపత్కర పరిణామాలు ఎదురైనా తగిన రీతిలో ప్రతిస్పందించేందుకు సిద్ధంగా ఉన్నామని పలువురు కార్యదర్శులు చెప్పారు.

మా సహనాన్ని పరీక్షించొద్దు



- పాక్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ వార్నింగ్

న్యూఢిల్లీ: భారత్ సహనాన్ని పరీక్షించవద్దని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌ను తీవ్రంగా హెచ్చరించారు. రెచ్చగొడితే తగు రీతిలో సమాధానం ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు బదులుగా భారత్‌లోని 15 సైనిక లక్ష్యాలపై పాక్ దాడికి యత్నించడం బదులుగా గురువారం పాక్ వ్యాప్తంగా ఉన్న మిలటరీ రాడార్లతోపాటు లాహోర్‌లోని రాడార్ వ్యవస్థను భారత వైమానిక దళం ధ్వంసం చేసిన నేపథ్యంలో రాజ్‌నాథ్ పైవిధంగా స్పందించారు. నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ..'మనం ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా, ఎంతో సంయమనంతో వ్యవహరిస్తూ వచ్చాం. చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలనే నమ్ముతున్నాం. దీనిని అలుసుగా తీసుకోవాలని ప్రయత్నిస్తే మాత్రం దీటుగా బదులిస్తాం'అని ఆయన స్పష్టం చేశారు. పాక్‌తోపాటు పీవోకేలోని ఉగ్ర స్థావరాలను నామరూపాలు లేకుండా చేసిన వీర సైనికులను ఆయన అభినందించారు. దాడుల సమయంలో సామాన్యులకు హాని వాటిల్లకుండా అనితర సాధ్యమైన కచ్చితత్వంతో దాడులు జరిపామన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకునే విషయంలో ఏ శక్తీ ఆపజాలదన్నారు. పాక్, పీవోకేల్లోని ఉగ్ర స్థావరాలపై జరిగిన దాడుల్లో పెద్ద సంఖ్యలో ముష్కరులు హతమయ్యారని వెల్లడించారు.

పుట్టినప్పటి నుంచీ అబద్ధాలే

- పాకిస్తాన్‌పై విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ ధ్వజం

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల శిబిరాలు, వారి మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయాలన్న ఏకైక లక్ష్యంతోనే ఆపరేషన్ సిందూర్ చేపట్టినట్లు భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ తేల్చిచెప్పారు. భారత్‌కు వ్యతిరేకంగా ముష్కర మూకలకు పాకిస్తాన్ నిస్సిగ్గుగా మద్దతిస్తోందని, ఈ విషయం ప్రపంచం మొత్తానికి తెలుసని చెప్పారు. పాకిస్తాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో టెర్రరిస్టు క్యాంపులపై జరిగిన దాడికి మతం రంగు పులుముతోందని పాక్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పుట్టినప్పటి నుంచి పాకిస్తాన్ అబద్ధాలే చెబుతోందని విమర్శించారు. 1947 నుంచి పాకిస్తాన్ అబద్ధాలు వినడం అందరికీ అలవాటైపోయిందని అన్నారు. విక్రం మిస్రీ గురువారం ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. పాకిస్తాన్ తీరుపై విరుచుకుపడ్డారు. ''1947లో పాకిస్తాన్ సైన్యం జమ్మూకశ్మీర్‌పై దాడికి దిగింది. కానీ, ఆ దాడితో సంబంధం లేదంటూ ఐక్యరాజ్యసమితికి అబద్ధాలు చెప్పింది. కేవలం గిజరినులే జమ్మూకశ్మీర్‌లోకి చొరబడ్డారని నమ్మబలికింది. భారత సైన్యం, ఐరాస బృందం అక్కడికి చేరుకుంటే అసలు సంగతి తెలిసింది. చివరకు చేసేది లేక తమ సైన్యమే జమ్మూకశ్మీర్‌పై దాడి చేసినట్లు పాకిస్తాన్ అంగీకరించింది. పాకిస్తాన్ అబద్ధాల ప్రయాణం 75 ఏళ్ల క్రితమే మొదలైంది కాబట్టి ఇది మాకు ఆశ్చర్యం కలిగించడం లేదు. పహల్గాంపై పాక్ అలాంటి అబద్ధాలే చెబుతోంది. తప్పుడు ప్రచారంతో నమ్మించాలని చూస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న భారత యుద్ధ విమానాలను కూల్చేశామంటూ అబద్ధాలు ప్రచారం చేస్తోంది. పుట్టుక నుంచే అబద్ధాలు మొదలు పెట్టిన పాకిస్తాన్‌ను నమ్మాల్సిన అవసరం లేదు.

మసీదులపై భారత్ సైన్యం దాడి చేయలేదు

భారత్‌కు చెందిన 15 సైనిక స్థావరాలపై దాడిచేసేందుకు పాక్ ప్రయత్నించగా భారత సైన్యం సమర్థంగా అడ్డుకుంది. భారత్‌ను ఎదుర్కొనే సత్తా లేని పాకిస్తాన్ మత ఉద్రిక్తతలు సృష్టించడానికి కుట్రలు పన్నుతోంది. ప్రజలను రెచ్చగొట్టడానికి మతంకార్డు వాడుతోంది. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్‌లో సిక్కు మతస్తులే లక్ష్యంగా పాక్ సైన్యం దాడులు చేసింది. గురుద్వారాతోపాటు సిక్కు ఇళ్లపై దాడికి దిగింది. ఈ దాడుల్లో 16 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. మసీదులపై భారత సైన్యం దాడి చేసిందంటూ పాక్ చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదు. ఉగ్రవాదుల క్యాంపులే ఇండియన్ ఆర్మీ లక్ష్యం. నిజానికి ఉగ్రవాదులకు మసీదుల్లో ఆశ్రయం కల్పించింది పాకిస్తానే. మసీదులను రక్షణగా వాడుకోవడం నిజం కాదా? ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన ఉగ్రవాదులకు పాక్ ప్రభుత్వం అధికారికంగా అంత్యక్రియలు నిర్వహించడం దారుణం. పహల్గాంలో పర్యాటకుల మతం అడిగి మరీ ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. భారత్‌లో పాక్ ఆటలు సాగవు. ఇక్కడ మతం పేరిట రెచ్చగొట్టాలని చూస్తే ఎవరూ రెచ్చిపోరు. పహల్గాంలో ఉగ్రదాడిని మతాలకు అతీతంగా భారతీయులంతా ఖండించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని నీలం–జీలం ప్రాజెక్టును ఇండియా టార్గెట్ చేసిందంటూ పాకిస్తాన్ చేసిన ఆరోపణలను ఖండిస్తున్నాం. ఈ సాకుతో ఇండియాలోని మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే జరగబోయే పరిణామాలకు పాకిస్తానే బాధ్యత వహించాలి''అని విక్రం మిస్రీ స్పష్టంచేశారు.


అంత్యక్రియలప్పటి ఫొటోను చూపుతున్న మిస్రీ

ఉగ్రవాదులకు అధికారిక అంత్యక్రియలా?

- లష్కరే ఉగ్రవాది నేతృత్వంలోనే ఆ దేశ సైన్యం నిర్వహించింది
- సామాన్య పౌరులు మరణిస్తే ఇలా కూడా చేస్తారా?
- పాక్ తీరును ఎండగట్టిన భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ దాడిలో హతమైన ఉగ్రవాదులకు పాకిస్తాన్ సైన్యం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించటంపై భారత ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి పనులు ఆ దేశానికి అలవాటుగా మారాయని మండిపడింది. ఆపరేషన్ సిందూర్‌పై గురువారం ఢిల్లీలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. పాక్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది నాయకత్వంలో ఆ దేశ సైన్యం, పోలీసులు ఉగ్రవాదుల మృతదేహాలకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఫొటోలను ప్రదర్శించారు. ఇలాంటి చర్యలతో పాకిస్తాన్ ఏం సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. భారత్ దాడుల్లో సాధారణ పౌరులు మరణించారన్న పాకిస్తాన్ ప్రకటనను ఖండించారు. 'దాడుల్లో నిజంగా సామాన్య పౌరులే మరణిస్తే.. మరి ఈ ఫొటోలో ఉన్నదేమిటి? సామాన్యుల మృతదేహాలను శవపేటికల్లో పెట్టి.. వాటిపై పాకిస్తాన్ జాతీయ జెండాలు కప్పి, అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారా?'అని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. తమ దాడుల్లో చనిపోయిన వాళ్లంతా ఉగ్రవాదులేనని స్పష్టంచేశారు. 'ఉగ్రవాదంతో మలినమైన చేతులను కడుక్కొనేందుకు పాకిస్తాన్ ప్రయత్నిస్తోంది. పాకిస్తాన్‌లో ఉగ్రవాదులే లేరని ఆ దేశ సమాచార శాఖ మంత్రి ఓ టీవీ చర్చలో ప్రకటించారు. కానీ, ఆ చర్చలోనే ఆయన తన ప్రకటనకు గట్టి సవాలు ఎదుర్కొన్నారు. ఉగ్రవాదానికి పాకిస్తానే కేంద్ర స్థానమని అనేక సందర్భాల్లో నిరూపణ అయ్యింది. ఇందుకు సంబంధించిన ఆధారాలు భారత్‌తోపాటు అనేక దేశాల వద్ద ఉన్నాయి'అని మిస్రీ పేర్కొన్నారు.

హై అలర్ట్

పంజాబ్, గుజరాత్‌లలో పోలీసుల సెలవుల రద్దు

చండీగఢ్/అహ్మదాబాద్: భారత్–పాకిస్తాన్ ఉద్రిక్తతల మధ్య అంతర్జాతీయ సరిహద్దును పంచుకుంటున్న పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలు హై అలర్ట్ ప్రకటించాయి. పాకిస్తాన్‌తో పంజాబ్ 532 కిలోమీటర్లు, రాజస్తాన్ 1,070 కిలోమీటర్లు సరిహద్దును పంచుకుంటోంది. రెండు రాష్ట్రాల్లో పోలీసుల సెలవులను రద్దు చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు పాఠశాలలను కూడా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ప్రజలు నిత్యావసర వస్తువుల కోసం దుకాణాల ముందు క్యూ కట్టారు. పంజాబ్‌లోని సరిహద్దుకు సమీపంలోని అన్ని జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. ఆరు సరిహద్దు జిల్లాలైన ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, ఫాజిల్కా, అమృత్‌సర్, గురుదాస్‌పూర్, తార్న్ తరన్ జిల్లాల్లో పాఠశాలలను మూసివేశారు. పోలీసుల సెలవులను రద్దు చేశారు. ఇక అమృత్‌సర్‌లో నిత్యావసర వస్తువుల బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించడానికి జిల్లా యంత్రాంగం ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. జిల్లాలో నిత్యావసర వస్తువుల కొరత లేదని, బ్లాక్ మార్కెటింగ్‌ను ప్రోత్సహించవద్దని, ప్రజలు అనవసరంగా అదనపు వస్తువులను కొనుగోలు చేయవద్దని అధికారులు కోరారు. మరోవైపు పప్పులు, వంటనూనె, గోధుమ పిండి, పంచదార, ఉప్పు వంటి వస్తువులను పెద్దమొత్తంలో కొనుగోలు చేసేందుకు అమృత్‌సర్‌లోని కిరాణా దుకాణాలు, డిపార్ట్‌మెంటల్ స్టోర్ల వద్ద ప్రజలు క్యూ కట్టారు. సరిహద్దు జిల్లాల్లో ఒకటైన గురుదాస్‌పూర్‌లో గురువారం రాత్రి 9 గంటల నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు బ్లాకవుట్ విధించారు. ప్రజల భద్రత కోసం పోలీసు స్క్వాడ్లు, క్విక్ రెస్పాన్స్ బృందాలను నియమించింది. అత్యవసర సహాయం కోసం హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేసింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం అన్ని బహిరంగ కార్యక్రమాలను రద్దు చేసింది.

రిట్రీట్ నిలిపివేత..

ప్రజల భద్రత దృష్ట్యా పాక్ సరిహద్దుల్లో రిట్రీట్ వేడుకలను బీఎస్ఎఫ్ నిలిపివేసింది. పంజాబ్‌లోని పాకిస్తాన్ వెంబడి ఉన్న మూడు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద రిట్రీట్ వేడుకలను నిర్వహించబోమని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) తెలిపింది. పాకిస్తాన్ వాఘాకు ఎదురుగా ఉన్న అట్టారీ (అమృత్‌సర్), ఫిరోజ్‌పూర్ జిల్లాలోని హుస్సేనీవాలా, ఫజిల్కా జిల్లాలోని సద్కీ వద్ద ఉన్న జేసీపీల వద్ద పాకిస్తాన్ రేంజర్లతో కలిసి బీఎస్ఎఫ్ దళాలు ప్రతిరోజూ సాయంత్రం రిట్రీట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి.

తీరప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత..

ఇక గుజరాత్ తీరం వెంబడి భద్రతను కట్టుదిట్టం చేసింది. పోలీసు సిబ్బంది సెలవులను రద్దు చేసింది. తీరం వెంబడి ఉన్న రాజ్‌కోట్ రేంజ్‌లోని జామ్‌నగర్, మోర్బి, దేవభూమి, ద్వారకాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. పోలీసులు తీరప్రాంత గ్రామాలు, బోట్‌ల్యాండింగ్ పాయింట్లను సందర్శిస్తున్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని గ్రామస్తులను పోలీసులు కోరుతున్నారు.

గాల్లో దీపం పాక్ గగనతలం

- భారత క్షిపణుల రాకను పసిగట్టలేకపోయిన పాక్ ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలు
- చైనా తయారీ ఆయుధ వ్యవస్థలపై పూర్తిగా ఆధారపడిన పాక్
- తరచూ మొరాయిస్తూ, రిపేర్లమయమైన వ్యవస్థ

పాకిస్తాన్‌పై ప్రళయ భీకరంగా భారత వైమానిక బలగాలు దాడి చేస్తుంటే ఆ దేశ రక్షణ వ్యవస్థ చేష్టలుడిగి చూసిందన్న వార్త నేపథ్యంలో అసలు ఈ ధూర్తదేశ గగనతలానికి రక్షణ ఉందా? ఉంటే ఎలాంటి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను పాకిస్తాన్ మోహరించిందనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. శతఘ్నులు, యుద్ధ విమానాలు మొదలు జలాంతర్గాములదాకా చాలా రకాల ఆయుధాలపై పాకిస్తాన్ చైనా మీదనే ఆధారపడుతోంది. గగనతల రక్షణ వ్యవస్థలను సైతం చైనా నుంచే కొనుగోలు చేసింది. పాకిస్తాన్ మోహరించిన హెచ్‌క్యూ–9పీ, హెచ్‌క్యూ–16 గగనతల రక్షణ వ్యవస్థలను భారత్ నాశనంచేసింది. ముఖ్యంగా లాహోర్, సియాల్‌కోట్‌లలో మోహరించిన హెచ్‌క్యూ–9పీ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను భారత వైమానిక దళాలు ధ్వంసంచేశాయి. చైనా తన కోసం తయారుచేసుకున్న హెచ్‌క్యూ–9 రకం వ్యవస్థను పాకిస్తాన్ కోసం కాస్త మార్పులు చేర్పులుచేసి ఆ దేశానికి అమ్మేసింది. ''రష్యా తయారుచేసిన ఎస్–300 మిస్సైల్ వ్యవస్థను చైనా తయారీ హెచ్‌క్యూ–9 క్షిపణి వ్యవస్థ పోలి ఉంటుంది. పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్సుపై భారత క్షిపణులు విరుచుకుపడుతున్నా పాకిస్తాన్ గగనతల రక్షణవ్యవస్థలు ఏమాత్రం పసిగట్టలేకపోయాయి. ఇది పూర్తిగా ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థ వైఫల్యాన్ని అద్దంపడుతోంది'' అని యుద్ధరంగ నిపుణుడు సందీప్ ఉన్నిథాన్ చెప్పారు. ''దూసుకొస్తున్న శత్రుదేశాల క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లను ముందుగా కనిపెట్టాల్సిన గురుతర, కీలక బాధ్యత ఈ ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలదే. రక్షణ, వైమానిక స్థావరాల రక్షణకు ఇదే ప్రాణం. అలాంటి వ్యవస్థలే విఫలమైన నేపథ్యంలో త్వరలో భారత్ జరపబోయే దాడులను అడ్డుకునే వ్యవస్థ ఇక లాహోర్, సియాల్‌కోట్ వంటి చోట్ల లేదనే చెప్పాలి'' అని ఉన్నిథాన్ వ్యాఖ్యానించారు.

పాకిస్తాన్ వద్ద ఉన్న వ్యవస్థలేంటి?

హెచ్‌క్యూ–9పీ, హెచ్‌క్యూ–9బీఈ, ఎఫ్‌డీ–2000, హెచ్‌క్యూ–16ఎఫ్ఈ గగనతల రక్షణ వ్యవస్థలపై పాక్ ఆధారపడుతోంది. వీటితోపాటే పాతతరం ఎల్‌వై–80, ఎఫ్ఎం–90 రకాలూ ఎంతోకొంత పాక్‌కు సాయపడుతున్నాయి. 40 కిలోమీటర్ల స్థాయిలో లక్ష్యాలను ఛేదించడానికి ఎల్‌వై–80ను పాక్ వాడుతోంది. మే 7వ తేదీ అర్ధరాత్రి దాటాక భారత్ చేసిన దాడిలో హెచ్‌క్యూ–16 వ్యవస్థ నాశనమైంది. చైనా నుంచి 2021లో హెచ్‌క్యూ–9పీ దీర్ఘశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థను దిగుమతి చేసుకుంది. తమ గగనతలంలోకి వచ్చిన శత్రు క్షిపణులను 125 కిలోమీటర్ల దూరం నుంచే గుర్తించి నేలమట్టంచేయగలదు. యుద్ధ విమానాలనూ అడ్డుకోగలదు.

అంతా మేకపోతు గాంభీర్యం

భారత్ దాడి చేస్తే ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని పాకిస్తాన్ గతంలోనే ప్రకటించింది. తమ వైమానిక, క్షిపణి విధ్వంసక వ్యవస్థలను వ్యూహాత్మక ప్రాంతాల్లో మోహరించామని, ఎలాంటి దాడినైనా ఎదుర్కొనే సత్తా తమకు ఉందని ఇన్నాళ్లూ పాకిస్తాన్ చేసిన భీష్మ ప్రతిజ్ఞలన్నీ కేవలం మేకపోతు గాంభీర్యమని బుధవారం నాటి భారతదాడితో తేలిపోయింది. అరగంటలోపు రెండు డజన్లకుపైగా క్షిపణులతో భారత్ విరుచుకుపడుతుంటే వాటిని పాక్ గగనతల వ్యవస్థలు అడ్డుకోలేకపోయాయి. మూడేళ్ల క్రితం అత్యాధునిక బ్రహ్మోస్‌కు సంబంధించిన డమ్మీ క్షిపణి పొరపాటున పాకిస్తాన్ గగనతలంలోకి దూసుకెళ్లినప్పుడు కూడా పాక్ ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థ దానిని కూల్చలేకపోయాయి. అటుగా మన క్షిపణి వెళ్లిన విషయాన్ని మొదట స్వయంగా భారతే ప్రకటించింది. ఇప్పుడు లాహోర్, సియాల్‌కోట్‌లోనూ ఇదే వైఫల్యం పునరావృతమైంది. 2019లో భారత వైమానిక దాడులు చేసిన బాలాకోట్‌లో ముష్కరుల స్థావరాలను నేలమట్టంచేసింది. ఆరోజు సైతం భారత గగనతల సంచారాన్ని పాక్ గగనతల వ్యవస్థలు ఏమాత్రం కనిపెట్టలేకపోయాయి.

వేధిస్తున్న సాంకేతిక సమస్యలు

చైనా తయారీ రక్షణ వ్యవస్థలు తరచూ మొరాయిస్తుండటం, రిపేర్లమయం కావడం పాకిస్తాన్‌కు పెద్ద సమస్యగా తయారైంది. పాకిస్తాన్ తన రక్షణవ్యవస్థలకు భారీగా నిధులను కేటాయించలేకపోవడమూ ఇందుకు ప్రధాన కారణం. ఉన్న ఆయుధాలతోనే ఎలాగోలా పాక్ సాయుధబలగాలు నెట్టుకొస్తున్నట్లు తెలుస్తోంది. గగనతల రక్షణ వ్యవస్థలను వాస్తవానికి ఎప్పటికప్పుడు ఆధునీకరించుకోవాలి. ఇప్పటికే పేదరికం, ద్రవ్యోల్బణం, అప్పులతో కుదేలైన పాకిస్తాన్‌కు ఎప్పటికప్పుడు కొత్త వ్యవస్థను కొనే ఆర్థిక దమ్ము లేదు. ఇవన్నీ కలిసి ఇప్పుడు దాని గగనతల రక్షణ వ్యవస్థను మరింత నిర్వీర్యం చేస్తున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

అందాల పోటీల విషయానికి వస్తే1994 దేశానికి ముఖ్యమైన సంవత్సరం! ఆ ఏడే తొలి మిస్ యూనివర్స్ కిరీటం దక్కింది. ఆ ఏడే మిస్ వరల్డ్ క్రౌన్ కూడా వచ్చింది.. 28 ఏళ్ల తర్వాత.. రీటా ఫారియా పావెల్ తర్వాత! ఈ రెండు ఘనతల్లో మొదటిది సుష్మితా సేన్ సాధిస్తే రెండవది ఐశ్వర్య రాయ్ అచీవ్ చేసింది. ఇప్పుడు సుష్మితా సేన్ ప్రయాణం గురించి మాట్లాడు కుందాం..!



మిస్ వరల్డ్ 2025



పోటీనుంచి తప్పుకుందాం అనుకున్నా!

ఫస్ట్ మిస్ యూనివర్స్ సుస్మితాసేన్

సుస్మితా సేన్.. ఢిల్లీ పుట్టి, పెరిగిన బెంగాలీ! అడపా దడపా మోడలింగ్‌లో అవకాశాలతో సాగుతున్న ఆమె సరదాగా మిస్ ఇండియా పోటీలకు దరఖాస్తు చేసుకుంది. అయితే తర్వాత తెలిసింది ఆ పోటీలో ఐశ్వర్య రాయ్ కూడా పాల్గొననుందని. అంతే ఆమె కాన్ఫిడెన్స్ అంతా కరిగిపోయింది. అప్పటికే ఐశ్వర్యకున్న నేమ్ అండ్ ఫేమ్, ఆమె అందం, ఆత్మవిశ్వాసం గురించి సుస్మితాకు తెలుసు. ఆ పోటీలో గెలుపు ఆమెదే అని అర్థమైంది! అందుకే ఆ పోటీ నుంచి తప్పుకోవాలనుకుంది. అమ్మతో, అప్పటి సుస్మితా బాయ్ ఫ్రెండ్ రజత్ తారా తోనూ అదే మాట చెప్పింది. అప్పుడు వాళ్ల అమ్మ, రజత్ ఇద్దరూ ధైర్యం చెప్పడంతో ఆ పోటీలో పాల్గొంది. ఐశ్వర్య అతి విశ్వాసం వల్ల ఆ కిరీటం కోల్పోయి సుస్మితాకు దక్కిందని నాటి మిస్ ఇండియా పోటీ సమీక్షకుల మాట.



మిస్ యూనివర్స్, మిస్ వరల్డ్, మిస్ ఏషియా పసిఫిక్ పోటీలుంటాయి. మిస్ ఇండియా కిరీటం గెలుచు కున్న వారు 'మిస్ యూనివర్స్'పోటీ లకు అర్హులు. మిస్ ఇండియా పోటీలో ఫస్ట్ రన్నరప్ అయిన వారు 'మిస్ వరల్డ్'పోటీలకు వెళ్తారు. సెకండ్ రన్నరప్ 'మిస్ ఏషియా పసి ఫిక్'లో పాల్గొంటారు. ఇదికాక పర్యావరణ స్పృహ, కార్యాచరణకు సంబంధించి 'మిస్ అర్త్' అనే పోటీ కూడా ఉంటుంది.

విశ్వసుందరిగా..

మిస్ ఇండియా టైటిల్ గెలుచుకుని మిస్ యూనివర్స్ పోటీలో పాల్గొనే అవకాశం అందుకుంది సుస్మితా. దాని కోసం ముంబైలో ట్రైన్ అవ్వాలి. అప్పుడూ అంతే.. ఒంటరిగా ముంబైలో ఉండలేను మొర్రో అని భయప డింది. ఆ సమయంలోనూ ఆమె వెన్నంటి ఉంది సుస్మిత బాయ్ ఫ్రెండ్ రజతే! అందుకోసం తాను పనిచేస్తున్న కంపెనీలో ఒక నెల రోజులు సెలవు అడిగాడు. వాళ్లు కుద రదనడంతో రాజీనామా చేసి సుస్మిత వెంట ముంబైకి ప్రయాణం అయ్యాడు. శిక్షణ ఆసాంతం ఆమె వెన్నంటే ఉన్నాడు. శారీరకంగా, మానసి కంగా దృఢం కావడానికి సుస్మిత నాన్‌చాక్‌లో శిక్షణ తీసుకుంది. మిస్ యూనివర్స్ పోటీల కోసం వేల రూపాయలతో డిజైనర్ వేర్‌ను కొనేంత ఆర్థిక స్తోమత లేదు. ఢిల్లీ లోకల్ మార్కెట్‌లో గుడ్డ కొనుక్కుని.. గౌను కుట్టించుకుంది. కొత్త సాక్స్‌ను వాళ్లమ్మ చక్కటి గ్లోవ్స్‌గా కుట్టి, ఇచ్చింది. వీటితోనే మిస్ యూనివర్స్ పోటీలు జరిగిన మనీలా (ఫిలిప్పీన్స్)కి బయలుదేరింది. ఫైనల్ రౌండ్‌లో ఆ గౌను, ఆ గ్లోవ్స్‌తోనే అప్పియర్ అయింది సుస్మిత. ఆమె ఆ అటైర్‌కి అందరూ ఫిదా అయ్యారు. వాటి కన్నా.. ఫైనల్ రౌండ్‌లోని ఆమె సమా ధానం అందరినీ ఇంప్రెస్ చేసింది. 'మహిళకు మీరిచ్చే నిర్వచనం ఏంటి?' అని జడ్జి అడిగిన ప్రశ్నకు 'మహిళ.. ఆ దేవుడు భువికి పంపిన కానుక. కొత్త ప్రాణానికి ఊపిరిపోసే జనని మహిళ! ప్రేమానురాగాలు అంటే ఏంటో పురుషుడికి చూపించేది మహిళ!' అని ఆమె జవాబు చెబు తుంటే ఆడిటోరియం అంతా చప్ప ట్లతో మారుమోగిపోయింది. విశ్వ సుందరి కిరీటం ఆమెను వరించింది.

తర్వాత..

సినీ ఇండస్ట్రీలోకి ఎంటర్ అయింది. 24వ ఏట రీనీ అనే అమ్మా యిని దత్తత తీసుకుని పెళ్లి కాకుం డానే తల్లి స్థానం తీసుకుంది. ఆ దత్తత కోసం అప్పుడున్న నియమ నిబంధనల ప్రకారం చాలానే ఇబ్బంది పడింది. అయినా వెనకడుగు వేయ లేదు. ఈ విషయంలో ఆమె తల్లిదం డ్రులు.. సుబ్రా సేన్ (జ్యువెలరీ డిజైనర్), సుబీర్ సేన్ (రిటైర్డ్ వింగ్ కమాండర్) ఆమెకు కొండంత అండ. వాళ్ల నాన్న అయితే దత్తత ఇచ్చే అధికా రుల నమ్మకం కోసం తన కష్టా ర్జితంలోని పెద్ద మొత్తాన్ని రెనీ పేరు మీదకి మార్చాడట. అంత మద్దతు ఉంది కాబట్టే కొన్నాళ్లకు ఇంకో బిడ్డ (అలీసా)నూ దత్తత తీసుకుంది. 'అందరు అమ్మలు తమ పిల్లల్ని పొట్టలో మోస్తారు. కానీ నా పిల్లల్ని నేను నా గుండెలో మోశాను. అందుకే ఆ బిడ్డలు నాకు స్పెషల్!' అని చెబుతుంది సుస్మితా సేన్! ఇలా పిల్లల్ని దత్తత తీసు కుని తన తల్లి హృదయాన్ని, మహిళగా తాను నిలబడ్డ మహోన్నత స్థానాన్ని ప్రపంచానికి చాటి .. సుస్మితా అంటే మాటలే కాదు చేతలు కూడా అని నిరూపించింది.

ట్రెండ్ సంప్రదాయం ప్లస్ సాంకేతికత



వీఆర్ హెడ్‌సెట్ ద్వారా భరతనాట్య ప్రదర్శన చూడడం, స్టాండప్ కామెడీ షోలో పాల్గొనడం... ఇ-ధోరణి పెరుగుతోంది. సంప్ర దాయం, ఆధునికతను సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానిస్తోంది.

'కళ సాంకేతికతను సవాలు చేస్తుంది. సాంకేతికత కళను ప్రేరే పిస్తుంది' అంటాడు స్కైడాన్స్ యానిమేషన్స్ చీఫ్ జాన్ లాసెటర్.

ముంబైలోని ఎన్సీపీఏ భారతీయ శాస్త్రీయ కళలను రక్షించుకో డానికి యూట్యూబ్ ఛానెల్ నడుపుతోంది.

సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నిర్వహించిన సర్వేలో భారతీయ సాంస్కృతిక సంస్థలు ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాయి. హైడెఫినిషన్ వీడియో, లైవ్-స్ట్రీమింగ్ టెక్నాలజీ మారుమూల గ్రామాల సాంస్కృతిక ప్రదర్శనలను ప్రపంచ స్థాయి ప్రేక్షకుల వరకు తీసుకువెళుతుంది.

ఉదాహరణకు ఒక భరతనాట్య నృత్యకళాకారిణి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తన నృత్య ప్రదర్శనను ప్రత్యక్ష ప్రసారం చేయవచ్చు.

ఆగ్మెంటెడ్ రియాలిటీ(ఏఆర్), హోలోగ్రామ్. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌ను కళాకారులు ఉపయోగించడం పెరిగింది.

ఏఆర్, వీఆర్ మార్కెట్‌లో 2029 నాటికి భారత్‌లో వినియోగదారుల సంఖ్య భారీగా పెరుగుతుందని అంచనా.

ఆర్మాక్స్ రిపోర్ట్ ప్రకారం మన దేశంలోని పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ కంపెనీలు ప్రపంచ వ్యాప్తంగా విస్తృత స్థాయిలో ప్రేక్షకులను చేరుకోవడానికి ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ప్లాట్ ఫామ్‌లకు చేరువ అవుతున్నాయి. 2019-2023 మధ్యకాలంలో యూట్యూబ్‌లో స్టాండప్ కామెడీ వ్యూయర్‌షిప్ 40 శాతం పెరిగింది.



ఒక హీరో, ఒక విలన్, ఒక క్లయిమాక్స్... అంతే కథ.
చెడు మీద మంచి గెలవడం... ప్రాబ్లమ్ మీద పరిష్కారం గెలవడం
భయం మీద ధైర్యం గెలవడం... ఇదే కథ రాయడం అంటే.
కథలు రాస్తే మీరు క్రియేటర్ అవుతారు.
క్యారెక్టర్స్‌ను క్రియేట్ చేసి గేమ్ ఆడతారు. ఇది చాలా ఫన్‌గా ఉంటుంది.
'రైటర్', 'ఆథర్' అనిపించుకోవాలంటే కథలు రాయాలి. ఈజీగా రాయగలరు. ఎలాగో వినండి.



పిల్లలూ... కథలు రాస్తారా?

కథ రాయడం భలే వీజీ.

చిట్టి చిలకమ్మ ఒక రోజు అల్లరి చేసింది. అల్లరి చేస్తే అమ్మ చిన్న దెబ్బ కొట్టింది. చిట్టి చిలకమ్మ బుంగమూతి పెట్టింది. అలిగి తోటకు వెళ్లింది. అక్కడ పండిన జాంకాయ కనిపించింది. దానిని తెచ్చుకుని తీరిగ్గా కొరికి గుటుక్కున మింగింది. అలకా గిలకా అన్నీ పోయాయి. మళ్లీ హాయిగా ఆటల్లో పడింది.

చూశారా ఇంతే కథ. చిన్నప్పుడు మనం విన్న రైమ్... 'చిట్టి చిలకమ్మా.. అమ్మ కొట్టిందా... తోట కెళ్లావా... పండు తెచ్చావా... గూట్లో పెట్టావా... గుటుక్కున మింగావా'... దానినేగా మనం పైన కథగా రాసింది.

ప్రతి కథలో చిన్న ప్రాబ్లమ్ ఉంటుంది. దానికి సొల్యూషన్ ఉంటుంది. ఇవి రెండూ ఉంటే అది కథ. పైన కథలో అమ్మ కొట్టడం ప్రాబ్లమ్. పండు తిని ఆ సంగతి మర్చిపోవడం సొల్యూషన్.

ఇప్పుడు చెప్పబోయే కథలో 'ప్రాబ్లమ్', 'సొల్యూషన్' కనిపెట్టండి.

ఒక ఆవు దారి తప్పి అడవిలోకి వెళ్లి పోతే పులి పట్టుకుంది. 'పులి బ్రో.. పులి బ్రో... ఇంటి దగ్గర నాకు చంటి దూడ ఉంది. దానికి పాలివ్వకపోతే ఏడు స్తుంది. వెళ్లి పాలు ఇచ్చి వస్తాను. అప్పుడు నన్ను కిల్ చేసి తినెయ్' అంది. 'నో. వదల్ను. నువ్వు వెళితే రావు' అంది పులి. 'వస్తాను. ప్రామిస్' అంది ఆవు. పులికి జాలి పుట్టి వస్తే వస్తుంది రాక పోతే రాదు అని పంపింది. పాపం ఆవు ఇంటికి వెళ్లి ఇచ్చిన ప్రామిస్‌కు కట్టుబడి తిరిగి పులి దగ్గరకు వచ్చింది. పులి చాలా ఇంప్రెస్ అయ్యింది. నీలాంటి గుడ్ కౌను నేను చూడలేదు. నిన్ను వది లేస్తున్నా. వెళ్లు' అంది.

పులి ఆవును పట్టుకోవడం ప్రాబ్లమ్. తన నిజాయితీతో ఆవు ఆ ప్రాబ్లం నుంచి బయట పడటం సొల్యూ షన్. చిన్న కథైనా ఎంత బాగుందో చూడండి. పంచతంత్రంలో ఈ కథ మీరు చదివే ఉంటారుగా.

> **కథలు లేకుండా లోకం ఉండదు. ఎప్పుడూ అందరికీ కథలు కావాలి. ఆ కథల్లో ఎంత గట్టి ప్రాబ్లమ్ ఉంటే అంత బాగా ఇంట్రెస్ట్ ఉంటుంది. ఆస్ట్రోనాట్ సునీతా విలియమ్స్ స్పేస్‌లో చిక్కుకు పోయింది. ఆమెను క్యారెక్టర్‌గా తీసు కుని ఒక స్టోరీ రాయొచ్చు. ఎంత ధైర్యంగా ఆమె అన్నాళ్లు స్పేస్‌లో ఉందో చెప్పి ఎప్పుడు తిరిగి వస్తుందో తెలియకపోవడం వల్ల టెన్షన్ బిల్డప్ చేసి క్లయిమాక్స్‌లో స్పేస్‌షిప్ వెళ్లి ఆమెను తీసుకురావడంతో హ్యాపీ ఎండింగ్ చేస్తే అది కథ.**

మనం తెలుగు వాళ్లం కాబట్టి తెలు గులో కథలు రాయడం ప్రాక్టీసు చేయాలి. తెలుగు బాగా రాకపోతే పర్వా లేదు.. ఇంగ్లిష్‌లో కథలు రాయొచ్చు. ఆ భాష ఈ భాష ఏదీ సరిగ్గా రాలేదంటే కొంచెం ప్రాబ్లమే.

కథలు ఎందుకు రాయాలంటే వాటి ద్వారా మన థాట్స్ షేర్ చేసుకోవచ్చు. అవేర్‌నెస్ తేవచ్చు. సెన్సిటైజ్ చేయొచ్చు. చూడండి... ఇది సమ్మర్. ఎంత వేడిగా ఉంటోంది. ఫారెస్ట్‌లు పెంచడం ఎంత అవసరమో చెప్తూ ఒక కథ రాయొచ్చు. ఒక అడవిలో చెట్లు కొట్టేయడం వల్ల ఒక పక్షికి గూడు పెట్టు కునే చోటు దొరకదు. అది సిటీకి వస్తుంది. చాలా కష్టాలు పడుతుంది. చివరకు ఒక అపార్ట్‌మెంట్ కిటికీ దగ్గర గూడు ఏర్పాటు చేసుకుంటుంది. నాలు గురోజులు గడుస్తాయో లేదో వేడి గాలి దాని గూడు మీదకు వస్తూ ఉంటుంది. కారణం ఏమిటని చూస్తే ఏసి ఔట్‌డోర్ యూనిట్ నుంచి ఆ గాలి వస్తుంటుంది. ఆ ఔట్ డోర్ యూనిట్ ఆగదు. పక్షి ఆ గూటిలో ఉండలేదు... ఇలా ఒక స్టోరీ రాయొచ్చు.

కథలు రాయాలంటే ముందు కథలు చదవాలి. స్టోరీ బుక్స్ చదివితే కథలు ఎలా రాయాలో తెలుస్తుంది. స్టోరీలు చదివి బెడ్ మీదకు చేరితే మీకూ రకరకాల స్టోరీ ఐడియాస్ వస్తాయి. వాటిని బాగా స్కీమ్ చేసుకుని పేపర్ మీద రాయాలి అంతే. కథ రాసి దానికో టైటిల్ పెట్టాలి. 'మేకపిల్ల హోమ్‌వర్క్', 'ఆక్సిజన్ ట్యాంకర్ దొంగలు', 'ఫ్లయింగ్ బైస్కిల్'... ఇలా.

కథలు రాస్తే మిమ్మల్ని రైటర్ అంటారు. రైటర్ గారూ అని పిలుస్తారు. చాలా గొప్పగా ఉంటుంది. ఇప్పుడు యుద్ధం జరుగుతోంది కదా. ఆ యుద్ధాన్ని చూసి క్లౌడ్స్ ఏమనుకుం టాయి? బ్లూ కలర్ క్లౌడ్, వైట్ కలర్ క్లౌడ్‌ను కేరెక్టర్లుగా చేసి కథ రాయాలి.

రాయండి. అలాంటి కథలు రాయ డమే ఈ సమ్మర్‌లో మీకు సరైన హోమ్ వర్క్.

– కె.

ఫ్యాషన్

బ్యూటిఫుల్.. బ్రైట్ ఫుల్



ఆ రంగులు, పువ్వులు, పక్షులు, జంతువుల జ్యామెట్రీ నమూనా డిజైన్లు నేత శైలి చూడగానే పోచంపల్లి ప్రత్యేకత ఇట్టే తెలిసిపోతుంది. మన దేశీయ సాంస్కృతిక, వారసత్వానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తాయి. మిస్ వరల్డ్ 2025 కాంటెస్ట్ ఈవెంట్‌లో భాగంగా ఈ నెల 15న ఒక బృందం ప్రపంచ ప్రఖ్యాత చేనేత గ్రామమైన పోచంపల్లిని సందర్శించనుంది. దీంతో దేశంలో అత్యంత ప్రసిద్ధ వస్త్ర సంప్రదాయాలలో ఒకటైన పోచంపల్లి ఇకత్ ఫ్యాషన్ మరోమారు ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది.



తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న పోచంపల్లి దాని సంక్లిష్ట మైన ఇకత్ నేత పద్ధతులు అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకు న్నాయి. యునెస్కో 'ప్రపంచంలోని ఉత్తమ పర్యాటక గ్రామం'గా పోచంపల్లి ప్రశంసలు అందుకుంది. చేతిపనులు, సంస్కృతి, వారసత్వానికి సజీవ సాక్ష్యంగా నిలిచి ఈ చేనేతలో అబ్బురపరిచే డైయింగ్ టెక్నిక్స్‌ను ఉపయోగిస్తారు. ఈ టెక్నిక్‌లో సంప్రదాయ చిలుక, ఏనుగు, వజ్రం, పూల మోటిఫ్‌లతో పాటు ఇప్పుడు వందల రకాల డిజైన్లు సృష్టిస్తున్నారు వీవర్స్.



హుందాతనాన్ని చాటేలా!

పోచంపల్లి ఇకత్ కాటన్‌తో ఎన్నో మోడల్స్ యువతను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కుర్తా పైజామాలు, లాంగ్ అండ్ షార్ట్ జాకెట్స్, ఫ్రాక్స్, జంప్‌సూట్స్, లెహం గాలు.. ఇండో-వెస్ట్రన్ డిజైన్స్ ఆధునికతను చాటుతు న్నాయి. సౌకర్యంతోపాటు క్యాజువల్, అఫిషియల్ అండ్ పార్టీవేర్‌గానూ హుందాతనాన్ని చూపుతున్నాయి.

పట్టు ప్రత్యేకత

బ్రైట్ కలర్స్, సంప్రదాయ డిజైన్లు, జరీ మెరుపులు చూపు తిప్పుకోనివ్వవు. కాంట్రాస్ట్ కలర్ ప్లెయిన్ బ్లౌజ్‌లు, క్రాప్ టాప్స్‌తో ఈ చీరలను జత చేసి మరిన్ని స్టైల్స్ తీసుకువస్తున్నారు.

ఇతర అలంకారాలు

చీర కట్టు, టెంపుల్ జ్యువెలరీతో సంప్రదాయ శైలిని తీసుకువస్తే ఫ్యాబ్రిక్ లేదా సిల్వర్ జ్యువెలరీతో వెస్ట్రన్ స్టైల్‌ని మెరిపించవచ్చు. ఏ జ్యువెలరీ, కేశాలంకరణ స్టైల్స్ లేకపోయినా ఫ్యాబ్రిక్‌నే అలంకారంగా ధరించవచ్చు.



దేశభక్తి చాటేలా!

పోచంపల్లి, ఇకత్‌లో యువతను ఆకట్టుకునేలా నేస్తున్న డిజైన్స్ గురించి స్టేట్ అవార్డ్ గ్రహీత వీవర్ బోగ సరస్వతి మాటల్లో..

"నేను పాతికేళ్లుగా, మావారు బోగ బాలయ్య యాభై ఏళ్లుగా ఈ చేనేత వస్త్రాలను నేస్తున్నాం. కొత్త కొత్త డిజైన్స్‌ను తయారు చేస్తున్నాం. ముఖ్యంగా యువతను దృష్టిలో పెట్టు కొని, వారి ఆధునిక వస్త్రాలకు తగినట్టుగా, హుందాగా ఉండే డిజైన్స్ రూపకల్పనలో కృషి చేస్తున్నాం. ఇటీవల ఆజాదీ కా అమృత మహోత్సవాలను పురస్కరించు కుని దేశభక్తి చాటేలా ఇండియా మ్యాప్ మధ్యన చరఖా రాట్నం వచ్చేలా స్కార్ఫ్ నేశాం. ఎకో ఫ్రెండ్లీ రంగులను ఉపయో గించాం. 2023 డిసెంబర్‌లో డబుల్ ఇకత్‌లో చరకా వచ్చేలా స్కార్ఫ్ డిజైన్ చేసి, మన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కానుకగా ఇచ్చాం. 121 కలర్స్‌లో 121 మోటిఫ్స్‌తో చీర తయారుచేశాం. 2021లో 100 అడ్డు చిటికీలు 100 నిలువు చిటికీలు రూపొందించి 100X100 అంటే 10,000 షేడ్ వచ్చేలా చీరలు రూపొందించాం. ఆ కృషికి గుర్తింపుగా స్టేట్ అవార్డు వరించింది. బెస్ట్ వీవర్ అప్రిసియేషన్, బెస్ట్ వీవర్ అవార్డ్ సర్టిఫికెట్ లభించింది. మహిళా దినోత్సవం సందర్భంగా బెస్ట్ వీవర్‌గా ప్రశంసలు అందుకున్నాను.



కొంగొత్త డిజైన్లు

మా కృషి, దృష్టి అంతా అనుకున్న డిజైన్లు, డైయింగ్, టైయింగ్, మోటిఫ్స్, షేడ్స్, వీవింగ్ పైన ఉంటుంది. నచ్చిన డిజైన్లకు ఎక్కువ మొత్తంలో కోరితే డిమాండ్‌ను బట్టి బయట ఆర్డర్ ఇస్తాం. సంప్రదాయ ఏనుగులు, పక్షులు మాత్రమే కాకుండా మార్కెట్ ట్రెండ్‌ను అనుసరించి డిజైన్ చేస్తున్నాం. రాజకీయ నాయకులు, ప్రముఖులు మా వద్ద నుంచి చీరలు తీసుకెళతారు. బాలీవుడ్ నటి జయాబచ్చన్, ఇన్ఫోసిస్ సుధామూర్తికి కూడా మా చీరలు వెళ్లాయి. పదివేల షేడ్స్‌తో తయారు చేసిన ఇకత్ స్కార్ఫ్‌కు మంచి గుర్తింపు లభించింది. జాతీయస్థాయి మా డిజైన్స్ గుర్తింపు సాధించాలని కృషి చేస్తున్నాం.

– బోగ సరస్వతి,
పోచంపల్లి ఇకత్ వీవింగ్ డిజైనర్

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 9 । మే । 2025



డిజిటల్ అరెస్టు పేరుతో..

డిజిటల్ అరెస్టు పేరుతో నగరానికి చెందిన మహిళా ఉద్యోగి నుంచి కేటుగాళ్లు రూ.84 లక్షలు కాజేశారు. బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. -10లో



అందరి చూపు.. భాగ్యనగరం వైపు..

ప్రస్తుతం ప్రపంచమంతా హైదరాబాద్ వైపే చూస్తోంది. దాదాపు 120 దేశాల అధికార ప్రతినిధులు, ప్రముఖులు నగరానికి గగనతల ప్రయాణం చేస్తున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
37.0/24.0

వాతావరణం

నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 37, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

సైబరాబాద్‌లో భద్రత కట్టుదిట్టం

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ పోలీసు పహారాలోకి వెళ్లిపోయింది. ప్రపంచ సుందరి పోటీల నేపథ్యంలో ఉక్రెయిన్, శ్రీలంక, థాయిలాండ్, అమెరికా, జర్మనీ, పరాగ్వే, చెక్ రిపబ్లిక్, సోమాలియా, మయన్మార్, వియత్నాం వంటి పలు దేశాల నుంచి సుందరీమణులు భాగ్యనగరానికి తరలివచ్చారు. ఈ నెల 31 వరకు ఈ కార్యక్రమం జరగనుంది. ప్రారంభ, ముగింపు వేడుకలతో పాటు సుందరీమణులు రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలలో సందర్శించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు విభాగం భద్రతను కట్టుదిట్టం చేసింది. ఐటీ హబ్‌లోని పలు స్టార్ హోటళ్లలో వీరంతా బస చేయనున్నారు. దీంతో ఆయా హోటళ్ల వద్ద 24/7 పోలీసు బలగాలు గస్తీ కాస్తున్నాయి. వేడుక జరిగే హైటెక్స్ ప్రాంతంతో పాటు సుందరీమణులు బస చేసే ప్రాంతాలలో డ్రోన్ ఎగరవేయడంపై పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. అలాగే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు చార్మినార్, లాడ్‌బజార్, చౌహమల్లా ప్యాలెస్ వంటి పలు పర్యాటక ప్రాంతాలలో కూడా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ నెల 13 వరకూ ఆయా ప్రాంతాల సందర్శనకు సాధారణ ప్రజలకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. వేడుక జరిగే ప్రాంతంతో పాటు సుందరీమణులు పర్యటించే పర్యాటక ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించారు. మూడు షిఫ్టులలో ఉన్నతాధికారులు నిరంతరం ఆయా ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

హెచ్‌ఎండీఏ అధికారులతో ఇలంబర్తి సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా (హెచ్‌ఎంఏ) సెక్రటరీ ఇలంబర్తి గురువారం హెచ్‌ఎండీఏ కార్యాలయాన్ని సందర్శించారు. జీహెచ్‌ఎంసీ నుంచి బదిలీపై హెచ్‌ఎంఏ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన ఆయన హెచ్‌ఎండీఏలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ప్లానింగ్, ఇంజినీరింగ్, ఎస్టేట్ తదితర విభాగాల్లో కొనసాగుతున్న కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ప్లానింగ్ విభాగం డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో విషాద ఛాయలు

మావోయిస్టుల మందుపాతరకు బలైన గ్రేహౌండ్స్ సందీప్



కుటుంబ సభ్యుల రోదనలు



సందీప్ (ఫైల్)

ఘట్‌కేసర్: ములుగు జిల్లా- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో కర్రెగుట్టల్లో కూంబింగ్ జరుపుతుండగా.. మావోయిస్టులు పేల్చిన మందుపాతరకు మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంబేడ్కర్ నగర్‌కు చెందిన తిక్క సందీప్ అసువులు బాశాడు. ఈ దుర్ఘటనతో గురువారం ఘట్‌కేసర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. సందీప్ పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయన అమరుడైన సమాచారం తెలుసుకున్న స్థానికులు, స్నేహితులు కన్నీరు మున్నీరయ్యారు. ఘట్‌కేసర్ పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.



సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు

సైన్యానికి సంఘీభావం

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పహల్గాం ఉగ్రదాడిలో అమరులైన వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు.



అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఆ నగరాల దుస్థితి మనకు రావద్దు

ఇతర మెట్రోల పరిస్థితుల నుంచి పాఠం నేర్చుకోవాలి

- ఎవరెన్ని విమర్శలు చేసినా ముందుకే వెళతాం
- హైడ్రా ఠాణా ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో:

'బెంగళూరులో తాగునీరు, ముంబై, చెన్నైలలో వరద సమస్యల కారణంగా అనేక సంస్థలు అక్కడ నుంచి తరలి వెళ్లిపోతున్నాయి. ఢిల్లీలో కాలుష్యం కారణంగా పార్లమెంట్ నుంచి పాఠశాలల వరకు మూతపడే పరిస్థితి ఉంటుంది. మానవ తప్పిదం వల్ల అవి నివాసయోగ్యం కాని నగరాలుగా మారుతున్నాయి. వాటి నుంచి మనం గుణపాఠం నేర్చుకుని, పాఠంగా స్వీకరించాలి. లేదంటే హైదరాబాద్ కూడా వాటి సరసన చేరుతుంది. అందుకే ఎవరు ఏమి అనుకున్నా, ఎలాంటి విమర్శలు చేసినా నియంత్రించాలని, నిలువరించాలని అవసరమైతే ఆక్రమణదారుల్ని నిర్మూలించాలని నిర్ణయించుకుని హైడ్రాను ఏర్పాటు చేశాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం బుద్ధభవన్ వద్ద హైడ్రా పోలీసుస్టేషన్‌కు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ విభాగం అధికారిక వెబ్‌సైట్‌తో



పాటు ప్రత్యేక వాహనాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, హోం సెక్రటరీ రవి గుప్తా తదితరులు హాజరయ్యారు.

ప్రకృతి విధ్వంసం జరిగినా ఫర్వాలేదా..?

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'హైడ్రా అంటే పేదల ఇళ్లు కూలగొట్టడానికి పెట్టినట్లు కొందరు చిత్రీకరిస్తున్నారు. వాళ్ల ఆలోచనలు, విధానాలతో నాకు ఆశ్చర్యం కలుగుతోంది. హైదరాబాద్‌లో ప్రకృతి విధ్వంసం జరిగినా.. నగరం కుప్పకూలినా ఫర్వాలేదు, నగరం కాలుష్య నగరంగా మారి ప్రజలు పారిపోయినా ఫర్వాలేదనే కుట్ర, కసి, కడుపుమంట వారి మాటల్లో కనిపిస్తోంది. మూసీ, ఈసీ నీటిని ఒడిసిపట్టడానికి వీటిని నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి హైటెక్ సిటీ వరకు వివిధ సందర్భాల్లో నగరాన్ని పునరుద్ధరించుకుంటూ, అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్లాం. అయితే చరిత్రలో చాలాసార్లు ప్రజలు నగరానికి వలస వచ్చినప్పుడల్లా సంప్రదాయ ప్రాంతాలను వదిలేసి కొత్త ప్రాంతాలను అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నాం. పాత నగరాన్ని వదిలేసి కొత్తకొత్తవి అభివృద్ధి చేసుకుంటూ వెళ్లున్నాం. ఇలా కొన్నాళ్లు గడిస్తే వారసత్వంగా మనకు అందినవి కాలగర్భంలో కలిసిపోతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇది ఓల్డ్ సిటీ కాదు ఒరిజినల్ సిటీ అనే ఉద్దేశంతో పునరుద్ధరణ చేయాలని ఆలోచన చేశాం' అని వ్యాఖ్యానించారు.

హైడ్రా మరింత బలోపేతం

ముఖ్యమంత్రి ఆలోచన, ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా హైడ్రా ఏర్పాటైంది. గడిచిన పది నెలల్లో ప్రజలకు చేరువై వారి మన్ననలు పొందింది. దీని ఏర్పాటు దేశంలోనే ఓ చారిత్రక నిర్ణయం అని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) సైతం తన వ్యాసంలో కితాబిచ్చింది. ప్రజా సంక్షేమం కోసమే హైడ్రా పని చేస్తోంది. ఇప్పుడు పోలీసుస్టేషన్ కూడా రావడంతో మరింత బలోపేతం అవుతోంది. చెరువులకు సంబంధించిన ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు సంబంధించిన కీలక ఫొటోలు మరో నెలన్నరలో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ నుంచి అందుతాయి. నాలాల పునరుద్ధరణకు డేటా సేకరిస్తున్నాం.

– ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

సీఎంగా చెప్పినా ఆశించిన ఫలితాలు రాలేదు...

'పోలీసు విభాగంలో ఏసీబీ, సీఐడీ, ఆక్టోపస్.. ఇవన్నీ ఒకేసారి అమలులోకి రాలేదు. అవసరాలు, పరిస్థితులకు తగ్గట్టు కొత్త శాఖలను ఏర్పాటు చేసుకున్నాం. ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, పోలీసు ఇలా అనేక శాఖల మధ్య సమన్వయ లోపంతో సమస్య వచ్చినప్పుడు ఎవరి పరిష్కరించాలనే అంశంలో ఇబ్బందులు వస్తున్నాయి. శాఖల మధ్య సమన్వయం కోసం ముఖ్యమంత్రిగా నేను చెప్పినా ఆశించిన మేరకు ఫలితాలు రాలేదు. దీనిపై అనుభవజ్ఞులతో మాట్లాడి కీలక నిర్ణయాలు తీసుకున్నా' అని వివరించారు. '1908లో వచ్చిన వరదల్ని చూసి భోరున విలపించిన నిజాం గొప్ప ఆలోచనతో మోక్షగుండం విశ్వేశ్వరయ్య ద్వారా వరదల నిరోధానికి ప్రణాళికలు చేశారు. అప్పట్లో వారు మొదలుపెట్టిన, విశ్వేశ్వరయ్య అందించిన గొప్ప కట్టడాలే మూసీ, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్'లు అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



హైడ్రా పోలీసు స్టేషన్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

శిథిల భవనాలతో జాగ్రత్త సుమా!

వర్షా కాలంలో ప్రమాదాలు జరగకుండా చర్యలు

- పూర్తిస్థాయి సర్వే.. ప్రమాదకర భవనాల కూల్చివేతలు
- అధికారులకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదేశాలు



సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవడంపై జీహెచ్‌ఎంసీ దృష్టి సారించింది. శిథిలావస్థలో ఉన్న భవనాలను సర్వే చేసి, ప్రమాదకర భవనాలు, కట్టడాలకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్ కర్ణన్ టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు సర్క్యులర్ జారీ చేశారు. ప్రాధాన్యతతో పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. సర్క్యులర్‌లోని ఆదేశాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..

సర్కిళ్లలో సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు పూర్తిస్థాయిలో సర్వే జరిపి శిథిల భవనాలు, పాత ప్రహరీలు తదితరమైనవి గుర్తించాలి. వాటి వివరాలను ఇంజినీరింగ్ విభాగానికి పంపించి స్ట్రక్చరల్ స్టెబిలిటీ పరీక్షలు చేయించి నివేదిక తెప్పించుకోవాలి. గత సంవత్సరం నివేదిక మేరకు మిగిలిపోయిన శిథిల భవనాలతో సహా మొత్తం ఎన్ని శిథిలభవనాలున్నాయో గుర్తించాలి. ప్రభుత్వ పాఠశాలల భవనాలు ప్రమాదకరంగా ఉంటే వెంటనే తగిన చర్యల కోసం సంబంధిత ప్రిన్సిపాల్ లేదా విద్యాశాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలి. ప్రైవేటు భవనాలకు సంబంధించి నిబంధనలకనుగుణంగా నోటీసులు జారీ చేయాలి.

ప్రమాదకర భవనాలపై చర్యలు

అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాలను వెంటనే ఖాళీ చేయించే, సీల్ వేసే చర్యలు చేపట్టాలి. శిథిల నిర్మాణాల చుట్టూ బారికేడింగ్ చేయడంతో పాటు ప్రజలు వాటి సమీపంలో సంచరించకుండా హెచ్చరిక బోర్డులు ఉంచాలి. నోటీసులందుకున్న భవన యజమానులు మరమ్మతు చర్యలు చేపడితే ప్రమాణాలకు అనుగుణంగా మరమ్మతులు జరిగిందీ, లేనిదీ గుర్తించాలి. మరమ్మతులు చేయించిన యజమానుల నుంచి స్ట్రక్చరల్‌స్టెబిలిటీ సర్టిఫికెట్లు తీసుకోవాలి.

కూల్చివేతలకు స్పెషల్ డ్రైవ్స్

ప్రమాదకర భవనాలను నిర్ణీత వ్యవధుల్లో కూల్చివేసేందుకు స్పెషల్‌డ్రైవ్స్ నిర్వహించాలి. అన్ని సర్కిళ్ల డిప్యూటీ సిటీ ప్లానర్లు / అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు తక్షణమే చర్యలు చేపట్టి ప్రధాన కార్యాయానికి నివేదిక అందజేయాలి. చీఫ్‌ఇంజినీర్ (మెయింటనెన్స్) సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్లు త్వరితంగా ఇచ్చేలా చూడాలి.శిథిల భవనాల అప్‌డేటెడ్ సమాచారాన్ని గూగుల్ స్ప్రెడ్‌షీట్‌లో జియో కోఆర్డినేట్స్ లింక్‌తో సహ అందజేయాలి. జోనల్ కమిషనర్లు తమ సర్కిళ్లలో ఈ పనుల్ని సమీక్షిస్తూ, నిర్ణీత వ్యవధిలో పూర్తయ్యేలా సంబంధిత అధికారులను సమన్వయం చేయాలి. శిథిల, ప్రమాదకర భవనాల విషయంలో పై ఆదేశాలు పాటించని, నిర్లక్ష్యం కనబరిచే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

హైదరాబాద్ టు హనోయ్

సిటీ టూరిస్ట్ నయా డెస్టినేషన్

- వియత్నాం ఎయిర్‌లైన్స్ సర్వీసులు ప్రారంభం
- తెలుగు రాష్ట్రాల నుంచి వియత్నాంకు పెరిగిన టూర్లు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నుంచి హనోయ్‌లోని నోయ్‌బాయ్ విమానాశ్రయానికి కొత్తగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు వియట్‌జెట్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన సర్వీసులు మాత్రమే అందుబాటులో ఉండగా కొత్తగా వియత్నాం ఎయిర్‌లైన్స్ సర్వీసులు మొదలయ్యాయి. నగరం నుంచి వియత్నాం వెళ్లే పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో విమాన సర్వీసులకు సైతం భారీ డిమాండ్ నెలకొంది. కొత్తగా ప్రారంభించిన వియత్నాం ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ (వీఎన్-984) హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతి ఆది, బుధ, శుక్ర వారాల్లో రాత్రి 11.45 గంటలకు బయలుదేరుతుంది. హనోయ్ స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 5.25 గంటలకు అక్కడికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో వియత్నాం ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ (వీఎన్-985) హనోయ్ నుంచి ప్రతి ఆది, బుధ, శుక్ర వారాల్లో సాయంత్రం 7.15 గంటలకు బయలుదేరి రాత్రి 10.15 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

మారుతోంది డెస్టినేషన్..

- సాధారణంగా హైదరాబాద్ నుంచి ఎక్కువ మంది పర్యాటకులు దుబాయ్, సింగపూర్, థాయ్‌లాండ్, మలేసియా తదితర దేశాలకు రాకపోకలు సాగిస్తారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతి రోజు సుమారు 12 వేల మందికిపైగా విదేశాలకు వెళ్లే ప్రయాణికులు ఉంటే వారిలో 60 శాతానికి పైగా ఈ నాలుగైదు దేశాలకు రాకపోకలు సాగించే వాళ్లే ఎక్కువ. కాగా.. కొంతకాలంగా సిటీ టూరిస్టుల డెస్టినేషన్‌లు మారుతున్నాయి. కొత్త ప్రదేశాల్లో పర్యటించేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. సోలోగా వెళ్లే వారికి, కుటుంబాలతో సహా కలిసి వెళ్లాలనుకొనే వాళ్లను వియత్నాం విశేషంగా ఆకట్టుకుంటోంది. గత సంవత్సరం భారత్ నుంచి సుమారు 5 లక్షల మంది వియత్నాం సందర్శించినట్లు అంచనా. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేకించి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వియత్నాంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించినవాళ్లు లక్ష మందికిపైగా ఉంటారని అమీర్‌పేట్‌కు చెందిన ఒక ప్రముఖ ట్రావెల్స్ సంస్థ వెల్లడించింది.
- వియత్నాంకు పర్యాటక ప్యాకేజీలను అందజేస్తున్న సంస్థలకు సైతం డిమాండ్ పెరిగింది, సులభంగా వీసాలు లభించడం, విమాన చార్జీలు, పర్యాటక ఖర్చులు కూడా తక్కువ మొత్తంలోనే ఉండడం వల్ల ఎక్కువ మంది వియత్నాంను సందర్శిస్తున్నారు. 'ఆ దేశంలో వందల కొద్దీ పర్యాటక స్థలాలు ఉన్నాయి. చారిత్రక ప్రదేశాలు ఉన్నాయి. ఆ దేశంలోని ఒక్క డానాంగ్ ప్రాంతాన్నే సుమారు 2.22 లక్షల మంది భారతీయ పర్యాటకులు గత సంవత్సరం సందర్శించారు.' అని వాల్మీకి ట్రావెల్స్ సంస్థ వ్యవస్థాపకులు హరికిషన్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి కనెక్టివిటీ పెరగడంతో ఎక్కువ మంది సందర్శించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఒక అందమైన దేశం..

సహజమైన దీవులు, ప్రకృతి రమణీయమైన ప్రదేశాలు, ఆహ్లాదకరమైన వాతావరణం విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆ దేశంలోని హనోయ్, హోచిమిన్ సిటీ, హాలోంగ్ బే, హోయి ఆన్, సాపా, హ్యూ,పాంగ్‌న, బిన్‌తన్, మయిచావ్, కావోబాంగ్ వంటి సుమారు 45 ప్రముఖ పర్యాటక స్థలాలను ఎక్కువ మంది సందర్శిస్తున్నారు.

పోర్టబిలిటీ ఎఫెక్ట్!

సన్నబియ్యం పంపిణీపై తీవ్ర ప్రభావం

- రేషన్ షాపుల్లో నిండుకుంటున్న నిల్వలు
- కోటా కోసం లబ్ధిదారుల చక్కర్లు
- ఇప్పటివరకు 64 శాతం బియ్యం డ్రా

సాక్షి, సిటీబ్యూరో:

నగరంలో ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్నబియ్యం కోటాపై పోర్టబిలిటీ విధానం తీవ్ర ప్రభావం చూపుతోంది. పోర్టబిలిటీ విధానంలో ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు డ్రా చేసుకునే వెసులుబాటు ఉండటంతో లబ్ధిదారులు తమకు కేటాయించిన షాపులోనే కాకుండా ఎక్కడ పడితే అక్కడ కోటా డ్రా చేస్తున్నారు. వాస్తవంగా గత నెల వరకు దొడ్డు బియ్యం పంపిణీ కొనసాగడంతో కోటా డ్రా చేసేందుకు పెద్దగా ఆసక్తి కనబరిచేవారు కాదు. తాజాగా సన్నబియ్యం పంపిణీ జరుగుతుండటంతో కోటా డ్రా చేసేందుకు గత వారం రోజులుగా రేషన్ షాపుల ముందు క్యూ కడుతున్నారు. పోర్టబిలిటీ విధానంలో బియ్యం కోటా డ్రా కారణంగా రేషన్ దుకాణాల్లో నిల్వలు



నిండుకుంటున్నాయి. ఫలితంగా బియ్యం కోటా డ్రాకు రేషన్ షాపుల చుట్టూ లబ్ధిదారులు చక్కర్లు కొటాల్సిన పరిస్థితి నెలకొంది.

17.40 లక్షల కుటుంబాలు..

గ్రేటర్ పరిధిలో రేషన్ కార్డులు కలిగిన సుమారు 17.40 లక్షల కుటుంబాలున్నాయి. ఇందులో ఈ నెల 8 వరకు సుమారు 11.02 లక్షల కుటుంబాలు సన్న బియ్యం కోటాను డ్రా చేసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందులో కేవలం పోర్టబిలిటీ విధానంలోనే సుమారు 6.92 కుటుంబాలు తమ కోటాను డ్రా చేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాల వారీగా పరిశీలిస్తే హైదరాబాద్ పరిధిలో 2.98 లక్షలు, రంగారెడ్డి పరిధిలో 1.74 లక్షలు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో 2.19 లక్షల కార్డుదారులున్నట్లు తెలుస్తోంది.

గ్రేటర్ పరిధిలో ఈనెల 8వ తేదీ వరకు సన్న బియ్యం కోటా డ్రా ఇలా..

జిల్లా	మొత్తం కార్డులు	కోటా డ్రా చేసిన కార్డులు	డ్రా చేసిన బియ్యం (కిలోలు)
హైదరాబాద్	6,39,452	4,12,909	95,93,318
రంగారెడ్డి	5,71,820	3,46,444	77,42,776
మేడ్చల్–మల్కాజిగిరి	5,29,698	3,43,480	75,63,696

కేటాయింపు కంటే.. అదనంగా

ప్రభుత్వ చౌకధరల దుకాణాల పరిధిలోని రేషన్ కార్డులు అందులోని యూనిట్లను బట్టి బియ్యం కోటాను పౌరసరఫరాల శాఖ కేటాయిస్తోంది. ప్రతి నెలా బియ్యం కోటా సుమారు 70 నుంచి 85 శాతం వరకు డ్రా అవుతోంది. పోర్టబిలిటీ విధానంలో సుమారు 10 నుంచి 15 శాతం బియ్యం కోటా డ్రా చేసినా.. మిగిలిన కోటా సర్దుబాటు అవుతోంది. కొన్నిసార్లు అదనంగా మరో 10 శాతం కోటా కూడా కేటాయింపు జరగడంతో నిల్వలపై పెద్దగా ప్రభావం ఉండదు. అయితే.. ఈసారి సన్నబియ్యం పంపిణీ జరుగుతుండటంతో డ్రా తాకిడి పెరిగింది. గత నెలలో ఎన్నికల కోడ్ కారణంగా హైదరాబాద్ పరిధిలో సన్న బియ్యం కోటా పంపిణీ జరగలేదు. ఈ నెలలో సన్నబియ్యం పంపిణీ కొనసాగుతుండటంతో లబ్ధిదారుల కుటుంబాల ఆసక్తి పెరిగింది.

15 వరకు బియ్యం కోటా గడువు

రేషన్ సరుకుల డ్రా గడువు ఈ నెల 15తో ముగియనుంది. అయితే ఇప్పటి వరకు కేవలం 64 శాతం కార్డు దారులు మాత్రమే బియ్యం కోటాను డ్రా చేశారు. మరో 36 శాతం డ్రా చేయాల్సి ఉంటుంది. మొత్త బియ్యం డ్రా చేసిన కుటుంబాల్లో సైతం సగం మంది పోర్టబిలిటీ విధానంలో సరుకులు డ్రా చేసినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సరిహద్దు జిల్లాల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు కూడా నగరంలో సుమారు మూడున్నర లక్షల ఉండటంతో వారు కూడా ఇక్కడే పోర్టబిలిటీ విధానంలో సరుకులు డ్రా చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిని బట్టి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలు సగానికి పైగా సరుకులు డ్రా చేయనట్లు అర్థమవుతోంది. ఇప్పటికే రేషన్ షాపుల్లో బియ్యం నిల్వలు నిండుకుండటంతో పేద కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే స్టాక్ కొరత ఉన్న రేషన్ షాపులకు అదనపు బియ్యం కోటా సరఫరా చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

సాయం చేసేందుకు వెళ్లి..

- యువకుడి దుర్మరణం
- కారు టైరు మారుస్తుండగా ఢీకొన్న మరో కారు
- మరో ఇద్దరికి గాయాలు
- ఓఆర్ఆర్‌పై ఘటన


మనోజ్ కుమార్ మృతదేహం


సంఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన కార్లు

రాజేంద్రనగర్: తోటి మనిషికి సాయం చేసేందుకు వెళ్లిన ఓ డ్రైవర్ కారు ఢీకొని మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట రుద్రారం ప్రాంతానికి చెందిన మనోజ్ కుమార్ (25) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత 15 నెలలుగా మాదాపూర్‌లోని లాంగ్ డ్రైవ్ కార్స్‌లో పని చేస్తున్న అతను అక్కడే ఉంటున్నాడు. బుధవారం రాత్రి కారులో శంషాబాద్ వెళ్లిన అతను ఓఆర్ఆర్ మీదుగా గచ్చిబౌలికి తిరిగి వెళుతున్నాడు. హిమాయత్‌సాగర్ వద్దకు రాగానే అప్పా నుంచి శంషాబాద్ వైపు వెళుతున్న ఓ ఇన్నోవా కారు టైర్ పేలి అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టి ఆగిపోయింది. దీంతో సదరు కారు డ్రైవర్ ఆజం టైర్ మార్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. అదే సమయంలో వెనకే వస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు డ్రైవర్ పవన్ దీనిని గమనించి తన వాహనాన్ని పక్కకు ఆపి అతడికి సహాయం చేస్తున్నాడు. ఇదే సమయంలో అటుగా వెళుతున్న మనోజ్ కుమార్ కూడా తన వాహనాన్ని పక్కన పార్కు చేసి రోడ్డు దాటి ఇన్నోవా కారు వద్దకు వచ్చాడు. జాకీ తీసుకుని టైర్ మార్చేందుకు ప్రయత్నిస్తుండగా వెనుకాల నుంచి వేగంగా దూసుకొచ్చిన మరో కారు ఇన్నోవాతో పాటు మనోజ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మరో డ్రైవర్ పవన్‌తో పాటు ఇన్నోవా యజమాని ఆజంలకు గాయాలయ్యాయి. ఈ ఘటనతో ఓఆర్ఆర్‌పై వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రాజేంద్రనగర్ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, ఓఆర్ఆర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మూడు వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. గాయపడిన ఇద్దరిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మనోజ్ కుమార్ తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ అరెస్టు పేరుతో రూ.84 లక్షలు స్వాహా

ప్రభుత్వ ఉద్యోగినికి టోకరా

- నరేష్ గోయల్ కేసుతో సంబంధం ఉందని ఫోన్
- తాత్కాలిక బెయిల్, రిఫండ్ అంటూ మోసం

సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ అరెస్టు పేరు చెబుతూ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగినికి కాల్ చేసిన కేటుగాళ్లు రూ.84 లక్షలు కాజేశారు. ఆద్యంతం ఆమెను భయంలో ఉంచిన ఈ-కేడీలు తాత్కాలిక బెయిల్ కూడా ఇచ్చారు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు గురువారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ స్కామ్ పూర్వాపరాలిలా ఉన్నాయి... ఓ ప్రభుత్వ ఉద్యోగినికి (57) ఈ ఏడాది మార్చి 4న ఓ ఫోన్ కాల్ వచ్చింది. ట్రాయ్ ఉద్యోగిగా పరిచయం చేసుకున్న అవతలి వ్యక్తి... ఆమెను పూర్తిగా నమ్మించేందుకు తన ఐడీ నెంబర్ అంటూ ఓడీ62813 అనే సంఖ్యను చెప్పాడు. బాధితురాలి పేరుతో నమోదై ఉన్న సెల్ నెంబర్ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగించారని, ఇందుకు సంబంధించి తమ వద్ద ఫిర్యాదు ఉందంటూ కంప్లైంట్ నెంబర్ కూడా చెప్పాడు. వీలున్నంత త్వరగా వ్యక్తిగతంగా వెళ్లి ట్రాయ్ కార్యాలయంలో అధికారులకు కలవాలని చెప్పాడు. ఆ కొద్దిసేపటికి ముంబై సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధిని అంటూ మరో వ్యక్తి ఫోన్ చేశాడు. వాట్సాప్ ద్వారా వీడియో కాల్ చేసిన అతను తతను దర్యాప్తు అధికారిగా పరిచయం చేసుకున్నాడు. మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ముంబైకి చెందిన వ్యాపారి నరేష్ గోయల్ వ్యవహారాల్లో బాధితురాలి పేరుతో ఉన్న ఫోన్ నెంబర్ వాడారని చెప్పాడు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశమైనందున న్యాయపరమైన అంశాలు అనేకం ఉంటాయని, అప్పటి వరకు విషయం కుటుంబీకులతో సహా ఎవరికీ చెప్పొద్దని స్పష్టం చేశాడు. గత నెల 8న వాట్సాప్ ద్వారానే బాధితురాలికి మరో వీడియో కాల్ వచ్చింది. కేసుకు సంబంధించిన చీఫ్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌గా చెప్పుకున్న ఆ వ్యక్తి కీలక కేసులో ఆరోపణలు ఉండటంతో మీ ఆర్థిక లావాదేవీలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిశీలించి, క్లీన్ చిట్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పాడు. నరేష్ గోయల్‌తో సంబంధాలు ఉన్న స్లీపర్ సెల్స్ కొందరు బెదిరింపులకు దిగే అవకాశం ఉందని, ఈ కారణంగానే మీ ఫోన్‌పై పూర్తి నిఘా ఉంచుతామని చెప్పాడు. గత నెల 11న వీడియో కాల్ చేసిన మరో నేరగాడు తాను సర్వైలెన్స్ ఆఫీసర్‌నని పరిచయం చేసుకున్నాడు. డిఫెన్స్ లాయర్ అంటూ మరో నేరగాడినీ పరిచయం చేసిన అతను డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు బాధితురాలికి చెప్పాడు. డిఫెన్స్ లాయర్‌గా చెప్పుకున్న వ్యక్తి వర్చువల్‌గా సుప్రీం కోర్టు న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తారని చెప్పాడు. ఇదంతా నిజమని నమ్మిన బాధితురాలు తన భర్త ఆరోగ్యం బాలేదని, వర్చువల్ అప్పీరెన్స్‌కు కొంత సమయం కావాలని కోరారు. దీంతో ఆమెకు వాట్సాప్ ద్వారా టెంపరరీ బెయిల్ అని రాసి, సుప్రీం కోర్టు పేరుతో ఉన్న పత్రాలు, రూ.30 లక్షల విలువైనదిగా తయారు చేసిన నకిలీ ష్యూరిటీ బాండ్ పంపించాడు. దీని నిమిత్తం ఆ మొత్తం తన ఖాతాల్లో వేయించుకున్నాడు. తాము కోరిన మొత్తం సూచించిన బ్యాంకు ఖాతాల్లో వేయాలని, ఆ లావాదేవీలను ఆర్‌బీఐ, న్యాయస్థానం పరిశీలించి క్లీన్ చిట్ ఇస్తాయని నమ్మించాడు. ఆపై కేసు వీగిపోవడంతో పాటు డిపాజిట్ చేసిన నగదు అంతా రిఫండ్ వస్తుందని నమ్మించాడు. దీంతో బాధితురాలు తన ఎఫ్‌డీలు విత్‌డ్రా చేసి, బంగారంపై రుణం తీసుకుని, అప్పులు చేసి మొత్తం రూ.84 లక్షలు నేరగాళ్లు సూచించిన ఖాతాల్లో వేశారు. మంగళవారం ఆఖరుసారిగా కాల్ చేసిన నేరగాళ్లు కేసు క్లోజ్ అయిందని, డిపాజిట్ చేసిన మొత్తం త్వరలోనే రిఫండ్ అవుతుందని చెప్పారు. ఆ మరుసటి రోజు నుంచి వారి ఫోన్లన్నీ స్విచ్ఛాఫ్ అయిపోయాయి. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.



అడ్డంగా దోచేసిన అకాల్ ఈ-వరల్డ్!

- ఎలక్ట్రిక్ వాహనాల డీలర్‌షిప్ ఇస్తానంటూ మోసం
- నగర వ్యాపారి నుంచి భారీ మొత్తం తీసుకున్న వైనం
- లోతుగా దర్యాప్తు చేస్తున్న సిటీ సీసీఎస్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల డీలర్‌షిప్ ఇస్తామంటూ నగరానికి చెందిన వ్యాపారి నుంచి రూ.కోటి తీసుకుని నిండా ముంచిన ఆరోపణలపై మొహాలీకి చెందిన అకాల్ ఈ-వరల్డ్ సంస్థపై సిటీ సీసీఎస్‌లో చీటింగ్ కేసు నమోదైంది. డీలర్‌షిప్ ఇవ్వడంతో పాటు ఈజెడ్‌వైగో ఈవీ పేరుతో తయారయ్యే వాహనాలు సరఫరా చేస్తానంటూ సదరు కంపెనీ హామీ ఇచ్చినట్లు బాధితుడు ఆరోపిస్తున్నాడు. బోరబండకు చెందిన వ్యాపారి డి.రమేష్ గౌడ్ 2023 నవంబర్‌లో ఈవీల డీలర్‌షిప్ కోసం అకాల్ సంస్థను సంప్రదించారు. పంజాబ్‌లోని మొహాలీలో ఉన్న వారి కార్యాలయం, ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లోని వాహనాల తయారీ యూనిట్ సందర్శించిన తర్వాత పూర్తి సంతృప్తి చెందిన అతను సదరు కంపెనీ సీఎండీ హర్మన్ ప్రీత్ సింగ్, మార్కెటింగ్ హెడ్ గౌతమ్ సింగ్‌లతో సంప్రదింపులు జరిపారు. డీలర్‌షిప్ ఇవ్వడంతో పాటు వాహనాలు సరఫరా చేస్తామని, షోరూమ్ నిర్వహణలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తామంటూ వాళ్లు హామీ ఇచ్చారని రమేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. డీలర్‌షిప్ కోసం గత ఏడాది ఫిబ్రవరి-ఏప్రిల్ మధ్య విడతల వారీగా రూ.57 లక్షలు అకాల్ సంస్థకు చెల్లించాడు. అమీర్‌పేటలో షోరూమ్ ఏర్పాటు కోసం మరో రూ.19 లక్షలు, సిబ్బంది జీతభత్యాలు, షోరూమ్ అద్దె కోసం మరో రూ.14 లక్షలు ఖర్చు చేశారు. గత ఏడాది ద్వితీయార్థానికి షోరూమ్ సిద్ధమైంది. అయితే అకాల్ సంస్థ కేవలం 20 వాహనాలను మాత్రమే సరఫరా చేసింది. వీటిలో 13 వాహనాలను ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మరో షోరూమ్‌కు పంపిన కంపెనీ మిగిలిన వాటిని వేర్వేరు వినియోగదారులకు అందించింది.

ఈ క్రయవిక్రయాలకు సంబంధించిన నగదు రమేష్‌కు చేరాల్సి ఉండగా... నేరుగా హర్మన్ ప్రీత్ సింగ్, గౌతమ్‌లే తీసుకున్నారు. కొన్నాళ్లకు ఆ ఇద్దరి నుంచి స్పందన కరువు కావడంతో అనుమానం వచ్చిన రమేష్ మొహాలీ వెళ్లి చూడగా సదరు సంస్థ కార్యాలయం మూతపడినట్లు గుర్తించాడు. దీంతో తనతో పాటు రూ.43.7 లక్షలు పెట్టుబడిగా పెట్టిన మరో నలుగురూ ఆర్థికంగా నష్టపోయారని రమేష్ ఆరోపించాడు. అకాల్ కంపెనీకి చెల్లింపులు చేయడానికి రుణాలు తీసుకోవడంతో పాటు బంగారాన్నీ కుదువ పెట్టానని పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దాదాపు ఏడాది పాటు ఆ కంపెనీతో పాటు దాని యజమానుల ఆచూకీ కోసం ప్రయత్నించిన రమేష్ గౌడ్ చివరకు సోమవారం సీసీఎస్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. దీని ఆధారంగా అకాల్ కంపెనీతో పాటు హర్మన్ ప్రీత్ సింగ్, కంపెనీలో డైరెక్టర్లుగా ఉన్న ఆయన భార్య జస్బీర్ కౌర్, కుమారుడు సహిబ్‌జ్యోత్ సింగ్, గౌతమ్ సింగ్‌లపై కుట్ర, మోసం సహా వివిధ ఆరోపణలపై కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

మియాపూర్: రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఆర్సీపురం అశోక్ నగర్‌కు చెందిన విశ్వరూపచారీ కుమార్తె బి.గోపి ప్రియ(29) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుంది. గురువారం ఉదయం ఆమె మదీనాగూడలోని కల్ట్ ఫిట్‌నెస్ సెంటర్‌లో యోగా చేసేందుకు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా మదీనాగూడ అర్చన ఆసుపత్రి సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఆమెను ఢీకొనడంతో కింద పడింది. అదే సమయంలో మియాపూర్ నుంచి చందానగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు ఆమెను సమీపంలోని అర్చన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి విశ్వరూప చారీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రుణం పేరుతో రూ. 2.4 లక్షలు టోకరా

ఫిలింనగర్: రుణం ఇప్పిస్తామని రూ. 2.4 లక్షలు కాజేసిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..ఫిలింనగర్ లేబర్ అడ్డాకు చెందిన చెబెల్లి వెంకన్నకు గత నెల 8న ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాను బ్యాంక్ ఉద్యోగినని, రూ.2,40,000 రుణానికి మీరు అర్హులని, ప్రాసెస్ చేయడానికి రూ.56,800 చెల్లించాల్సి ఉంటుందని చెప్పాడు. అతడి మాటలు నమ్మిన వెంకన్న వారు చెప్పినట్లుగా మూడు వేర్వేరు ఖాతాలకు రూ.10,000 ఒకసారి, రూ.26,900 మరోసారి, రూ.20,000లు ఇంకోసారి బదిలీ చేశాడు. నగదు చెల్లించిన అనంతరం రుణం మంజూరు విషయం తెలుసుకునేందుకు బ్యాంకుకు వెళ్లాడు. అయితే తమ బ్యాంక్‌లో అలాంటి వ్యక్తి లేడని, రుణానికి సంబంధించిన స్కీమ్‌లు లేవని చెప్పడంతో షాక్‌కు గురయ్యాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు కేసుల్లో 14 కిలోల గంజాయి స్వాధీనం

సాక్షి,సిటీబ్యూరో: సికింద్రాబాద్ మీదుగా భువనేశ్వర్ నుంచి ముంబైకి వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి మూడు గంజాయి ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఉదంతంలో గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి తప్పించుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే నగరంలోని నారాయణగూడ వైఎంసీఏ వద్ద ఆటోలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రెండు ఆటోల్లో 2.5 కేజీల గంజాయి పట్టుబడింది. విక్కి పటేల్ అనే వ్యక్తి ధూల్‌పేట్‌లో 2.5 కేజీల గంజాయిని కొనుగోలు చేసి తీసుకువచ్చి నారాయణగూడ వైఎంసీ ప్రాంతంలో సమంత్ అనే మరో ఆటో డ్రైవర్‌కు ఇస్తుండగా ఎస్టీఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని రెండు ఆటోలను , మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ధూల్‌పేట్ రహీంపురాలో ఒక ఇంట్లో గంజాయి అమ్మకాలు జరుపుతుండగా దాడి చేసి 1.5 కిలోల గంజాయిని పట్టుకున్నారు.

కమలాబాయికి మూడు నెలల జైలు..

గంజాయి అమ్మకాలు జరుపుతూ పట్టుబడిన కమలాబాయికి న్యాయస్థానం రూ.లక్ష జరిమానా లేదా, 3 నెలల జైలు శిక్ష విధించింది. జరిమానా చెల్లించకపోవడంతో ఆమెకు జైలు శిక్ష విధించారు.

చెల్లని చెక్కు ఇచ్చి చెక్కేసింది..

- నగల షాపులను బురిడీ కొట్టిస్తున్న 'కిలేడీ'
- రూ.50 లక్షల విలువైన నగలు టోకరా
- నిందితురాలి కోసం గాలింపు

గచ్చిబౌలి: సినీ ప్రముఖులు, రాజకీయ పెద్దలు తెలుసని బిల్డప్ ఇస్తూ విలువైన నగలను ఆర్డర్ చేసి ఉడాయించిన ఓ కిలేడీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. మాయమాటలు చెప్పి రూ.50 లక్షల విలువ చేసే నగలను తీసుకుని బిల్లులు చెల్లించకుండా తిరుగుతున్న మహిళ కోసం రాయదుర్గం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. కొద్ది రోజుల క్రితం అబిడ్స్‌లోని ఓ నగలు షాపు యజమానికి రమాదేవి అనే మహిళ వాట్సాప్ వీడియో కాల్ చేసి వివిధ డిజైన్ల నగలను ఎంపిక చేసుకుంది. దాదాపు రూ.50 లక్షల విలువైన నలను రాయదుర్గం పీఎస్ పరిధిలోని తాను నివాసం ఉండే ఓ గేటెడ్ కమ్యూనిటీకి తెప్పించుకుంది. చెక్ ఇచ్చి కొంత డబ్బు తక్కువగా ఉందని రెండు రోజుల తర్వాత బ్యాంకులో వేసుకోవాలని సూచించింది. అయితే ఆమె ఇచ్చిన చెక్ బౌన్స్ కావడంతో డబ్బులు ఇవ్వకుండా మొఖం చాటేసింది. బాధితులు రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితురాలు రమాదేవి కోసం గాలిస్తున్నారు. ఇది ఇలా ఉండా గతంలో ఇదే తరహాలో నగలు కాజేసిన ఆమెపై నార్సింగి పీఎస్ పరిధిలో ఒకటి, రాయదుర్గం పీఎస్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. అయినా తన తీరు మార్చుకోని సదరు మహిళ సినీ ప్రముఖులు, రాజకీయనాయకులతో దిగిన ఫొటోలు చూపిస్తూ, తాను ధనవంతురాలినని బిల్డప్ ఇస్తూ జ్యువెల్లర్ షాపుల యజమానులతో పరిచయం చేసుకుంటుంది. కొన్ని సందర్భాల్లో నమ్మకంగా ఉన్నట్లు నమ్మిస్తుంది. ఆ తర్వాత పెద్ద మొత్తంలో విలువైన నగలు తీసుకుని మోసాలకు పాల్పడుతోంది. గతంలో నమోదైన కేసుల్లో నోటీసులు ఇచ్చిన పోలీసులు ఈసారి ఆమెను అరెస్ట్ చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

గొంతు కోసి..మృతదేహాన్ని తగులబెట్టి..

- మహిళ దారుణ హత్య
- చాంద్రాయణగుట్టలో ఘాతుకం


కేతావత్ బుజ్జి (ఫైల్)

చాంద్రాయణగుట్ట: ఓ మహిళను గొంతుకోసి దారుణంగా హత్య చేయడమేగాక మృతదేహాన్ని తగలబెట్టిన సంఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాతబస్తీ కేశవగిరి హిల్స్ ప్రాంతంలో కేతావత్ బుజ్జి (55), రూప్ దంపతులు నివాసం ఉంటున్నారు. భర్త, కుమారుడు మరో ప్రాంతంలో ఉండటంతో ఒంటరిగా ఉంటున్న బుజ్జి కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. బుధవారం కూలీ పనులకు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వచ్చింది. అర్ధరాత్రి ఆమె ఇంట్లో నుంచి మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు ఫోన్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ గురునాథ్ తలుపులు బద్దలు కొట్టి లోనికి వెళ్లి చూడగా ఓ మహిళ మృతదేహం తగలబడుతున్నట్లు గుర్తించి మంటలను ఆర్పారు. అప్పటికే ఆమె మృతదేహం సగం కాలిపోయింది. సమాచారం అందుకున్న సైబర్ క్రైమ్ డీసీపీ కవిత ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా బుజ్జిని గొంతుకోసి హత్య చేసినట్లుగా పోలీసులు గుర్తించారు.

సెకండ్ హ్యాండ్ కార్లలో లిక్కర్ దందా

- ఢిల్లీ నుంచి మద్యం అక్రమ రవాణా
- రూ. 4 లక్షల విలువైన నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ పట్టివేత



హస్తినాపురం: సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారం ముసుగులో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్న ముఠాకు ఎస్టీఎఫ్ పోలీసులు చెక్ పెట్టారు. వారి నుంచి రూ. 4 లక్షల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూలు జిల్లాకు చెందిన కత్రావత్ రవీందర్ సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారం చేసేవాడు. ఇందుకు గాను తరచూ ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లేవాడు. ఆయా ప్రాంతాల్లో కార్లను కొనుగోలు చేసే అతను అక్కడ తక్కువ ధర ఉన్న మద్యాన్ని కొనుగోలు చేసి కారు డిక్కీలో వేసుకుని నగరానికి తీసుకువచ్చేవాడు. ఈ మద్యం బాటిళ్లను హస్తినాపురం సంతోషిమాత కాలనీలో ఉంటున్న తన మిత్రుడు నాగిరెడ్డికి అందజేసేవాడు. అతను వాటిని విక్రయించగా వచ్చి వచ్చిన లాభాలను ఇద్దరూ పంచుకునేవాడు. దీనిపై సమాచారం అందడంతో ఎస్టీఎఫ్ పోలీసులు సీఐ నాగరాజు నేతృత్వంలో బుధవారం రాత్రి నాగిరెడ్డి ఇంటిపై దాడిచేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ నుంచి తెచ్చిన 105 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.4 లక్షలు ఉండవచ్చునని సీఐ తెలిపారు. మద్యం బాటిళ్లను పట్టుకున్న ఎస్టీఎఫ్ టీంను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ షానవాజ్‌ఖాసీం అభినందించారు.

దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

అంబర్‌పేట: దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల ముఠాను అంబర్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. డీఐ హఫీజుద్దీన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మొఘల్‌పురా సుల్తాన్‌షాహికి చెందిన సయ్యద్ అఫ్రీదిన్, షేక్ హమీదుద్దీన్, నసీమ్ బేగం, ఖయ్యూం సుల్తానా ముఠాగా ఏర్పడి దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నెల 5న వారు అంబర్‌పేట తిరుమల నగర్‌లోని భవానీలాల్ జ్యూవెల్లరీ దుకాణానికి వచ్చారు. వృద్ధురాలైన ఖయ్యూం సూల్తానా తన ఒంటిపై ఉన్న బంగారు గాజులను తీసి ఇచ్చి వాటిపై డబ్బులు కావాలని కోరింది. వాటికి రూ.2 లక్షలు వస్తాయని చెప్పిన దుకాణ యజమాని డబ్బులు ఇచ్చేందుకు సిద్దపడి కౌంటర్‌లో నుంచి తీసి బయటపెట్టారు. బంగారాన్ని పరీక్షించేందుకు అతను లోపలి వెళ్లగానే వారు కౌంటర్ పై ఉన్న రూ.2 లక్షల నగదును తీసుకుని ఉడాయించారు. అదే సమయంలో బంగారాన్ని పరీక్షించిన యజమానికి అది నకిలీదిగా గుర్తించి బయటికి చూడగా సుల్తానాతో పాటు మిగతా వ్యక్తులు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2 లక్షలు నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

మొబైల్ స్నాచింగ్ కోసం బైక్ చోరీ..

ఇద్దరు పాత నేరస్తుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న జూబ్లీహిల్స్ డీఐ మధుసూదన్


నిందితులు నసీర్ ఖాన్, ఇర్ఫాన్ ఖాన్

బంజారాహిల్స్: మొబైల్ స్నాచింగ్‌ల కోసం బైక్ చోరీకి పాల్పడిన ఇద్దరు పాత నేరస్తులను జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..ఆగాపురాకు చెందిన నసీర్‌ఖాన్ అలియాస్ నజీర్ ఆటోడ్రైవర్‌గా పని చేసేవాడు. అఫ్జల్‌సాగర్‌కు చెందిన ఇర్ఫాన్‌ఖాన్ అలియాస్ అర్మాస్ ఫర్నీచర్ షాపులో వర్కర్‌గా పని చేస్తున్నాడు. స్నేహితులైన వీరు జల్సాలకు అలవాటు పడ్డారు. వీరిపై నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొబైల్ స్నాచింగ్‌లతో పాటు బైక్ చోరీలు, హత్యాయత్నం కేసులు ఉన్నాయి. ఏప్రిల్ 18న హయత్‌నగర్‌లో ఓ బైక్ చోరీ చేసిన బైక్ చోరీ చేసిన రషీద్ ఖాన్ అదే బైక్‌పై ఇర్ఫాన్‌ఖాన్‌తో కలిసి ఏప్రిల్ 30న బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 5 మొబైల్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఫిర్యాదు అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లో స్నాచింగ్ జరిగిన ప్రాంతం నుంచి నాలుగు రోజుల పాటు 100 సీసీ కెమెరాలను పరిశీలించారు. గురువారం ఉదయం వీరు ఇద్దరూ హబీబ్‌నగర్‌లోని ఓ ఇంటి ఎదుట ఆగడాన్ని గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో రషీద్‌ఖాన్‌పై ఫిలింనగర్, బంజారాహిల్స్, హయత్‌నగర్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, నాంపల్లి, రాజేంద్రనగర్, కూకట్‌పల్లి, హుమాయున్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 17 కేసులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఇర్ఫాన్‌ఖాన్‌పై హబీబ్‌నగర్, హుమాయున్‌నగర్, మార్కెట్, గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 6 కేసులు ఉన్నట్లు తెలిపారు. వీరిద్దరూ కలిసి మొబైల్ స్నాచింగ్‌ల కోసమే బైక్ చోరీ చేసినట్లుగా గుర్తించారు. వీరి నుంచి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం



నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న వీసీ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రెండేళ్ల కాలానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పి.వేణుగోపాల్‌రెడ్డి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా కే.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎండీ మియాజాని, ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథ్, జాయింట్ సెక్రటరీగా అశోక్, కోశాధికారిగా పాండులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను రిటర్నింగ్ ఆఫీసర్ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డికి పరిచయం చేశారు.

సంఘీభావ ర్యాలీకి తరలిన నేతలు



సంఘీభావ ర్యాలీలో ఫిలింనగర్ కాంగ్రెస్ నాయకులు

బంజారాహిల్స్: భారత సైనికులకు సంఘీభావంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘీభావ ర్యాలీకి ఫిలింనగర్ నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు తరలివెళ్లారు. కాంగ్రెస్ నేత కాటూరి రమేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు ఫిలింనగర్ నుంచి ర్యాలీగా నెక్లెస్‌రోడ్డుకు తరలివెళ్లారు.

టాస్క్ పేరుతో టోకరా

రహమత్‌నగర్: బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో సైబర్ క్రైం వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. మోతీనగర్ ప్రభాత్‌నగర్‌కు చెందిన తాలారి సింధు హార్డ్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుంది. గత నెల 21న గుర్తు తెలియని నెంబర్ నుంచి వాట్సాప్ మేసేజ్ వచ్చింది. తన పేరు మాలని అని టెలిగ్రామ్‌లో టాస్క్ ద్వారా పార్ట్‌టైమ్‌గా సంపాదిస్తుంటానని నమ్మించింది. తొలుత కొంత మొత్తాన్ని సింధూకు పంపించింది. ఈ క్రమంలోనే పలు దఫాలుగా సింధూ వద్ద నుంచి రూ. 44 వేల వరకు తన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది. అదనంగా మరో కొంత నగదు వేయాలంటూ సింధైపై ఒత్తిడి చేయడంతో అనుమాన వచ్చిన సింధూ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని టీజీఎస్‌ఆర్టీసీ మెహిదీపట్నం డిపో మేనేజర్ బి.వి.కె.మూర్తి తెలిపారు. ప్రయాణికుల సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రయాణికులు, వ్యాపారులు, కాలనీ సంక్షేమ సంఘాల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. తమకు వస్తున్న సలహాలు, సూచనలను పరిశీలించి వివిధ రూట్‌ల లో కొత్త బస్సు సర్వీసులు వేయడంతో పాటు పలు రూట్‌లలో బస్సు సర్వీస్ సంఖ్యను పెంచడం జరుగుతుందన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959226133లో సంప్రదించాలన్నారు.

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి నరపల్ సింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థల్లోని 100 ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియేట్, డిగ్రీ అర్హత కలిగి ఉండి 18 ఏళ్లు పైబడిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి వారి విద్యార్హత నైపుణ్యాన్ని అనుసరించి చక్కటి జీతభత్యాలతో పాటు ఇతర ఇన్సెంటీవ్స్ ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విజయనగర్ కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఫొటోలు, సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 83284 28933లో సంప్రదించవచ్చు.

వీధి కుక్కల వీరంగం.. ఇద్దరిపై దాడి

అడ్డగుట్ట: నార్త్‌లాలాగూడ శేషాపహాడ్ ప్రాంతంలో గురువారం పారిశుద్ధ్య కార్మికురాలిపై వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. అదే విధంగా స్థానికంగా ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ బాలుడిపై కూడా దాడి చేసింది. వీధికుక్కలు విచ్చలవిడిగా దాడులు చేస్తున్నా సంబంధిత జీహెచ్‌ఎంసీ వెటర్నరీ సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. బస్తీల్లో శునకాలు అధికంగా ఉన్నాయని అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

కార్డుల లెక్క తేలింది..!

- కొత్త రేషన్‌కార్డులకు సన్నబియ్యం పంపిణీ
- అర్హుల జాబితా ప్రతిపాదనలు ప్రభుత్వానికి..
- తమకు కార్డు వచ్చిందో లేదో షాపుల్లో తెలుసుకోవచ్చు



ఫిలింనగర్‌లోని రేషన్ షాపులో సన్నబియ్యం కోసం బారులుదీరిన కార్డుదారులు

బంజారాహిల్స్: ఎన్నో ఏళ్ల లబ్దిదారుల ఎదురుచూపులకు తెరదించుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేసింది. నూతన కుటుంబ సభ్యులను చేర్చే ప్రక్రియను కూడా పూర్తి చేసింది. వివాహం జరిగిన వారు తమ పేర్లను చేర్పించేందుకు దరఖాస్తు చేసుకోగా, కొన్నేళ్లుగా అవి పరిశీలనకు నోచుకోలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన, మీ–సేవా కేంద్రాల ద్వారా తమ పేర్లను చేర్చాలంటూ దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు రేషన్‌కార్డుల్లో కనిపిస్తుండడంతో వారంతా సంతోషంగా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన దరఖాస్తులకు ప్రజాపాలన పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించగా ఇందులో అర్హత ఉన్నవారంతా భారీ ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. అంతేకాకుండా మీ సేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. కార్డుల నుంచి 'డిలీట్'చేసుకోవడానికి, కొత్తగా పేర్లను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించడంతో చాలా మంది వినియోగించుకున్నారు. ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్–7 పరిధిలో 4,681 పేర్లు కార్డుల నుంచి డిలీట్ చేసుకోగా, కొత్తగా 304 పేర్లు నమోదయ్యాయి. అలాగే ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకుని ఇటీవలనే ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించగా 73 కొత్త కార్డులు మంజూరయ్యాయి. మరో 145 కార్డులు అర్హత కలవిగా గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అలాగే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న 508 మంది కార్డుదారుల అర్హతను గుర్తించి వాటిని కూడా సర్వే చేసి ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా సర్కిల్–7 పరిధిలో అన్నపూర్ణ కార్డులు 1 ఉండగా, అంత్యోదయ అన్నయోజన (ఏఏవై) కార్డులు 3480, ఆహార భద్రతా కార్డులు 79,595 ఉన్నాయి.

సర్కిల్–7లో 83,076 రేషన్‌కార్డులు..

ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్–7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో మొత్తం 81 రేషన్ షాపులు ఉండగా ఇందులో 83,076 కార్డులు ఉన్నాయి. ఈ కార్డులన్నింటిలో 2,78,604 మంది వినియోగదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా 17,93,434 కిలోల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.

కొత్త కార్డులకూ సన్నబియ్యం..

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన కొత్త రేషన్‌కార్డుదారులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. అలాగే కార్డుల్లో కొత్తగా నమోదైన సభ్యులకు కూడా ఉచిత సన్నబియ్యం పంపిణీ అవుతున్నాయి. రేషన్‌షాపుల్లో తమ ఆధార్ నెంబర్‌ను చూపించడం ద్వారా డీలర్లు ఆ నెంబర్‌ను నొక్కడం ద్వారా సదరు వ్యక్తికి కొత్త రేషన్‌కార్డు మంజూరైనదో లేదో అప్పటికప్పుడు తెలిసిపోతుంది. తెల్ల రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుని సర్వే పూర్తయిన తర్వాత అర్హుల జాబితాలో పేర్లు ఉన్నవారంతా సమీప రేషన్ షాపుల్లోకి వెళ్లి తమ పేరు ఉందో లేదో చెక్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

ఉద్యోగం కోసం వచ్చి ఐఫోన్లు మాయం చేశాడు

సనత్‌నగర్: ఉద్యోగం కోసం వచ్చిన ఓ వ్యక్తి రూ.1.40 లక్షల విలువైన రెండు ఐఫోన్లను చోరీ చేసిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట డీఐ జి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేటలోని ఎఫ్‌డీఆర్ ఆర్‌డీ టవర్స్‌లో గల జెప్టో కార్యాలయానికి స్టోర్ ప్యాకర్‌గా పనిచేసేందుకు బాలానగర్‌లోని జింకలవాడకు చెందిన గౌతమ్ అంకిత్‌పాత్ర (24) ఈ నెల 3వ తేదీన వచ్చాడు. ఇంటర్వ్యూ పూర్తయిన తర్వాత స్టోర్‌లో పనిచేసేందుకు అంగీకరించాడు. స్టోర్‌ను ఒకసారి చూసి వస్తానని చెప్పి స్టోర్‌లో కనిపించిన రెండు విలువైన ఐఫోన్లను తీసి దాచుకున్నాడు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి కార్యాలయానికి రాలేదు. ఆ తర్వాత స్టోర్ ఆడిట్ చేసిన నిర్వాహకులు రెండు ఐఫోన్లు కనిపించడం లేదని గుర్తించారు. సీసీ కెమెరాల ద్వారా గౌతమ్ అంకిత్‌పాత్ర సెల్‌ఫోన్లను చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు స్టోర్ ఉద్యోగి తిలక్‌కుమార్ బుధవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనాథను ఆదరించి.. డిగ్రీ చదివించి..

ఘనంగా అనాథ యువతి హల్దీ మెహిందీ ఫంక్షన్




పాయల్‌కు హల్దీ మెహింది ఫంక్షన్ చేస్తున్న కార్పొరేటర్ నిర్వాహకులు

రాంగోపాల్‌పేట్: రెండేళ్ల వయసులో రైల్వే స్టేషన్‌లో దొరికి పోలీసుల సహకారంతో ఆశ్రమానికి వచ్చింది. నిర్వాహకులే కుటుంబ సభ్యులై అన్నీ చూసుకున్నారు. పాయల్‌కు రెండేళ్ల వయసున్నపుడు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఉండగా పోలీసులు హిల్‌స్ట్రీట్ పాతశాల ఆవరణలోని ఆశ్రయ్ రెయిన్‌బో హోంకు అప్పగించారు. రెండేళ్ల వయసు నుంచి అక్కడే ఉంటూ డిగ్రీ ఆమె ఇక్కడే పూర్తి చేసింది. ఆ తరువాత ఆప్థమాలజీ కోర్సు పూర్తి చేసి ఓ ఆప్టికల్ షాపులో ఉద్యోగం చేస్తుంది. చందానగర్‌కు చెందిన యువకుడిని ఇష్టపడింది. దీంతో ఆశ్రమ నిర్వాహకులు పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఆశ్రమం నిర్వాహకులు గ్రేస్.. కార్పొరేటర్ కొంతం దీపిక మరికొంత మంది దాతల దృష్టికి ఈ విషయాన్ని తీసుకుని వెళ్లారు. బుధవారం రాత్రి ఆశ్రమం ఆవరణలో ఉత్సాహంగా మెహిందీ ఫంక్షన్ నిర్వహించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నాంపల్లి: పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మాసబ్‌ట్యాంక్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 1800 బియ్యాన్ని, 405 కేజీల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం..బంజారాహిల్స్ రోడ్ నెం–12 గోలానగర్‌కు చెందిన మహ్మద్ యాసిర్(23), బిహార్‌కు చెందిన లలిత్‌కుమార్ (22) కాటేదాన్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రజా పంపిణీకి చెందిన సన్న బియ్యం, గోధుమలను అక్రమంగా బంజారాహిల్స్ నుంచి కాటేదాన్‌కు తరలిస్తున్నారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా బియ్యాన్ని, గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా తాము పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లుగా ఒప్పుకున్నారు. వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి



రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు రసూల్‌పురా లోని బస్తీల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బోర్డు నామినేటేడ్ సభ్యురాలు భానుకనర్మద మల్లిఖార్జున్ అన్నారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా గురువారం నర్మద రసూల్‌పురా ఉషాగోదాం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు రూ.18 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టే తాగునీటి పైపులైను పనులను ప్రారంభించారు. అనంతరం వివిధ బస్తీలు, కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు బాలంరాయి పంప్‌హౌజ్ నుంచి గన్‌బజార్ పంప్‌హౌజ్ పైపులైనుకు అనుసంధానం అయ్యేలా పనులు చేపడుతున్నామని చెప్పారు. వార్డు అధ్యక్షులు మందుల శ్రవణ్, అశోక్ కుమార్, శ్రీశైలం, చిట్టిబాబు, అల్పేష్, రాజశేఖర్, ముకేష్, మహేష్, అనిల్, పరశురాం పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఇద్దరు నిర్వాహకుల రిమాండ్

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆశ్రయ్‌మాన్షన్ ప్లాట్ నెం.302లో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ యూ.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు డీఎస్ఐ జి.వెంకటేష్, ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి వెళ్లి కడప జిల్లాకు చెందిన సంగటి నాగేశ్వర్ రెడ్డి(56), నెల్లూరు జిల్లాకు చెందిన సి.ప్రభావతి(61) అనే ఇద్దరు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించి రిమాండ్ నిమిత్తం గురువారం కోర్టుకు తరలించినట్లు చెప్పారు. వారి నుంచి రూ.3 వేలు నగదుతో పాటు 6 కండోమ్ ప్యాకెట్లు, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడిలో ఇద్దరు విటులు, ఇద్దరు బాధిత మహిళలను గుర్తించి విచారించినట్లు తెలిపారు. బాధితులైన ఇద్దరు మహిళలను కోర్టులో ప్రవేశపెట్టి కోర్టు ఆదేశాలసారం 'ప్రజ్వల హోం'కు తరలించినట్లు చెప్పారు. ప్రధాన నిందితుడు సంగటి నాగేశ్వర్ రెడ్డిపై 2004లో చిక్కడపల్లి, 2008లో పంజగుట్ట, 2012లో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లలో వ్యభిచార నేరంలో అరెస్టు అవ్వడంతో పాటు కోర్టు కేసులు కూడా రిజిస్టర్ అయినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో రెండు బైక్‌లు, ఒక ఆటోట్రాలీ చోరీ

బంజారాహిల్స్: రిపేరు నిమిత్తం ఇచ్చిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12 ఎన్‌బీటీనగర్ మసీదు సమీపంలో నివసించే పిట్టల భరత్ ఈ నెల 2న మధ్యాహ్నం 3 గంటలకు తన బైక్ రిపేరు కోసం స్థానికంగా ఉండే మెకానిక్ షాపులో ఇచ్చాడు. మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు మెకానిక్ ఎండీ హనీఫ్ షాపునకు రాగా భరత్ ఇచ్చిన బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా బైక్ ఆచూకీ లభించలేదు. దీంతో బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో ఆటోట్రాలీ..

పార్కు చేసిన ఆటోట్రాలీ చోరీకి గురైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..షేక్‌పేట కో–ఈ–సార్ కాలనీకి చెందిన షేక్ ఫైజాన్ అలీ ఆటోట్రాలీ నడిపిస్తుంటాడు. ఈ నెల 4న తన ఆటోట్రాలీని స్థానికంగా ఉన్న జేకే మార్ట్ కిరాణా షాపు పక్కన పార్క్ చేసి తన స్వస్థలమైన మహారాష్ట్ర నాందేడ్‌కు వెళ్లాడు. ఈ నెల 7న తిరిగి రాగా తాను పార్క్ చేసిన ఆటోట్రాలీ కనిపించలేదు. దీంతో బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్క్ చేసిన యాక్టివా చోరీ..

పార్క్ చేసిన యాక్టివా చోరీకి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..జూబ్లీహిల్స్ ప్రాంతంలో నివాసం ఉంటున్న వెంకటేష్ (35) తన హోండా యాక్టివాను గత నెల 30న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో యూసుఫ్‌గూడ గణపతి కాంప్లెక్స్ వెనుక పార్క్ చేసి పనికి వెళ్లాడు. సాయంత్రం 6 గంటలకు తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య సమస్యకు చెక్

సాక్షి ఎఫెక్ట్..



బంజారాహిల్స్‌లోని మీ సేవా కేంద్రం ముందు చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–7లోని మీ సేవా కేంద్రం ముందు కొన్ని నెలలుగా చెత్త, వ్యర్థాలతో పేరుకుపోయి దుర్వాసనతో వచ్చేది. దీంతో మీ సేవా కేంద్రానికి వచ్చేవారు ఇబ్బందులకు గురయ్యేవారు. రెండు రోజుల క్రితం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తపై జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. గురువారం ఇక్కడ పేరుకుపోయిన చెత్తను, మట్టి దిబ్బలను తొలగించారు. దీంతో మీ సేవా కేంద్రం ముందు పారిశుద్ధ్య సమస్య చాలా వరకు పరిష్కారానికి నోచుకుంది. వెంకటేశ్వర కాలనీ డివిజన్ వార్డు కార్యాలయం పక్కనే ఈ సమస్య ఉన్నా ఇన్నాళ్లు అటు పారిశుద్ధ్య విభాగం సిబ్బంది గానీ, ఇటు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం గానీ స్పందించలేదు. సర్కిల్–18 ఏఎంఓహెచ్ సూపర్‌వైజర్ నిర్లక్ష్యానికి జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతూ వ్యర్థాలు, దుర్గంధంతో స్థానికంగా పారిశుద్ధ్య సమస్య తీవ్రతరమవుతుందని గత ఏడాది కాలంగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

సిబిల్ నిబంధనను తొలగించాలి



నిరసనలో పాల్గొన్న ఏఐవైఎఫ్ నేతలు

హిమాయత్‌నగర్: రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన సరికాదని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలిఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర అన్నారు. సిబిల్ స్కోర్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి వై జంక్షన్ వరకు చెవిలో పూలు, చేతిలో చిప్ప పట్టుకుని వినూత్నంగా ధర్నా నిర్వహించారు. సిబిల్ నిబంధన నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ నేతలు నెర్లకంటి శ్రీకాంత్, టి.సత్యప్రసాద్, షేక్ మహమూద్, మాజీద్ అలీఖాన్, హేమంత్, జానీ, వెంకట్, ఖాజా పాషా, సతీశ్ కుమార్, జగన్, సీపీఐ నేత చెట్టుకింది శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల్లో సౌకర్యాలు కల్పించాలి

కూకట్‌పల్లి: బస్తీదవాఖానాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం. శంకర్ అన్నారు. హనుమాన్‌నగర్, వెంకటేశ్వరనగర్, ఆస్‌బెస్టాస్ కాలనీల్లోని బస్తీ దవాఖానాల్లో సౌకర్యాలపై గురువారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సౌకర్యాలు లేకపోవడంతో రోగులు రోజుల తరబడి మందులు కోసం బస్తీ దవాఖానాల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన స్టాఫ్ లేకపోవటం వల్ల రక్త పరీక్షలు కూడా సరిగ్గా నిర్వహించటం లేదన్నారు. దుర్వాసనతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సిబ్బందికి ప్రతి నెలా జీతాలు సమయానికి ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే 12న కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పి. ధర్మారావు, ఏ. రంగారెడ్డి, కృష్ణారావు, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ పోయించుకుని డబ్బులు ఇవ్వకుండా పరార్

బంజారాహిల్స్: రెండు బైక్‌ల్లో పెట్రోల్ పోయించుకుని డబ్బులు ఇవ్వకుండా నలుగురు వ్యక్తులు పరారైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ దేవరకొండ బస్తీకి చెందిన అనికేత్‌కుమార్ (23) బంజారాహిల్స్ రోడ్డునెంబర్–3లోని పెట్రోల్ పంపులో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 4న తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో నలుగురు వ్యక్తులు టీఆర్ నెంబర్ కలిగిన రెండు బైక్‌లపై వచ్చారు. ఇద్దరు నీలిరంగు కలిగిన కేటీఎం డ్యూక్ బైక్‌లో రాగా, మరొకరు బ్లాక్ కలర్ డ్యూక్ బైక్‌పై వచ్చారు. ఒక వాహనంలో ఆరు లీటర్లు, మరో వాహనంలో 9 లీటర్ల పెట్రోల్‌ను పోయించుకున్నారు. అయితే బిల్లు ఇవ్వాల్సిందిగా వారు కోరగా, అనికేత్ బిల్లు జనరేట్ చేస్తుండగానే అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఫిలింనగర్: విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..టోలిచౌకి మెరాజ్‌కాలనీకి చెందిన మీర్జా తాహెర్ అలీ స్థానికంగా స్టార్‌లైట్ పాన్‌షాప్‌ను నిర్వహిస్తున్నాడు. అయితే పాన్‌షాపులో విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్నట్లుగా పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడులు చేయగా పెద్ద ఎత్తున విదేశీ సిగరెట్లు బయటపడ్డాయి. రూ.5,470ల విలువ చేసే ఆరు రకాలకు చెందిన 15 పెట్టెలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాను ఈ విదేశీ సిగరెట్లను కిషోర్ పటేల్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లుగా మీర్జా తాహెర్ అలీ పోలీసులకు చెప్పాడు. ఈ మేరకు అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నందినగర్‌లో వీధి కుక్కల బెడద



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని నందినగర్‌లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసిత రహదారితో పాటు బ్రహ్మకుమారీస్ గ్రౌండ్లల్లో వీధికుక్కల బెడద తీవ్ర రూపందాల్చింది. రాత్రిపూట వీధుల్లోకి రావాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. సుమారుగా 70 నుంచి 100 వీధి కుక్కలు వాడవాడలా స్థానికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. సంబంధిత వెటర్నరీ బృందానికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తెలంగాణలో బీజేపీకి ప్రజాదరణ



గోల్కొండ: తెలంగాణలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కూ పడుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. గురువారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తెలంగాణలో బీజేపీకి ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఉత్తుత్తి హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎక్కువ కాలం ఉండజాలదని ఆమె అన్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడమే బీజేపీ లక్ష్యమన్నారు. ఆమెను కలిసిన వారిలో కార్వాన్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఉద్దడి జగదీష్‌కుమార్ తదితరులున్నారు.

వివాహిత అదృశ్యం



సికింద్రాబాద్: భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన వివాహిత అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. ఒడిశా రాష్ట్రం పలపాతి గ్రామానికి చెందిన జడునాథ్ ముర్ము, మల్హో మణి ముర్ము(26) దంపతులు. ఈ నెల 6న సాయంత్రం 8 గంటల సమయంలో భార్యభర్తలు భువనేశ్వర్ రైల్వే స్టేషన్లో జనరల్ టికెట్ తీసుకొని విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలెక్కారు. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో దిగి ప్లాట్ ఫాం నంబర్ 1లోని గేట్ నంబర్ 5 వద్ద కూర్చున్నారు. టూత్‌పేస్ట్ తీసుకొచ్చేందుకు భర్త జడునాథ్ బయటకు వెళ్లి వచ్చేసరికి భార్య కనిపించకుండా పోయింది. దీంతో పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా భార్య మల్హో మణి ఆచూకీ లభించకపోవడంతో జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం

మూసాపేట: దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ అన్నారు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పక్కన పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సత్యవేద ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీవోల సహాయంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ రాజేష్, డీఐ వెంకటేశం, ఎస్ఐలు రామకృష్ణ, నాగేశ్వరరావు, నరసింహ, శ్రీనివాస్, సంస్థ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



టీసీఎస్, జేఎన్‌టీయూహెచ్ మధ్య ఒప్పందం



శ్రీధర్‌బాబు సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్న జేఎన్‌టీయూహెచ్, టీసీఎస్ అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ: ప్రముఖ బహుళజాతి సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్), జేఎన్‌టీయూహెచ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. గురువారం జేఎన్‌టీయూహెచ్ ఉప కులపతి ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి, టీసీఎస్–ఐఓఎన్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ విభాగం వ్యాపార విభాగాధిపతి స్మృతిముల్యే, తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ సలహాదారు సాయికృష్ణ సమక్షంలో ఈ ఒప్పందాన్ని చేసుకున్నారు. ఈ ఒప్పందం జేఎన్‌టీయూ మంథని విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. విద్యారంగం, పరిశ్రమల మధ్య సంబంధాలు, విద్యార్థుల్లో నైపుణ్య అభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ ఒప్పందం ద్వారా జేఎన్‌టీయూ, మంథని ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగంలోని 100 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కనీసం 70 మంది విద్యార్థులకు టీసీఎస్ భాగస్వామ్య సంస్థల ద్వారా తెలంగాణలో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని జేఎన్‌టీయూహెచ్ ఉప కులపతి ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి తెలిపారు.

టీ హబ్- బీఎన్‌వీఐ మధ్య ఒప్పందం పొడిగింపు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్–బియాండ్ నెక్ట్స్ వెంచర్స్ ఇండియా (బీఎన్‌వీఐ) మధ్య ఒప్పందాన్ని పొడిగించాలనే నిర్ణయాన్ని గురువారం ప్రకటించాయి. ఈ మేరకు టీహబ్ ప్రాంగణంలో రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి వాటిని మార్చుకున్నారు. భారత్, జపాన్ దేశాల మధ్య సరిహద్దు దాటి ఇన్నోవేషన్‌ను బలోపేతం చేయడంలో భాగంగా 2027 వరకు తమ భాగస్వామ్యాన్ని పొడిగించాయి. జైకా(జేఐసీఏ), బీఎన్‌వీఐలకు చెందిన బ్రేవ్ యాక్సిలరేటర్ మద్దతుతో ఈ భాగస్వామ్యం మూడు ప్రాధాన్య కార్యక్రమాలను ప్రవేశపెడుతోంది. వాతావరణ మార్పు, ఆరోగ్య సంరక్షణ వంటి సమస్యలను పరిష్కరించే సోషల్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్, విజ్ఞాన ఆధారిత భారతీయ స్టార్టప్ వ్యవస్థాపకులను అభివృద్ధి చేయడానికి ఇన్నోవేషన్ లీడర్స్ ప్రోగ్రామ్, భారతదేశంలోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు(జీసీసీ)ను స్కేల్ చేయడానికి, స్టార్టప్‌కు జపాన్ మార్కెట్‌లో ప్రవేశం కల్పిందానికి ఇండో–జపాన్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్‌ను రూపొందించారు. కేవలం స్టార్టప్‌లకు నిధులు సమకూర్చడమేకాకుండా ప్రపంచ వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక ప్రభావాన్ని కలిగించే పరిష్కారాలను సంయుక్తంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని రెండు సంస్థలు నిర్ణయించాయి.



టీ హబ్, బీఎన్‌వీఐల మధ్య ఒప్పందం కుదుర్చుకున్న దృశ్యం

మూసీ అభివృద్ధి పనుల పరిశీలన



సాక్షి, సిటీబ్యూరో: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ 'మూసీ పునరుజ్జీవం'అభివృద్ధి పనుల పురోగతిని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎంఆర్‌డీసీఎల్) ఎండీ ఈవీ నరసింహారెడ్డి, జాయింట్ ఎండీ గౌతమి, ఇతర అధికారులతో కలిసి గురువారం సందర్శించారు. మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి పనుల్లో భాగంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ రిజర్వాయర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజర్వాయర్ల స్టోరేజ్ సామర్థ్యం, అందులోకి వచ్చే ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో వివరాలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ వారికి వివరించారు. అనంతరం మూసీలోకి మంచినీటి విడుదల, దానికి సంబంధించిన ఇతర సాంకేతిక అంశాలపై అధికారులతో కలిసి నరసింహారెడ్డి సమగ్రంగా చర్చించారు. మూసీ, ఈసీ నదుల పొడవునా బాపూఘాట్ వరకూ విస్తరించి ఉన్న ప్రాంతానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ దత్తుపంత్, మెయిన్‌హార్ట్ కన్సల్టెంట్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఆర్‌పై వాహనాల మరమ్మతుకు టోల్‌ఫ్రీ నంబర్

రాజేంద్రనగర్: ఔటర్ రింగ్ రోడ్డుతోపాటు పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై వెళ్లే సమయంలో వాహనాలు మరమ్మతుకు గురైతే టోల్ ఫ్రీ నంబర్‌కు కానీ, పోలీసులకు సమాచారం అందించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేందర్ గౌడ్ వాహనదారులను కోరారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఓఆర్‌ఆర్‌పై వాహనం మరమ్మతులకు టోల్ ఫ్రీ నంబర్ 14449కు సమాచారం అందించాలని సూచించారు. ఔటర్‌పై ఉన్న ఎస్‌ఓఎస్ ఫోన్లలో సమాచారం అందించాలన్నారు. వెంటనే సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకొని పూర్తి రక్షణ చర్యల మధ్య మరమ్మతు పనులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. రోడ్డుపైనే వాహనాలకు మరమ్మతులు చేస్తే వెనుక నుంచి వాహనాలు వేగంగా దూసుకొచ్చి ఢీకొట్టే ప్రమాదం ఉందని అన్నారు. బుధవారం రాత్రి హిమాయత్‌సాగర్ వద్ద రోడ్డుపైనే వాహనానికి మరమ్మతు చేస్తుండగా వెనుక నుంచి మరో వాహనం వచ్చి ఢీకొట్టడంతో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడని గుర్తు చేశారు. పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై ఏదైనా వాహనం బ్రేక్ డౌన్ అయినా, ఇతర కారణాలతో నిలిచినా వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఇంటి నుంచి బయటికి వెళ్లే సమయంలోనే వాహనం కండీషన్‌గా ఉందో లేదో సరిచూసుకోవాలని సూచించారు.

మెట్రో బుక్‌ఫెయిర్ పోస్టర్ ఆవిష్కరణ



పుస్తక ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించిన అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: మియాపూర్‌లో ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు జరిగే మెట్రో బుక్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. గురువారం పుస్తక ప్రదర్శన పోస్టర్‌ను తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాల పట్ల ప్రతి ఒక్కరిలోనూ అవగాహన పెంచాలన్నారు. సెల్‌ఫోన్‌లో లీనమైపోయే సంస్కృతికి ప్రజలు అలవాటు పడ్డారని, ఇటువంటి సందర్భాల్లో తెలంగాణ బుక్ ట్రస్ట్ ముందుకు వచ్చి రాష్ట్ర వ్యాప్తంగా పుస్తక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయినేని చంద్రకాంత్‌రావు, మల్లయ్య, నరేష్, తెలంగాణ బుక్ ట్రస్ట్ నిర్వాహకులు కోయ చంద్రమోహన్, ప్రైవేట్ విద్యాసంస్థల రాష్ట్ర చైర్మన్ శివరాత్రి యాదగిరి, ఏఐఎఫ్‌డీవై నాయకులు వనం సుధాకర్, దశరథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు విధానాల వల్లే సాగు సంక్షోభం

వ్యవసాయ ఆర్థిక నిపుణులు డి.పాపారావు



ధర్నాలో మాట్లాడుతున్న పాపారావు

కవాడిగూడ: కేంద్ర, రాష్ట్ర పాలకుల తప్పుడు విధానాల వల్లే వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని వ్యవసాయ ఆర్థిక నిపుణులు డి.పాపారావు అన్నారు. రైతు అనుకూల విధానాలు అమలు చేయకపోతే దేశానికి ఆహార భద్రత ఉండదని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయాలని, స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదనలకు అనుగుణంగా పంటలకు కనీస మద్దతు ధరలు నిర్ణయించాలని గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని ఉపసంహరించి రైతాంగ రుణాలను రద్దు చేయాలన్నారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం–2006 అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధిలేదని, సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వడం లేదని విమర్శించారు. ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల ప్రభాకర్ మాట్లాడుతూ కనీస మద్దతు ధరలను ఇష్టం వచ్చినట్లు పాలకులు నిర్ణయించడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చర్చల రంగారెడ్డి, ఉపాధ్యక్షులు డి.రాము, సహాయక కార్యదర్శి నంది రామయ్య, చంద్రన్న, భిక్షమన్న, దేవారం, సురేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలి స్టేడియంలో పోలీసు జాగిలాలతో సోదాలు



సేదదీరుతున్న పోలీసులు



పార్కింగ్‌పై చర్చిస్తున్న లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు

జాగిలాలు వచ్చె.. జల్లెడ పట్టె..

- మిస్ వరల్డ్ పోటీలకు భారీ బందోబస్తుకు చర్యలు
- ప్రధాన వేడుకల్లో పోలీసుల మోహరింపుపై కసరత్తు
- 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రారంభ వేడుకలు



ఇండోర్ స్టేడియానికి వచ్చే రోడ్డులో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రుల ఫొటోలు

గచ్చిబౌలి: మిస్ వరల్డ్ వేడుకలు.. ఐటీ కారిడార్‌లో వేదికలు.. విదేశాల నుంచి అందాల భామల రాక.. అప్రమత్తమైన పోలీసు శాఖ. ఇంకా ఒక్కరోజు మాత్రమే మిగిలింది. ఈ నెల 10న మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై సైబరాబాద్ పోలీసులు కసరత్తు చేస్తున్నారు. ప్రధాన వేడుకలు జరిగే చోట భారీగా పోలీసులను మోహరించనున్నారు. గచ్చిబౌలి పోలీసుస్టేషన్ పరిధిలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 10న మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకలు, 17న స్పోర్ట్స్ ఫినాలే జరగనున్నాయి. ఇప్పటికే గచ్చిబౌలి పోలీసులు ఇండోర్ స్టేడియం, పరిసరాలను అధీనంలోకి తీసుకున్నారు. గురువారం ఇండోర్ స్టేడియం, పరిసరాల్లో పోలీసులు జల్లెడ పట్టారు. జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. ఇండోర్ స్టేడియానికి వచ్చే కంటెస్టెంట్లు, వీవీఐపీల రాకపోకలు, వాహనాల పార్కింగ్, విజిటర్స్ పార్కింగ్ తదితర అంశాలపై పోలీసులు చర్చించారు.

ప్రధాన వేడుకలు ఇక్కడే...

రాయదుర్గం పీఎస్ పరిధిలోని టీ హబ్‌లో ఈ నెల 20న కాంటినెంటల్ ఫినాలే, 21న రెండెజ్ వ్యూస్ విత్ ఎంటర్‌ప్రెన్యూర్స్ నిర్వహిస్తారు. మాదాపూర్ పీఎస్ పరిధిలోని శిల్పారామంలో 21న ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ వర్క్‌షాపు, 22న శిల్పకళావేదికలో మిస్ వరల్డ్ ఫినాలే, 23న ట్రైడెంట్ హోటల్‌లో హెచ్2హెచ్ చాలెంజ్ ఫినాలే, 24న ట్రైడెంట్, హైటెక్స్‌లో ఫ్యాషన్ ఫినాలే, 25న హైటెక్స్ బ్యూటీ విత్ పర్పస్, గాలా డిన్నర్ 31న హైటెక్స్‌లో మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే జరగనున్నాయి. మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ నేతృత్వంలో గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం పోలీసులు భద్రత కల్పిస్తున్నారు.ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

సీఎం, మంత్రుల ఫొటోలు

ఇండోర్ స్టేడియంలోకి వెళ్లే మిస్ వరల్డ్ ఈవెంట్ మోడల్స్, వీవీఐపీ వెళ్లే రోడ్డులో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఒలింపిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి ఫొటోలను అమర్చారు. ఇండోర్ స్టేడియం నుంచి బయటకు వెళ్లేటప్పుడు కూడా అవి కనిపించేలా అమర్చారు.

ఉత్తమ ఎస్‌హెచ్‌ఓగా బాలానగర్ సీఐ నరసింహరాజు



బాలానగర్: నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలో బాలానగర్ పోలీస్ స్టేషన్ సీఐ టి.నరసింహరాజు ఉత్తమ ఎస్‌హెచ్‌వోగా ఎన్నికయ్యారు. దీనికి సంబంధించి రాష్ట్ర డీజీపీ నుంచి రివార్డు, ప్రశంసాపత్రం ఈ నెల 17వ తేదీన అందుకోనున్నారు. డీజీపీ కార్యాలయం పోలీస్ అధికారుల పనితీరుపై ప్రజల నుంచి వివరాలు సేకరించింది. విధి నిర్వహణతోపాటు ప్రజలను చైతన్యవంతం చేయటం, నిత్యం పౌరులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించడటం తదితర అంశాల ఆధారంగా రాష్ట్రంలోని టాప్ 10 మంది ఎస్‌హెచ్‌ఓలను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా నరసింహరాజు ఉత్తమ ఎస్‌హెచ్‌వోగా ఎంపికయ్యారు.

ఎస్కీలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

డాక్టర్ రామేశ్వరరావు వెల్లడి

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ) క్యాంపస్‌లో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ప్రత్యేక ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు 'ఎస్కీ'డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు గురువారం వెల్లడించారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ'లో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని గురువారం క్యాంపస్‌లో ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం 2025–26 సంవత్సరానికి జియో స్పేషియల్ టెక్నాలజీ అప్లికేషన్స్ బలోపేతం చేయడంలో భాగంగా దేశం మొత్తంలో కూడా అర్బన్ ప్లానింగ్‌ను అభివృద్ధి చేయడం, ల్యాండ్ రికార్డులను ఆధునీకరించడం, భూగర్భ వనరులను కాపాడుకోవడం కోసం నేషనల్ జియో స్పేషియల్ మిషన్ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ఇందులో భాగంగానే ఎస్కీలో శిక్షణా సంస్థలోని వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ విభాగం సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో ఆరువారాలు, నాలుగు వారాలకు సంబంధించిన ఇంటర్న్‌షిప్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ హెడ్ ఎం.రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ నాలుగు వారాలకు సంబంధించిన జీఐఎస్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో చేరడానికి సివిల్ ఇంజనీరింగ్ డిగ్రీ లేదా డిప్లొమో చదువుతున్న లేదా ఎంటెక్ ప్రాజెక్ట్ వర్క్ చేస్తున్నవారు కూడా అర్హులన్నారు. పీహెచ్‌డీ చేస్తున్న స్కాలర్స్‌కు జీఐఎస్‌లో ట్రైనింగ్ ఇస్తామని తెలిపారు.

ఉపాధి ఆధారిత తెలుగుబోధన అవసరం

డాక్టర్ నందిని సిధారెడ్డి

చిక్కడపల్లి: విశ్వవిద్యాలయాల్లో ఉపాధి ఆధారిత తెలుగు బోధన ఉండాలని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభ హాల్‌లో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, నక్క వెంకటమ్మయాదవ్, నక్క యాదగిరిస్వామి యాదవ్ ఎడ్యుకేషనల్ స్పోర్ట్స్ ఫౌండేషన్‌ల సౌజన్యంతో తెలుగు భాషా చైతన్య సమితి, లక్ష్యసాధన ఫౌండేషన్‌ల 12వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా తెలుగు భాషకు పట్టాభిషేకం శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగు భాషపై పట్టుకు, భాషా చైతన్యానికి సమితి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ సజీవ భాషకు విఘాతం కలిగిస్తే అందరూ చైతన్యవంతం కావాలన్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కాశీం మాట్లాడుతూ రాజకీయ పార్టీల నేతలు తెలుగును ప్రధానాంశంగా మేనిఫెస్టోలో చేర్చాలని, దీనికోసం త్వరలో పదివేల మందితో ఎల్బీ స్టేడియంలో సదస్సు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఆచార్య ఇటిక్యాల పురుషోత్తం, బడే సాబ్, రామకృష్ణ చంద్రమౌళి, జయప్రకాష్, డాక్టర్ ఎడ్ల మల్లేష్, నాళేశ్వరం శంకరం, డాక్టర్ ఎస్.బాలాచారి, డాక్టర్ బి. జయరాములు, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు సరికొత్త టెస్ట్

రాజేంద్రనగర్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో సీవై–టీబీ టెస్ట్



సీవై–టీబీ పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: టీబీ (క్షయ వ్యాధి)ని నిర్మూలించేందుకు సరికొత్త టెస్టు అందుబాటులోకి వచ్చింది. సీవై–టీబీ అనే పరీక్షను రాజేంద్రనగర్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య, ఆరోగ్య శాఖ ప్రారంభించింది. సీవై–టీబీ పరీక్ష ద్వారా టీబీ బ్యాక్టీరియా శరీరంలో లోపల దాగి ఉందా లేదా అనే విషయాన్ని స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఇది ప్రధానంగా టీబీ రోగుల కుటుంబ సభ్యులు, షుగర్ వ్యాధిగ్రస్తులు, బీడీ, సిగరెట్ తాగేవారు, మద్యం సేవించే వారికి నిర్వహిస్తున్నారు. బ్యాక్టీరియా దాగి ఉందని గుర్తిస్తే వెంటనే ఐఎన్‌హెచ్ రిఫ్ ప్రివెంటివ్ థెరపీ ద్వారా చికిత్స ప్రారంభిస్తారు. దీంతో టీబీ వచ్చే అవకాశం తొలగిపోతుంది. స్టాఫ్ నర్సులపై కూడా ఈ పరీక్షలు నిర్వహించి వారు ఆరోగ్యంగా ఉన్నారా అనే అంశాన్ని గుర్తిస్తున్నారు. సీవై–టీబీ ద్వారా ముందుగానే రోగాన్ని గుర్తించడంతో భారత్‌ను టీబీ రహిత దేశంగా మార్చే లక్ష్యాన్ని చేరుకునేందుకు దోహదపడనుందని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజు, ఎస్.టి.ఎస్.నరేశ్ కుమార్, రహీం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ దోపిడీతోనే రాష్ట్రం అధోగతి

ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం




గజ్జెల కాంతం

పంజగుట్ట: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డప్పుడు మిగులు బడ్జెట్ ఉండగా, 2023లో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయేనాటికి ఎంత మిగులు బడ్జెట్ ఉందో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజలకు వివరించాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం డిమాండ్ చేశారు. అదే సమయంలో రాష్ట్రం ఏర్పడ్డప్పుడు కేసీఆర్, కేటీఆర్, కవితల ఆస్తులు ఎంత ఉన్నాయో, 10 సంవత్సరాల పాలన తరువాత ఎంత ఉన్నాయో వివరించాలని కోరారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ నాలుక కోస్తాం, చేతకాకపోతే దిగిపో అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు ప్రజలకు తెలవాలనే ఉద్దేశంతో ప్రజలకు వివరించారని, ఈ పరిస్థితి రావడానికి గత 10 సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనే కారణమని అన్నారు. ముఖ్యమంత్రి గురించి అవాకులు, చెవాకులు పేలితే బీసీ, ఎస్సీ, ఎస్టీలు కలిసి కేటీఆర్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టే పరిస్థితి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లు, భూముల స్కాం, ఇసుక దోపిడీ, ఫోన్ ట్యాంపరింగ్, అన్ని శాఖల్లో అవినీతి బయటపడి జైలుకు వెళ్లాల్సి వస్తుందోనన్న భయంతో కేటీఆర్ మాట్లాడుతున్నారని అన్నారు. మరోసారి ముఖ్యమంత్రిపై కేటీఆర్ దిగజారుడు మాటలు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

'మనూ'లో బయోడైవర్సిటీ చెరువు

ప్రారంభించిన వైస్ చాన్స్‌లర్

రాయదుర్గం: ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కలిసి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టిస్తాయని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం(మనూ) వైస్ చాన్స్‌లర్ సయ్యద్ ఐనుల్ హసన్ అన్నారు. గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో బయోడైవర్సిటీ చెరువును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో భూగర్భ జలాలు వేగంగా తగ్గడం, ఉష్ణోగ్రత పెరగడం ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. క్యాంపస్‌లో భూగర్భ జలాలను పునరుద్ధరించడానికిగాను బయోడైవర్సిటీ చెరువును ప్రారంభించామన్నారు. వచ్చే వేసవికి ముందు భూగర్భ జలాలను తిరిగి నింపడానికి వీలుగా రుతుపవనాల నీటిని కూడా సేకరించే ప్రణాళికలు ఉన్నాయన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి సౌర ఫలకాలను ఏర్పాటు చేసి సామర్థ్యాలను పెంచుతామని వివరించారు. కార్యక్రమంలో ఎంఏకే అధ్యక్షురాలు అర్షియా హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ షెహబాజ్ అహ్మద్, ఓఎస్‌డి ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఆరోగ్య కేంద్రంలో ఫెడరల్ బ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద పలు అధునాతన పరికరాలను విరాళంగా అందించారు. రెండు బెడ్‌సైడ్ మల్టీ పారామీటర్ మానిటర్లు, ఈసీజీ యంత్రాలు వంటి ఆధునాతన వైద్య పరికరాలను వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ప్రారంభించారు.



ఆరోగ్య కేంద్రంలో అత్యాధునిక సౌకర్యాలను ప్రారంభిస్తున్న వీసీ సయ్యద్ ఐనుల్ హసన్

మహిళలకు అండగా షీ టీమ్స్

వేధిస్తే పోకిరీలపై చర్యలు: రాచకొండ సీపీ

నాగోలు: బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీ టీమ్స్ వదలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. రాచకొండ పరిధిలో గత నెలరోజుల్లో 188 మంది పోకిరీలను షీ టీమ్స్ పట్టుకున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు ఎల్బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో వారి కుటుంబసభ్యుల సమీక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. రాచకొండ పరిధిలో మహిళలను, యువతులను వేధింపులకు గురిచేసిన 188 మందిలో మేజర్లు 132, మైనర్లు 56 మంది ఉన్నారు. గత నెల 1వ తేదీ నుంచి 30 వరకు 225 ఫిర్యాదులు అందాయని తెలిపారు. రాచకొండ పరిధిలో 93 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 17,420 మందికి మహిళా చట్టాలు, వారి హక్కులు, నేరాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్లు వివరించారు. మెట్రో రైల్ డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించి మహిళా కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తున్న 9 మంది పురుషులకు పట్టుకుని మెట్రో స్టేషన్ అధికారుల ద్వారా ఫైన్ వేయించినట్లు విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి.ఉషారాణి తెలిపారు. మహిళలు వేధింపులకు గురి అయినప్పుడు వెంటనే రాచకొండ షీ టీమ్స్ వాట్సాప్ నెంబర్ 87126 62111కు ఫిర్యాదు చేయాలని సూచించారు.



పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న షీ టీమ్స్ పోలీసులు

టీజీ ఈసెట్–2025కు ఏర్పాట్లు పూర్తి

12న పరీక్ష... ఒక నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ ఈసెట్–2025 ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కన్వీనర్ ప్రొ.చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఇంజినీరింగ్ వివిధ పీజీ కోర్సుల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ఈ నెల 12న ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగే ప్రవేశ పరీక్షకు రాష్ట్రంలో 86 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 7.30 గంటలకు చేరుకొని రిపోర్టు చేయాలన్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని కన్వీనర్ పేర్కొన్నారు. పరీక్ష ప్రారంభం నుంచి ముగిసే సమయం వరకు అభ్యర్థులను బయటకు అనుమతించరని పేర్కొన్నారు. టీజీ ఈసెట్–2025కు 19,672 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ వివరించారు. పూర్తి వివరాలకు 9866695963 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

టర్కీ కాన్సుల్ కార్యాలయం వద్ద భద్రతపై పర్యవేక్షణ



టర్కీ కాన్సుల్ కార్యాలయం వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

బంజారాహిల్స్: పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలపై భారత ఆర్మీ దాడులు చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో గురువారం జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–36లోని టర్కీ కాన్సుల్ కార్యాలయం వద్ద జూబ్లీహిల్స్ పోలీసులు భద్రతను పరిశీలించారు. జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు సిబ్బంది కాన్సులేటివ్ కార్యాలయం లోపల, బయట భద్రతపై ఆరా తీశారు. వివరాలు నమోదు చేసుకున్నారు.

కృత్రిమ మేధపై ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ

ఈ నెల 15 నుంచి నెలరోజులపాటు నిర్వహణ

గచ్చిబౌలి: ఇంజినీరింగ్ విద్యార్థులకు కృత్రిమ మేధపై నైపుణ్యం కల్పించడమే లక్ష్యంగా 'సమ్మర్ ఆఫ్ ఏఐ'ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలని విశ్వం డాట్ ఏఐ సంస్థ నిర్ణయించింది. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, స్వేచ్ఛ, మెటా, హెచ్‌వైఎస్ఈఏ ఒజోనెటెల్ వంటి సంస్థల సహకారంతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ నుంచి నెలరోజులపాటు నిర్వహించాలని తలపెట్టినట్లు గురువారం విశ్వం డాట్ ఏఐ సెంటర్ హెడ్ కిరణ్‌చంద్ర ప్రకటించారు. విద్యార్థులు ఏఐ/ఎంఎల్ ప్రాథమికాంశాలు, డేటా ప్రిపరేషన్, మోడల్ బిల్డింగ్, డెవలప్‌మెంట్ వంటి అంశాలలో నైపుణ్యం పొందుతారని వివరించారు. ఇది ప్రపంచంలో మొట్టమొదటి తెలుగు లార్జ్ లాంగ్వేజ్ మోడల్(ఎల్ఎల్ఎం) అభివృద్ధికి తోడ్పాటు అందించనుందన్నారు. దీని ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న లక్ష మందికిపైగా ఇంజినీరింగ్ విద్యార్థులకు లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ అభ్యాసాన్ని తెలంగాణలోని ఏడు కేంద్రాల్లో ఆఫ్‌లైన్ సమావేశాలతో మిళితం చేస్తుందని చెప్పారు. విద్యార్థులు వారాంతపు వర్క్‌షాప్‌లో ప్రాజెక్టులపై పనిచేస్తారని పేర్కొన్నారు. ఒక్కో బ్యాచ్‌లో 25 వేల మంది విద్యార్థులు ఉంటారన్నారు. మరిన్ని వివరాలకు 99591 54371, 99639 80259లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఓయూలో ఘనంగా కిడ్స్ అథ్లెటిక్స్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని సింథటిక్స్ అథ్లెటిక్స్ ట్రాక్‌లో కిడ్స్ అథ్లెటిక్స్ డే–2025ను ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగరానికి చెందిన 100 మంది చిన్నారులు పాల్గొన్నారు. చిన్నారుల్లో అథ్లెటిక్స్ పట్ల ఆసక్తిని పెంచేందుకు 4–7, 8–11, 12–14 వయస్సు గల బాల బాలికలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, శుక్రవారం 9, మే, 2025



స్ట్రీట్ వేర్.. షీక్ స్టైల్..

సాక్షి, సిటీబ్యూరో : ఫ్యాషన్ ప్రపంచంలో స్ట్రీట్ వేర్‌కు తనకంటూ ఓ స్టైల్ ఉంది.. ప్రముఖ బ్రాండ్స్ తమదైన శైలిలో వీటిని డిజైన్ చేసి యూత్‌ని ఆకట్టుకుంటుంటాయి.. అదే క్రమంలో ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ షీక్ తమ స్ట్రీట్ వేర్‌ను నగరంలో ప్రదర్శించింది. మాదాపూర్‌లోని నోవోటెల్ హోటల్‌లో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది.. ఈ సందర్భంగా బ్రాండ్‌ను సిటీలో లాంచ్ చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.



ఐపీఎల్ క్రికెటర్ @ ఐవేర్..

సాక్షి, సిటీబ్యూరో : అగ్రగామి క్రికెటర్, సన్ రైజర్స్ హైదరాబాద్ టీమ్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ నగరంలో సందడి చేశాడు. అభిమానులకు ఆటోగ్రాఫ్‌లు, షేక్ హ్యాండ్స్ ఇస్తూ వారిని అలరించాడు. నగరంలోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లోని ఐవేర్ బ్రాండ్ అయిన ఎఓ ఆప్టికల్స్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో క్రికెట్ స్టార్ పాట్ కమ్మిన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాండ్ రూపొందించిన సరికొత్త కళ్లజోళ్ల కలెక్షన్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాండ్ డైరెక్టర్ ప్రియాంక గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్న్‌షిప్‌తో కెరీర్‌కు ఊతం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని కేఎల్‌హెచ్ డీమ్డ్ యూనివర్సిటీ, అజీజ్ నగర్ క్యాంపస్, తమ విద్యార్థులు ప్రముఖ బహుళ జాతి సంస్థలు (ఎంఎన్‌సీలు) సహా ప్రఖ్యాత కంపెనీల నుంచి పెద్ద సంఖ్యలో ప్లేస్‌మెంట్ ఆఫర్లు పొందారు. ఈ విషయాన్ని యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ హవిష్ తెలిపారు. పలు సంస్థల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఆధారిత ఉద్యోగాలు లభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కెరీర్‌కు ఎంతో మేలు చేస్తాయని, పెద్ద సంఖ్యలో తమ విద్యార్థులు ఒప్పో వంటి సంస్థల్లో ఇంటర్న్‌షిప్ టూ ప్లేస్‌మెంట్స్ ఆఫర్స్ ద్వారా రూ.19లక్షల ప్యాకేజీ దక్కించుకోనున్నారని వెల్లడించారు. మరికొందరు విద్యార్థులు సీమన్స్ సంస్థ నుంచి నేరుగా ప్లేస్‌మెంట్ ఆఫర్స్ దక్కించుకున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

క్వాలిజీల్‌తో నిర్మాణ్ భాగస్వామ్యం

పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ



సాక్షి, సిటీబ్యూరో: ఏఐ ఆధారిత ఆధునిక నాణ్యత ఇంజినీరింగ్ డిజిటల్ సొల్యూషన్స్‌కు పేరొందిన క్వాలిజీల్ సంస్థ, ప్రముఖ ఎన్‌జీఓ నిర్మాణ్ విద్యా వ్యాప్తికి చేతులు కలిపాయి. ఈ భాగస్వామ్యంతో తొలి కార్యక్రమంలో భాగంగా, నగరంలోని పేద యువతకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. అమీర్‌పేట్‌లోని నిర్మాణ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో క్వాలిజీల్ సహ వ్యవస్థాపకుడు మధుమూర్తి రోణంకి మాట్లాడుతూ ఉన్నత, వెనుకబడిన సమాజాల్లోని వ్యక్తుల మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గించడం, వారి విద్య, వృత్తిపరమైన అవసరాలకు సాంకేతికతను అందించడం తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం లక్ష్యంగా తెలిపారు. ఎదుగుదలలో సాంకేతికత ఒక అవరోధంగా కాకుండా అనుసంధానంగా ఉండాలని తాము కోరుకుంటున్నామన్నారు. నిర్మాణ్ నిర్వాహకులు నిఖిల్ గంపా మాట్లాడుతూ ఇది ఒక విరాళంగా చూడకూడదని, యువత సామర్థ్యం పై పెట్టుబడిగా చూడాలని పేర్కొన్నారు.



ప్రస్తుతం ప్రపంచమంతా హైదరాబాద్ నగరం వైపే చూస్తోంది. దాదాపు 120 దేశాలకు పైగా ఆయా దేశ అధికార ప్రతినిధులు, ప్రముఖులు నగరానికి గగనతల ప్రయాణం చేస్తున్నారు. నగర వేదికగా ప్రతిష్టాత్మక 72వ మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో నగరంలోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రతి రోజూ వివిధ దేశాలకు చెందిన సుందరీమణులతో కళకళలాడుతోంది. అయితే రేపటి నుంచి ప్రారంభం కానున్న ప్రపంచ సుందరి పోటీల నేపథ్యంలో నగరంతో పాటు దేశంలోని అన్ని ప్రముఖ నగరాల్లోనూ ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ పోటీల్లో పాల్గొనే 109 దేశాలకు చెందిన పోటీదారులు ఇప్పటికే నగరానికి చేరుకోగా మరికొన్ని దేశాలకు చెందిన వారు శుక్రవారం రానున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

అందరి చూపు.. భాగ్యనగరం వైపు..

రేపటి నుంచి ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలు

- ఇప్పటికే నగరానికి చేరుకున్న 109 దేశాల సుందరీమణులు
- విమానాశ్రయంలో నెలకొన్న పండుగ వాతావరణం
- ఇప్పటికే ప్రీ ట్రయల్స్‌లో భాగస్వాములైన పోటీదారులు
- నగరంతో పాటు చెన్నై, ముంబై, ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌ల్లో డిజిటల్ వెల్‌కమ్
- ప్రత్యేక ఆకర్షణగా అథెనా క్రాస్బీ, ఎమ్మా మోరిసన్, నందిని గుప్తా



ప్రపంచ అందాల పోటీలకు హైదరాబాద్ ఘన వేదికగా మారిన విషయం విదితమే.. ఇందులో పాల్గొనే సుందరీమణులు ఇప్పటికే ప్రీ ట్రయల్స్‌లో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నందిని గుప్తాతో పాటు, అథెనా క్రాస్బీ (అమెరికా), ఎమ్మా మోరిసన్ (కెనడా), వాలేరియా కాన్యావో (వెనిజులా) వంటి తారలు మిస్ వరల్డ్ వేదిక పై ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారు. అంతేకాకుండా అమెరికా, దక్షిణాఫ్రికా, వెనిజులా వంటి ప్రముఖ దేశాలతో పాటు గ్వాడలూప్, గిబ్రాల్టర్, మార్టినిక్, క్యురాకావ్ వంటి చిన్న దేశాల నుంచి కూడా 72వ మిస్ వరల్డ్ పోటీల్లో అభ్యర్థులు పాల్గొనుండడం విశేషం. ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో వరల్డ్ టాప్ మోడల్స్‌తో పాటు విద్యార్థులు, డాక్టర్లు, న్యాయవాదులు, సామాజిక వేత్తలు, ఆర్టిస్టులు, విభిన్న రంగాలకు చెందిన ఉద్యమకారులు తమ దేశాల తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ పోటీపడుతుండటం మరో విశేషం.





దేశవ్యాప్తంగా డిజిటల్ వెల్‌కమ్..

పోటీదారులు దాదాపు నెల రోజులపాటు తెలంగాణలో పర్యాటక, సాంస్కృతిక, వైద్య, చేనేత, ఆవిష్కరణ కేంద్రాలను సందర్శించనున్నారు. గతేడాది ముంబయిలో మిస్ వరల్డ్ ఈవెంట్ జరగగా, ఈ ఏడాది మే 31న హైదరాబాద్, హైటెక్స్ వేదికగా గ్రాండ్ ఫినాలే జరగనుంది. మిస్ వరల్డ్ పోటీలను వరుసగా రెండేళ్ల పాటు భారత్‌లో నిర్వహించడం తొలిసారి. ఈ అరుదైన గౌరవం దేశానికి మాత్రమే కాదు, తెలంగాణకు కూడా విశ్వవేదికపై విశిష్ట గుర్తింపునిస్తుంది. ఈ విశిష్ట కార్యక్రమానికి సంబంధించి దేశ రాజధాని ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు చెందిన అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ వెల్‌కమ్ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ పోటీలను తిలకించడానికి సామాన్యులకు సైతం ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం రావడంతో వివిధ నగరాల నుంచి ఫ్యాషన్ ఔత్సాహికులు నగరానికి రావడానికి సన్నద్ధమవుతున్నారు.





స్వాగతం ఘనం..

నగరంలో ఈ నెల 10 జరగనున్న ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు గురువారం మరో 12 దేశాలకు చెందిన పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నారు. ఇందులో కంబోడియా, లెబనాన్, చైనా, గ్రీస్, టునిషియా, డెన్మార్క్, సింగపూర్, లాత్వియా, కజకిస్తాన్, నార్త్ మెకడోనియా, ఈఎల్ సల్వాడోర్, ఉంగాండా, పనామా, ఈక్విటోరియల్ గినీయా, సెనెగల్, బంగ్లాదేశ్‌కు చెందిన పోటీదారులు ఉన్నారు. వీరికి ఎయిర్‌పోర్టులో పర్యాటక శాఖ ఘనంగా స్వాగతం పలికింది.

– శంషాబాద్

మినీ ఆఫ్రికా @ టోలిచౌకీ

ఆఫ్రికాను తలపిస్తున్న పారామౌంట్ కాలనీ

- కాలనీలో సొమాలియా, సూడాన్ వాసుల నివాసం
- అక్కడి వంటకాలు, రుచులతో స్థానిక రెస్టారెంట్లు
- సూడాన్, సొమాలియా భాషలు నేర్చుకుంటున్న స్థానికులు



గోల్కొండ : టోలిచౌకీని ఆనుకుని ఉన్న పారామౌంట్ కాలనీ మినీ ఆఫ్రికాను తలపిస్తుంది. అధునాతన నివాస గృహాలు ఎత్తయిన ప్రదేశంలో ఉన్న ఈ కాలనీ ప్రస్తుతం సూడాన్, సొమాలియా వాసుల అడ్డాగా పేరు గాంచింది. ఇక్కడ ఉంటున్న వారిలో 90 శాతం మంది మినీ ఆఫ్రికాకు చెందిన వారే. ప్రశాంత వాతావరణంలో ఉండడంతో పాటు ఫిలింనగర్, జూబ్లీహిల్స్, టోలిచౌకీ చౌరస్తా తదితర ప్రదేశాలకు అత్యంత సమీపంలో ఉన్న పారామౌంట్ కాలనీ ఆఫ్రికా దేశాలకు చెందిన విద్యార్థులకు అడ్డాగా నిలుస్తోంది. పదేళ్ల క్రితం స్థానికులతో నిండి ఉన్న ఈ కాలనీ నేడు ఆఫ్రికా దేశస్తులతో నిండివుంది. కొత్తగా నిర్మితమవుతున్న భవనాలను సైతం సూడాన్, సొమాలియా దేశాలకు చెందిన విద్యార్థులు అద్దెకు ముందుగానే బుక్ చేసుకుంటున్నారు. గతంలో ఇక్కడ ఉన్న ఇరానీ రెస్టారెంట్లు, చిన్న చిన్న కిరాణా దుకాణాలు మాయమై వాటి స్థానంలో అత్యాధునిక ఆఫ్రికన్ కిచెన్‌లు వెలిశాయి.

ఆఫ్రికన్ తరహా జీవనశైలి..

టీ సెంటర్లలో సైతం అరేబియన్ టీ అందుబాటులో ఉంటుంది. ఇక్కడి షాపులు ఆఫ్రికన్ దేశాల వారికి అవసరమయ్యేవే ఎక్కువగా లభిస్తున్నాయి. రేడీమేడ్ షాపుల్లో సైతం సూడాన్ యువకులు ఇష్టపడి తొడిగే టీషర్ట్స్ మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. ఆఫ్రికన్ దేశాల నుంచి విద్యాభ్యాసం కోసం వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు సైతం పలు కారణాలతో ఇక్కడకు వస్తున్నారు. ఒక సూడానీస్‌తో పాటు అదనంగా ఇద్దరు ముగ్గురు వారి కుటుంబ సభ్యులు ఒక్కో ఫ్లాట్‌లో ఉంటున్నారు. దీంతో స్థానికులు, వ్యాపారులు సైతం నెమ్మదిగా ఇంగ్లిష్‌తో పాటు సూడానీస్, సొమాలియా భాషను నేర్చుకుంటున్నారు.



యువర్స్

● యంగ్ టాలెంట్



చాలామంది పిల్లలకు అంకెలను చూస్తే....
'అమ్మో!' అనుకునేంత భయం. కానీ ఆర్యన్ నితిన్ శుక్లా అలా కాదు.
చాలా చిన్న వయసులోనే అంకెలకు 'లవ్ యూ' చెప్పాడు.
పేపర్ ఉపయోగించకుండా మనసులోనే లెక్కలు చేసేవాడు.
అంకెలపై అబ్బాయికి ఉన్న ఆసక్తిని గమనించిన పేరెంట్స్ ప్రోత్సహించారు.
ఆర్యన్ ప్రతిభకు మెరుగు పెట్టారు.
ఫలితం... ఇప్పుడు పద్నాలుగు సంవత్సరాల ఆర్యన్ శుక్లా
'హ్యూమన్ క్యాలిక్యులేటర్'గా పేరు తెచ్చుకున్నాడు...

అంకెల మాంత్రికుడు

● ఒకేరోజు ఆరు గిన్నిస్ రికార్డులు బ్రేక్ చేశాడు

తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లాలో ఒక హైస్కూల్... పదిమంది విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు టీచర్. ఆ విద్యార్థులకు 'మ్యాథ్స్' అనే మాట వినబడగానే ముచ్చెమటలు పోస్తాయి.

'ఈరోజు మీకు ఒక అబ్బాయి గురించి చెబుతాను' అంటూ 'హ్యూమన్ క్యాలిక్యులేటర్ ఆర్యన్ శుక్లా' అద్భుతాల గురించి వివరంగా చెప్పారు.

'ఆర్యన్ మీలాంటి స్టూడెంటే. తేడా ఏమిటంటే...అతడికి అంకెలు అంటే ఇష్టం. మీకు భయం. ఆసక్తి అనేది ప్రతిభకు మొదటి మెట్టు. మ్యాథ్స్‌పై మీకు ఆసక్తి ఉంటే భయం ఉండదు. ఇష్టం పెరుగుతుంది' అని చెప్పారు టీచర్.

ఆయన మాటలు పిల్లల్లో మార్పు తెచ్చాయి. వారికి ఇప్పుడు 'మ్యాథ్స్' అంటే భయం కాదు. అమితమైన ఇష్టం. 'ఆర్యన్ శుక్లా' అనేది 'మ్యాథ్స్'పై భయాన్ని పోగొట్టే తారకమంత్రం అయింది!

మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన ఆర్యన్‌కు రికార్డ్‌లు బ్రేక్ చేయడం కొత్తేమీ కాదు. పన్నెండు సంవత్సరాల వయసులోనే 'మెంటల్ క్యాలిక్యులేషన్ వరల్డ్ కప్' గెల్చుకొని అందరి దృష్టిని ఆకర్షించాడు. గత సంవత్సరం కూడా 'మెంటల్ క్యాలిక్యులేషన్ వరల్డ్ కప్'ను గెల్చుకున్నాడు.

ఈ సంవత్సరం దుబాయ్‌లో జరిగిన మెంటల్ మ్యాథ్స్ పోటీలో పద్నాలుగు సంవత్సరాల ఆర్యన్ శుక్లా ఒకేరోజు ఆరు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌ను బ్రేక్ చేశాడు.

ఆరు సంవత్సరాల వయసులో 'మెంటల్ మ్యాథమెటిక్స్'లో ఆర్యన్ ప్రయాణం ప్రారంభించాడు.

గ్లోబల్ మెంటల్ క్యాలిక్యులేటర్ అసోసియేషన్(జీఎంసీఏ) ఫౌండింగ్ బోర్డ్ మెంబర్స్‌లో ఆర్యన్ కూడా ఒకరు.

'నీ విజయరహస్యం ఏమిటి?' అని పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా అడిగిన ప్రశ్నకు 'ఫ్లాష్ అన్జాన్' అని చెప్పాడు ఆర్యన్. ఈ టెక్నిక్‌లో ప్రావీణ్యం సంపాదించడానికి అతడికి ఎనిమిది సంవత్సరాలు పట్టింది.

ఫ్లాష్ అన్జాన్

'ఫ్లాష్ అన్జాన్' అనేది సూపర్-ఫాస్ట్ మెంటల్ మ్యాథ్స్ టెక్నిక్. జపనీస్ అబకస్ ఆధారంగా రూపొందించారు. ఈ టెక్నిక్‌లో మనసులో సంఖ్యలను విజువలైజ్ చేస్తారు. మెదడు ఒకేసారి మల్టీపుల్ నెంబర్స్‌ను హ్యాండిల్ చేసేలా ఈ టెక్నిక్ ట్రైన్ చేస్తుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ప్రాసెసింగ్ స్పీడ్‌ను పెంచుతుంది. 'ఫ్లాష్ అన్జాన్' కేవలం స్పీడ్‌కు సంబంధించి మాత్రమే కాదు ఖచ్చితత్వం గురించి కూడా. కుడి మెదడుకు శిక్షణ ఇచ్చే శక్తివంతమైన సాధనం. జ్ఞాపకశక్తి, ప్రాసెసింగ్ స్పీడ్, ఏకాగ్రతను బలోపేతం చేయడంలో 'ఫ్లాష్ అన్జాన్' కీలక పాత్ర పోషిస్తుంది.

అంకెల ప్రపంచంలో...

ప్రతిరోజు అయిదు నుంచి ఆరుగంటల వరకు ప్రాక్టిస్ చేస్తాను. పోటీలో ఒత్తిడిని తట్టుకోవడానికి యోగా, ధ్యానం బాగా ఉపయోగపడతాయి. మ్యాథ్స్ అంటే అంకెలు మాత్రమే కాదు. అంతులేని ఉత్సాహం, మెదడుకు ఎప్పుడూ పదును పెట్టడం, జ్ఞాపకశక్తిని పెంచుకోడం. అంకెల ప్రపంచంలో అద్భుతాలు ఉన్నాయి.

- ఆర్యన్ శుక్లా

● గేమింగ్

అణువణువూ ఆయుధమై!

కొత్త ఆయుధాలు... కొత్త శత్రువులు... కొత్త ప్రమాదాలు... అంతా కొత్తే... అయినా తిరుగులేని ఆయుధం ఒకటి ఉంది. దాని పేరు ధైర్యం. ఆ ధైర్యం మీలో ఉందా?

అయితే 'డూమ్: ది డార్క్ ఏజెస్' మీకు స్వాగతం పలుకుతుంది. ఫస్ట్-పర్సన్ షూటర్ గేమ్ 'డూమ్: ది డార్క్ ఏజెస్' ఈ నెల 15న విడుదల కానుంది. డూమ్(2016)కు ఇది ప్రీక్వెల్‌గా వస్తోంది. గత గేమ్స్ డూమ్(2016), డూమ్ ఎటెర్నల్(2020) ఆక్రోబాటిక్ కంబాట్ మీద దృష్టి పెట్టాయి. తాజా గేమ్ భారీ గ్రౌండెడ్ కంబాట్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుంది.

యుద్ధం కోసం స్లో-మోషన్ గ్లోరీ కిల్ ఫీచర్‌లు ఉన్నాయి. 'స్కల్ క్రషర్'లాంటి కొత్త వెపన్స్ ఉన్నాయి.

సైబర్‌మెటిక్ డ్రాగన్స్, 30 అంతస్తుల అట్లాస్ మెచ్ వంటి వాహనాలను పైలట్ చేయడానికి ప్లేయర్స్‌ను అనుమతించే సిరీస్‌లో ఈ గేమ్ మొదటిది. 'ఈ గేమ్‌లో మీరు ఇనుప ట్యాంకులా దృఢంగ ఉంటారు' అంటున్నాడు గేమ్ డైరెక్టర్ హ్యూగో మార్టిన్.

సిరీస్: డూమ్
ఇంజిన్: ఐడీ టెక్ 8
ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్: ఫస్ట్-పర్సన్ షూటర్
మోడ్: సింగిల్-ప్లేయర్



● అవును....ఇది నిజమే!



● మాయాన్ ప్రజలు చాక్లెట్లను (కోకో బీన్స్) తినడానికే కాదు డబ్బుగా కూడా వాడుకునేవారు! వస్తువులను కొనడానికి, సేవల కోసం చాక్లెట్ కరెన్సీని ఉపయోగించేవారు.

● 'వైట్ షార్క్' అనేది రహస్యమైన మధ్య-పసిఫిక్ ప్రాంతం. ఇక్కడ తెల్లని షార్క్‌లు సమావేశం అవుతాయి. హవాయి, బాజా కాలిఫోర్నియాల మధ్య ఉన్న ఈ ప్రాంతం కొన్నేళ్లుగా శాస్త్రవేత్తలను ఆకర్షిస్తోంది. వేలాది మైళ్ల నుంచి సొరచేపలు ఈ ప్రాంతానికి వస్తాయి. అవి ఇక్కడికి రావడానికి ఎందుకు అంత ఆసక్తి చూపిస్తున్నాయి? అనేదాని గురించి శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు.

● నక్షత్రాలు ఉన్న దేశ జాతీయ జెండాల విషయానికి వస్తే...59 దేశాల జెండాలపై నక్షత్రాలు ఉన్నాయి.

● టెక్... టాక్



గూగుల్ సెర్చ్‌లో ఏఐ మోడ్

గూగుల్ సెర్చ్‌లోని కొత్త 'ఏఐ మోడ్' యూజర్‌లు సెర్చ్‌లో అడిగే ప్రశ్నలకు ఏఐ జనరేటెడ్ రెస్పాన్స్ ఇస్తుంది. ఈ సమాచారం గూగుల్ సెర్చ్ ఇండెక్స్ నుంచి తీసుకోబడుతుంది. ప్రస్తుతం ఇది అమెరికాలో పరిమిత యూజర్‌లకు అందుబాటులో ఉంది. యూజర్‌ల ప్రశ్నల ఆధారంగా వెబ్‌సైట్‌ల లింక్‌లను అందించే సంప్రదాయ సెర్చ్ ఇంజిన్‌లకు 'ఏఐ మోడ్' భిన్నమైనది. 'ఏఐ మోడ్'లో కొత్త ఫీచర్‌లు వస్తున్నట్లు గూగుల్ ప్రకటించింది. ఏఐ సెర్చ్ ఇంజిన్‌లోని లెఫ్ట్‌సైడ్ ప్యానెల్‌లో యూజర్‌లు తమ సెర్చ్ టాపిక్స్‌ను యాక్సెస్ చేసుకోవచ్చు. ఫాలో-అప్ ప్రశ్నలు అడగవచ్చు.

త్వరలో 'ఏఐ మోడ్'లో విజువల్ ప్లేస్ అండ్ ప్రొడక్ట్ కార్డులను కూడా విడుదల చేయనున్నారు. రెస్టారెంట్లు, సెలూన్లు, దుకాణాలు... మొదలైన వాటి గురించి మరింత వివరంగా తెలుసుకోవడానికి ఇది యూజర్‌లకు ఉపయోగపడుతుంది. ఈ ప్లేస్, ప్రొడక్ట్ కార్డులలో రేటింగ్స్, రివ్యూలు, లోకల్ స్పాట్స్ ఓపెనింగ్ అవర్స్, షాపింగ్ ప్రొడక్ట్ ప్రమోషనల్ వివరాలు ఉంటాయి.

గూగుల్ పిక్సెల్ 9 ఏ



డిస్‌ప్లే: 6.30 అంగుళాలు
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
రిజల్యూషన్: 1080x2424 పిక్సెల్స్
మెమోరీ 128జీబి 8జీబి ర్యామ్/ 256 జీబి 8జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 15
బరువు: 186 గ్రా.

వాల్‌వ్యూ టెక్ మౌంట్ (మల్టీపర్పస్ వాల్ హోల్డర్)



బ్రాండ్: వాల్ మౌంట్
కలర్: పింక్
షెల్ఫ్స్: 5
డైమెన్షన్స్: 90డీ x 40 డబ్ల్యూ x 90 హెచ్ మిల్లీమీటర్స్
బరువు: 130 గ్రా.

యూట్యూబ్‌లో త్వరలో...



క్రియేటర్‌ల కోసం ఆకర్షణీయమైన, ఇంటరాక్టిక్ షార్ట్-ఫామ్ వీడియో కంటెంట్‌ను రూపొందించడంలో సహాయపడే కొత్త ఫీచర్‌లపై యూట్యూబ్ దృష్టి పెట్టింది. సోషల్ మీడియా యూజర్‌ల అటెన్షన్ స్పాన్ తగ్గిపోవడంతో వినూత్న సాధనాలను ప్రవేశపెడుతోంది యూట్యూబ్. 'షార్ట్స్' క్రియేట్ చేయడం సులభతరం చేయడానికి గూగుల్‌కు చెందిన 'డీప్ మైండ్' అభివృద్ధి చేసిన కొత్త ఏఐ ఆధారిత టూల్స్ ఇందులో ఉన్నాయి. కంటెంట్‌కు క్రియేటివ్ టచ్ ఇవ్వడానికి ఈ ఏఐ టూల్స్ యూజర్‌లకు ఉపయోగపడతాయి. ఇంతకు ముందు యూట్యూబ్ 'వీయో'ను పరిచయం చేసింది. టెక్స్ట్ ప్రాంప్ట్స్ ఇవ్వడం ద్వారా 'షార్ట్స్'కు గ్రీన్-స్క్రీన్ బ్యాక్‌గ్రౌండ్‌ను జోడించడానికి ఇది ఉపయోగపడుతుంది. 'వీయో 2'ను కూడా లాంచ్ చేశారు. ఆరు సెకన్ల వీడియో క్లిప్‌ను క్రియేట్ చేయడానికి ఇది యూజర్‌లకు ఉపయోగపడుతుంది. సింథ్ ఐడీని ఉపయోగించి ఈ క్రియేషన్‌ను వాటర్ మార్క్ చేస్తామని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో జనరేట్ అయిన విషయాన్ని ప్రేక్షకులకు స్పష్టంగా తెలియజేసే లేబుల్ ఉంటుంది అని యూట్యూబ్ తెలిపింది. యూట్యూబ్‌లో రాబోయే కొత్త ఫీచర్‌లు: ● ఇంప్రూవ్‌డ్ వీడియో ఎడిటర్ ● ఫోటోస్ ఇన్ టెంప్‌లెట్స్ ● ఇమేజ్ స్టిక్కర్స్ ● ఆల్ స్టిక్కర్స్

సాక్షి సినిమా

ప్రేమ కబుర్లు?



● రష్మికా మందన్నా, ధనుష్

ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'కుబేర'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌వీసీ ఎల్‌ఎల్‌పీ పతాకంపై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్‌రావు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది జూన్ 20న విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి ధనుష్, రష్మిక మాట్లాడుకుంటున్న ఓ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ధనుష్, రష్మిక చిరునవ్వులు చిందిస్తూ, ఏవో ప్రేమ కబుర్లు చెప్పుకుంటున్నట్లుగా ఈ పోస్టర్ ఉంది. తమిళ్, తెలుగు,హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాకు సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

కాన్స్‌కు బెంగాలీ ఫిల్మ్ అరణ్యేర్ దిన్ రాత్రి

- 'కాన్స్ క్లాసికల్ సెక్షన్' విభాగంలో ప్రదర్శన



● 'అరణ్యేర్ దిన్ రాత్రి' సినిమా సెట్స్‌లో సత్యజిత్ రే



● 'అరణ్యేర్ దిన్ రాత్రి'లో సౌమిత్ర ఛటర్జీ, షర్మిలా ఠాగూర్

భారతీయ ప్రముఖ దివంగత దర్శకులు సత్యజిత్ రే ఐకానిక్ బెంగాలీ ఫిల్మ్ 'అరణ్యేర్ దిన్ రాత్రి' (1970) కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితం కానుంది. ఫ్రాన్స్‌లో ఈ నెల 13 నుంచి 24 వరకు 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రోత్సవాల తొలి రోజున 'కాన్స్ క్లాసికల్ సెక్షన్' విభాగంలో 'అరణ్యేర్ దిన్ రాత్రి' సినిమా స్క్రీనింగ్ కానుంది. సునీల్ గంగోపాధ్యాయ రాసిన 'అరణ్యేర్ దిన్ రాత్రి' నవలను అదే పేరుతో సత్యజిత్ రే సినిమాగా తెరకెక్కించారు. ఈ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామా చిత్రం 1970 జనవరి 16న ఇండియాలో విడుదల కాగా, 1973 మార్చి 14న యూఎస్‌లో (ఇంగ్లిష్‌లో 'డేస్ అండ్ నైట్స్ ఇన్ ది ఫారెస్ట్') విడుదలైంది. సౌమిత్రా ఛటర్జీ, సుభాష్ ఛటర్జీ, సమిత్ భంజా, రబీ ఘోష్, షర్మిలా ఠాగూర్, కబీర్ బోస్, అపర్ణ సేన్ ఈ సినిమాలోని ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా కాన్స్ చిత్రోత్సవాల్లో ప్రదర్శనకు ఎంపికైనట్లుగా కాన్స్ ప్రతినిధులు అధికారికంగా వెల్లడించారు. ఇందుకోసం ఈ చిత్రాన్ని 4కే రెజల్యూషన్‌లో రీస్టోర్ చేశారు. ది ఫిల్మ్ ఫౌండేషన్స్ వరల్డ్ సినిమా ప్రాజెక్ట్, ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, ది క్రైటీరియన్ కలెక్షన్స్ జానస్ ఫిల్మ్స్‌ల ఆధ్వర్యంలో 'అరణ్యేర్ దిన్ రాత్రి' సినిమా 4కే రెజల్యూషన్‌లో రీ స్టోర్ చేయడం జరిగింది. ఈ చిత్రనిర్మాత పూర్ణిమా దత్తా దగ్గర ఉన్న ఈ సినిమా ఒరిజినల్ కెమెరా, సౌండ్ నెగటివ్‌ల సాయంతో ఈ సినిమా 4కే రెజల్యూషన్ వీలుపడింది. గోల్డెన్ గ్లోబ్ ఫౌండేషన్ ఫండింగ్ చేసింది. దర్శకులు మార్టిన్ స్కోర్సెస్, వెస్‌అండర్సన్ 'అరణ్యేర్ దిన్ రాత్రి' సినిమాను 4కే రెజల్యూషన్‌లో రూపొందించడానికి కీలక పాత్రలు పోషించారు.

సంతోషం... బాధ: సందీప్ రే

'అరణ్యేర్ దిన్ రాత్రి' సినిమా కాన్స్‌లో ప్రదర్శితం కానున్న సందర్భంగా సత్యజిత్ రే తనయుడు, దర్శకుడు-సంగీత దర్శకుడు సందీప్ రే స్పందించారు. ''ఈ రోజు నాకు చాలా సంతోషంగా ఉంది. అలాగే బాధగా కూడా ఉంది. 'కాన్స్'లో సినిమా ప్రదర్శితం కానున్నందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమాలోని నటీనటుల్లో చాలా మంది ఇప్పుడు జీవించి లేకపోవడం బాధగా ఉంది. అంతర్జాతీయ స్థాయిలో ఈ సినిమా తీయాలని నాన్నగారు అనుకోలేదు. అంతర్జాతీయ స్థాయిలో ఆయన సినిమాలు ఉన్నాయని వారు తెలుసుకున్నారు. 'పథేర్ పాంచాలి' సినిమా విషయంలోనూ ఇదే జరిగింది'' అని పేర్కొన్నారు.

కాన్స్ ఫెస్టివల్‌కు పూర్ణిమ... షర్మిల

ఇక ఈ సినిమా కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శన కానున్న సందర్భంగా ఈ చిత్ర నిర్మాత పూర్ణిమా దత్తా, ఈ చిత్రంలో నటించిన షర్మిలా ఠాగూర్ హాజరు కానున్నారు. ఈ చిత్రంలో నటించిన మరో నటి సిమీ గరేవాల్‌కు ఆహ్వానం అందినప్పటికీ అనారోగ్యం కారణంగా ఆమె హాజరు కాలేకపోతున్నారట. ఇక ఈ 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు భారతదేశం తరఫున ఎంపికైన ఏకైక చిత్రం 'హోమ్‌బౌండ్'. జాన్వీ కపూర్, ఇషాన్ కట్టర్ లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకు హైదరాబాదీ వ్యక్తి నీరజ్ దర్శకత్వం వహించారు. 'అన్‌సర్టైన్ రిగార్డ్' విభాగంలో 'హోమ్‌బౌండ్' చిత్రం పోటీ పడుతోంది.

నిజ జీవితాల ఆధారంగా...



● 'గేమ్ ఆఫ్ చేంజ్' పోస్టర్

నలందా విశ్వవిద్యాలయం నేపథ్యంలో (5వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం) భారతదేశంలో జరిగిన కొన్ని నిజ జీవిత కథనాలతో రూపొందిన చిత్రం 'గేమ్ ఆఫ్ చేంజ్'. బ్లెయిర్ సింగర్, సిద్ధార్థ్ రాజశేఖర్, సురేంద్రన్ జయ శేఖర్, దినాజ్ వేర్వాట్వాల, ఆదిత్య, సోనియా శర్మ, గీతా మిక్కిలినేని, హరీష్, ప్రియాదావే ప్రధాన పాత్రల్లో నటించారు. మలయాళ దర్శకుడు సిధిన్ దర్శకత్వంలో సిద్ధార్థ్ రాజశేఖర్, మీనా చాబ్రియా నిర్మించిన ఈ చిత్రం మే 14న ప్రపంచ వ్యాప్తంగా వివిధ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సిధిన్ మాట్లాడుతూ- ''సాధారణమైన క్షణాలను అసాధారణమైన మార్పులుగా రేకెత్తించిన పలువురు వ్యక్తుల నిజ జీవిత కథనాలను మిళితం చేసి, రూపొందించిన చిత్రం ఇది'' అని తెలిపారు. ''నేను ఇంగ్లిష్‌లో రాసిన 'యు కెన్ కోచ్' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా అమ్ముడుపోయింది. ప్రస్తుతం సినిమాపై ఆసక్తితో 'గేమ్ ఆఫ్ చేంజ్' సినిమాతో నిర్మాతగా, నటుడిగా మారాను'' అని పేర్కొన్నారు సిద్ధార్థ్ రాజశేఖర్. ''గేమ్ ఆఫ్ చేంజ్' లాంటి సినిమా కథ ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకు రాలేదు. ప్రేక్షకుల్లో దేశభక్తిని ఉప్పొంగించే చిత్రం ఇది. ఈ నెల 14న ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్, తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తున్నాం'' అన్నారు.

భారత్‌లో పాకిస్తాన్ కంటెంట్‌ను నిలిపివేయాలి

- భారత సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్ణయం

కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది భారతీయ పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ దాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత ఆర్మీ మెరుపు దాడులు చేసింది. ఈ దాడుల్లో దాదాపు 80 మంది పాకిస్తాన్ ఉగ్రవాదులు హతమయ్యారు. కాగా 'ఆపరేషన్ సిందూర్' ఇంకా కొనసాగుతోందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. ప్రస్తుతం ఇండియా-పాకిస్తాన్ మధ్య నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పాకిస్తాన్ మూలాలున్న ఓటీటీ కంటెంట్‌ను పూర్తిగా నిలిపివేయాలని భారత సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు పలు సూచనలు జారీ చేస్తూ, ఓ ప్రకటన విడుదల చేసింది.''జాతీయ భద్రతని దృష్టిలో పెట్టుకుని పాకిస్తాన్ మూలాలున్న ఓటీటీ కంటెంట్, మీడియా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్, ఓటీటీ వేదికలు, మధ్యవర్తిత్వం ద్వారా అయ్యే ప్రసారాలని పూర్తిగా నిలిపివేస్తున్నాం. పాక్ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, పాడ్‌కాస్ట్‌లు, పాటలు సహా మీడియా కంటెంట్ ఏదీ ఇక ఇండియాలో అందుబాటులో ఉండదు. సబ్‌స్క్రిప్షన్‌తో పాటు ఇతర మార్గాల ద్వారా ఆ కంటెంట్ పొందుతున్న వారికీ ఇందులో ఏ మినహాయింపు లేదు. అదే విధంగా ఓటీటీలు కూడా పాకిస్తాన్ కంటెంట్‌ను ఇండియాలో స్ట్రీమింగ్ చేయడానికి వీలు లేదు'' అన్నది ఆ ప్రకటన సారాంశం.

శత్రువులు ఎక్కడో ఉండరు



● మాస్టర్ మహేంద్రన్, చైత్ర

మాస్టర్ మహేంద్రన్, బ్రహ్మాజీ, శత్రు, చైత్ర ప్రధాన పాత్రల్లో నటించిన క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అండ్ థ్రిల్లర్ సినిమా ఫిల్మ్ 'కర్మణ్యే వాధికారస్తే'. అమర్ దీప్ చల్లపల్లి దర్శకత్వంలో డీఎస్ఎస్ దుర్గా ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో మాస్టర్ మహేంద్ర మాట్లాడుతూ- ''నాకు సినిమా తప్ప ఏమీ తెలియదు. కథపై ఉన్న నమ్మకంతో నిర్మాతగారు ఈ సినిమాను ముందుకు తీసుకెళ్తున్నారు. బ్రహ్మాజీగారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం సంతోషంగా ఉంది'' అని తెలిపారు. ''శత్రువులు ఎక్కడో ఉండరు. మన చుట్టూనే మన ఇంట్లోనే ఉంటారనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను రూపొందించారు. సినిమాలో థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. క్లైమాక్స్‌ను కొత్తగా డిజైన్ చేశారు'' అని తెలిపారు బ్రహ్మాజీ. ''ఈ సినిమా చేయడం కోసం చాలా కష్టపడ్డాం'' అన్నారు అమర్‌దీప్. ''చిన్న సినిమా అని కాకుండా మంచి కంటెంట్ ఉన్న సినిమాగా ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అని పేర్కొన్నారు నిర్మాత దుర్గా ప్రసాద్. ఈ చిత్రంలో నటించిన బెనర్జీ, అతిథిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్ట్ ప్రభు, నిర్మాత 'మధుర' శ్రీధర్ మాట్లాడారు.

సస్పెన్స్... హారర్



● యశ్విక, మంగపుత్ర

మంగపుత్ర హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వం వహిస్తున్న సస్పెన్స్ అండ్ హారర్ థ్రిల్లర్ సినిమా 'వృశ్చికం'. ఈ చిత్రంలో యశ్విక హీరోయిన్‌గా నటిస్తున్నారు. గంగాధర్ రెడ్డి సమర్పణలో శ్రీ ఆద్య నిర్మాణం బ్యానర్‌పై శివరామ్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నటుడు కోసూరి సుబ్రహ్మణ్యం కెమెరా స్విచ్చాన్ చేయగా, సుప్రీం కోర్టు అడ్వకేట్ హబీబ్ సుల్తానా క్లాప్ ఇచ్చారు. ఈ సన్నివేశానికి ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా మంగపుత్ర మాట్లాడుతూ- ''పదిహేనేళ్లుగా ఇండస్ట్రీలో ఉంటున్నాను. 'బాహుబలి 1, బాహుబలి 2' చిత్రాల్లో నటించాను. రాజమౌళిగారికి ఏకలవ్య శిష్యుడిగా మారాను. 'వృశ్చికం' సినిమాలో హీరోగా నటిస్తూ, దర్శకుడిగా మారుతున్నాను. మూడు షెడ్యూల్స్‌లో 45 రోజుల్లో ఈ సినిమాను పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంలో నా క్యారెక్టర్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది'' అని పేర్కొన్నారు యశ్విక. ఈ కార్యక్రమంలో నటుడు కోసూరి సుబ్రహ్మణ్యం, నటి క్రాంతి బలివాడ, సంగీత దర్శకుడు ప్రమోద్, ఆర్ట్ డైరెక్టర్ సముద్రాల రవిచంద్ర మాట్లాడారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
9-5-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▽	412	80,335
నిఫ్టీ ▽	141	24,274

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	18,040	▲	301
డోజోన్స్	41,632	▲	518
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,532	▽	28
డాక్స్	23,353	▲	237
షాంఘై	3,352	▲	9
నికాయ్	36,929	▽	149

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.20	85.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	111.70	114.55
€	యూరో	ఎస్‌బీఐ	94.65	97.34
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.77	58.19
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.63	55.82
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.84	68.52
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.96	23.47
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.45	24.23
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.97	12.79

స్టార్‌లింక్ శాట్‌కామ్ వచ్చేస్తోంది..!

- సర్వీసుల ప్రారంభానికి సన్నాహాలు
- ఎంట్రీ ఫీజు చెల్లించాక తుది లైసెన్సు
- ఇప్పటికే ప్రాథమిక అనుమతులు జారీ



న్యూఢిల్లీ: భారత్‌లో శాటిలైట్ కమ్యూనికేషన్ (శాట్‌కామ్) సర్వీసులు ప్రారంభించే దిశగా తదుపరి పూర్తి చేయాల్సిన ప్రక్రియపై అమెరికన్ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ దృష్టి పెట్టనుంది. ఇప్పటికే టెలికం శాఖ (డాట్) నుంచి ప్రాథమిక అనుమతులు (లెటర్ ఆఫ్ ఇంటెంట్–ఎల్‌వోఐ) లభించడంతో, ఇక ఒప్పంద నియమాలను అంగీకరిస్తున్నట్లు కంపెనీ సంతకాలు చేయాల్సి ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అటుపైన నిర్దేశిత ఎంట్రీ ఫీజును చెల్లించాక తుది లైసెన్సు లభిస్తుందని పేర్కొన్నాయి. శాట్‌కామ్ స్పెక్ట్రం ధరను టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ సిఫార్సు చేసే ప్రక్రియ తుది దశలో ఉందని, ఎప్పుడైనా దీనిపై ప్రకటన వెలువడొచ్చని వివరించాయి. గ్లోబల్ మొబైల్ పర్సనల్ కమ్యూనికేషన్స్ బై శాటిలైట్ (జీఎంపీసీఎస్), ఐఎస్‌పీ, వీశాట్ సేవలకు సంబంధించి స్టార్‌లింక్‌నకు ఎల్‌వోఐ జారీ అయినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. డాట్ లైసెన్సుతో నెట్‌వర్క్‌ను నిర్మించుకోవడానికి స్టార్‌లింక్‌కు అనుమతులు లభించినా, కార్యకలాపాలు ప్రారంభించడానికి ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్–స్పేస్) ఆమోదం, ప్రభుత్వం నుంచి స్పెక్ట్రం అవసరమవుతుంది.

ఇప్పటికే వన్‌వెబ్, జియో శాటిలైట్‌కు లైసెన్స్..

ఇప్పటికే యూటెల్‌శాట్ వన్‌వెబ్, జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్ సంస్థలకు ఈ లైసెన్సులు వచ్చాయి. స్పెక్ట్రంను కేటాయించిన తర్వాత అవి సర్వీసులు ప్రారంభించనున్నాయి. భారత్‌లో లైసెన్సు కోసం కొన్నాళ్లుగా ప్రయత్నిస్తున్న స్టార్‌లింక్ ఈమధ్యే దేశీ టెలికం దిగ్గజాలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌తో ఒప్పందాలు కుదుర్చుకుంది. దీనితో భారత్‌లో తమ సొంత పంపిణీ, కస్టమర్ సర్వీస్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాల్సిన భారం లేకుండా, సంప్రదాయ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లోకి సేవలను విస్తరించే వీలు చిక్కుతుంది.

సుదూరంగా ఉండే జియోస్టేషనరీ ఉపగ్రహాలపై ఆధారపడే సాంప్రదాయ శాటిలైట్ సర్వీసులతో పోలిస్తే భూమికి కొంత సమీపంగా (550 కి.మీ. పైన) ఉండే 'లో ఎర్త్ ఆర్బిట్' (లియో) శాటిలైట్లను ఉపయోగిస్తుంది. ప్రస్తుతం ఇవి 7,000 ఉండగా, వీటి సంఖ్య 40,000కు పెరగనుంది.

కియా కొత్త ఎంపీవీ 'క్లావిస్'



న్యూఢిల్లీ: దక్షిణ కొరియా కార్ల దిగ్గజం కియా తాజాగా మల్టీ–పర్పస్ వాహనం క్యారెన్స్ పోర్ట్‌ఫోలియోలో క్లావిస్ మోడల్‌ను ఆవిష్కరించింది. ఇందులో ప్రీమియం ఫీచర్లతో పాటు మూడు వరుసల సీట్లు తదితర ప్రత్యేకతలు ఉంటాయి. దేశీయంగా ఎంపీవీ, ఎస్‌యూవీ సెవెన్ సీటర్ సెగ్మెంట్లను లక్ష్యంగా దీన్ని ప్రవేశపెడుతున్నట్లు కియా ఇండియా నేషనల్ హెడ్ (సేల్స్, మార్కెటింగ్) హర్‌దీప్ సింగ్ బ్రార్ తెలిపారు. దీనికి బుకింగ్స్ ప్రారంభించామని, ధరలను ఈ నెలాఖరులోగా ప్రకటిస్తామని చెప్పారు. కొత్త మోడల్ దన్నుతో ఈ ఏడాది క్యారెన్స్ పోర్ట్‌ఫోలియో విక్రయాలు 20–25 శాతం వృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నట్లు బ్రార్ పేర్కొన్నారు. గతేడాది 60,000 క్యారెన్స్ వాహనాలను విక్రయించినట్లు వివరించారు. క్లావిస్ ఎగుమతులకు సంబంధించి కుడి చేతి వైపు డ్రైవింగ్ అమల్లో ఉండే మార్కెట్లను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎల్‌అండ్‌టీ లాభం జూమ్



- క్యూ4లో రూ. 5,497 కోట్లు
- షేరుకి రూ. 34 డివిడెండ్

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్‌అండ్‌టీ) గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 25 శాతం జంప్‌చేసి రూ. 5,497 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 4,396 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 67,079 కోట్ల నుంచి రూ. 74,392 కోట్లకు ఎగసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 34 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఆర్డర్లు 24 శాతం వృద్ధితో రూ. 89,613 కోట్లుగా నమోదయ్యాయి. వీటిలో అంతర్జాతీయ ఆర్డర్లు రూ. 62,739 కోట్లు. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి 18 శాతం అధికంగా రూ. 3,56,631 కోట్ల విలువైన ఆర్డర్లు సాధించింది. వీటిలో అంతర్జాతీయ కాంట్రాక్టులు 58 శాతం జంప్‌చేసి రూ. 2,07,478 కోట్లను తాకాయి. గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆర్డర్లను అందుకున్నట్లు ఎల్‌అండ్‌టీ చైర్మన్, ఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ వెల్లడించారు. ఇక 2024–25లో నికర లాభం 15 శాతం ఎగసి రూ. 15,037 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 16 శాతం వృద్ధితో రూ. 2,55,734 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ షేరు బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 3,321 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఎఫ్ఎంసీజీ అమ్మకాల్లో వృద్ధి 5 శాతమే | రియల్టీకి డేటా సెంటర్స్ దన్ను

ఆఖర్లో అమ్మకాలు



- భారత్–పాక్ మధ్య యుద్ధ ఉద్రిక్తతల ప్రభావం
- బ్యాంకులు, ఆటో షేర్లలో విక్రయాలు
- సూచీలు అరశాతం డీలా

ముంబై: ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్–పాకిస్తాన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు మరింత తీవ్రతరమవడంతో స్టాక్ సూచీలు గురువారం అరశాతం నష్టపోయాయి. సెన్సెక్స్ 412 పాయింట్లు పతనమై 80,335 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 141 పాయింట్లు పతనమై 24,274 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాల్లో మొదలైన సూచీలు ప్రథమార్ధమంతా సానుకూలంగా ట్రేడయ్యాయి. భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా దాడులు చేసిన పాక్‌పై ప్రతీకార చర్యగా లాహోర్ గగనతల రక్షణ వ్యవస్థను నిర్వీర్యం చేసినట్లు భారత రక్షణ శాఖ ప్రకటనతో దలాల్ స్ట్రీట్ సెంటిమెంట్ ఒక్కసారిగా మారిపోయింది. ట్రేడింగ్ మరో గంటలో ముగుస్తుందనే సమయంలో ఎఫ్ఎంసీజీ, ఆటో, బ్యాంకింగ్ షేర్లలో భారీ విక్రయాలు తలెత్తాయి. ఒక దశలో సెన్సెక్స్ 759 పాయింట్లు క్షీణించి 79,988 వద్ద, నిఫ్టీ 264 పాయింట్లు కోల్పోయి 24,150 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. అమెరికాతో చైనా, తాజాగా బ్రిటన్ వాణిజ్య ఒప్పంద చర్చలు సఫలం అవ్వొచ్చనే అంచనాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. అమెరికా మార్కెట్లు భారీ లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- ఐటీ మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈలో రంగాల వారీగా సూచీల్లో రియల్టీ 2.6%, ఆయిల్‌అండ్‌గ్యాస్, ఆటో, విద్యుత్ 2% క్షీణించాయి.
- సూచీలు అరశాతం పతనంతో స్టాక్ మార్కెట్లో రూ.5 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే, బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.418.50 లక్షల కోట్లకు దిగి వచ్చింది.

రూపాయి రెండున్నరేళ్లలో అతిపెద్ద పతనం



భారత్ పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం వేళ రూపాయి విలువ భారీగా పడిపోయింది. డాలర్ మారకంలో ఏకంగా 81 పైసలు క్షీణించి 85.58 వద్ద స్థిరపడింది. 2022 సెప్టెంబర్ 22 (83 పైసలు క్షీణత) తర్వాత భారత కరెన్సీకిదే అత్యంత భారీ పతనం. అంతర్జాతీయంగా డాలర్ బలపడటం, క్రూడాయిల్ ధరలు పెరగడమూ మన కరెన్సీపై మరింత ఒత్తిడి పెంచాయని ఫారెక్స్ నిపుణులు తెలిపారు. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 84.61 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 84.52 వద్ద గరిష్టాన్ని, 85.77 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది.

కెనరా బ్యాంక్ లాభం అప్

క్యూ4లో రూ. 5,070 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం కెనరా బ్యాంక్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 28 శాతం జంప్‌చేసి రూ. 5,070 కోట్లను తాకింది. ప్రొవిజన్లు తగ్గడం, వడ్డీయేతర ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించాయని బ్యాంక్ ఎండీ, సీఈఓ కె. సత్యనారాయణ రాజు తెలిపారు. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 3,951 కోట్లు మాత్రమే ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) మాత్రం స్వల్ప వెనకడుగుతో రూ. 9,442 కోట్లకు పరిమితమైంది. నికర వడ్డీ మార్జిన్లు 0.25 శాతం నీరసించి 2.8 శాతానికి చేరాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.34% నుంచి 2.94 శాతానికి తగ్గాయి.

బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో 2 శాతం లాభంతో రూ. 95 వద్ద ముగిసింది.

మార్కెట్లకు సైబర్ దాడి ముప్పు

అప్రమత్తంగా ఉండాలని ఇన్వెస్టర్లు, బ్రోకర్లకు బీఎస్ఈ హెచ్చరిక



న్యూఢిల్లీ: దేశీ మార్కెట్లకు సైబర్ దాడుల ముప్పు పొంచి ఉందని మార్కెట్ వర్గాలను స్టాక్ ఎక్స్చేంజీ బీఎస్ఈ హెచ్చరించింది. రిస్కులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఒక సర్క్యులర్‌లో సూచించింది. రిస్కులను మదింపు చేసుకుని, నివారణ చర్యలు తీసుకోవాలని, సిస్టంల భద్రతకు సంబంధించి పర్యవేక్షణను పటిష్టపర్చుకోవాలని, దాడులు జరిగిన పక్షంలో సత్వరం స్పందించేలా తగు ప్రణాళికలతో సన్నద్ధంగా ఉండాలని తెలిపింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్‌పై భారత సైన్యం క్షిపణి దాడులతో విరుచుకుపడిన నేపథ్యంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది.



ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ మీట్‌లో నీరజ్ చోప్రా

భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా... వచ్చే నెలలో చెక్ రిపబ్లిక్‌లో జరగనున్న ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొననున్నాడు. గత రెండు సార్లు గాయాల కారణంగా ఈ టోర్నీకి దూరంగా ఉన్న నీరజ్ ... జూన్ 24న జరిగే మీట్‌లో బరిలోకి దిగనున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పసిడి పతకం, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం నెగ్గిన నీరజ్ చోప్రా... ప్రస్తుతం కొత్త కోచ్ జాన్ జెలెజ్నీ వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు. 'ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ మీట్‌లో పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. నా కోచ్ జెలెజ్నీ గతంలో ఈ టోర్నీలో చాలా సార్లు విజేతగా నిలవడంతో పాటు... ఈవెంట్ డైరెక్టర్‌గానూ ఉన్నారు' అని నీరజ్ పేర్కొన్నాడు. 1961 నుంచి జరుగుతున్న ఈ మీట్‌కు ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య గోల్డ్ లెవల్ మీట్ గుర్తింపునిచ్చింది. ఈ నెల 16న దోహా డైమండ్ లీగ్‌లో పాల్గొననున్న నీరజ్... ఈ నెల 24 భారత్‌లో తొలిసారి జరగనున్న 'నీరజ్ చోప్రా క్లాసిక్' ఈవెంట్‌లో పాల్గొంటాడు.

అది అతని వ్యక్తిగత నిర్ణయం

- బోర్డు పాత్ర ఏమీ లేదు
- రోహిత్ రిటైర్మెంట్‌పై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వివరణ




రోహిత్ శర్మ, రాజీవ్ శుక్లా (ఫైల్)

న్యూఢిల్లీ: భారత విజయవంతమైన కెప్టెన్, 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ రిటైర్మెంట్ నిర్ణయం పూర్తిగా అతని వ్యక్తిగతమని బోర్డు సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపారు. వచ్చే నెలలో ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్‌కు ముందు రోహిత్ బుధవారం అనూహ్యంగా సంప్రదాయ టెస్టు ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పాడు. ఇది భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)తో పాటు క్రికెట్ అభిమానుల్ని నిర్ఘాంతపరిచింది. సీనియర్ క్రికెటర్, కోల్‌కతా నైట్‌రైడర్స్ సారథి రహానే సైతం రోహిత్ నిర్ణయం షాక్‌కు గురి చేసిందని వ్యాఖ్యానించాడు. 'హిట్‌మ్యాన్' టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంపై శుక్లా స్పందించారు. 'అది పూర్తిగా అతని వ్యక్తిగత నిర్ణయం. ఇందులో బోర్డు పాత్ర ఏమీ లేదు. బోర్డు పాలసీ ప్రకారం ఎవరైనా ఆటగాడు ఆటకు వీడ్కోలు పలికితే... ఆ నిర్ణయం సవరించుకునేలా ఒత్తిడి చేయం. అలాగే ఎలాంటి సూచన గానీ, సంప్రదింపులు గానీ జరపం' అని అన్నారు. అయితే సుదీర్ఘ కాలం ఆటగాడిగా, సారథిగా భారత క్రికెట్ అతను అందించిన సేవల్ని కొనియాడుతామన్నారు. 'రోహిత్ ముమ్మాటికీ గొప్ప బ్యాటర్. అతను వన్డే క్రికెట్‌లో కొనసాగుతానని చెప్పడం ఇందులో సానుకూలాంశం. కాబట్టి అతని విశేషానుభవం, అసాధారణ ప్రదర్శన భారత వన్డే జట్టుకు బాగా ఉపయోగపడుతుంది' అని శుక్లా అన్నారు. టెస్టుల్లో టీమిండియా తదుపరి సారథి ఎవరనేదానిపై సీనియర్ పేసర్ బుమ్రా సహా, బ్యాటర్లు కేఎల్ రాహుల్, శుబ్‌మన్ గిల్‌ల పేర్లు వినిపిస్తున్నప్పటికీ శుక్లా వీటిని కొట్టిపారేశారు. రోహిత్ వారసుడి ఎంపిక సెలక్షన్ కమిటీ చూసుకుంటుందని స్పష్టం చేశారు.

ఐపీఎల్ వాయిదా?

ఆటగాళ్ల భద్రతకే ప్రాధాన్యం ● ముందు దేశం... తర్వాతే వినోదం ● బీసీసీఐ నిర్ణయం నేడు





ధర్మశాల: ఉగ్రవేటకు తలపెట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ఏమాత్రం జీర్ణించుకోలేని పాకిస్తాన్ మిలిటరీ కుటిలబుద్ధితో క్రూరమైన దాడులకు తెగబడుతోంది. సరిహద్దు రాష్ట్రాల పౌరులపై విచక్షణారహితంగా మోర్టార్లు, ఫిరంగులతో దాడులు చేస్తోంది. దీంతో భారత బలగాలు దీటుగా బదులిస్తున్నాయి. భారత్, పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కాస్తా యుద్ధభూమిని తలపించడంతో భారత రక్షణ దళాలు కీలక నగరాల్లో విద్యుత్ సరఫరా (పవర్ బ్లాక్ అవుట్)ను నిలిపివేసింది. ఇంటర్నెట్, మొబైల్ సేవల్ని నిలిపివేసింది. పాక్ ప్రయోగించిన మిస్సైళ్లు, డ్రోన్లను నిర్వీర్యం చేసేందుకు భారత సాయుధ బలగాలు రాత్రంతా శ్రమిస్తున్నాయి. ఇలా ప్రస్తుతం దేశం కోసం భారత త్రివిధ దళాలు ప్రాణాలకు తెగించి పోరాడుతుంటే స్టేడియాల్లో ఐపీఎల్ వినోదం పట్ల నెట్టింట తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. భారత పౌరులు, ప్రధాన నగరాలే లక్ష్యంగా పాక్ ఆర్మీ విచక్షణా రహితంగా జరిపే దాడుల్ని తిప్పికొడుతున్నప్పటికీ... పొరపాటున ఏ మిస్సైల్, డ్రోన్ దాడి అయిన స్టేడియంలో పడితే... వేలల్లో ప్రేక్షకులు, పదుల సంఖ్యలోని విదేశీ, భారత క్రికెటర్లకు జరిగే ప్రాణ నష్టం ఊహకందదు. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌ను రద్దు చేయాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వినోదం కంటే కూడా దేశ రక్షణ, ఆటగాళ్ల భద్రతే తమకు ప్రధానమని బోర్డు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అందుబాటులో ఉన్న బీసీసీఐ ఉన్నతాధికారులతో నేడు సమావేశమై ఐపీఎల్‌పై తుది నిర్ణయం తీసుకుంటారు. శుక్రవారం ఐపీఎల్ రద్దు లేదంటే వాయిదా ప్రకటన వెలువడుతుందని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.

పంజాబ్, ఢిల్లీ మ్యాచ్ రద్దు

- ముందు వర్షంతో ఆలస్యం
- తర్వాత పవర్ బ్లాక్ అవుట్‌తో మ్యాచ్ రద్దు

ధర్మశాల: పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్ రద్దయ్యింది. మొదట వర్షంతో ఆలస్యమైన మ్యాచ్ తర్వాత 10.1 ఓవర్లపాటే జరిగింది. సాంకేతిక కారణాలతో ఫ్లడ్‌లైట్లు నిలిపివేయాల్సి రావడంతో మ్యాచ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. ధర్మశాలకు పొరుగు నగరమైన పఠాన్‌కోట్ సైనిక స్థావరాలపై పాకిస్తాన్ మిస్సైళ్లు, ఆత్మాహుతి డ్రోన్లతో దాడులకు తెగబడింది. పఠాన్‌కోట్ నుంచి ధర్మశాలకు మధ్య దూరం కేవలం 85 కిలోమీటర్లే ఉండటంతో పవర్ బ్లాక్ అవుట్ (విద్యుత్ నిలిపివేత) వల్ల మ్యాచ్‌కు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ స్వయంగా స్టేడియం లోపలికి వచ్చి మరీ ప్రేక్షకులంతా మైదానం నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అప్పటికే నాలుగు ఫ్లడ్‌లైట్లలో ఒకటి ఆరిపోగా... మిగతా మూడు ఫ్లడ్‌లైట్లను ప్రేక్షకులంతా బయటికి వెళ్లిపోయేదాకా ఉంచారు. ఆ తర్వాత ఆ మూడు ఫ్లడ్‌లైట్లను కూడా ఆపేశారు. పంజాబ్, ఢిల్లీ మ్యాచ్ రద్దయినా రెండు జట్లకు ఎలాంటి పాయింట్లు కేటాయించకపోవడం గమనార్హం.

మొదట వర్షంతో...

ధర్మశాలలో కురిసిన వర్షం వల్ల మ్యాచ్ షెడ్యూల్ ప్రకారం మొదలవలేదు. వాన తెరిపినిచ్చాక అవుట్ ఫీల్డ్‌ను సిద్ధం చేసేందుకు చాలా సమయం పట్టడంతో మ్యాచ్ గంట ఆలస్యంగా మొదలైంది. అయినప్పటికీ నిర్ణీత ఓవర్లలో కోత విధించకుండా 20 ఓవర్ల మ్యాచ్‌ను నిర్వహించేందుకే మ్యాచ్ రిఫరీ మొగ్గుచూపారు. పంజాబ్ గత మ్యాచ్ ఆడిన తుది జట్టునే కొనసాగించగా, ఢిల్లీ ఒక మార్పు చేసింది. విప్రాజ్ నిగమ్ స్థానంలో మాధవ్ తివారీ బరిలోకి దించింది. టాస్ నెగ్గిన పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఆట రద్దు చేసే సమయానికి పంజాబ్ 10.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 122 పరుగులు చేసింది. ఓపెనర్లు ఇద్దరు దంచేశారు. ప్రియాన్ష్ ఆర్య (34 బంతుల్లో 70; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (28 బంతుల్లో 50 నాటౌట్; 7 ఫోర్లు) మెరుపు అర్ధసెంచరీలు సాధించారు. ఇద్దరు కలిసి ఓపెనింగ్ వికెట్‌కు 122 పరుగులు జోడించారు. సిక్సర్లతో విరుచుకుపడిన ప్రియాన్ష్ 25 బంతుల్లో అర్ధసెంచరీ సాధించగా, కాసేపటి తర్వాత ప్రభ్‌సిమ్రన్ 28 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు.



నేటి మ్యాచ్ యథాతథం

"ప్రస్తుత పరిస్థితులపై సమీక్షిస్తున్నాం. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత ఇంకా కొనసాగుతూనే ఉంది. ఐపీఎల్ మ్యాచ్‌ల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాల్ని పాటిస్తాం. ఇప్పటివరకైతే కేంద్రం నుంచి మాకెలాంటి సూచనలు రాలేదు. ఆటగాళ్ల భద్రత, రవాణా తదితర పరిస్థితుల్ని సమీక్షించాకే తుది నిర్ణయం తీసుకుంటాం. లక్నోలో శుక్రవారం లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగాల్సిన మ్యాచ్‌కు ఏ ఇబ్బందులు లేవు. కాబట్టి మ్యాచ్ షెడ్యూల్ ప్రకారం జరిగే అవకాశాలే ఉన్నాయి. -ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్

ఐపీఎల్–2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	11	8	3	0	16	0.793
బెంగళూరు	11	8	3	0	16	0.482
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	11	6	4	1	13	0.362
కోల్‌కతా	12	5	6	1	11	0.193
లక్నో	11	5	6	0	10	-0.469
హైదరాబాద్	11	3	7	1	7	-1.192
రాజస్తాన్	12	3	9	0	6	-0.718
చెన్నై	12	3	9	0	6	-0.992

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో × బెంగళూరు
వేదిక: లక్నో
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

ఆదివాసీ యువతికి ఓయూ నుంచి డాక్టరేట్


జ్యోతిర్మయి

భద్రాచలం టౌన్: భద్రాచలానికి చెందిన ఈసం జ్యోతిర్మయికి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. భౌతిక శాస్త్రంలో ఆమె సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గురువారం డాక్టరేట్ ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కుమార్తె అనురాధ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పీహెచ్‌డీ (ఆర్ట్స్) పూర్తి చేసిన మొదటి ఆదివాసీ మహిళ కాగా, భౌతిక శాస్త్రంలో డాక్టరేట్ సాధించిన ఆదివాసీగా జ్యోతిర్మయి రికార్డు సృష్టించారు. ఆమె తండ్రి అనంతయ్య భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

12 నుంచి టీచర్లకు శిక్షణ

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల బోధనా పటిమను మరింత మెరుగుపర్చేందుకు ఐదు రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తొలి విడత శిక్షణ ఈనెల 5 నుంచి మొదలైంది. ఇది శుక్రవారంతో ముగుస్తుంది. రెండో దశ శిక్షణను ఈ నెల 12 నుంచి 17 వరకూ చేపడతారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్ జిల్లా, మండల స్థాయిలో టీచర్లకు శిక్షణ ఇస్తారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి గురువారం విడుదల చేశారు.

సాయుధ దళాల వీరత్వానికి గర్విస్తున్నా

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ



సాక్షి, హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్‌లో వీరోచితంగా పోరాడుతున్న భారత సాయుధ దళాలను చూసి గర్విస్తున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముఖేష్ డి అంబానీ పేర్కొన్నారు. భారతదేశం అన్ని రకాల ఉగ్రవాదాలకు వ్యతిరేకంగా ఐక్యంగా, దృఢ సంకల్పంతో నిలుస్తుందని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాహసోపేతమైన, నిర్ణయాత్మక నాయకత్వంలో, భారత సాయుధ దళాలు సరిహద్దు అవతలి నుండి వచ్చే ప్రతి రెచ్చగొట్టే చర్యకు కచ్చితత్వం, అసమాన శక్తితో ప్రతిస్పందించాయని కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడంలో భాగంగా రిలయన్స్ కుటుంబం ఎలాంటి మద్దతు ఇవ్వడానికైనా సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ నేడు


హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలంగాణ జాగృతి సంస్థ తెలిపింది. సాయంత్రం 6 గంటలకు పీపుల్స్ ప్లాజా నుంచి 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామని వెల్లడించింది.

నూతన పోప్.. రాబర్ట్ ప్రివోస్ట్

పోప్ లియో-14 పేరుతో క్యాథలిక్ గురువుగా పట్టం

అమెరికా నుంచి పోప్‌గా ఎన్నికైన తొలి వ్యక్తిగా రికార్డు..

అందరం కలిసుండటానికి వారధులు నిర్మిద్దాం: పోప్



వాటికన్ సిటీ: ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాదాపు 140 కోట్ల మంది క్యాథలిక్‌ల కొత్త మత గురువుగా రాబర్ట్ ఫ్రాన్సిస్ ప్రివోస్ట్ ఎన్నికయ్యారు. 69 ఏళ్ల ప్రివోస్ట్ పోప్ లియో 14 పేరుతో 267వ పోప్‌గా అధికారం చేపట్టనున్నారు. వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బసిలికాలో సమావేశమైన 133 మంది కార్డినల్స్ కొత్త పోప్‌ను గురువారం ఎన్నుకున్నారు. కొత్త పోప్‌ను ఎన్నుకున్నందుకు సూచనగా సెయింట్ పీటర్స్ బసిలికాలోని సిస్టైన్ చాపెల్ నుంచి తెల్లని పొగను వదిలారు. ఆ తర్వాత 70 నిమిషాలకు చర్చిలోని సెంట్రల్ బాల్కనీ నుంచి ఫ్రెంచ్ కార్డినల్ డొమినిక్ మంబెర్టీ లాటిన్ భాషలో 'హబెమస్ పాపమ్'(మనకు కొత్త పోప్ వచ్చారు) అని ప్రకటించారు. ఆ వెంటనే వాటికన్‌లో సంబరాలు మొదలయ్యాయి. చర్చి ముందు గుమికూడిన వేల మంది క్రైస్తవులు 'వివా ఇల్ పాపా'అని నినదించారు. పోప్ ఫ్రాన్సిస్ ఇటీవల అనారోగ్యంతో మరణించటంతో కొత్త పోప్‌ను ఎన్నుకున్నారు.

అమెరికా నుంచి తొలి పోప్

అగ్రరాజ్యం అమెరికా నుంచి పోప్‌గా ఎన్నికైనతొలి వ్యక్తిగా రాబర్ట్ ఫ్రాన్సిస్ ప్రివోస్ట్ చరిత్ర సృష్టించారు. షికాగో నగరంలో 1955 సెప్టెంబర్ 14న జన్మించిన ప్రివోస్ట్.. 2023లోనే కార్డినల్‌గా నియమితులయ్యారు.ఆయన ఎక్కువ కాలం పెరూలో సేవలందించారు. ఆయన మీడియాకు దూరంగా ఉంటారు. అత్యంత అరుదుగా మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తుంటారు. పోప్‌గా ఎన్నికైన తొలి అగస్టినియన్ కూడా ఈయనే. చికాగోలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేసిన ఆయన.. పెన్సిల్వేనియాలోని విల్లనోవా యూనివర్సిటీ నుంచి గణితంలో బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తిచేశారు. క్యాథలిక్ థీయాలజీ యూనియన్ ఆఫ్ చికా గోలో థీయాలజీలో డిప్లొమా చేశారు. రోమ్‌లోని సెయింట్ థామస్ అక్వినాస్ యూనివర్సిటీలో క్యానన్ లా చదివారు. 1982లో ప్రీస్ట్‌గా నియమితులయ్యారు. పెరూలోని త్రుజిల్లో సెమిటరీలో క్యానన్ లాను చాలాకాలంపాటు బోధించారు.

వారధులు నిర్మిద్దాం

పోప్‌గా ఎన్నికైన తర్వాత సెయింట్ పీటర్స్ బసిలికా నుంచి తొలి సందేశమిచ్చిన పోప్ లియో 14.. ప్రపంచంలోని మనుషులందరినీ కలిపే వారధులు నిర్మిద్దామని పిలుపునిచ్చారు. చర్చలకు వేదికగా చర్చిని తీర్చి దిద్దుతానని ప్రకటించారు. కాగా, అమెరికా వ్యక్తిని తొలిసారి పోప్‌గా ఎన్నుకోవటం అమెరికన్లందరికీ గొప్ప గౌరవంగా భావిస్తున్నామని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు.

జస్టిస్ యశ్వంత్‌ను అభిశంసించాలి

కేంద్రానికి సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా సిఫార్సు

రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీకి లేఖ

న్యూఢిల్లీ: నోట్ల కట్టల వ్యవహారంలో దోషిగా తేలిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోపాటు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఢిల్లీలో జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు దొరికిన సంగతి నిజమేనని, వాటితో ఆయనకు సంబంధం ఉన్నట్లు త్రిసభ్య కమిటీ విచారణలో తేలిందని వెల్లడించారు. విచారణ కమిటీ నివేదికను జస్టిస్ ఖన్నా రాష్ట్రపతి, ప్రధానమంత్రికి పంపించారు. జస్టిస్ యశ్వంత్ వర్మ వివరణను సైతం జతచేశారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు తాజాగా ఒక ప్రకటనలో తెలియజేసింది. జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పని చేస్తున్న సమయంలో ఈ ఏడాది మార్చి 14న రాత్రి 11.35 గంటలకు ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. ఆ ఇంట్లోని ఓ గదిలో అగ్నిమాపక సిబ్బంది నోట్ల కట్టలను గుర్తించారు. వీటిని పోలీసులకు అందజేశారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో జస్టిస్ యశ్వంత్ వర్మను సుప్రీంకోర్టు అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. కానీ, ఆయనకు న్యాయ సంబంధిత విధులేవీ అప్పగించలేదు. జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలు నిగ్గుతేల్చడానికి త్రిసభ్య కమిటీని నియమించింది. ఈ కమిటీ పలువురు సాక్షులను విచారించింది. ఆధారాలు సేకరించింది. ఢిల్లీ పోలీసు కమిషనర్, అగ్నిమాపక సిబ్బంది సహా దాదాపు 50 మందిని ప్రశ్నించి, ఈ నెల 3న నివేదికను సిద్ధం చేసింది. నోట్ల కట్టలతో జస్టిస్ వర్మకు సంబంధం ఉందని విచారణలో వెల్లడయినట్లు సమాచారం. ఆరోపణలు నిజమేనని తేలితే.. రాజీనామా చేయాలని లేదా స్వచ్ఛంద పదవీ విరమణ చేయాలని సదరు న్యాయమూర్తిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశించాల్సి ఉంటుంది. అందుకు న్యాయమూర్తి అంగీకరించకపోతే ఆయనను అభిశంసించాలంటూ రాష్ట్రపతి, ప్రధానమంత్రికి సీజేఐ సిఫార్సు చేయాలి. రాజీనామాకు జస్టిస్ వర్మ అంగీకరించకపోవడం వల్లే రాష్ట్రపతి, ప్రధానికి జస్టిస్ సంజీవ్ ఖన్నా లేఖ రాసినట్లు తెలుస్తోంది.

విద్య పూర్తయ్యే సరికి ఉద్యోగం!

ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ: మంత్రి శ్రీధర్‌బాబు

జేఎన్‌టీయూహెచ్, టీసీఎస్ ఐయాన్‌ల మధ్య ఒప్పందం



సాక్షి, హైదరాబాద్: యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించే మరో వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు 'ప్లేస్‌మెంట్ సక్సెస్ ప్రోగ్రాం'కింద ఐదు నెలల శిక్షణ ఇవ్వడం ద్వారా ఉద్యోగాలకు సంసిద్ధులుగా తీర్చిదిద్దేందుకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఐయాన్ (టీసీఎస్ ఐయాన్) ముందుకొచ్చిందని చెప్పారు. ఈ సందర్భంగా టీసీఎస్ ఐయాన్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సచివాలయంలో హైదరాబాద్ జేఎన్‌టీయూ, టీసీఎస్ ఐయాన్ సంస్థల మధ్య విద్యార్థులకు శిక్షణకు సంబంధించి అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పి యువతను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రారంభించామని చెప్పారు.

తొలుత మంథని జేఎన్‌టీయూ విద్యార్థులకు శిక్షణ: 'సాంకేతిక నైపుణ్యాలు లేకుండా డిగ్రీలతో ఉద్యోగాలు రావడం కష్టం. దీనిని అర్థం చేసుకున్నందునే శిక్షణపై దృష్టి సారించాం. చదువు పూర్తి చేసే సమయానికి ప్రతి ఒక్కరికీ ఏదో ఒక అంశంలో నైపుణ్యం పెంచగలిగితే ఉద్యోగాలు ఇవ్వడం కోసం కంపెనీలు వాటికవే పరుగెత్తుకుంటూ వస్తాయి. టీసీఎస్ ఐయాన్ సంస్థ మొదటి దశలో ప్రతి ఐదు నెలల (20 వారాల)కు 100 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలకు సిద్ధం చేస్తుంది. ఆ సంస్థతో ఎంప్యానెల్ అయిన మూడు వేలకు పైగా కంపెనీలు వీరిలో ప్రతిభావంతులను ఎంపిక చేసుకుని ఉద్యోగాలు కల్పిస్తాయి. పైలట్ కార్యక్రమం కింద మొదట మంథనిలోని జేఎన్‌టీయూ కళాశాల విద్యార్థులను నైపుణ్య శిక్షణకు ఎంపిక చేస్తాం..' అని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువతను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగ సంసిద్ధత కార్యక్రమాలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీసీఎస్ ఐయాన్ గ్లోబల్ హెడ్ వెంగుస్వామి, స్కిల్ ఎడ్యుకేషన్ బిజినెస్ హెడ్ స్మృతి ముల్యే, జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్‌లో కూలిన హెలికాప్టర్

పైలట్ సహా ఆరుగురు మృతి

మృతుల్లో ఏపీ ఎంపీ సోదరి సహా ఇద్దరు..

తీవ్రంగా గాయపడిన ఏపీ వాసి

గంగోత్రికి వెళ్తుండగా ఘటన



ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీ జిల్లాలో గురువారం జరిగిన ఘోర హెలికాప్టర్ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీ లక్ష్మీనారాయణ సోదరి వేదవతి కుమారి సహా ఆరుగురు మృత్యువాతపడ్డారు. ఘటనలో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన ఎం.భాస్కర్ తీవ్రంగా గాయపడ్డారు. ఏరో ట్రాన్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన బెల్ హెలికాప్టర్ డెహ్రాడూన్ నుంచి గంగోత్రి సమీపంలోని ఖర్సాలీ హెలిప్యాడ్‌కు టేకాఫ్ తీసుకుంది. ఉదయం 8.45 గంటల సమయంలో రిషికేశ్–గంగోత్రి నేషనల్ హైవేపై గంగ్నానీ సమీపంలో అదుపు తప్పిన హెలికాప్టర్ సుమారు 250 మీటర్ల లోతైన లోయలో కూలిపోయింది. ఆ సమయంలో అందులో పైలట్ సహా ఏడుగురున్నారు. ఘటనలో మృతి చెందిన వారిని ఏపీకి చెందిన వేదవతి కుమారి(48), విజయా రెడ్డి(57), కళ చంద్రకాంత్ సోని(61), రుచి అగర్వాల్(56), రాధ అగర్వాల్(79), కెప్టెన్ రాబిన్ సింగ్(60)గా గుర్తించారు. రాబిన్ సింగ్ స్వస్థలం గుజరాత్ కాగా ముగ్గురిది ముంబై, ఒకరిది యూపీ. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఏపీ వాసి ఎం.భాస్కర్(51)ను వెంటనే మరో హెలిక్టాపర్‌లో రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించామని జిల్లా మేజిస్ట్రేట్ మెహర్బన్ సింగ్ బిష్త్ చెప్పారు. ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.

రిహార్సల్స్ చేస్తున్న మిస్ వరల్డ్ పోటీదారులు



సుందరీమణులు సిద్ధం

రేపట్నుంచే హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రపంచ సుందరి (మిస్ వరల్డ్) పోటీలకు సమయం ఆసన్నమైంది. శనివారం సాయంత్రం గచ్చిబౌలి స్టేడియంలో అంగరంగ వైభవంగా ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. మిస్ వరల్డ్ సంస్థతో కలిసి ప్రభుత్వం.. ఈ పోటీలు నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ పోటీల నిర్వహణ ద్వారా తెలంగాణ రాష్ట్రం ప్రపంచ పటంపై ప్రత్యేక స్థానం పొందుకునేలా ప్రణాళి కలు సిద్ధం చేసింది. ఈ పోటీల్లో పాల్గొనడానికి దాదాపు 100 మందికి పైగా సుందరీమణులు ఇప్పటికే నగరానికి చేరుకున్నారు. నిర్వహణ సంస్థ మిస్ వరల్డ్ లిమిటెడ్‌కు చెందిన 28 మంది ప్రతినిధులు, మరో 17 మంది సహాయకులు కూడా వచ్చేశారు. రానున్న రెండురోజుల్లో మరికొంత మంది ప్రతినిధులు వివిధ దేశాల నుంచి వస్తారని నిర్వాహకులు తెలిపారు. అధికారులు నగరానికి చేరుకున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో సహా.. ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ విమానాశ్రయాల్లో కూడా ప్రపంచ సుందరి పోటీలకు వచ్చే వారికి ఆహ్వానం పలుకుతూ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయించింది. విదేశీ ప్రతినిధులు బస చేసిన ట్రిడెంట్ హోటల్ దగ్గర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

అలరించిన రిహార్సల్స్: ప్రపంచ సుందరి పోటీల కోసం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గురువారం రిహార్సల్స్ ఉత్సాహంగా కొనసాగాయి. ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న వివిధ దేశాల పోటీదారులు ఆకర్షణీయమైన వస్త్రాలు ధరించి ర్యాంప్ వాక్ చేశారు. తమ ప్రతిభకు తగిన కార్యక్రమాలను ఎంపిక చేసుకుని ప్రాక్టీస్ చేశారు. ఇక సమయాను కూలంగా స్టేజ్ ఎంట్రీలు, గ్రూప్ మూవ్‌మెంట్స్, లైటింగ్, మ్యూజిక్ సెట్ అప్ తదితర అంశాలను నిర్వాహకులు పరిశీలించారు.

సామాన్యులకూ వీక్షించే అవకాశం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఈ నెలాఖరు వరకు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాన్ని పరిమిత సంఖ్యలో సామాన్యులకూ కల్పించేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టూరిజం వెబ్‌సైట్ (https://tourism.telangana.gov.in/events single/missworldevent)లో రిజిస్టర్ చేసుకున్న వారికి పోటీలు జరిగే ఒక్కో కేంద్రంలో వెయ్యి మంది చొప్పున మొత్తం 5 కేంద్రాల్లో 5వేల మందికి మిస్ వరల్డ్ పోటీలను వీక్షించే అవకాశం కల్పించాలని భావిస్తున్నారు.

వేసవిలో తరగతులపై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ కాలేజీలకు వేసవి సెలవులు ఇచ్చినా అందుకు విరుద్ధంగా ప్రైవేటు కాలేజీల్లో జరుగుతున్న తరగతుల నిర్వహణపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 14కు వాయిదా వేస్తూ ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని జస్టిస్ సూరేపల్లి నందా, జస్టిస్ జె.శ్రీనివాస్ రావు ధర్మాసనం స్పష్టం చేసింది. ఇంటర్ బోర్డు జారీ చేసిన వార్షిక కేలండర్‌లో ప్రకటించిన విధంగా ప్రైవేట్ కళాశాలలు సెలవులు ప్రకటించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బెండెల క్రాంతికుమార్ తరఫున న్యాయవాది సీఆర్ సుకుమార్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఆదివారాలు, ప్రభుత్వ సెలవు రోజులు అని తేడా లేకుండా తరగతులను నిర్వహిస్తున్నారని.. దీనివల్ల విద్యార్థులు ఒత్తిడి, మానసిక రుగ్మతలకు గురై ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా కాలేజీలు వెంటనే తరగతుల నిర్వహణను ఆపేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఇలాంటి వాటిపై ఫిర్యాదులు తీసుకోవడానికి ఓ పోర్టల్‌ను ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలన్నారు. అయితే రాష్ట్రంలోని ఏ ప్రైవేట్ జూనియర్ కాలేజీ కూడా వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించట్లేదని స్పెషల్ జీపీ వాదించారు. ట్యూషన్లు, కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై ఇంటర్ బోర్డుకు నియంత్రణ లేదన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలుకు సమయం కావాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది. ఏజీ హాజరై వాదనలు వినిపిస్తారని ప్రభుత్వ న్యాయవాది చెప్పడంతో తదుపరి విచారణను వాయిదా వేసింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


ఇల్లెందులో స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణకు హాజరైన విద్యార్థులు

చదువుదాం.. మాట్లాడుదాం..


కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాలలో శిక్షణ పొందుతున్న మహిళలు

సింగరేణిలో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు
సంస్థ వ్యాప్తంగా ఏడు పాఠశాలల్లో శిక్షణ
విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఇతరులకు అవకాశం

ఇల్లెందు: వేసవి సెలవులు రాగానే నెలన్నరకు పైగా పిల్లలకు ఆటవిడుపే. కానీ ఇది గతం. ఇప్పుడు వేసవి సెలవులను సద్వినియోగం చేసేలా కొత్త కోర్సులు నేర్పించడంపై తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. పిల్లల్లోనూ ఇదే ఉత్సాహం ఉండడంతో పలుచోట్ల ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యాన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ శిక్షణ తరగతులు ఏర్పాటవుతున్నాయి. ఈ క్రమంలోనే సింగరేణి సంస్థ కూడా ఈ ఏడాది తమ పాఠశాలలు, కళాశాలల్లో రెండు నెలల పాటు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. సంస్థ వ్యాప్తంగా 7 విద్యాసంస్థలను ఎంపిక చేసి, బోధిస్తుండగా.. ప్రస్తుతం 8, 9వ తరగతులకు చెందిన 598 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. సింగరేణి సీఎండీ ఎన్.బలరాం ఆదేశాలతో రోజుకు రెండు గంటల పాటు నిర్వహిస్తున్న ఈ తరగతులను సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ పర్యవేక్షిస్తున్నారు.

ఇదీ ప్రత్యేకం

వేసవి శిక్షణ తరగతులు అంటే కేవలం విద్యార్థులకే ఉంటాయి. కానీ సింగరేణి సంస్థ వినూత్నంగా ఆలోచన చేసింది. సింగరేణి పరిధిలోని విద్యార్థులే కాక వారి తల్లిదండ్రులు, ఇతరులకూ అవకాశం కల్పించింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందరికీ ఇంగ్లిష్ అవసరం పెరుగుతున్న నేపథ్యాన నిపుణులైన ఇంగ్లిష్ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. ఈ శిక్షణతో ఇంగ్లిష్ నేర్చుకోవడమే కాక.. భావాలను సమర్థవంతంగా వ్యక్తీకరించే అవకాశం ఏర్పడుతుందని, శృతి, ఉచ్ఛారణ మెరుగుపడుతుందని చెబుతున్నారు.

భవిష్యత్‌లో ఉపయోగం..


వేసవి సెలవుల్లో రోజుకు రెండు గంటల పాటు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులకు హాజరవుతున్నా. ఇప్పుడు ఇంగ్లిష్ నేర్చుకోవడం వల్ల ఎవరితో ఎలా మాట్లాడాలో తెలుస్తోంది. అంతేకాక వచ్చే ఏడాది, ఆ తర్వాత విద్యాసంవత్సరాల్లో నాకు ఉపయోగకరంగా ఉంటుంది.
– హారిక, 9వ తరగతి, సింగరేణి హైస్కూల్, ఇల్లెందు

శిక్షణ బాగుంది


సింగరేణి హైస్కూల్‌లో ప్రస్తుత వేసవి సెలవుల్లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇస్తున్నారు. ఎవరితో ఎలా మాట్లాడాలి, ఏ సందర్భంలో ఏ పదం వాడాలి అనేది అవగాహన వస్తోంది. రోజుకు రెండు గంటలు ఇస్తున్న శిక్షణ బాగుంది.
– ఖద్గేశ్వర్, 9వ తరగతి, ఇల్లెందు

ఇంట్లో మాట్లాడే పదాలే..


స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ద్వారా పిల్లలకు తరచూ అవసరమయ్యే పదాలు ఎలా ఉపయోగించాలో నేర్పిస్తున్నాం. మా సెంటర్‌లో 106 మందికి శిక్షణ ఇస్తున్నాం. ఇక్కడికి వస్తున్న పిల్లలు ఇంగ్లిష్‌లో మాట్లాడుతుంటే ఆనందం కలుగుతోంది.
– షహనాజ్, ఉపాధ్యాయిని, ఇల్లెందు

స్కూల్ / కాలేజీ	హాజరవుతున్న అభ్యర్థులు
సింగరేణి మహిళా డిగ్రీ కాలేజ్, కొత్తగూడెం	50
సింగరేణి కాలరీస్ హైస్కూల్, గోదావరిఖని	80
సింగరేణి కాలరీస్ హైస్కూల్, కొత్తగూడెం	70
సింగరేణి కాలరీస్ హైస్కూల్, భూపాలపల్లి	58
సింగరేణి కాలరీస్ హైస్కూల్, ఇల్లెందు	106
సింగరేణి కాలరీస్ హైస్కూల్, సీసీసీ (శ్రీరాంపూర్)	31
సింగరేణి కాలరీస్ హైస్కూల్, మణుగూరు	75
సింగరేణి కాలరీస్ హైస్కూల్, కేకే (మందమర్రి)	65
సింగరేణి కాలరీస్ హైస్కూల్, గోదావరిఖని	32
సింగరేణి కాలరీస్ హైస్కూల్, గోలేటి (బెల్లంపల్లి)	31
మొత్తం	598

ఈ ఏడాదిలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలివే

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి మిషన్–2025 కింద వివిధ కార్యక్రమాలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చేపట్టబోతోంది. 2024–2029 నాటికి స్వయం సంఘాల్లోని మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో రూ.లక్ష కోట్ల బ్యాంకు రుణాల మంజూరు లక్ష్యంగా చర్యలు తీసుకుంటోంది.

- 15–18 ఏళ్ల మధ్యలోని బాలికలకు బాలికా సంఘాలు ఏర్పాటు చేసి, ఆరోగ్యం, పోషణ, ప్రస్తుత సామాజిక పరిస్థితులు, డిజిటల్ మోసాలు, హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కల్పించాలని నిర్ణయించింది.
- రాష్ట్రంలోని 22 జిల్లాల్లో రూ.110 కోట్ల వ్యయంతో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం చేపట్టనున్నారు.
- 33 జిల్లాల్లోని జిల్లా కలెక్టర్ ఆఫీసుల సముదాయాల (ఐడీవోసీ) పరిధిలో, రాష్ట్ర సచివాలయం, అన్ని పర్యాటక ప్రాంతాలు, రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, కళాశాలలు, ఆస్పత్రులు, పారిశ్రామిక పార్కులలో 'మహిళా శక్తి'క్యాంటీన్ల నిర్వహణ చేపట్టేలా పీఆర్ శాఖ చర్యలు తీసుకోనుంది. సెర్ప్ ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలనలో స్వయం సహాయక సంఘాలు కీలకపాత్ర నిర్వహిస్తున్నాయి.

ఈ ఆర్థిక సంవత్సరంలో సెర్ప్-బ్యాంక్ లింకేజీ లక్ష్యాలు

ఈ ఏడాది 3,55,138 స్వయం సహాయక సంఘాలకు, రూ.19,838.58 కోట్ల బ్యాంకు రుణాల మంజూరు లక్ష్యంగా లింకేజీ వార్షిక కార్యాచరణ ప్రణాళికను ఆవిష్కరించారు.

- 52,715 ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ.1,639.05 కోట్లతో వ్యక్తిగత ఎంటర్‌ప్రైజ్ రుణాల కల్పన లక్ష్యం
- 1,000 మంది బ్యాంకు మేనేజర్లకు ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీపై శిక్షణ
- 64 అదనపు డీఆర్‌డీవోలు/ డీపీఎంలకు, 2,600 ఏపీఎం/సీసీలకు మహిళా జీవనోపాధుల కల్పనపై శిక్షణ
- చదువుకున్న 500 మంది స్వయం సహాయక సంఘాల మహిళలను బ్యాంకు సఖిలుగా ఆర్థికంగా ఎదిగేలా సహకారం అందించడం
- 1106 మహిళలకు వ్యక్తిగత ఎంటర్‌ప్రైజ్‌లపై శిక్షణ కల్పించి ఎంటర్‌ప్రైజ్‌ల ఏర్పాటు లక్ష్యం

గత ఆర్థికసంవత్సరంలో సాధించిన విజయాలు

- 2024–25లో బ్యాంకుల ద్వారా 2,13,948 సంఘాలకు, రూ.20,069 కోట్ల రుణాలు మంజూరు
- 2025 మార్చి చివరి నాటికి 3,76,025 సంఘాలపై రూ.26,103.15 వేల కోట్ల బ్యాంకు అప్పులు తీసుకోగా, ఈ రుణాల్లో వందకు 98.60% బ్యాంకులకు తిరిగి చెల్లింపు
- చదువుకున్న 600 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలను బ్యాంకు సఖిలుగా నియమించి, వారు ఆర్థికంగా ఎదిగేలా సహకారం
- 10,804 మంది నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ స్వయం ఉపాధి పథకాలపై శిక్షణ
- 3,32,324 సంఘాలకు రూ.220.62 కోట్ల వడ్డీ రాయితీ

సుజాతపై చర్య తీసుకుంటారా? లేదా?

– బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్



సాక్షి, హైదరాబాద్: 'సీఎంగారూ.. ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపై చర్యలు తీసుకుంటారా? లేదా?'.. అని బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ ప్రశ్నించారు. సూరేపల్లి సుజాత ఒక అర్బన్ నక్సలైట్.. అందుకే దేశద్రోహ వ్యాఖ్యలు చేస్తూ.. సైనికుల మనోధైర్యాన్ని, దేశ సమగ్రతను దెబ్బతీయాలనుకుంటున్నారని ఆరోపించారు. ఆపరేషన్ సిందూర్‌ను యావత్ ప్రపంచం అభినందిస్తోందని ఒకప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సైనిక చర్యకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సంఘీభావం తెలిపిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నియమించిన వ్యక్తే.. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడుతుంటే మౌనంగా ఉంటారా? అని నిలదీశారు. ప్రొఫెసర్‌గా, విద్యాకమిషన్ సభ్యురాలిగా ఉన్న సుజాతపై చర్య తీసుకోకపోతే 'ఆపరేషన్ సిందూర్'ను రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యతిరేకిస్తోందని ప్రజలు భావిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం సుజాతపై చర్య తీసుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని రాజాసింగ్ హెచ్చరించారు.

ఆపరేషన్ సిందూర్‌పై ప్రొఫెసర్ సుజాత వ్యాఖ్యలు



- తక్షణం చర్య తీసుకోవాలి
- గవర్నర్, సీఎంకు బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: పాకిస్తాన్, పీవోకేలోని ఉగ్రవాద శిక్షణ శిబిరాలపై భారత సైనికదళాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'ను అపహాస్యం చేస్తూ.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపై చర్యలు తీసుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డిలకు బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ విజ్ఞప్తి చేశారు. సైనిక దాడులపై యావత్ దేశం గర్విస్తుంటే.. శాతవాహన వర్సిటీ ప్రొఫెసర్, విద్యాకమిషన్ సభ్యురాలు సుజాత.. ఈ ఆపరేషన్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం గర్హనీయమని గవర్నర్, సీఎంలకు రాసిన లేఖలో శంకర్ పేర్కొన్నారు. వెంటనే ఆమెను ప్రొఫెసర్ బాధ్యతల నుంచి తొలగించాలని గవర్నర్‌ను కోరారు. ప్రొఫెసర్ సుజాతను రాష్ట్ర విద్యా కమిషన్ సలహామండలి నుంచి తొలగించడంతో పాటు.. ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సీఎంకు శంకర్ విజ్ఞప్తి చేశారు.

'ఏజెన్సీ'ల్లో పేదలకు ఇళ్ల పథకంలో పెద్దపీట

అధికారులకు మంత్రి సీతక్క సూచన



సాక్షి, హైదరాబాద్: గిరిజన ప్రాంతాల్లో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. ప్రత్యేకించి గుడిసెల్లో నివసిస్తున్న వారిని గుర్తించి వారికి అవకాశం కల్పించాలన్నారు. గురువారం సచివాలయంలో మంత్రి ఐటీడీఏల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మైదాన ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తుండగా.. ఐటీడీఏల పరిధిలో ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్లు పర్యవేక్షించాలన్నారు. ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఐటీడీఏ పీవోలకు పంపించాలని, వారి ఆధ్వ ర్యంలో అర్హులను గుర్తించాలని ఆదేశించారు. ఏజెన్సీల పరిధిలో చాలామంది పూరి గుడిసెల్లోనే నివసిస్తున్నా రని సీతక్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధ ప్రకాశ్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, అదనపు సంచాలకుడు వి.సర్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ వలసదారులను పంపించేయాలి

బీజేపీ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అక్రమ వలసదారులను ఇక్కడి నుంచి పంపించేలా చర్యలు చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ వలసదారులను గుర్తించడం, అరెస్ట్ చేయడం వంటి చర్యలు చేపట్టడంలో ఎందుకు విఫలమవుతోందని బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ ప్రశ్నించారు. పోలీసులు ఎందుకు మెతకవైఖరి అవలంబిస్తున్నారని నిలదీశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అక్రమ వలసదారుల జాబితాను ప్రజల ముందుపెట్టాలని డిమాండ్ చేశారు. దేశ భద్రత విషయంలో కొంతమంది సినిమా నటులు ఇష్టానుసారంగా మాట్లాడటం తగదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ హితవు పలికారు. సింధూ నది నీళ్లు ఆపొద్దని, సరిహద్దులోని భారత సైనికులు పాకిస్తాన్‌కు ఉగ్రవాదుల్లా కనిపిస్తున్నారంటూ ఇష్టమొచ్చిన రీతిలో మాట్లాడితే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

యాసంగి సాగు రికార్డు స్థాయిలో

- గతేడాది 67.83 లక్షల ఎకరాల్లో... ఈ ఏడాది దాదాపు 80 లక్షల ఎకరాల్లో
- గతంలో పోల్చితే వరిసాగు అదనంగా 8 లక్షల ఎకరాల్లో...
- వచ్చే సీజన్ సన్నద్ధత, రైతు సంక్షేమంపై 12న సీఎం సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ఈ యాసంగిలో సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. గతేడాది యాసంగిలో 67.83 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తే....ఈ ఏడాది దాదాపు 80 లక్షల ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగయ్యాయి. వరి కోతలు చివరి దశకు చేరగా, కొనుగోళ్లలో అక్కడక్కడా ఆటంకాలు, అకాల వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో రైతుల ఇబ్బందులు మినహా ఈ యాసంగి సాగు రాష్ట్ర రైతాంగానికి భారీ ఊరటనిచ్చింది. ఇదే ఉత్సాహంతో రైతులు వచ్చే వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో వరి, పత్తి, మొక్కజొన్నతోపాటు ఇతర పంటల సాగు మొత్తం కలిపి 1.34 కోట్ల ఎకరాల్లో ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గతేడాది వానాకాలంలో 1.29 కోట్ల ఎకరాల్లోనే వివిధ పంటలు సాగయ్యాయి. గతంతో పోలిస్తే వచ్చే వానాకాలంలో 5 లక్షల ఎకరాల్లో అదనంగా వివిధ పంటలు సాగవనున్నాయి.

ఏటేటా పెరుగుతున్న యాసంగి సాగు విస్తీర్ణం

యాసంగిలో 50 నుంచి 60 లక్షల ఎకరాల్లో పంటలు సాగవడమే గొప్ప అన్నట్టుగా ఉండేది పరిస్థితి. కానీ మూడేళ్లుగా అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. పెరిగిన సాగు నీటి వనరులు, భూగర్భ జలాలతో గత 2023–24 యాసంగి సీజన్‌లో 67.83 లక్షల ఎకరాల్లో వరి, మక్క, జొన్న, శనగ, వేరుశనగ తదితర పంటలు సాగయ్యాయి. ఇందులో అధికంగా వరి 51.92 లక్షల ఎకరాల్లో సాగైంది. అయితే ఈసారి యాసంగిలో గత సంవత్సరం కన్నా దాదాపు 13 లక్షల ఎకరాలు అదనంగా సాగైంది. అన్ని వ్యవసాయ పంటలన్నీ కలిపి 79.96 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. అంటే అటు ఇటుగా 80 లక్షల ఎకరాలు. ఇది రాష్ట్రంలోనే ఓ రికార్డు. ఉద్యాన వన పంటలు, కూరగాయలు కలిపితే మరో 12 లక్షల ఎకరాలు అదనంగా చెప్పొచ్చు.

సాగుకు 'రైతుభరోసా'

పెట్టుబడి సాయం అందించే రైతుబంధు పథకాన్ని రైతుభరోసాగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మార్చిన విషయం తెలిసిందే. అయితే రైతుభరోసా పథకం కింద సాగులో లేని భూములకు పెట్టుబడి సాయం అందించబోమని తొలుత ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో కేబినెట్ సబ్‌కమిటీ పలుమార్లు సమావేశమై విధి విధానాలపై చర్చించింది. ఈ మేరకు సాగు భూములు, సాగులో లేకపోయినా రైతుబంధు పథకం కింద లబ్ధి పొందిన లెక్కలు తీసింది. దీంతో భూములున్నా, సాగు చేయకుండా 'పడావు'పెట్టిన భూముల యజమానులు కొంత ఆందోళన చెందారు. ఆ తర్వాత యాసంగి సీజన్‌లో పడావు పెట్టిన భూములను సాగు చేశారు. దీంతో రికార్డు స్థాయిలో 80 లక్షల ఎకరాల్లో యాసంగి పంటల సాగు జరిగింది.

వ్యవసాయంపై సమీక్ష

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం, రైతాంగానికే ఎక్కువ లబ్ధి చేకూర్చినా, ప్రభుత్వ అనుకూలంగా తగిన ప్రచారం లభించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. రైతు రుణమాఫీ కింద రూ. 21వేల కోట్లు, రైతుభరోసా కింద సుమారు రూ.5వేల కోట్లు నేరుగా రైతులకు సాయం అందించినా, ప్రజల్లోకి వెళ్లలేదనే భావన ఉంది. ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారుల తీరు పట్ల ఆయన కొంత అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో రైతు భరోసా కింద ఉన్న బకాయిలను కూడా ఈ నెలలోనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని భావిస్తున్నారు. పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించడం, ఉద్యాన వన పంటల విస్తీర్ణం పెంచడం వంటి అంశాలపై అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని అనుకుంటున్నారు. వీటన్నింటిపై ఈనెల 12న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోపాటు ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాలని సీఎం నిర్ణయించారు.

యాసంగిలో పెరిగిన ప్రధాన పంటల విస్తీర్ణం ఇలా (ఎకరాల్లో..)

పంట	2023-24	2024-25
వరి	51,92,350	59,84,302
మక్కలు	6,68,754	9,13,411
జొన్న	2,32,992	3,67,440
శనగ	2,55,368	2,22,772
వేరుశనగ	2,09,960	2,51,615
ఇతర పంటలు	2,23,934	2,56,762
మొత్తం	67,83,358	79,96,302

- వచ్చే వానాకాలం సీజన్‌లో పంటల విస్తీర్ణం అంచనా 1.34 కోట్ల ఎకరాలు

ముగిసిన మావోయిస్ట్ నేత 'పుల్లూరి' ప్రస్థానం?

కర్రి గుట్టల ఎన్‌కౌంటర్‌లో ప్రసాదరావు మృతి?


పుల్లూరి ప్రసాదరావు పుట్టి పెరిగిన ఇల్లు ఇదే (ఇన్‌సెట్‌లో పుల్లూరి ప్రసాదరావు ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): మావోయిస్ట్ కీలక నేత పుల్లూరి ప్రసాదరావు ఉరఫ్ చంద్రన్న అనేక ఎన్‌కౌంటర్లలో వెంట్రుకవాసిలో తప్పించుకున్నారు.. చివరకు తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రి గుట్టల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారనే వార్తలతో ఆయన స్వగ్రామమైన పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడ్కాపూర్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. 40 ఏళ్లుగా ఉద్యమంలో కొనసాగుతున్న ఆయన.. పలుసార్లు జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతి చెందినట్టు ప్రచారం జరిగినా, చాకచక్యంగా తప్పించుకున్నారు. తాజాగా కర్రి గుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన మృతి చెందినట్టు ప్రచారం జరుగుతోంది.

తండ్రి ఉపాధ్యాయుడు..

వడ్కాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడైన పుల్లూరి శ్రీనివాస్‌రావు–వరాలు దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు. పెద్దకుమారుడు అశోక్‌రావు, రెండో కుమారుడు పుల్లూరి ప్రసాదరావు, మూడో కుమారుడు తిరుపతిరావు, కూతురు అంజలి. ప్రసాదరావు స్వగ్రామంలోని ప్రభుత్వ బడిలోనే ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివారు. వృత్తిరీత్యా తండ్రి పెద్దపల్లిలో ఉండటంతో ఇంటర్ వరకు పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివారు. ఆ తర్వాత నక్సలిజం వైపు ఆకర్షితుడై అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలోనే కార్యకలాపాలు సాగించినట్టు సమాచారం. తెలంగాణలో మావోయిస్టులపై నిర్బంధం తీవ్రం కావడంతో ప్రసాదరావు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది.

కలుపుగోలుగా ఉండేవాడు

నేను, ప్రసాదరావు కలిసి వడ్కాపూర్ సర్కారు బడిలోనే ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుకున్నం. గ్రామంలో ఆయన ఎవరితోనూ ఎక్కువగా తిరిగేవాడు కాదు. వడ్డీ వ్యాపారులు నశించాలని అప్పుడప్పుడు అనేవాడు. ఎక్కువగా పేకాట ఆడుకునే వాళ్లం. ఇంటర్ చదువుతుండగా అజ్ఞాతంలోకి వెళ్లిన ప్రసాదరావు నేటికీ మాకు కనపడలేదు.
– చెన్నమనేని విద్యాసాగర్‌రావు, ప్రసాదరావు క్లాస్‌మేట్

క్లుప్తంగా...

మిగులు టీచర్లకు బదిలీ పాయింట్లు కేటాయించాలి
ఏపీటీఎఫ్ అమరావతి విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ప్రభుత్వం మార్చిన నిబంధనల మేరకు మిగులుగా మారుతున్న ఉపాధ్యాయులకు 2023 బదిలీల్లో కేటాయించిన మాదిరిగా స్టేషన్, రేషనలైజేషన్ పాయింట్లు మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాత, కొత్త పాఠశాలల మొత్తం సర్వీసును లెక్కించి గరిష్టంగా 8 సంవత్సరాల స్టేషన్ పాయింట్లు మంజూరు చేయాలి. రేషనలైజేషన్ పాయింట్లు ఇవ్వాలి. లేకపోతే మిగులు ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. 2023లో లాంగ్ స్టాండింగ్ కాకుండా బదిలీ అయిన వారికి ప్రస్తుత రేషనలైజేషన్ ద్వారా తీవ్ర అన్యాయం జరుగుతుంది. వీరికి పాత స్టేషన్ పాయింట్లతోపాటు రేషనలైజేషన్ పాయింట్లు కూడా ఇవ్వాలి. ఖాళీగా ఉన్న పోస్టును రేషనలైజేషన్ ద్వారా షిఫ్ట్ చేసినట్టుగానే.. 1 నుంచి 10వ తరగతి వరకు ఉన్న హైస్కూళ్లలోని మిగులు ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా నియమించాలి' అని కోరారు.

కుట్టు శిక్షణ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి
వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సవిత

సాక్షి, అమరావతి: మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను విధిగా కల్పించాలని రాష్ట్ర బీసీ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఈడీలు, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారులతో సెక్రటరీ సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జునతో కలిసి మంత్రి సవిత గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శిక్షణ కేంద్రాలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు(ఈడీలు) తరచూ సందర్శించాలని, వంద శాతం మేర లబ్ధిదారులు శిక్షణకు హాజరయ్యేలా చూడాలన్నారు. రోజూ శిక్షణ కేంద్రాలను పరిశీలించాలని, ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎండీ కార్యాలయ వాట్సాప్ గ్రూప్‌నకు పంపాలని మంత్రి సవిత ఆదేశించారు.

రాష్ట్రంలో బ్లూజే ఏరోస్పేస్ రూ.2,000 కోట్ల పెట్టుబడులు
మంత్రి బీసీ జనార్దన రెడ్డి

సాక్షి, అమరావతి: విమాన రంగంలో పెట్టుబడులు పెట్టడానికి బ్లూజే ఏరో స్పేస్ సంస్థ ముందుకు వచ్చినట్లు పెట్టుబడులు, మౌలిక వసతుల మంత్రి బీసీ జనార్దన రెడ్డి తెలిపారు.రూ.2,000 కోట్లతో ఏవియేషన్ రంగంలో కార్గో, ప్యాసింజర్ ఈవీ టోల్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనుందన్నారు. గురువారం సచివాలయంలో బ్లూజే సంస్థ వ్యవస్థాపకులు అమర్ శ్రీవాస్తవ్య, ఉత్తమ్‌కుమార్ మంత్రిని కలిసి పెట్టుబడుల ప్రతిపాదనలను వివరించారు.

ఆయుర్వేదం 'తప్పుడు' ప్రకటనలపై నిఘా కట్టుదిట్టం
అసత్య ప్రచారాలకు ఆరు నెలల జైలు శిక్ష

సాక్షి, అమరావతి: ప్రజలను తప్పుదారి పట్టించే ఆయుర్వేదం, సిద్ధ, యునాని వంటి సంప్రదాయ వైద్య విధానాల ప్రకటనలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఉమ్మడి 13 జిల్లాల్లో నిఘా వ్యవస్థను వైద్య శాఖ విస్తరించింది. ప్రతి జిల్లాలో ఒక ప్రభుత్వ ఆయుష్ వైద్యుడికి 'తప్పుదారి పట్టించే ప్రకటనలపై' చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం అప్పగించారు. ప్రస్తుతం అమలులో ఉన్న డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ (అద్భుత పరిష్కారాలు) చట్టం, 1954 ప్రకారం, మందుల వాస్తవ గుణాలకు విరుద్ధంగా చేసిన ప్రచారం నేరం. ముఖ్యంగా గర్భధారణ, గర్భస్రావం నివారణ, రుతుచక్ర లోపాలు, లైంగిక సామర్థ్యం వంటివాటిపై అద్భుత ప్రభావం చూపుతాయంటూ చేసే ప్రకటనలు నిషిద్ధం. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై ఆరు నెలల జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రకటనలు రూపొందించిన వారు, ప్రచురించిన వారు ఇద్దరూ శిక్షార్హులే. ఆధునిక వైద్య విధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించడంపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం, ఆయా అంశాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో వైద్య శాఖ తాజా చర్యలకు శ్రీకారం చుట్టింది.

వెబ్‌సైట్‌లో పదోతరగతి మార్కుల మెమోలు

సాక్షి, అమరావతి: పదో తరగతి మార్కుల మెమోలను పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్టు పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి లాగిన్ ద్వారా షార్ట్ మెమోలను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందించాలని సూచించారు. మార్కుల జాబితాల్లో ఏమైనా పొరపాట్లు గుర్తిస్తే పరీక్షల విభాగానికి తెలియజేయాలని సూచించారు.

ఎంపీపీల గౌరవ వేతనం విడుదల చేయాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మండలాధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు మంజూరు కావడం లేదని ఎంపీపీల సంక్షేమ సంఘం కన్వీనర్ మేకల హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవ వేతనాలతోపాటు వెహికల్ అలవెన్స్, కంటింజెంట్ వంటి ఆర్థిక అంశాలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

లోకలే బెటరొయ్య



'రెడీ టూ కుక్' పేరిట స్థానిక విక్రయాలపై రొయ్య రైతుల దృష్టి

- భీమవరం, వీరవాసరం, నరసాపురంలో ప్రత్యేక కౌంటర్లు
- ఇతర జిల్లాలకూ విస్తరించే యోచన
- ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో డోర్ డెలివరీ చేస్తున్న డెల్టా రైతు
- 'డొమెస్టిక్ సేల్స్'కు గతంలోనే కార్యాచరణ చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా 250 ఫిష్ ఆంధ్రా ఔట్‌లెట్స్ ఏర్పాటు

సాక్షి, భీమవరం: సిండికేట్ దోపిడీతో కుదేలవుతున్న ఆక్వా రంగాన్ని కాపాడుకునే దిశగా రొయ్యల రైతులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా లోకల్ మార్కెట్‌ను పెంచుకునే పనిలో పడ్డారు. ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి 'రెడీ టు కుక్' పేరిట రైతులే రొయ్యల అమ్మకాలు చేపడుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని భీమవరం, వీరవాసరం, నరసాపురంలో అమ్మకాలు మొదలుకాగా ఇతర జిల్లాలకూ విస్తరించే పనిలో నిమగ్నమయ్యారు.

'పశ్చిమ'లోనే 3 లక్షల టన్నుల ఉత్పత్తి

రాష్ట్రంలో 5.75 లక్షల ఎకరాల్లో ఆక్వా (రొయ్యలు, చేపల) చెరువులు ఉండగా.. అత్యధికంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే 2.63 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఇందులో 60 శాతం విస్తీర్ణంలో ఏటా సుమారు 3 లక్షల టన్నుల రొయ్యలను ఉత్పత్తి చేస్తున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. ఫీడ్, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, ఎక్స్‌పోర్టర్స్ ఏకమై రొయ్య ధరలను ఇష్టానుసారం తగ్గించడం, మేత ధరలను పెంచడంపై ఆక్వా రైతులు మండిపడుతున్నారు. వారి దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు జై భారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘం పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల్లో జూలై నుంచి సెప్టెంబర్ వరకు సాగు సమ్మెకు పిలుపునిచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే పలువురు రైతులు సాగు సమ్మెకు శ్రీకారం చుట్టి చెరువులను ఎండగట్టేశారు.

స్థానిక వినియోగం పెంచేందుకు..

రొయ్యలు ఎక్కువగా తినే దేశాల్లో ఏడాదికి తలసరి 10 నుంచి 12 కిలోల సగటు వినియోగంతో చైనా ముందుంటే.. 8–10 కిలోలతో అమెరికా రెండో స్థానంలో, 8 కిలోల సగటు వినియోగంతో యూరోపియన్ దేశాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచ దేశాలకు రొయ్యలు ఎగుమతి చేస్తున్న మన రాష్ట్రంలో మాత్రం రొయ్యల సగటు వినియోగం కేవలం 1.5 కిలోలు మాత్రమే. స్థానిక వినియోగం పెరిగేలా డొమెస్టిక్ సేల్స్ చేపట్టడం ద్వారా సిండికేట్ దోపిడీకి కళ్లెం వేయాలన్న యోచనలో రొయ్య రైతులు ఉన్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా వివిధ కౌంట్లలోని రొయ్యలను ప్రాసెసింగ్ చేసి 150 గ్రాముల నుంచి 300, 500 గ్రాములు, కిలో వరకు వివిధ పరిమాణాల్లో ప్యాకింగ్ చేసి అమ్మకాలు చేస్తున్నారు. భీమవరానికి చెందిన ఆక్వా రైతు గాదిరాజు వెంకట సుబ్బరాజు రైతు బజార్‌లో రొయ్యల రిటైల్ అమ్మకాలను ప్రారంభించారు. పశ్చిమ గోదావరి జిల్లా రొయ్య రైతుల ఆధ్వర్యంలో ప్రాన్స్ పర్చేజింగ్ డొమెస్టిక్ యూనిట్ పేరిట వీరవాసరంలో ఔట్‌లెట్ ఏర్పాటుచేశారు. రొయ్యల్లో ఉండే పోషకాలు, ఆరోగ్యానికి అవి చేసే మేలుపై కరపత్రాలు, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా ఇతర జిల్లాలకూ ఔట్‌లెట్లను విస్తరించే ఆలోచన చేస్తున్నట్టు ఆక్వా రైతులు చెబుతున్నారు.



తెలుగు రాష్ట్రాల్లో డోర్ డెలివరీ

నరసాపురానికి చెందిన ఆక్వా రైతు కర్రి రామకృష్ణ 'టేస్టీ ప్రాన్స్' పేరిట 4 నెలలుగా ప్రాసెసింగ్ చేసిన రొయ్య పప్పును ఆర్డరుపై ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వినియోగదారులకు డోర్ డెలివరీ చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తూ సగటున రోజుకు 200 కిలోల రొయ్య పప్పు విక్రయిస్తున్నారు. పాలకొల్లులో కొందరు రైతులు ఏకమై సుమారు రూ.30 లక్షలతో డొమెస్టిక్ సేల్స్ కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేస్తున్నారు. దీనిని త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. లాభాపేక్షతో కాకుండా రొయ్యల స్థానిక వినియోగం పెంచడమే లక్ష్యంగా కార్యాచరణ చేస్తున్నట్టు ఆక్వా రైతులు చెబుతున్నారు.



వైఎస్సార్‌సీపీ హయాంలోనే..

ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ రొయ్యలను స్థానిక వినియోగదారులకు డోర్ డెలివరీకి గతంలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్యాచరణ చేసింది. దీనికి ఏపీ రొయ్య రైతుల ఫెడరేషన్ అప్పట్లో ముందుకు వచ్చింది. ఎక్స్‌పోర్టు తరహాలో ప్రాసెస్ చేసిన రొయ్య పప్పు కిలోకు కౌంట్‌ను బట్టి రూ.600 నుంచి రూ.850 వరకు ధర నిర్ణయించారు. తొలుత ప్రయోగాత్మకంగా భీమవరం పరిసర ప్రాంతాల్లో అమలుచేసి తర్వాత రాష్ట్ర వ్యాప్తం చేయాలని భావించారు. అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేయగా.. ఎన్నికల హడావుడి మొదలవడంతో కార్యరూపం దాల్చలేదు. సీ ఫుడ్ డొమెస్టిక్ వినియోగం పెంచేందుకు అప్పట్లోనే ఫిష్ ఆంధ్రా పేరిట సబ్సిడీపై రూ.లక్ష నుంచి రూ.3 లక్షల విలువైన 250కు పైగా ఔట్‌లెట్లు ఏర్పాటు చేశారు. ఫోర్, టూ వీలర్స్‌ను అందించారు.

తెలుగు రాష్ట్రాల నుంచి ఆర్డర్స్



నాలుగు ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నాను. కొద్ది నెలల క్రితం సొంతంగా రొయ్యలు ప్రాసెసింగ్ చేసి డోర్ డెలివరీ చేయడం ప్రారంభించాం. తక్కువ ధరకే క్వాలిటీ రొయ్యపప్పు ఇవ్వడంతో లోకల్ సేల్స్‌తో పాటు ఏపీ, తెలంగాణ నుంచి ఆర్డర్లు బాగా వస్తున్నాయి.

– కర్రి రామకృష్ణ, ఆక్వా రైతు, నరసాపురం

లాభాలు ఆర్జించాలని కాదు



లాభాపేక్షతో కాకుండా అందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన రొయ్యలు అందించడమే మా ఉద్దేశం. స్థానిక వినియోగం పెరిగితే సిండికేట్ ఆగడాలకు కళ్లెం పడుతుంది. పాలకొల్లులో కొందరు రైతులు కలిసి యూనిట్ ఏర్పాటు చేస్తున్నాం. పనులు దాదాపు పూర్తికావచ్చాయి.

– బోణం చినబాబు, ఆక్వా రైతు, పాలకొల్లు

అదిగదిగో అలనాటి జీవన స్వర్గం!

అనగనగా ఓ కాలంలో.. సెల్ కోడి కూయకుండానే నిద్ర లేచేవారు.

కరెంటు, రెంటు, ఎక్స్‌ట్రా.. వంటి కష్టాలు లేకుండా ప్రకృతితో మమేకమయ్యేవారు. ఉదయాస్తమయాల మధ్య కాలాన్ని అత్యంత సహజంగా గడిపేవారు. పున్నమి వెలుగు, అమావాస్య చీకటి, వాసంతపు వేకువ, శరత్ కాలపు రాత్రుళ్ల కాలాన్ని ఆస్వాదించేవారు. ఆధునికత వచ్చింది. యంత్రాలను తెచ్చింది. బతుకుల్లో సహజత్వం మాయమైపోయింది. కూర్మ గ్రామం మళ్లీ ఆ సహజత్వానికి దగ్గరగా బతుకుతోంది. వందల ఏళ్ల కిందటి జీవన విధానాన్ని అనుసరిస్తోంది. ఆ బతుకుల్లో తీపిని రుచి చూపేందుకు వేసవిలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.



కూర్మగ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై యువతకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

- కూర్మ గ్రామంలో శ్రమైక జీవన సౌందర్యం
- యువతకు వేసవి శిక్షణ శిబిరాలు
- ప్రకృతి ప్రసాదం, సనాతన ధర్మ విస్తరణ లక్ష్యం

హిరమండలం: కరెంటు లేని నివాసాలు.. రసాయనాలు లేని పంటలు, ఆధునికత అంటని బతుకులు.. వెరసి కూర్మ గ్రామం. శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండల పరిధిలోని అంతకాపల్లి అడవుల్లో కనిపిస్తుందీ గ్రామం. కృష్ణ చైతన్య సమాజం పేరుతో 2018లో గ్రామం ఏర్పాటైంది. భక్తి వేదాంతస్వామి ప్రభుపాదుల ఆదేశాల మేరకు భక్తి వికాస్‌స్వామి ఆధ్వర్యంలో ఈ పల్లె ఏర్పడింది. ఏడాది పొడవునా ఇక్కడకు వేలాది మంది భక్తులకు తరలివస్తుంటారు. కాగా ప్రస్తుతం కూర్మ గ్రామంలో యువతకు నెల రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

అన్నీ సొంతంగానే..

కూర్మ గ్రామంలో 80 మంది వరకూ నివాసముంటున్నారు. 20 వరకూ గృహస్తు జీవన కుటుంబాలు ఉన్నాయి. ఓ 20 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. ఆరుగురు బ్రహ్మచర్యం పాటిస్తున్నారు. సరళ జీవనం, ఉన్నత చింతన వీరి విధానం. మనిషికి నిత్యావసరాలుగా భావించే కూడు, గూడు, గుడ్డ ప్రకృతి నుంచే పొందవచ్చని నిరూపిస్తున్నారు. ప్రకృతి సేద్యంతోనే వీటిని సంపాదించుకుంటున్నారు. ఏడాదిలో వీరికి అవసరమైన వందలాది బస్తాల ధాన్యాన్ని పండిస్తుంటారు. టన్నుల కొద్దీ కూరగాయలను సాగు చేస్తున్నారు. అక్కడ గృహస్తులతో పాటు విద్యార్థులు, ఏడాది పొడవునా ఇక్కడకు వచ్చే భక్తులకు వాటితోనే ఆహారం తయారుచేసి అందిస్తుంటారు. దంపుడు బియ్యాన్ని మాత్రమే వండుకుంటారు. వారి దుస్తులను వారే తయారుచేసుకుంటారు. ఇళ్లకు వారే మేస్త్రీలు, కూలీలు. ఇసుక, సున్నం, బెల్లం, మెంతులు, కరక్కాయలు, మినుములు మిశ్రమంగా చేసి గానుగ ఆడిస్తారు. గుగ్గిలం మరగబెట్టిన మిశ్రమంతో కలిపి ఇళ్లు కట్టుకున్నారు. కుంకుడు కాయ రసంతోనే దుస్తులను ఉతుక్కుంటారు.

వర్ణాశ్రమ విద్య..

ఇక్కడ విద్యార్థులు వర్ణాశ్రమ విద్యను అభ్యసిస్తుంటారు. పూర్వపు గురుకులాలతరహాలో ఇక్కడ వాతా వరణం ఉంటుంది. విద్యార్థులు సంస్కృతం, ఇంగ్లిష్, హిందీ, తెలుగులో అనర్గళంగా మాట్లాడతారు. వయసు, ఆసక్తిని బట్టి చేతివృత్తులపై శిక్షణ ఇస్తారు. మనిషిని సనాతన మార్గం వైపు నడిపించాలన్నదే కృష్ణచైతన్య సమాజం కూర్మ గ్రామం ఏకైక లక్ష్యం. అందుకే ఒక ఇంటితో ప్రారంభమైన ఈ శ్రీకారం ఇప్పుడు దాదాపు 80 ఇళ్ల వరకూ చేరుకుంది.

ఏటా యువతకు శిక్షణ

ప్రకృతి సమాజాన్ని విస్తరించాలని.. సనాతన ధర్మం వైపు ఈ సమాజం అడుగులు వేయాలని ఏటా యువతకు ఇక్కడ వేసవి శిబిరాలు ఏర్పాటుచేస్తున్నారు. నెలరోజుల పాటు చేతివృత్తులు, పురాతన జీవన విధానం, సనాతన ధర్మం వంటి వాటిపై అవగాహన కల్పిస్తారు. అందులో భాగంగానే ఈ నెల 1 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. వర్ణాశ్రమ కళాశాలలో ఈ శిబిరాలు నెల రోజుల పాటు కొనసాగుతాయి. చేనేత మగ్గం, మట్టికుండల తయారీ, వడ్రంగి, కర్రసాము, నూనెగానుగ, సున్నం గానుగ, వైదిక గృహ నిర్మాణం, ప్రకృతి వ్యవసాయం, గో సంరక్షణ, ఆయుర్వేదం వంటి వాటిపై ఇక్కడ శిక్షణ ఇస్తారు. మరోవైపు ఆధ్యాత్మిక కార్యక్రమాల శిక్షణ కూడా ఉంటుంది. మంత్రధ్యానం, శ్రవణం, కీర్తనం, వైదిక జీవన ప్రాముఖ్యత, రసాయనాలు లేని ఆహారం, మనస్సుకు, శరీరానికి అనుకూలమైన జీవన విధానం, గృహస్థ జీవన శిక్షణ, బ్రహ్మచారి శిక్షణ, సంస్కృత సంభాషణ అభ్యాసనం, మృదంగం, కరతాళ వాదనం శిక్షణ వంటి అంశాలపై నెలరోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనుంది.



వైదిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు,యువత



సామూహికంగా అన్నప్రసాదం స్వీకరిస్తున్న దృశ్యం

జీవిత లక్ష్యంపై అవగాహన



మనిషి జీవిత లక్ష్యంపై అవగాహన కల్పించడమే కృష్ణచైతన్యం. వర్ణాశ్రమ కళాశాలలో బతుకు తెరువు, వృత్తి కళలపై శిక్షణ ఇస్తున్నాం. నెల రోజుల పాటు వేసవి శిబిరాలు కొనసాగుతాయి. గుజరాత్, పంజాబ్, కర్ణాటక, తమిళనాడులో కూర్మ లాంటి గ్రామాలను నెలకొల్పాం. హంగేరిలో అయితే 800 ఎక రాల విస్తీర్ణంలో గ్రామం విస్తరిస్తోంది. చెక్ రిపబ్లిక్‌లోనూ ఒక పల్లె ఉంది.

– నటేకర్ నరోత్తమదాస్, వర్ణాశ్రమ బోధకుడు, కూర్మ గ్రామం

ప్రైవేటు చేతుల్లోకి నిఘా నేత్రం



రాష్ట్రంలో ప్రైవేటు సంస్థలకు సెక్యూరిటీ కెమెరాల నిర్వహణ

- అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిరంతర నిఘా
- 15 వేల కెమెరాల సమాచారం ఏఐ/ఎంఎల్ ఆధారంగా విశ్లేషణ
- నాలుగేళ్లపాటు నిర్వహణ కోసం బిడ్లు కోరిన ఏపీఎస్ఎఫ్ఎల్

సాక్షి, అమరావతి : స్వర్ణాంధ్ర–2047లో భాగంగా రాష్ట్రంలో సుస్థిరమైన భద్రత, రక్షణ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వచ్చే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిఘా నేత్రాల ఏర్పాటు, పర్యవేక్షణను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు, మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారులు, ఆరోగ్య శాఖ, తదితర ప్రభుత్వ విభాగాలకు చెందిన సీసీ టీవీ కెమెరాలను నిరంతరం పర్యవేక్షించే బాధ్యతను ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతోంది. రాష్ట్రంలో వచ్చే నాలుగేళ్లపాటు సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించడానికి ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానిస్తూ ఏపీ ఫైబర్‌నెట్ తాజాగా టెండర్లు పిలవడమే ఇందుకు ఉదాహరణ. ఎంపికైన సంస్థ.. ఏదైనా ఘటన జరిగితే లైవ్ అలెర్ట్‌లు ఇవ్వడం, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిరంతర నిఘా కొనసాగిస్తుంది. ఆటోమేటిక్‌గా నంబర్ ప్లేట్, ముఖాలను గుర్తించే వ్యవస్థ ఏర్పాటు చేస్తుంది. భారీ బహిరంగ సభలు, శాంతి భద్రతలు, ట్రాఫిక్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మిషన్ లెర్నింగ్ (ఎంఐ)లతో విశ్లేషించనుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డేటాను క్రోడీకరించి ఆర్టీజీఎస్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌కు పంపించాల్సి ఉంటుంది.

ప్రతి నగరం, పట్టణంపై నిఘా

ఈ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలోని ప్రతి నగరం, పట్టణం, జిల్లా సరిహద్దులు, ముఖ్యమైన సెంటర్లు, జంక్షన్లు, ప్రధాన భవనాలకు వెళ్లే రహదారులు, ప్రభుత్వ బిల్డింగ్‌లు, ముఖ్యమైన ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు, షాపింగ్ మాల్స్, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాలు, టాక్సీ స్టాండ్‌ల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలి. సిటీ ఫ్లైఓవర్స్, వంతెనలు, విద్యుత్ ప్లాంట్లు, విద్యుత్ సరఫరా స్టేషన్లు, మంచినీటి సరఫరా, పంపింగ్ స్టేషన్లు, వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్స్, జనాభా అత్యధికంగా గుమికూడే ప్రాంతాల్లో కూడా నిఘాను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. నిరంతరం ఈ డేటాను విశ్లేషించడం కోసం సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో పాటు ప్రతి జిల్లాలో ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రత్యేక వ్యూయింగ్ సెంటర్లు, మొబైల్ కమాండ్ కంట్రోల్ సెంటర్లు.. స్మార్ట్‌ఫోన్ల ద్వారా నిర్వహించేలా ఏర్పాటు చేయాలి. ఇందుకోసం కొత్తగా 300 ఆధునిక కెమెరాలతో పాటు ఇప్పటికే ఉన్న14,770 కెమెరాలను అనుసంధానం చేస్తారు. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ 12 నెలల్లోగా ఏఐ బేస్ట్ సీసీటీవీ సర్వైలెన్స్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది.

మైనారిటీ విదేశీ విద్యపై సర్కారు నిర్లక్ష్యం

ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్ మీరా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మైనారిటీ విద్యార్థుల విదేశీ విద్యా పథకాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా గురువారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మైనారిటీ సమాజాన్ని మోసం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన మైనారిటీ విద్యార్థులకు అందించాల్సిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఓవర్సీస్ ఎడ్యుకేషన్ స్కీమ్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి కేవలం రూ.20 కోట్లు కేటాయించారని, దానిలో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. జూన్, జూలై, ఆగస్టు నుంచి విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు ప్రారంభమవుతున్నప్పటికీ పథకానికి సంబంధించిన నోటిఫికేషన్ వెలువడకపోవడం వల్ల విద్యార్థులు అడ్మిషన్, వీసా ప్రక్రియల్ని కొనసాగించలేని పరిస్థితిలో ఉన్నారన్నారు.


పాలిటెక్నిక్ వాల్యుయేషన్‌లో గందరగోళం

- అర్ధంతరంగా నిలిపివేత..
- మూల్యాంకనం నుంచి కాంట్రాక్టు లెక్చరర్ల తొలగింపు

సాక్షి, అమరావతి : పాలిటెక్నిక్ విద్యార్థుల పరీక్ష పేపర్ల వాల్యుయేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం గందరగోళాన్ని సృష్టిస్తోంది. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులతో చేయిస్తున్న మూల్యాంకనాన్ని అర్ధంతరంగా నిలిపివేసింది. కాంట్రాక్టు అధ్యాపకులెవ్వరూ వాల్యుయేషన్‌లో ఉండకూడదని అధికారులు బుధవారం రాత్రి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు మెయిల్స్ ద్వారా ఆదేశాలు జారీచేయడం చర్చనీయాంశంగా మారింది. దీంతో.. గురువారం ఉదయం చాలామంది కాంట్రాక్టు అధ్యాపకులు వాల్యుయేషన్ చేస్తున్న పేపర్లను సగంలోనే తిరిగి ఇచ్చేశారు. గుంటూరు, విజయవాడలోని సెంట్రల్ క్యాంపుల్లో ఫైనలియర్ విద్యార్థుల పేపర్లను వీరు వాల్యుయేషన్ చేపట్టారు. మిగిలిన విద్యార్థుల పేపర్లను కళాశాలలకే తిప్పి పంపిస్తున్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులపై కూటమి సర్కారు కక్ష..

నిజానికి.. పరీక్షలు ముగియగానే సంబంధిత సబ్జెక్టు లెక్చరర్లు పేపర్లను వాల్యూ చేస్తున్నారు. చాలామంది కాంట్రాక్టు అధ్యాపకులతో సాంకేతిక విద్యాశాఖ ఈ ప్రక్రియ చేపట్టింది. అయితే, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరిపై కక్షగట్టింది. గత ప్రభుత్వంలో స్వల్ప విరామంతో 12 నెలల పూర్తి జీతం అందుకుని సమర్థవంతంగా సేవలందించిన వీరికి ఇప్పుడు కష్టాలు మొదలయ్యాయి. ఏప్రిల్ 30తో కాంట్రాక్టు గడువు ముగిసి రెన్యువల్ కోసం ఎదురుచూస్తున్నారు. అయినా.. ప్రభుత్వం వీరి సేవలను రెన్యూవల్ చేయకుండా ఈ నెలకు 'నో వర్క్–నో పే' అంటూ ప్రకటించింది. పైగా.. గతేడాది కూడా మేలో అందించిన సేవలకు ఇప్పటివరకూ వేతనం ఇవ్వలేదు. మరోవైపు.. పరీక్ష పేపర్ల మూల్యాంకనాన్ని ప్రభుత్వం ప్రైవేటు లెక్చరర్లతో కొనసాగిస్తోంది.






శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 71,001 మంది స్వామివారిని దర్శించుకోగా 28,637 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.25 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైభవంగా కోన బ్రహ్మోత్సవాలు

రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలు జరిపించుకొనేందుకు గోనుపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీతో కలసి అత్తారింటి నుంచి కోనకు బయలుదేరారు. కొత్త అల్లుడు ఉభయనాంచారులతో కలసి పెంచలకోనకు చేరుకోవడంతో శ్రీపెనుశిల నరసింహుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమైనట్లు ఆలయ ప్రధాన అర్చకులు పెంచలస్వామి, సీతారామయ్యస్వామి తెలిపారు.



విలీన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

సాక్షి, అమరావతి: ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు సర్వీసు విషయంలో విద్యాశాఖ స్పష్టతనివ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. జీవో నం.50 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం 2022 మార్చి నుంచి విడతల వారీగా 3200 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేశారని గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్‌కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి గుర్తు చేశారు. ఆయా ఉపాధ్యాయులకు ప్రస్తుత కౌన్సిలింగ్‌లో స్టేషన్ సర్వీస్ మూడేళ్లు మాత్రమే ఉందన్నారు. ఈ క్రమంలో పదోన్నతుల్లో ఎయిడెడ్ ఉపాధ్యాయుల పూర్తి సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

రీ రిలీజ్

● మళ్లీ ప్రేక్షకుల ముందుకు హిట్ బొమ్మలు

చిత్ర పరిశ్రమలో ఒక్కోసారి ఒక్కో ట్రెండ్ కొనసాగుతుంటుంది. అదే కోవలో ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో రీ రిలీజ్‌ల ట్రెండ్ కొనసాగుతోంది. గతంలో హిట్‌గా నిలిచిన సినిమాలను రీ రిలీజ్ చేసేందుకు అమితాసక్తి చూపిస్తున్నారు మేకర్స్. హీరోల పుట్టినరోజు కావచ్చు.. లేదా ఆ సినిమాకి సంబంధించి ఏదైనా ప్రత్యేకమైన రోజు కావచ్చు.. లేకుంటే ఆ సినిమాకి ఉన్న ప్రత్యేకమైన క్రేజ్... ఇలా సందర్భాలను బట్టి తమ సినిమాలను రీ రిలీజ్ చేసేందుకు హీరోలు, దర్శక-నిర్మాతలు ఆసక్తి చూపిస్తున్నారు. పైగా హిట్ సినిమాలను రీ రిలీజ్ చేస్తుండటంతో ఆయా హీరోల అభిమానులతో పాటు ప్రేక్షకులు కూడా చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు వస్తున్నాయి. ఆ కోవలో భాగంగా ఈ నెలలో 'జగదేక వీరుడు అతిలోక సుందరి, దేశముదురు, జల్సా, యమదొంగ, వర్షం, ఖలేజా' వంటి హిట్ బొమ్మలు (చిత్రాలు) ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. ఆ విశేషాలేంటో చూద్దాం....



ముప్పై ఐదేళ్ల తర్వాత...

ముప్పై ఐదేళ్ల తర్వాత జగదేక వీరుడు అతిలోక సుందరి మరోసారి ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. చిరంజీవి హీరోగా నటించిన సూపర్ హిట్ చిత్రాల్లో 'జగదేకవీరుడు అతిలోక సుందరి' ఒకటి. ఈ సినిమాలో శ్రీదేవి హీరోయిన్‌గా నటించారు. కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు అమ్రిష్ పురి, అల్లు రామలింగయ్య, కన్నడ ప్రభాకర్, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, రామిరెడ్డి, బేబీ షాలినీ, బేబీ షామిలీ వంటి వారు కీలక పాత్రలు పోషించారు. వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్వనీదత్ నిర్మించిన ఈ సినిమా 1990 మే 9న విడుదలైంది. సోషియో ఫ్యాంటసీ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లింది. ఈ సినిమాకి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఇళయరాజా సంగీతం అందించిన ఈ చిత్రంలోని పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. చిరంజీవి కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచిన సినిమా ఇది. ఈ చిత్రం విడుదలై 35 ఏళ్లు అవుతున్న సందర్భంగా నేడు ఈ సినిమా రీ రిలీజ్ అవుతోంది. అప్పట్లో ఈ సినిమాని రీల్ రూపంలో ప్రదర్శించారు. అయితే ఇప్పుడంతా డిజిటల్ మయం కావడంతో రీల్‌లో రిలీజ్ చేయడం కుదరదు. అందుకే 2018 నుంచి 'జగదేకవీరుడు అతిలోక సుందరి' నెగటివ్ రీల్ కోసం వెతుకులాట మొదలుపెట్టిన యూనిట్‌కి.. 2021లో విజయవాడలోని అప్పారావు అనే వ్యక్తి వద్ద ఒక ప్రింట్ రీల్ దొరికింది. ఆ రీల్ కూడా దుమ్ము, ధూళి పట్టడం.. అక్కడక్కడా గీతలు పడటంతో పెరిగిన సాంకేతికతని బేస్ చేసుకుని ఎంతో శ్రమించి రీల్‌లోని ఈ సినిమాని 8కే రెజల్యూషన్‌లో డిజిటలైజ్ చేసి 4కే ఔట్‌పుట్‌గా మార్చారు మేకర్స్. ఈ ప్రింట్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని చిత్రయూనిట్ చెబుతోంది. 2డీతో పాటు ఈ చిత్రం 3డిలోనూ విడుదల కానుండటం విశేషం.







దేశముదురు మళ్లీ వస్తున్నాడు...

తెలుగు ప్రేక్షకులను అలరించడానికి మరోసారి వస్తున్నాడు దేశముదురు. అల్లు అర్జున్ హీరోగా నటించిన చిత్రం 'దేశముదురు'. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ద్వారా హన్సిక టాలీవుడ్‌కి పరిచయమయ్యారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మించిన ఈ చిత్రం 2007 సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదలై, సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ సినిమాలో తొలిసారి సిక్స్‌ప్యాక్ బాడీలో కనిపించారు అల్లు అర్జున్. సన్యాసిగా మారిన వైశాలిని (హన్సిక) ప్రేమించి, ఆ ప్రేమ కథను సుఖాంతం చేసుకునే బాల గోవింద్ పాత్రలో అల్లు అర్జున్ నటించారు. ఈ చిత్రానికి దివంగత మ్యూజిక్ డైరెక్టర్ చక్రి సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అప్పట్లో ఈ సినిమాలోని పాటలు ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచాయనడం అతిశయోక్తి కాదు. బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన ఈ సినిమా పద్దెనిమిదేళ్ల తర్వాత రీ రిలీజ్‌కి ముస్తాబైంది. ఈ నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు మేకర్స్.

కరో కరో జల్సా...

'హే సరిగమ పదనిస కరో కరో జర జల్సా...' అంటూ మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నారు పవన్ కల్యాణ్. ఆయన హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'జల్సా'. ఇలియానా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో పార్వతీ మిల్టన్, కమలినీ ముఖర్జీ, ప్రకాశ్‌రాజ్, బ్రహ్మానందం, అలీ, ముఖేష్ రిషి వంటి వారు కీలక పాత్రలు పోషించారు. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ నిర్మించిన ఈ చిత్రం 2008 ఏప్రిల్ 1న రిలీజై హిట్‌గా నిలిచింది. నక్సలైట్ (మావోయిస్టు) నుంచి జనజీవన స్రవంతిలో కలిసిపోయిన సంజయ్ సాహు పాత్రలో పవన్ కల్యాణ్ నటించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఈ సినిమాకి ప్లస్‌గా మారింది. 17ఏళ్ల తర్వాత ఈ సినిమా రీ రిలీజ్ కానుంది. ఈ నెల 16న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు.

పుట్టినరోజు కానుకగా...

'రేయ్.. పులిని దూరం నుంచి చూడాలనిపించిందనుకో చూసుకో... పులితో ఫొటో దిగాలనిపించిందనుకో కొంచెం రిస్క్ అయినా పర్లేదు ట్రై చేయొచ్చు... సరే చనువు ఇచ్చింది కదా అని పులితో ఆడుకుంటే మాత్రం వేటాడేస్తది' అంటూ 'యమదొంగ' సినిమాలో ఎన్టీఆర్ చెప్పిన డైలాగులు ఎంత పాపులర్ అయ్యాయో తెలిసిందే. ఆయన హీరోగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'యమదొంగ'. ఈ సినిమాలో ప్రియమణి హీరోయిన్‌గా నటించగా మంచు మోహన్‌బాబు, మమతా మోహన్‌దాస్, బ్రహ్మానందం, ఎమ్మెస్ నారాయణ, ఖుష్బు వంటి వారు కీలక పాత్రలు పోషించారు. హీరోయిన్ రంభ ఈ చిత్రంలో 'నాచోరే నాచోరే...' అంటూ ఎన్టీఆర్‌తో కలిసి తనదైన డ్యాన్సుతో అదరగొట్టారు. సోషియో ఫ్యాంటసీ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రాజా అనే దొంగ పాత్రలో ఎన్టీఆర్ నటించారు. యమధర్మ రాజు పాత్రలో మోహన్ బాబు నట విశ్వరూపం చూపించారు. రమా రాజమౌళి సమర్పణలో చెర్రీ, ఊర్మిళ నిర్మించిన ఈ సినిమా 2007 ఆగస్టు 15న రిలీజై సూపర్ హిట్‌గా నిలిచింది. అంతేకాదు.. ఎన్టీఆర్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచింది. ఈ చిత్రానికి కీరవాణి సంగీతం కూడా ప్లస్ అయ్యింది. ఈ సినిమాని 17 ఏళ్ల తర్వాత రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ నెల 20న ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా ఈ మూవీని ఈ నెల 18న రిలీజ్ చేస్తున్నారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని 4కేలో రీ రిలీజ్ చేస్తున్నారు.







బాహుబలి రిటర్న్స్

ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన బ్లాక్‌బస్టర్ మూవీ 'బాహుబలి'. అనుష్కా శెట్టి, తమన్నా, రానా, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మించారు. ఈ చిత్రం తొలి భాగం 'బాహుబలి: ది బిగినింగ్' 2015 జూలై 10న విడుదల కాగా, రెండో భాగం 'బాహుబలి: ది కన్‌క్లూజన్' 2017 ఏప్రిల్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ రెండు చిత్రాలూ బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. కాగా ఈ ఏడాది అక్టోబరులో 'బాహుబలి' సినిమాను రీ రిలీజ్ చేయనున్నట్లు నిర్మాతల్లో ఒకరైన శోభు యార్లగడ్డ అధికారికంగా ప్రకటించారు. అదికూడా కేవలం ఇండియాలోనే కాదు.. అంతర్జాతీయంగా కూడా రీ రిలీజ్ చేయనున్నారు. అయితే రీ రిలీజ్‌లో కొన్ని సర్‌ప్రైజ్‌లు కూడా ఉంటాయని ఆయన చెప్పడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. ఇదిలా ఉంటే విడుదల తేదీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.



అతడొస్తున్నాడు

మహేశ్‌బాబు కెరీర్‌లో హిట్‌గా నిలిచిన చిత్రాల్లో 'అతడు' ఒకటి. మహేశ్‌బాబు, డైరెక్టర్ త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందిన తొలి చిత్రమిది. త్రిష హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో ప్రకాశ్‌రాజ్, నాజర్, తనికెళ్ల భరణి, బ్రహ్మానందం వంటి వారు కీలక పాత్రలు పోషించారు. దుగ్గిరాల కిశోర్, రామ్మోహన్ నిర్మించిన ఈ చిత్రం 2005 ఆగస్టు 10న విడుదలై, హిట్‌గా నిలిచింది. దాదాపు 19 ఏళ్ల తర్వాత ఈ సినిమా రీ రిలీజ్ కానుంది. అది కూడా మహేశ్‌బాబు బర్త్‌డే కానుకగా. ఆగస్టు 9న ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా 'అతడు' చిత్రాన్ని మళ్లీ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. అంతేకాదు... ఈ చిత్రాన్ని ఐమ్యాక్స్ వెర్షన్‌లోకి మార్చి 4కె, డాల్బీ అట్మాస్ టెక్నాలజీతో రిలీజ్ చేయబోతున్నారు. ఇలా రీ రిలీజ్ విషయంలోనూ మహేశ్‌బాబు సరికొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేయబోతున్నారు.

వర్షం వస్తోంది...

మండు వేసవిలో థియేటర్లలో ప్రేక్షకులపై చల్లని వర్షపు జల్లులు కురిపించనున్నారు ప్రభాస్. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'వర్షం'. శోభన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటించారు. హీరో గోపీచంద్ విలన్ పాత్ర పోషించారు. ఎంఎస్ రాజు నిర్మించిన ఈ చిత్రం 2004 సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 'ఈశ్వర్, రాఘవేంద్ర' వంటి చిత్రాల తర్వాత ప్రభాస్ నటించిన మూడో చిత్రం 'వర్షం'. ఈ చిత్రం ఆయన కెరీర్‌ను మలుపు తిప్పింది. అంతేకాదు కెరీర్ ఆరంభంలో యూత్‌లో ప్రభాస్‌కు మంచి ఫాలోయింగ్‌ని, ఫ్యాన్స్‌ని తెచ్చిపెట్టిన చిత్రం ఇదే. వెంకట్ (ప్రభాస్), శైలు (త్రిష) ప్రేమకథకి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ప్రభాస్–గోపీచంద్ మధ్య వచ్చే పోరాట సన్నివేశాలు ప్రేక్షకులను అలరించాయి. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఈ చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలిచింది. కాగా 25 ఏళ్ల తర్వాత 'వర్షం' చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ నెల 23న 4కే వెర్షన్‌లో ఈ సినిమా విడుదలవుతోంది.

మళ్లీ ఖలేజా...

హీరో మహేశ్‌బాబు ఖలేజా చూపించనున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో మహేశ్‌బాబు, అనుష్క జోడీగా నటించిన చిత్రం 'ఖలేజా'. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో సునీల్, అలీ, తనికెళ్ల భరణి, ప్రకాశ్‌రాజ్, రావు రమేశ్ కీలక పాత్రలు పోషించారు. ఎస్. సత్యరామ్మూర్తి సమర్పణలో సింగనమల రమేశ్‌బాబు, సి. కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం 2010 అక్టోబరు 7న విడుదలైంది. మహేశ్‌బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్ కావడం, మణిశర్మ సంగీతంలోని పాటలకు మంచి స్పందన రావడం... వంటి భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా వెండితెర ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయింది. కానీ, బుల్లితెర ప్రేక్షకులను మాత్రం విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పటికీ టీవీలో ఈ సినిమాని విరగబడి చూసేవాళ్లు ఉన్నారనడం అతిశయోక్తి కాదేమో. బహుశా.. అందుకేనేమో.... పద్నాలుగేళ్ల తర్వాత ఈ సినిమాని మరోసారి వెండితెర ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. ఈ నెల 30న 'ఖలేజా' రీ రిలీజ్‌కి సన్నాహాలు చేస్తున్నారట చిత్రయూనిట్. ఈ వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మరి... ప్రచారంలో ఉన్నట్లు 'ఖలేజా' ఈ నెల 30న రిలీజ్ అవుతుందా? లేదా? అన్నది తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాలి.

– దేరంగుల జగన్ మోహన్

బర్త్ డేకి టైటిల్ గిఫ్ట్


● రామ్, పి.మహేశ్‌బాబు

రామ్ హీరోగా పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ పీరియాడికల్ లవ్‌స్టోరీ మూవీలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్నారు. రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు. ఈ చిత్రంలో సాగర్ పాత్రలో రామ్, మహాలక్ష్మి పాత్రలో భాగ్యశ్రీ బోర్సే కనిపిస్తారు. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. కాగా...ఈ నెల 15న (గురువారం) రామ్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించనున్నట్లుగా మేకర్స్ గురువారం వెల్లడించారు. సో.. బర్త్ డేకి ఈ సినిమా టైటిల్‌ను ఫ్యాన్స్‌కు గిఫ్ట్‌గా ఇస్తున్నట్లున్నారు హీరో రామ్. ఈ సినిమాకు సంగీతం: వివేక్ – మెర్విన్, కెమెరా: సిద్ధార్థ్ నూని.


● విష్ణు మంచు

యాక్షన్ కన్నప్ప

విష్ణు మంచు హీరోగా నటించిన తాజా చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్ బాబు, ఆర్.శరత్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్, బ్రహ్మానందం ఇతర కీలక పాత్రల్లో నటించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది. ప్రస్తుతం 'కన్నప్ప' సినిమా అమెరికా ప్రమోషన్ టూర్‌లో బిజీగా ఉన్నారు విష్ణు మంచు. కాగా ఈ సినిమాలోని మేజర్ యాక్షన్ సీక్వెన్స్‌లకు తాను స్టంట్ కొరియోగ్రాఫర్‌గా చేసిన విషయాన్ని విష్ణు మంచు 'ఎక్స్' వేదికగా తెలిపారు. ''మార్షల్ ఆర్ట్స్‌లో నేను ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను. లాస్ ఏంజిల్స్‌లో స్టంట్ మేన్‌గా వర్క్ చేశాను. తెలుగు స్టంట్ యూనియన్ సభ్యుడిగా కూడా నేను గర్వపడుతున్నాను. ఇదంతా నేను యాక్టర్ కాకముందే చేశాను. ఈ విషయం చాలామందికి తెలియక పోవచ్చు. అయితే 'కన్నప్ప' సినిమాకు షో రన్నర్‌గా చేస్తూనే, ఈ సినిమాలోని చాలా యాక్షన్ సీక్వెన్స్‌లను నేనే డిజైన్ చేశాను. ఈ యాక్షన్ సీక్వెన్స్‌లకు ప్రాణం పోసిన కెచా మాస్టర్‌కు ధన్యవాదాలు'' అంటూ 'ఎక్స్'లో పేర్కొన్నారు విష్ణు మంచు. అలాగే 'కన్నప్ప' చిత్రంలోని యాక్షన్ సీక్వెన్స్‌ల మేకింగ్ వీడియోను కూడా షేర్ చేశారు విష్ణు మంచు.

త్రీ రోజెస్


● రాశీ సింగ్

ఈషా రెబ్బా, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, 'సత్యం' రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్'. ఆహా ఓటీటీలో సూపర్ హిట్‌గా నిలిచిన ఈ సిరీస్‌కు సీజన్ 2 రాబోతోంది. ఇందులో ఈషా రెబ్బా, కుషిత కల్లపు, రాశీ సింగ్ లీడ్ రోల్స్‌లో నటించారు. డైరెక్టర్ మారుతి షో రన్నర్‌గా వ్యవహరిస్తున్న 'త్రీ రోజెస్' సీజన్ 2కి రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా, కిరణ్ కె.కరవల్ల దర్శకత్వం వహించారు. మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సిరీస్ ఆహా ఓటీటీలో త్వరలో స్ట్రీమింగ్ కానుంది. ఇదిలా ఉంటే.. 'త్రీ రోజెస్' సీజన్ 2 నుంచి రాశీ సింగ్ గ్లింప్స్ రిలీజ్ చేశారు మేకర్స్. ఆమె ఎందుకు ట్రెడిషనల్ నుంచి మోడ్రన్‌గా మారారు? అనేది గ్లింప్స్‌లో ఆసక్తి కలిగిస్తోంది. 'త్రీ రోజెస్' సీజన్ 2 నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన ఈషా రెబ్బా, కుషిత కల్లపు గ్లింప్స్‌లకు మంచి స్పందన వచ్చింది. రాశీ సింగ్ క్యారెక్టర్ గ్లింప్స్‌కి కూడా అద్భుతమైన స్పందన వస్తోంది'' అని మేకర్స్ పేర్కొన్నారు.

ఎఫ్‌ఎంసీజీ అమ్మకాల్లో వృద్ధి 5 శాతమే

- ధరల పెంపుతో మరో 5.6% వృద్ధి
- మార్చి త్రైమాసికంలో నమోదు
- నీల్సన్‌ఐక్యూ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ పరిశ్రమలో వృద్ధి కాస్తంత నిదానించింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో అమ్మకాలు (పరిమాణం పరంగా) 5.1 శాతం పెరిగాయి. కానీ, క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో అమ్మకాలు 6.1 శాతం వృద్ధి చెందడం గమనార్హం. వినియోగదారులు తక్కువ ధరల ప్యాక్‌లను కొనుగోలు చేయడానికి మొగ్గు చూపిస్తున్నట్టు నీల్సన్‌ఐక్యూ నివేదిక వెల్లడించింది. అమ్మకాల్లో వృద్ధి తగ్గడం ఎఫ్‌ఎంసీజీ పరిశ్రమలోని దాదాపు అన్ని విభాగాల్లోనూ నమోదైంది. ఆహారోత్పత్తులతో పోల్చితే ఆహారేతర ఉత్పత్తుల విభాగం కాస్త మెరుగైన ప్రదర్శన చూపించింది. చిన్న ప్యాక్‌లు ఎక్కువగా అమ్ముడుపోయే గ్రామీణ మార్కెట్ మార్చి త్రైమాసికంలో పట్టణ మార్కెట్ కంటే నాలుగు రెట్లు వేగవంతమైన వృద్ధిని నమోదు చేసింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపించింది. అయినప్పటికీ మొత్తం మీద గ్రామీణ మార్కెట్‌లోనూ వృద్ధి క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు తగ్గింది. ఎఫ్‌ఎంసీజీ మార్కెట్లో చిన్న కంపెనీలు (అన్ బ్రాండెడ్) తమ వాటాను పెంచుకున్నాయి. అమ్మకాల్లో డబుల్ డిజిట్ వృద్ధి నమోదైంది. ఇక ధరల పెరుగుదల రూపంలోనూ 5.6 శాతం వృద్ధి నమోదైంది. దీంతో కలిపి చూస్తే మార్చి త్రైమాసికంలో ఎఫ్‌ఎంసీజీ పరిశ్రమలో వృద్ధి 11 శాతంగా ఉంది.

సంప్రదాయ దుకాణాల్లో అధిక అమ్మకాలు

సంప్రదాయ కిరాణా దుకాణాల్లోనూ ఎఫ్‌ఎంసీజీ అమ్మకాలు మార్చి త్రైమాసికంలో వృద్ధిని చూశాయి. మెట్రో మార్కెట్‌లో క్విక్‌కామర్స్ రూపంలో అధిక అమ్మకాలు కనిపించాయి. ''ఆహార వినియోగంలో వృద్ధి 2025 క్యూ1లో (జనవరి–మార్చి) 4.9 శాతానికి తగ్గింది. 2024 చివరి మూడు నెలల్లో ఇది 6 శాతంగా ఉంది. వంట నూనెల విభాగంలో ధరలు పెరగడంతో వినియోగం తగ్గింది''అని నీల్సన్‌ఐక్యూ నివేదిక వెల్లడించింది. ఆహారోత్పత్తుల విభాగంలో ధరల పెరుగుదల 7.2 శాతంగా ఉండడం గమనార్హం. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 0.9 శాతంగానే ఉంది. అంటే ధరల పెంపు ద్వారా కంపెనీలు ఆదాయాన్ని పెంచుకున్నట్టు తెలుస్తోంది. హోమ్ అండ్ పర్సనల్ కేర్ (హెచ్‌పీసీ) ఉత్పత్తుల అమ్మకాలు 5.7 శాతం పెరిగాయి. 2024 డిసెంబర్ త్రైమాసికంలో వృద్ధి 10.8 శాతం కంటే తక్కువే. ఓటీసీ అమ్మకాలు విలువ పరంగా 14 శాతం పెరిగాయి. ఈ విభాగంలో ధరలను 10.4 శాతం పెంచడం ఇందుకు అనుకూలించింది. టాప్–8 మెట్రో నగరాల్లో ఈ–కామర్స్ అమ్మకాలు 13 శాతం పెరిగాయి.

ఏడాదికి రూ.100 కోట్ల టర్నోవర్ ఉండే చిన్న ఎఫ్‌ఎంసీజీ కంపెనీల అమ్మకాలు (పరిమాణం పరంగా) 11.9 శాతం వృద్ధి చెందాయి. రూ.100–1,000 కోట్ల టర్నోవర్ ఉండే కంపెనీల అమ్మకాలు పరిమాణం పరంగా 6.4 శాతం పెరిగాయి. రూ.5,000 కోట్ల వరకు ఆదాయం కలిగిన బడా ఎఫ్‌ఎంసీజీ కంపెనీల అమ్మకాలు పరిమాణం పరంగా కేవలం 1.6 శాతం వృద్ధినే చూశాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో వృద్ధి 8.1 శాతంతో పోల్చితే గణనీయంగా తగ్గింది. ప్రధానంగా పెద్ద సంస్థలు అమ్మకాల విషయంలో తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నట్టు ఈ నివేదిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

తాలేగావ్‌లో ఉత్పత్తిపై హ్యుందాయ్ కసరత్తు

క్యూ4లో ప్రారంభించడంపై ఫోకస్

న్యూఢిల్లీ: జనరల్ మోటార్స్ నుంచి కొనుగోలు చేసిన తాలేగావ్ ప్లాంటులో ఈ ఏడాది నాలుగో త్రైమాసికం నుంచి వాహనాల ఉత్పత్తిని ప్రారంభించడంపై హ్యుందాయ్ మోటర్ ఇండియా (హెచ్‌ఎంఐఎల్) కసరత్తు చేస్తోంది. కార్యకలాపాల విస్తరణలో భాగంగా అటు చెన్నై ప్లాంటు ఆధునీకరణ కోసం కంపెనీ ఇటీవలే రూ. 1,500 కోట్లు కేటాయించింది. కంపెనీ ఎండీ ఉన్సూ కిమ్ ఈ విషయాలు తెలిపారు. 1996 మే 6న భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుంచి మొత్తం మీద 1.27 కోట్ల వాహనాలను విక్రయించినట్లు వివరించారు. గత 29 ఏళ్లుగా వ్యాపార విస్తరణపై 6 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రలోని తాలేగావ్ ప్లాంటును కొనుగోలు చేసేందుకు 2023లో హెచ్‌ఎంఐఎల్ ఒప్పందం కుదుర్చుకుంది. కొనుగోలు ప్రక్రియ గతేడాది జనవరిలో పూర్తయ్యింది. ఈ ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1.3 లక్షల యూనిట్లుగా ఉంది.



రెన్యూ ఎనర్జీకి రూ. 870 కోట్లు

ఇన్వెస్ట్ చేసిన బ్రిటీష్ ఇంటర్నేషనల్ బ్యాంక్

న్యూఢిల్లీ: బ్రిటీష్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ (బీఐఐ) నుంచి రూ. 870 కోట్ల (సుమారు 100 మిలియన్ డాలర్లు) పెట్టుబడులకు హామీని పొందినట్లు రెన్యూ ఎనర్జీ గ్లోబల్ వెల్లడించింది. భారత్‌లోని తమ అనుబంధ సంస్థ రెన్యూ ఫొటోవోల్టెయిక్స్‌లో ఈ మొత్తం ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. దీనికి ప్రతిగా రెన్యూ ఫొటోవోల్టెయిక్స్‌లో బీఐఐ మైనారిటీ వాటా తీసుకోనుంది. దేశీయంగా సౌర విద్యుత్ రంగ ఉత్పత్తుల తయారీ వ్యాపార విస్తరణకు ఈ నిధులను ఉపయోగించుకోనున్నట్లు ఒక ప్రకటనలో వివరించింది. భారత సోలార్ తయారీ రంగంలో బీఐఐ పెట్టుబడులు పెట్టడం ఇదే తొలిసారి. 2021లో ఏర్పాటైన రెన్యూ ఫొటోవోల్టెయిక్స్‌కి రాజస్థాన్‌లోని జైపూర్‌లో 6.4 గిగావాట్ల సోలార్ పీవీ మాడ్యూల్ ప్లాంటు, గుజరాత్‌లోని ధొలెరాలో 2.5 గిగావాట్ల సోలార్ సెల్ తయారీ ప్లాంటు ఉన్నాయి. ధొలేరాలో కొత్తగా 4 గిగావాట్ల సోలార్ సెల్ ప్లాంటును కంపెనీ నిర్మించనుంది. దీనితో కొత్తగా సుమారు 2,000 ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా.



ప్రాపర్టీ షేర్ మళ్లీ ఐపీవో బాట

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: రియల్టీ రంగ కంపెనీ ప్రాపర్టీ షేర్ ఇన్వెస్ట్‌మెంట్ మరోసారి పబ్లిక్ ఇష్యూకి రానుంది. ప్రాప్‌షేర్ టైటానియా కోసం క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. తద్వారా రూ. 472 కోట్లు సమీకరించే ప్రణాళికలు ప్రకటించింది. దేశీయంగా తొలి చిన్న, మధ్యతరహా(ఎస్ఎం) రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్)గా లిస్టయిన ప్రాపర్టీ షేర్ రెండో ఎస్ఎం రీట్ ఐపీవో చేపట్టనుంది. ఇష్యూలో భాగంగా ప్రాప్‌షేర్ టైటానియా రూ. 472 కోట్ల విలువైన యూనిట్లను తాజాగా జారీ చేయనుంది. టైటానియా ముంబైలోని జీ కార్ప్ టెక్ పార్క్‌లో 4,37,973 చదరపు అడుగుల గ్రేడ్–ఏ ఆఫీస్ స్థలాలను కలిగి ఉంది. డిసెంబర్‌లో ప్రాప్‌షేర్ ప్లాటినా ఐపీవో ద్వారా ప్రాపర్టీ షేర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ రూ. 353 కోట్లు సమీకరించింది. ఇది తొలి ఎస్ఎం రీట్ పథకంకాగా.. రూ. 50–500 కోట్ల మధ్య విలువైన ఆస్తులుగల సంస్థలకు సెబీ ఈ విభాగాన్ని ప్రవేశపెట్టింది. కాగా.. యూనిట్స్ బీఎస్ఈలో లిస్టకానున్నాయి.

గుజరాత్ ఐటీ రోడ్‌షోలో మిలియన్ మైండ్స్ టెక్ సిటీ ఆవిష్కరణ



హైదరాబాద్: గుజరాత్ ఐటీ/ఐటీఈఎస్ పాలసీ 2022–27 రోడ్‌షో సందర్భంగా మిలియన్ మైండ్స్ టెక్ సిటీ ప్రాజెక్టును ఆవిష్కరించారు. గుజరాత్ కూడా ప్రధాన ఐటీ హబ్‌గా ఎదిగేందుకు హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ రోడ్‌షో తోడ్పడగలదని ప్రాజెక్టు నిర్మాణ సంస్థ గణేష్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ అన్మోల్ పటేల్ తెలిపారు. గుజరాత్ ప్రభుత్వం, సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్, అసోచాం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 200 ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలు పాల్గొన్నాయి.

ఆజాద్ ఇంజినీరింగ్‌కు జీఈ వెర్నోవా కాంట్రాక్టు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఈ వెర్నోవాకు చెందిన స్టీమ్ పవర్ సర్వీసెస్ వ్యాపార విభాగంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆజాద్ ఇంజినీరింగ్ వెల్లడించింది. ఈ అదనపు సరఫరా కాంట్రాక్టు విలువ 53.5 మిలియన్ డాలర్లని తెలిపింది. ఈ కాంట్రాక్టు ఆరేళ్ల పాటు 2030 వరకు అమల్లో ఉంటుంది. దీని కింద అణు, పారిశ్రామిక, థర్మల్ విద్యుత్ పరిశ్రమల్లో ఉపయోగించే సంక్లిష్టమైన రొటేటింగ్, స్టేషనరీ ఎయిర్‌ఫాయిల్స్‌ను కంపెనీ తయారు చేసి, సరఫరా చేయనున్నట్లు సంస్థ చైర్మన్ రాకేశ్ చోప్దార్ తెలిపారు. తమ ప్రెసిషన్ ఇంజినీరింగ్ సామర్థ్యాలకు ఈ ఒప్పందం నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ప్లైవుడ్ వ్యాపారానికి కజారియా గుడ్‌బై

న్యూఢిల్లీ: నష్టాల్లో ఉన్న ప్లైవుడ్ వ్యాపారం నుంచి వైదొలిగినట్లు సెరామిక్ టైల్స్ తయారీ సంస్థ కజారియా సెరామిక్స్ వెల్లడించింది. జూన్ 30 నాటికి నిష్క్రమణ ప్రక్రియ పూర్తవుతుందని అంచనా వేస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ప్రధాన వ్యాపార కార్యకలాపాలకు అనుగుణంగా లేకపోవడం, నష్టాల్లోనే కొనసాగటం కారణమని పేర్కొంది. కజారియా ప్లైవుడ్‌లో రూ. 112.38 కోట్ల పెట్టుబడులు, రుణాలను రైటాఫ్ చేసినట్లు మార్చి త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా కంపెనీ వివరించింది. గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కంపెనీ రూ. 1,222 కోట్ల ఆదాయంపై రూ. 43 కోట్ల లాభం ఆర్జించింది. ప్లైవుడ్ విభాగం మూసివేత సెటిల్మెంట్‌కి సంబంధించిన ప్రొవిజనింగ్ కారణంగా లాభం రూ. 102 కోట్ల నుంచి తగ్గింది.



రియల్టీకి డేటా సెంటర్స్ దన్ను

- అదనంగా 50 మిలియన్ చ.అ. అవసరం
- 2030 నాటికి అంచనాలు
- డెలాయిట్ నివేదిక



న్యూఢిల్లీ: దేశీయంగా కృత్రిమ మేథకు డిమాండ్‌తో డేటా సెంటర్లు గణనీయంగా పెరగనున్న నేపథ్యంలో 2030 నాటికి అదనంగా 45–50 మిలియన్ చ.అ. రియల్ ఎస్టేట్ అవసరం ఏర్పడనుంది. అలాగే 40–45 టెరావాట్–అవర్స్ (టీడబ్ల్యూహెచ్) విద్యుత్ కూడా కావాల్సి రానుంది. 'భారత ఏఐ డేటా సెంటర్ మౌలిక సదుపాయాల్లోకి పెట్టుబడుల ఆకర్షణ' పేరిట డెలాయిట్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. వ్యయాల పరమైన ప్రయోజనాలు, పునరుత్పాదక విద్యుత్‌పై ప్రధానంగా దృష్టి పెట్టడం, వ్యూహాత్మక స్థానంలో ఉండటం తదితర అంశాలు భారత్‌కి సానుకూలాంశాలని వివరించింది. అయితే, అంతర్జాతీయంగా ఏఐ హబ్‌గా ఎదగాలంటే కీలకమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవడం, నిపుణుల లభ్యత, విధానాల్లో అంతరాలను తొలగించడం మొదలైనవి ప్రధానంగా ఉంటాయని పేర్కొంది. ప్రపంచ స్థాయి ఏఐ వ్యవస్థను ఏర్పాటు చేయాలంటే రియల్ ఎస్టేట్, విద్యుత్, కనెక్టివిటీ, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు, నిపుణులు, విధానాలు అనే ఆరు అంశాలు మూల స్తంభాలుగా ఉంటాయని నివేదిక తెలిపింది. నేషనల్ బిల్డింగ్ కోడ్‌లో డేటా సెంటర్ల కోసం ప్రత్యేక కేటగిరీని ఏర్పాటు చేయాలని సూచించింది.

నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు అనుమతుల ప్రక్రియను సరళతరం, వేగవంతం చేయాల్సి ఉంటుంది.
- విధానాలపరంగా మద్దతు కల్పించాలి. డేటా లోకలైజేషన్ నిబంధనలను క్రమబద్ధీకరించాలి. ప్రత్యేక డేటా సెంటర్ జోన్లను ఏర్పాటు చేయాలి. ఇవి భారతదేశ ఏఐ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు తోడ్పడతాయి.
- డేటా సెంటర్ల వేగవంతమైన విస్తరణ వల్ల పవర్ గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతుంది. దీంతో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునేందుకు, మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేసుకునేందుకు అత్యవసరంగా భారీ స్థాయిలో పెట్టుబడులు అవసరమవుతాయి.
- దేశీయంగా నెట్‌వర్క్, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌పరంగా పరిమితులు, గట్టిగా ఆధారపడలేని హై–స్పీడ్ ఇంటర్నెట్ మొదలైన వాటి పరిమితుల వల్ల డేటా సెంటర్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి ఉండొచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

9-5-2025	
విశాఖ	505–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	490–00
వరంగల్	492–00
రిటైల్ ధర	5.50

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DIVISLAB	4,973.05	1.74
HDFCBANK	1,658.05	1.17
DRREDDY	6,945.70	0.84
SUNPHARMA	1,729.00	0.8
BRITANNIA	5,766.00	0.63

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
EICHERMOT	4,713.00	-5.15
TATAMOTORS	1,095.00	-4.32
MARUTI	12,697.10	-4.06
JSWSTEEL	898	-3.91
HINDALCO	647.3	-3.89

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,315
ఎన్ఎస్ఈ	1,01,223
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,74,784
ఎఫ్ఐఐ	+ 2,586
డీఐఐ	+ 2,378

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	59.98	$ 59.09
బ్రెంట్	62.90	$ 62.15

బయోకాన్ లాభం మూడింతలు

మార్చి త్రైమాసికంలో రూ.344 కోట్లు



న్యూఢిల్లీ: ప్రముఖ ఫార్మా సంస్థ బయోకాన్ మార్చి త్రైమాసికానికి రూ.344 కోట్లను ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.136 కోట్లతో పోల్చి చూస్తే మూడింతలైంది. ఆదాయం సైతం ఇదే కాలంలో రూ.3,966 కోట్ల నుంచి రూ.4,454 కోట్లకు వృద్ధి చెందింది. 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి బయోకాన్ లాభం రూ.1,013 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.1,022 కోట్లుగా ఉంది. ఆదాయం ఇదే కాలంలో రూ.15,621 కోట్ల నుంచి రూ.16,470 కోట్లకు వృద్ధి చెందింది. అన్ని విభాగాల్లోనూ బలమైన పనితీరును నమోదు చేసినట్టు బయోకాన్ గ్రూప్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా తెలిపారు. 2024–25 తమకు స్థిరీకరణ, మార్పు సంవత్సరంగా పేర్కొన్నారు. ప్రతీ షేరుకు 0.50 పైసల చొప్పున డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది.

బీఎస్ఈలో బయోకాన్ షేరు 3.46% నష్టంతో రూ.335 వద్ద ముగిసింది.

భారత్ ఫోర్జ్ బలహీన పనితీరు

లాభం, ఆదాయంలో క్షీణత



న్యూఢిల్లీ: భారత్ ఫోర్జ్ పనితీరు గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో (2025 జనవరి–మార్చి) నిదానించింది. లాభం, ఆదాయం రెండూ తగ్గిపోయాయి. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 12 శాతం క్షీణించి రూ.345 కోట్లుగా నమోదైంది. ఆదాయం సైతం 8 శాతం తగ్గి రూ.2,163 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో లాభం రూ.390 కోట్లు, ఆదాయం రూ.2,329 కోట్లు చొప్పున ఉండడం గమనార్హం. ఇక 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరంలోనూ కంపెనీ లాభం రూ.1,322 కోట్లు, ఆదాయం రూ.8,844 కోట్లకు తగ్గాయి. 2023–24లో లాభం రూ.1,425 కోట్లు, ఆదాయం రూ.8,969 కోట్లు చొప్పున ఉండడం గమనార్హం. ప్రతి షేరుకు రూ.6 చొప్పున డివిడెండ్ పంపిణీకి కంపెనీ బోర్డు నిర్ణయించింది.

బీఎస్ఈలో భారత్ ఫోర్జ్ షేరు 2% పైగా నష్టంతో రూ.1,114 వద్ద ముగిసింది.

మార్చి త్రైమాసిక ఫలితాలు

ఆర్ఈసీ లాభం అప్

- క్యూ4లో రూ. 4,310 కోట్లు
- షేరుకి రూ. 2.6 డివిడెండ్



న్యూఢిల్లీ: విద్యుత్ రంగ ప్రభుత్వ దిగ్గజం ఆర్ఈసీ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతం వృద్ధితో రూ. 4,310 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 4,079 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 12,707 కోట్ల నుంచి రూ. 15,348 కోట్లకు ఎగసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 2.6 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఆర్ఈసీ నికర లాభం రూ. 14,145 కోట్ల నుంచి రూ. 15,884 కోట్లకు బలపడింది. మొత్తం ఆదాయం రూ. 47,571 కోట్ల నుంచి రూ. 56,434 కోట్లకు జంప్‌చేసింది. మరో పీఎస్‌యూ దిగ్గజం బీహెచ్ఈఎల్‌తో సొంత అనుబంధ సంస్థ ఆర్ఈసీపీడీసీఎల్ సమాన వాటా(50:50) ప్రాతిపదికన భాగస్వామ్య కంపెనీ ఏర్పాటు చేయనుంది. ఇందుకు బోర్డు అనుమతించినట్లు ఆర్ఈసీ తాజాగా వెల్లడించింది. జేవీ ద్వారా పునరుత్పాదక ఇంధనంసహా ఇతర విద్యుత్, మౌలిక రంగ ప్రాజెక్టులను అభివృద్ధి చేయనున్నట్లు వివరించింది.

ఫలితాల నేపథ్యంలో ఆర్ఈసీ షేరు బీఎస్ఈలో 4.6 శాతం పతనమై రూ. 392 వద్ద ముగిసింది.

టైటన్ లాభం ప్లస్

- క్యూ4లో రూ. 871 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ టాటా గ్రూప్ దిగ్గజం టైటన్ కంపెనీ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 13 శాతం ఎగసి రూ. 871 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 771 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 11,472 కోట్ల నుంచి రూ. 14,049 కోట్లకు జంప్ చేసింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి టైటన్ నికర లాభం 5 శాతం నీరసించి రూ. 3,337 కోట్లకు పరిమితమైంది. 2023–24లో రూ. 3,496 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 47,501 కోట్ల నుంచి రూ. 57,818 కోట్లకు జంప్‌చేసింది. మరోసారి వార్షికంగా 22 శాతం వృద్ధిని అందుకోవడం ద్వారా రూ. 50,000 కోట్ల ఆదాయ మైలురాయిని అధిగమించినట్లు టైటన్ ఎండీ సీకే వెంకటరామన్ పేర్కొన్నారు. జ్యువెలరీ విభాగం ప్రస్తుత సీఈవో అజయ్ చావ్లా 2026 జనవరి 1నుంచి ఎండీగా బాధ్యతలు చేపట్టనున్నట్లు టైటన్ వెల్లడించింది. ప్రస్తుత ఎండీ వెంకటరామన్ 2025 డిసెంబర్ 31న పదవీ విరమణ చేయనున్నట్లు తెలియజేసింది. 1990లో టైటన్‌లో చేరిన వెంకటరామన్ 2019 అక్టోబర్1న ఎండీ పదవిని స్వీకరించారు.

ఫలితాల నేపథ్యంలో టైటన్ షేరు బీఎస్ఈలో 0.7 శాతం బలపడి రూ. 3,363 వద్ద ముగిసింది.

జిందాల్ స్టెయిన్‌లెస్ ఫర్వాలేదు

- మార్చి క్వార్టర్ లాభం రూ.590 కోట్లు



న్యూఢిల్లీ: జిందాల్ స్టెయిన్‌లెస్ మార్చితో ముగిసిన త్రైమాసికానికి రూ.590 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.501 కోట్లతో పోల్చితే 18 శాతం వృద్ధి నమోదైంది. ఆదాయం ఇదే కాలంలో 8 శాతం వృద్ధితో రూ.9,454 కోట్ల నుంచి రూ.10,198 కోట్లకు పెరిగింది. 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి నికర లాభం రూ.2,500 కోట్లుగా ఉంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.2,693 కోట్లతో పోల్చితే స్వల్ప క్షీణతను ఎదుర్కొన్నది. ప్రతి షేరుకు రూ.2 చొప్పున డివిడెండ్‌ను కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. మార్చి చివరికి కంపెనీ కన్సాలిడేటెడ్ రుణ భారం రూ.3,899 కోట్లుగా ఉంది. లాభాల్లో వృద్ధికి జిందాల్ యునైటెడ్ స్టీల్ లిమిటెడ్ నుంచి డివిడెండ్ పంపిణీ, జిందాల్ కోక్‌లో వాటాల విక్రయం అనుకూలించినట్టు కంపెనీ ఎండీ అభ్యుదయ జిందాల్ తెలిపారు.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు 1%కి పైగా నష్టపోయి రూ.587 వద్ద ముగిసింది.

జీ ఎంటర్‌టైన్‌మెంట్ పటిష్ట పనితీరు

- రూ.188 కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024–25) మార్చి త్రైమాసికంలో జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజ్ పటిష్ట పనితీరు చూపించింది. నికర లాభం ఎన్నో రెట్ల వృద్ధితో రూ.188 కోట్లకు చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి లాభం కేవలం రూ.13 కోట్లుగానే ఉంది. వ్యయ నియంత్రణకు తీసుకున్న సమర్థవంతమైన చర్యలు ఫలితమిచ్చాయి. ఆదాయం కేవలం 1.6 శాతం వృద్ధితో రూ.2,185 కోట్ల నుంచి రూ.2,220 కోట్లకు చేరింది. సబ్‌స్క్రిప్షన్ ఆదాయం, ఇతర అమ్మకాలు, సేవలు మార్చి త్రైమాసికంలో వృద్ధిని నడిపించినట్టు కంపెనీ తెలిపింది. ప్రకటనల వాతావరణం బలహీనంగా ఉన్నప్పటికీ లాభదాయకత పెంచుకున్నట్టు పేర్కొంది. ప్రకటనల ఆదాయం 27 శాతం తగ్గిపోయింది. జీ సినీ అవార్డుల కార్యక్రమం వాయిదా వేయడం, క్రీడలతో కూడిన రద్దీ కేలండర్‌ను కారణాలుగా తెలిపింది. సబ్‌స్క్రిప్షన్ ఆదాయం 4 శాతం పెరిగి రూ.986 కోట్లుగా ఉంది. మొత్తం వ్యయాలు 4.2 శాతం తగ్గి రూ.1,958 కోట్లకు పరిమితమయ్యాయి.

బీఎస్ఈలో కంపెనీ షేరు 1 శాతానికి పైగా లాభపడి రూ.111 వద్ద ముగిసింది.

ఏషియన్ పెయింట్స్ లాభం డౌన్

- క్యూ4లో రూ. 701 కోట్లు
- షేరుకి రూ. 20.55 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఏషియన్ పెయింట్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 45 శాతం క్షీణించి రూ. 701 కోట్లకు పరిమితమైంది. డిమాండ్ తగ్గడంతోపాటు, పోటీ తీవ్రత ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,275 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 8,731 కోట్ల నుంచి రూ. 8,359 కోట్లకు స్వల్పంగా(4 శాతం) వెనకడుగు వేసింది. మొత్తం వ్యయాలు రూ. 7,277 కోట్లుగా నమోదయ్యాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 20.55 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది.

విదేశీ అమ్మకాలు వీక్

క్యూ4లో ఇతర ఆదాయంతో కలిపి ఏషియన్ పెయింట్స్ మొత్తం టర్నోవర్ 5 శాతం తక్కువగా రూ. 8,459 కోట్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయాలు 2 శాతం నీరసించి రూ. 800 కోట్లకు పరిమితమయ్యాయి. ఇథియోపియా, ఈజిప్టులలో కరెన్సీ విలువ క్షీణించడం, బంగ్లాదేశ్‌లో ఆర్థిక సవాళ్లు ఇందుకు కారణమైనట్లు కంపెనీ ఎండీ, సీఈవో అమిత్ సింగ్లే పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1.3 శాతం బలహీనపడి రూ. 2,303 వద్ద ముగిసింది.

కల్యాణ్ జ్యువెలర్స్ లాభం జూమ్

- క్యూ4లో రూ. 188 కోట్లు



న్యూఢిల్లీ: ఆభరణ రిటైల్ కంపెనీ కల్యాణ్ జ్యువెలర్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 36 శాతం జంప్‌చేసి రూ. 188 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 138 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 37 శాతం ఎగసి రూ. 6,182 కోట్లను తాకింది. 2023–24 క్యూ4లో రూ. 4,525 కోట్ల టర్నోవర్ అందుకుంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 596 కోట్ల నుంచి రూ. 714 కోట్లకు బలపడింది. మొత్తం ఆదాయం 35 శాతం జంప్‌చేసి రూ. 25,045 కోట్లుగా నమోదైంది. 2023–24లో కేవలం రూ. 18,516 కోట్ల టర్నోవర్ ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో కల్యాణ్ షేరు బీఎస్ఈలో 2.2% బలహీనపడి రూ. 511 వద్ద ముగిసింది.

ఉజ్బెకిస్తాన్‌తో భారత్ 'ఢీ'



- రెండు అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడనున్న భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు
- ప్రాబబుల్స్‌లో సౌమ్య గుగులోత్

న్యూఢిల్లీ: ఈ నెలాఖరులో భారత సీనియర్ మహిళల ఫుట్‌బాల్ జట్టు ఉజ్బెకిస్తాన్‌తో రెండు అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడనుంది. మే 30వ తేదీన తొలి మ్యాచ్... జూన్ 3వ తేదీన రెండో మ్యాచ్ జరుగుతుంది. బెంగళూరులోని పడుకోన్-ద్రవిడ్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ ఈ రెండు మ్యాచ్‌లకు వేదిక కానుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం భారత జట్టు 69వ ర్యాంక్‌లో, ఉజ్బెకిస్తాన్ 50వ ర్యాంక్‌లో ఉన్నాయి. ఇరు జట్లు ఇప్పటి వరకు 13 సార్లు తలపడ్డాయి. తొమ్మిది మ్యాచ్‌ల్లో ఉజ్బెకిస్తాన్, ఒక మ్యాచ్‌లో భారత్ గెలిచాయి. మరో మూడు మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి. ప్రస్తుతం భారత జట్టు హెడ్ కోచ్ క్రిస్పిన్ ఛెత్రి పర్యవేక్షణలో 2026 ఆసియా కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లకు సిద్ధమవుతోంది. మే 1 నుంచి జరుగుతున్న శిక్షణ శిబిరంలో భారత క్రీడాకారిణులు పాల్గొంటున్నారు. ఈ శిబిరంలో తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ కూడా ఉంది. ఈ సీజన్‌లో సౌమ్య నిలకడగా రాణించి 2025 సంవత్సరానికి భారత ఉత్తమ మహిళా ఫుట్‌బాలర్ అవార్డును గెల్చుకుంది. ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీ జూన్ 23 నుంచి జూలై 5వ తేదీ వరకు థాయ్‌లాండ్‌లో జరగనుంది. గ్రూప్ 'బి'లో మంగోలియా, తిమోర్‌లెస్టె, ఇరాక్, థాయ్‌లాండ్ జట్లతో కలిసి భారత్ ఉంది.

భారత ప్రాబబుల్స్: పాయల్, ఎలాంగ్‌బమ్ పంథోయ్ చాను, కీషమ్ మెలోడి చాను, మోనాలిసా దేవి, పూర్ణిమ కుమారి, నిర్మలా దేవి, మార్టినా థోక్‌చోమ్, శుభాంగి సింగ్, సంజు, మాలతి ముండా, తోయ్‌జామ్ థోయ్‌బిసనా చ ఆను, రంజన చాను, స్వీటీ దేవి, వికసిత్ బరా, హేమం షిల్కీ దేవి, కిరణ్ పిస్దా, రత్నబాలా దేవి, ముస్కాన్ సుబ్బా, లిషామ్ బబీనా దేవి, కార్తీక అంగముత్తు, సిండీ కల్నే, సంగీత బస్ఫోరె, ప్రియదర్శిని, బేబీ సనా, సంతోష్, అంజు తమాంగ్, మౌసుమి ముర్ము, మాళవిక, సంధ్య రంగనాథన్, సౌమ్య గుగులోత్, సులాంజన రౌల్, లిండా కోమ్ సెర్టో, రింపా హల్దర్, మనీషా నాయక్, రేణు, కరిష్మా పురుషోత్తం, సుమతి కుమారి, మనీషా కల్యాణ్, గ్రేస్ డాంగ్మై.

ప్రియాంక విజయం



అల్ అయిన్ (యూఏఈ): ఆసియా వ్యక్తిగత చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి నూతక్కి ప్రియాంక వరుసగా రెండో విజయం నమోదు చేసింది. గురువారం అల్‌సెర్కల్ ఈసా (యూఏఈ)తో జరిగిన రెండో గేమ్‌లో ప్రియాంక 28 ఎత్తుల్లో గెలిచింది. తొలి రౌండ్‌లో ప్రియాంక 32 ఎత్తుల్లో గలాస్ బెర్నాడెటె (ఫిలిప్పీన్స్)ను ఓడించింది. మహిళల విభాగంలో 100 మంది క్రీడాకారిణులు పోటీపడుతుండగా భారత్ నుంచి 19 మంది బరిలో ఉన్నారు. రెండో రౌండ్ తర్వాత భారత్ నుంచి శ్రీజా శేషాద్రి, వంతిక అగర్వాల్, రక్షిత రవి రెండు పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నారు. పురుషుల విభాగంలో 150 మంది పోటీపడుతుండగా... భారత్ నుంచి 32 మంది బరిలో ఉన్నారు. రెండో రౌండ్ తర్వాత భారత ప్లేయర్లు నిహాల్ సరీన్, మురళీ కార్తికేయన్, ఇనియన్, ప్రాణేశ్, వుప్పాల ప్రణీత్ రెండు పాయింట్లతో ఉమ్మడిగా టాప్ ర్యాంక్‌లో ఉన్నారు.



లక్ష్యంపై ధీరజ్ గురి చిత్రంలో భారత ఆర్చర్లు అతాను దాస్, తరుణ్‌దీప్ ఉన్నారు

భారత్ చేజారిన కాంస్యం

- రికర్వ్ విభాగంలో భారత పురుషుల ఆర్చరీ జట్టుకు నిరాశ
- కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో సెమీస్ చేరిన మధుర, రిషభ్

షాంఘై: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నమెంట్‌లో భారత రికర్వ్ పురుషుల, మహిళల జట్లు పతకం సాధించడంలో విఫలమయ్యాయి. ధీరజ్ బొమ్మదేవర (ఆంధ్రప్రదేశ్), అతాను దాస్ (బెంగాల్), తరుణ్‌దీప్ రాయ్ (సిక్కిం)లతో కూడిన భారత పురుషుల జట్టు త్రుటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకోగా... దీపిక కుమారి (జార్ఖండ్), అంకిత (బెంగాల్), అన్షిక కుమారి (బిహార్)లతో కూడిన భారత మహిళల జట్టు మాత్రం రెండో రౌండ్‌లోనే వెనుదిరిగింది. కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత ప్లేయర్లు మధుర (మహారాష్ట్ర), రిషభ్ యాదవ్ (హరియాణా) సెమీఫైనల్ చేరుకొని పతకాల వేటలో నిలిచారు.

క్రిస్టియన్ స్టాదర్డ్, బ్రాడీ ఎలీసన్, జాక్ విలియమ్స్‌లతో కూడిన అమెరికా జట్టుతో కాంస్య పతక మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 3-5 సెట్ పాయింట్లతో ఓడిపోయింది. తొలి సెట్‌ను అమెరికా 57-56తో నెగ్గి 2 పాయింట్లు సాధించింది. రెండో సెట్ 56-52తో అమెరికా ఖాతాలోనే వెళ్లింది. అమెరికా ఆధిక్యం 4-0కు పెరిగింది. మూడో సెట్‌ను భారత్ 55-54తో గెలిచి 2 పాయింట్లు సంపాదించింది. నాలుగో సెట్‌లో రెండు జట్లు 56-56తో సమంగా నిలిచాయి. దాంతో రెండు జట్లకు ఒక్కో పాయింట్ దక్కింది. ఓవరాల్‌గా అమెరికా 5-3తో విజయాన్ని ఖరారు చేసుకొని కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. అంతకుముందు భారత జట్టు 5-4తో (53-51, 55-58, 55-56, 54-53, 29-27) కజకిస్తాన్‌పై గెలిచింది. నాలుగు సెట్‌ల తర్వాత రెండు జట్లు 4-4తో సమంగా నిలిచాయి. దాంతో 'షూట్ ఆఫ్' నిర్వహించగా... భారత్ పైచేయి సాధించింది. క్వార్టర్ ఫైనల్లో భారత్ 6-0తో (58-56, 57-56, 55-53)తో ఇటలీపై నెగ్గింది. సెమీఫైనల్లో టీమిండియా 4-5తో (51-54, 50-56, 56-55, 55-53, 25-26) 'షూట్ ఆఫ్'లో ఫ్రాన్స్ జట్టు చేతిలో ఓడిపోయింది.

తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన భారత మహిళల జట్టు 4-5తో (49-50, 52-54, 52-45, 55-48, 26-27)తో 'షూట్ ఆఫ్'లో అలెజాండ్రా వలెన్సియా, వాలెంటీనా వాజ్‌క్వెజ్, మోంటాయ అల్వారోలతో కూడిన మెక్సికో జట్టు చేతిలో ఓడిపోయింది.

చికిత, జ్యోతి సురేఖలకు నిరాశ

మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, తెలంగాణ క్రీడాకారిణి తనిపర్తి చికిత, ప్రపంచ చాంపియన్ అదితి స్వామి నిరాశపరచగా... మధుర సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో మధుర 142-141తో జ్యోతి సురేఖను ఓడించింది. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో చికిత 134-138తో అదెల్ జెక్సెన్‌బినోవా (కజకిస్తాన్) చేతిలో, అదితి 129-140తో కార్సన్ క్రాహి (అమెరికా) చేతిలో ఓడిపోయారు. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత క్వార్టర్ ఫైనల్లో రిషభ్ డెన్మార్క్‌కు చెందిన మథియాస్ ఫులర్టన్‌పై గెలిచాడు. నిర్ణీత 15 బాణాల తర్వాత ఇద్దరూ 147-147తో సమంగా నిలిచారు. 'షూట్ ఆఫ్'లోనూ ఇద్దరూ 10 పాయింట్లు స్కోరు చేశారు. అయితే రిషభ్ సంధించిన బాణం కేంద్ర బిందువుకు అతి సమీపంగా ఉండటంతో అతనికి సెమీఫైనల్ బెర్త్ ఖరారైంది.

శ్రీకాంత్‌కు షాక్



తైపీ: భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్‌కు చైనీస్ తైపీ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో నిరాశ ఎదురైంది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీకాంత్ పరాజయం పాలయ్యాడు. గురువారం జరిగిన పోరులో భారత యువ షట్లర్ ఆయుశ్ శెట్టి 21-16, 15-21, 21-17తో ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్‌పై విజయం సాధించాడు. తొలి గేమ్‌ను సునాయాసంగా గెలుచుకున్న 20 ఏళ్ల ఆయుశ్... రెండో గేమ్‌లో వెనకబడి పోయినా... హోరాహోరీగా సాగిన మూడో గేమ్ కీలక సమయాల్లో పాయింట్లు సాధించి ముందంజ వేశాడు. తొలి రౌండ్‌లో ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ రన్నరప్ లీ చియా హౌపై విజయం సాధించిన ఆయుశ్... తదుపరి మ్యాచ్‌లో ఏడో సీడ్ బ్రియాన్ యంగ్ (కెనడా)తో తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా 21-12, 21-7తో లిన్ షి యున్ (చైనీస్ తైపీ)పై గెలుపొందింది. 27 నిమిషాల్లో ముగిసిన పోరులో ఉన్నతి సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. 17 ఏళ్ల ఉన్నతి క్వార్టర్ ఫైనల్లో హంగ్ యీ టింగ్ (చైనీస్ తైపీ)తో ఆడుతుంది. మరో మ్యాచ్‌లో హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నెపల్లి 13-21, 9-21తో మోహ్ జాకీ ఉబేదుల్లా (ఇండోనేసియా) చేతిలో ఓడాడు.



ఆయుశ్ శెట్టి



వరుణ్ చక్రవర్తికి జరిమానా



కోల్‌కతా: కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిపై జరిమానా పడింది. ఐపీఎల్‌లో భాగంగా బుధవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా... వరుణ్ ఐపీఎల్ నిబంధనలను అతిక్రమించినందుకు గానూ అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత పడింది. దీంతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్ సైతం ఖాతాలో చేరింది. 'వరుణ్ చక్రవర్తి లెవల్ 1 తప్పిదానికి పాల్పడ్డాడు. ఆర్టికల్ 2.5 ద్వారా అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్ కేటాయించాం' అని ఐపీఎల్ పాలక మండలి ఒక ప్రకటనలో తెలిపింది. వరుణ్ తప్పిదాన్ని స్పష్టంగా పేర్కొనకపోయినా... ప్రత్యర్థి ప్లేయర్లు అవుటైన సందర్భంలో దురుసుగా ప్రవర్తించిన సందర్భాల్లో ఈ ఆర్టికల్ ద్వారా ప్లేయర్లకు జరిమానా విధిస్తారు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన పోరులో చెన్నై బ్యాటర్ బ్రెవిస్ ఔటైన సందర్భంలో వరుణ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కనిపించాడు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో చెన్నై జట్టు 2 వికెట్ల తేడాతో కోల్‌కతాపై విజయం సాధించింది.

'ప్లే ఆఫ్స్' బెర్త్ లక్ష్యంగా...



పంత్

తుది జట్లు (అంచనా)

లక్నో సూపర్ జెయింట్స్: పంత్ (కెప్టెన్), మార్క్‌రమ్, మార్ష్, పూరన్, బదోనీ, మిల్లర్, సమద్, అవేశ్ ఖాన్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, దిగ్వేశ్ రాఠీ, ఆకాశ్ సింగ్.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: రజత్ పాటీదార్ (కెప్టెన్), విరాట్ కోహ్లి, జాకబ్ బెథెల్, మయాంక్ అగర్వాల్, జితేశ్ శర్మ, టిమ్ డేవిడ్, షెఫర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, ఇన్‌గిడి, యశ్ దయాళ్, సుయాశ్ శర్మ.

నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పోరు

- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

లక్నో: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ 18వ సీజన్‌లో రెండు భిన్నమైన జట్ల మధ్య సమరానికి రంగం సిద్ధమైంది. వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచి 'ప్లే ఆఫ్స్'కు సమీపించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) శుక్రవారం లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ)తో తలపడుతుంది. గత మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన లక్నో జట్టు సొంతగడ్డపై జరగనున్న పోరులో సత్తా చాటాలని చూస్తోంది. ఈ మ్యాచ్‌లో ఓడితే లక్నో 'ప్లే ఆఫ్స్' ఆశలు గల్లంతయ్యే అవకాశమున్న నేపథ్యంలో... సమష్టిగా కదం తొక్కేందుకు రెడీ అయింది. ఈ సీజన్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ముందుకు సాగుతున్న ఆర్‌సీబీ 11 మ్యాచ్‌లాడి 8 విజయాలు, 3 పరాజయాలతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. మరోవైపు లక్నో 11 మ్యాచ్‌ల్లో 5 విజయాలు, 6 పరాజయాలతో 10 పాయింట్లతో ఉంది. ఇక మిగిలిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిస్తేనే లక్నో జట్టు ప్లే ఆఫ్స్ రేసులో నిలుస్తుంది. ఐపీఎల్ వేలంలో అత్యధిక ధర పలికిన లక్నో సారథి రిషభ్ పంత్ ఏమాత్రం ప్రభావం చూపెట్టలేకపోతున్నాడు. బ్యాటింగ్ స్థానాల్లో మార్పు చేసుకున్నా ఫలితం మాత్రం శూన్యంగా మారింది. మరి ఈ మ్యాచ్‌లో బెంగళూరు విజయం సాధించి 'ప్లే ఆఫ్స్' బెర్త్ ఖరారు చేసుకుంటుందా లేక లక్నో పోటీలో నిలుస్తుందా చూడాలి!

ఒత్తిడిలో పంత్ బృందం

ఈ సీజన్‌లో లక్నో విజయాల్లో టాప్-3 కీలక పాత్ర పోషిస్తున్నారు. మార్క్‌రమ్, మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్ రాణిస్తుండటంతో ఆ జట్టుకు మంచి ఆరంభాలు లభిస్తున్నాయి. పూరన్ 11 మ్యాచ్‌ల్లో 410 పరుగులు చేయగా... మార్క్‌రమ్ 348 పరుగులు చేశాడు. మార్ష్ 10 మ్యాచ్‌ల్లో 378 పరుగులు కొట్టాడు. మిడిలార్డర్‌లో ఆయుశ్ బదోని కూడా ఫర్వాలేదనిపిస్తున్నాడు. అతడు 326 పరుగులు చేయగా... భారీ ఆశలు పెట్టుకున్న పంత్ అంచనాలను అందుకోలేకపోతున్నాడు. ఈ సీజన్‌లో పంత్ 12.80 సగటుతో కేవలం 128 పరుగులే చేశాడు. ధాటిగా ఆడగల సత్తాఉన్న పంత్ 99.22 స్ట్రయిక్‌రేట్ మాత్రమే నమోదు చేశాడు. చావో రేవో తేల్చుకునేందుకు బరిలోకి దిగాల్సిన పరిస్థితుల్లో పంత్ మాట్లాడుతూ... 'మిగిలిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిస్తే 'ప్లే ఆఫ్స్' రేసులో ఉంటాం. ఇప్పుడు మా ముందు ఉన్న లక్ష్యం అదే. టాపార్డర్ మెరుగైన ప్రదర్శన చేస్తోంది. ప్రతి మ్యాచ్‌లో వాళ్లపైనే భారం వేయడం కూడా తగదు' అని పంత్ అన్నాడు. గాయం నుంచి కోలుకొని తిరిగి వచ్చిన సూపర్ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్ భారీగా పరుగులు ఇచ్చుకుంటుండగా... ఫీల్డింగ్‌లోనూ జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. మరి కీలక పోరులో నెగ్గాలంటే అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో లక్నో మెరవాల్సిన అవసరముంది.

ఫుల్ ఫామ్‌లో విరాట్...

లీగ్ ఆరంభం నుంచి బరిలోకి దిగుతున్నా... ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ట్రోఫీ చేజిక్కించుకోలేకపోయిన ఆర్‌సీబీ... ఈ సీజన్‌లో తమ కల నెరవేర్చుకోవాలని భావిస్తోంది. అందుకు తగ్గట్లే అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో మెరుగైన ప్రదర్శనతో నిలకడగా విజయాలు సాధిస్తోంది. మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి ఫుల్ ఫామ్‌లో ఉండటం బెంగళూరుకు ప్రధాన బలం. ఈ సీజన్‌లో ఆడిన 11 మ్యాచ్‌ల్లో విరాట్ 63.13 సగటుతో 505 పరుగులు చేసి 'ఆరెంజ్ క్యాప్' రేసులో ముందు వరుసలో ఉన్నాడు. అందులో 7 అర్ధశతకాలు ఉన్నాయి. ఆరంభంలో కోహ్లి ఇన్నింగ్స్‌లో స్థిరత్వాన్ని తెస్తే... రజత్ పాటీదార్, జితేశ్ శర్మ, కృనాల్ పాండ్యా దాన్ని కొనసాగిస్తున్నారు. ఆఖర్లో టిమ్ డేవిడ్, రొమారియో షెఫర్డ్ వంటి హిట్టర్లు ఉండటం ఆ జట్టు భారీ స్కోర్లు చేయగలుగుతోంది. అయితే ఆర్‌సీబీ తరఫున అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడు దేవదత్ పడిక్కల్ గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. అతడి స్థానంలో కర్ణాటక ఆటగాడు మయాంక్ అగర్వాల్‌ను ఎంపిక చేసుకుంది. చెన్నైతో జరిగిన గత మ్యాచ్‌లో షెఫర్డ్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అయితే ఆర్‌సీబీ తరఫున అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడు దేవదత్ పడిక్కల్ గాయం కారణంగా దూరవడంతో ఆ జట్టుకు ఇబ్బందికరంగా మారింది. బౌలింగ్‌లో భువనేశ్వర్ కుమార్, యశ్ దయాళ్, కృనాల్ పాండ్యా, సుయాశ్ శర్మ కీలకం కానున్నారు.

సందీప్ శర్మ స్థానంలో బర్గర్



న్యూఢిల్లీ: గాయం కారణంగా ఐపీఎల్‌కు దూరమైన భారత పేసర్ సందీప్ శర్మ స్థానంలో రాజస్తాన్ రాయల్స్ ఫ్రాంచైజీ దక్షిణాఫ్రికా బౌలర్ నాంద్రె బర్గర్‌ను ఎంపిక చేసుకుంది. ఈ సీజన్‌లో రాయల్స్ తరఫున 10 మ్యాచ్‌లాడిన 31 ఏళ్ల సందీప్ శర్మ... వేలు విరగడంతో జట్టుకు అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో రాజస్తాన్ ఫ్రాంచైజీ... సఫారీ లెఫ్టార్మ్ పేసర్ బర్గర్‌ను ఎంపిక చేసుకుంది. బర్గర్ గతంలో రాజస్తాన్ తరఫున 6 మ్యాచ్‌లు ఆడాడు. 'ఐపీఎల్ 2024 సీజన్‌లో బర్గర్ రాజస్తాన్ తరఫున 6 మ్యాచ్‌లాడి 7 వికెట్లు తీశాడు. అతడిని రూ. 3 కోట్ల 50 లక్షలకు రాయల్స్ సొంతం చేసుకుంది' అని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు గాయం కారణంగా జట్టుకు దూరమైన భారత బ్యాటర్ నితీశ్ రాణా స్థానంలో రాజస్తాన్ రాయల్స్ ఫ్రాంచైజీ దక్షిణాఫ్రికా యువ ఆటగాడు లువాన్ డ్రె ప్రిటోరియస్‌ను ఎంపిక చేసుకుంది. 19 ఏళ్ల ప్రిటోరియస్ 33 టి20ల్లో 911 పరుగులు చేశాడు. ఎస్‌ఏ20 లీగ్‌లో పార్ల్ రాయల్స్ తరఫున ఈ ఏడాదే అరంగేట్రం చేశాడు. పార్ల్ రాయల్స్ జట్టు కూడా రాజస్తాన్ రాయల్స్ యాజమాన్యందే కాగా... ధాటిగా ఆడే సత్తా ఉన్న ఈ సఫారీ బ్యాటర్‌కు ఐపీఎల్‌లో అవకాశం ఇచ్చింది. ప్రాథమిక ధర రూ. 30 లక్షలకు లువాన్ డ్రెను కొనుగోలు చేసుకుంది. నితీశ్ రాణా ఈ సీజన్‌లో 161.94 స్ట్రయిక్ రేట్‌తో 217 పరుగులు చేశాడు. ఇప్పటికే ప్లే ఆఫ్స్ రేసు నుంచి తప్పుకున్న రాజస్తాన్ రాయల్స్ జట్టు మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది.

క్వార్టర్స్‌లో రష్మిక



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ50 మహిళల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. జార్జియాలోని లాపోటో నగరంలో ఈ టోర్నీ జరుగుతోంది. గురువారం జరిగిన సింగిల్స్ రెండో రౌండ్‌లో రష్మిక 6-4, 6-2తో దరియా జెలిన్‌స్కాయ (రష్యా)పై విజయం సాధించింది. 1 గంట 51 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరోవైపు భారత నంబర్‌వన్, ఐదో సీడ్ అంకిత రైనా పోరాటం ముగిసింది. రెండో రౌండ్‌లో అంకిత 4-6, 6-3, 2-6తో రాడా జొలోటరేవా (రష్యా) చేతిలో ఓడిపోయింది.



జమ్మూలోని సరిహద్దులకు సమీప గ్రామంలో మూతబడిన దుకాణం వద్ద కూర్చుని టీ తాగుతున్న ఓ మహిళ





జమ్మూ జిల్లా మిశ్రివాలా ప్రాంతంలో తాత్కాలిక శిబిరాలతోపాటు, బంకర్‌లో తలదాచుకున్న స్థానికులు





జమ్మూ శివారులోని తాత్కాలిక శిబిరంలో ప్రజలకు ఆహారం పంపిణీ చేస్తున్న స్థానిక యంత్రాంగం

ఆర్మీలో చేరతా.. ఉగ్రవాదులను మట్టుబెడతా..

పహల్గాం దాడిలో తండ్రిని కోల్పోయిన తొమ్మిదేళ్ల బాలుడు

బాలాసోర్: 'భారత సైన్యంలో చేరి పాక్ ఉగ్రవాదులను అంతమొందించాలనుకుంటున్నా'పహల్గాం దాడిలో తండ్రిని కోల్పోయిన ఓ బాలుని కోరిక ఇది. తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకోవడానికి సైన్యంలో చేరాలని నిర్ణయించుకున్నానని తొమ్మిదేళ్ల తనూజ్ కుమార్ సత్పతి గురువారం వెల్లడించాడు. అంతేకాదు.. ప్రధాని నరేంద్ర మోదీని కలిసే అవకాశం వస్తే.. తనలా ఏ బిడ్డా తండ్రిని కోల్పోకుండా చూడాలని చెబుతానన్నాడు. తనూజ్ తండ్రి ప్రశాంత్ సత్పతి పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం వారి కుటుంబాన్ని మీడియా కలవగా.. తనూజ్ మాట్లాడాడు. "నేనూ, అమ్మ బుధవారం ఉదయం నుంచి వార్తలు చూస్తూనే ఉన్నాం. పాక్ ఉగ్ర స్థావరాలపై దాడి మాకు చయాలా సంతృప్తినిచ్చింది. మన సైన్యాన్ని చూసి గర్విస్తున్నా''అని తెలిపాడు. అంతేకాదు.. సైన్యం మొదటి నుంచి తనకు, తన తల్లికి అండగా ఉందని తనూజ్ చెప్పారు. "కొండపై నుంచి కిందకు వస్తుండగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారని చెప్పాడు. "నాన్న వెంటనే పడిపోయాడు. నేను, అమ్మ అతని దగ్గరికి పరిగెత్తాం. తల నుంచి రక్తస్రావం అవుతోంది. నీళ్లు కావాలా అని అమ్మ అడగ్గానే.. అవునన్నాడు. నీళ్లు ఇచ్చాను''అని పహల్గాంలో జరిగిన భయానక పరిస్థితులను తనూజ్ గుర్తు చేసుకున్నాడు. తనూజ్ పెద్దరికంగా మాట్లాడుతుండటంపై అతని తల్లి ప్రియా దర్శిని ఆందోళన వ్యక్తం చేసింది.''అతను అకస్మాత్తుగా తన బాల్యాన్ని కోల్పోయినట్లు కనిపిస్తున్నాడు. పిల్లలు క్రమంగా పరిణితి చెందాలి. భగవంతుడు నా కొడుకును ఆశీర్వదించాలి''అని ఆమె కోరుకున్నారు.

బెంగళూరులో సిద్ధమైన ఆర్మీ డ్రోన్లు!

సాక్షి, బెంగళూరు: భారత ఆర్మీ 'ఆపరేషన్ సిందూర్'లో ఉపయోగించిన ఆత్మాహుతి డ్రోన్‌లను బెంగళూరులో తయారు చేశారు. స్వయం చాలితమైన ఈ డ్రోన్లు పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్తాన్‌లలోని 9 ఉగ్రవాద స్థావరాలను అత్యంత కచ్చితత్వంతో నేలమట్టం చేశాయి. బాలాకోట్ దాడి తర్వాత వీటిని ఆర్మీలో చేర్చారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆల్ఫా డిజైన్, ఇజ్రాయెల్ ఎల్బిట్ సెక్యూరిటీ సిస్టమ్స్ సంయుక్తంగా ఈ డ్రోన్లను తయారు చేసినట్లు తెలిసింది. ఈ కంపెనీల ప్రధాన కార్యాలయాలు బెంగళూరులోనే ఉండడం గమనార్హం. భారత ఆర్మీ ప్రత్యేకంగా 100 డ్రోన్ల కొనుగోలుకు ఆర్డర్ చేసింది. ఎలాంటి శబ్దం లేకుండా, తక్కువ ఎత్తులో ఎగురుతూ 5-10 కిలోల బరువైన పేలుడు పదార్థాలను మోసుకెళ్లగల ఈ డ్రోన్లకు 100 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగల సత్తా ఉంది.

పిల్లలకు సిందూర్ పేరు

బిహార్‌లోని ఓ ఆస్పత్రిలో 12 మందికి అదే పేరు

కతిహార్: పహల్గాం ఉగ్రదాడిలో మరణించినవారికి నివాళిగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను యావత్ భారతం స్వాగతించింది. అయితే.. ఆ పేరుపై ట్రేడ్ మార్క్ కోసం వ్యాపారవేత్తలు పోటీ పడుతుంటే.. ప్రజలు మాత్రం ఆ ఆపరేషన్‌ను మరింత గుర్తుండిపోయేలా చేసుకుంటున్నారు. పాక్‌లో ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు జరిపిన బుధవారం రోజే పుట్టిన తమ బిడ్డలకు ఆపరేషన్ పేరు పెట్టుకుంటున్నారు. అమ్మాయిలయితే సిందూరి అని, అబ్బాయికయితే సిందూర్ అని పేరు పెట్టుకుంటున్నారు. బిహార్‌లో ఉన్న కతిహార్ జిల్లాలోని ఓ చిన్న ఆసుపత్రిలో కుందన్ కుమార్ మండల్ తన కూతురుకు సిందూరి పేరు పెట్టాడు. భారత సాయుధ దళాల ఆపరేషన్ పట్ల సంతోషం వ్యక్తం చేసిన కుందన్.. ఆ పేరు తన కూతురుకు పెట్టుకోవడం గర్వంగా ఉందన్నారు. ఒక్క కుందన్‌మాత్రమే కాదు.. ఆ పేరు పెట్టినందుకు కుటుంబమంతా సంతోషంగా ఉంది. ఆసుపత్రి సిబ్బంది కూడా ఈ పేరును ఆమోదించారు. పెరిగి పెద్దయ్యాక అమ్మాయి తన పేరు వెనుక ఉన్న ప్రాముఖ్యతను, చరిత్రను తెలుసుకుంటుందని కుటుంబం ఆశిస్తోంది. ఒక్క కుందన్ మాత్రమే కాదు.. బిహార్‌లోని ఓ ఆస్పత్రిలో 12 మంది ఈ పేరు పెట్టుకున్నారు. 'ఆపరేషన్ సిందూర్' జరిపిన రోజు పుట్టిన 12 మంది పిల్లలకు ముజఫర్‌పూర్‌లో ఈ పేరే పెట్టుకున్నారు. రెండు ఆనందాలు కలిసి వచ్చాయని సంబరపడిపోతున్నారు. పెద్దయ్యాక తమ పిల్లలను సైన్యంలో చేర్పిస్తామని అంటున్నారు. కన్హారా నివాసి హిమాన్షు రాజ్ కూడా తన కూతురికి 'సిందూరి'అని నామకరణం చేశాడు. 'సిందూరి'పేరు కుటుంబానికి గర్వకారణంగా మారింది. జాఫర్‌పూర్‌కు చెందిన పవన్ సోనీతన కొడుకుకి సిందూర్ అని పేరు పెట్టాడు. 'సిందూర్'కేవలం పేరు కాదు.. అదొక గర్వమని చెబుతున్నారు.

ఉద్రిక్తతల నేపథ్యంలో బీఎస్ఎఫ్ జవాన్ కుటుంబం ఆందోళన

సీఎం మమత జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

రిష్రా(పశ్చిమబెంగాల్): భారత్-పాక్‌ల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అనుకోకుండా అంతర్జాతీయ సరిహద్దు దాటి పాక్ రేంజర్ల అదుపులో ఉన్న బీఎస్ఎఫ్ జవాన్ కుటుంబం ఆందోళన చెందుతోంది. ప్రస్తుతం పరిస్థితులు తన భర్త విడుదల ప్రయత్నాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని సాహు భార్య రజని గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, అధికారికంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులకు తనకు హామీ ఇచ్చారని, తన భర్త తిరిగి వస్తాడని ఆశించానని తెలిపారు. కానీ, ఇప్పుడు యుద్ధ వాతావరణం నెలకొనడంతో ఏం జరుగుతుందో తెలియడం లేదన్నారు. తన భర్త కేసును అత్యున్నత స్థాయిలో విచారించేలా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జోక్యం చేసుకోవాలని రజనీ కోరారు. పంజాబ్ లోని ఫిరోజ్ పూర్ సెక్టార్ లో విధు లు నిర్వహిస్తున్న నలభై ఏళ్ల సాహు అనుకోకుండా అంతర్జాతీయ సరిహద్దు దాటి పాక్ సైనికులకు చిక్కాడు.

'ఆపరేషన్ సిందూర్' టైటిల్ కోసం క్యూ!

రిజిస్టర్ చేసేందుకు పోటాపోటీ

ముంబై: ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం ఉగ్రవాదంపై పోరు చేస్తుంటే.. ఆ పేరు కోసం బాలీవుడ్ దర్శక, నిర్మాతలు క్యూ కడుతున్నారు. 'ఆపరేషన్ సిందూర్', 'మిషన్ సిందూర్', 'సిందూర్ : ది రివెంజ్'అంటూ ఆపరేషన్ కోడ్‌నేమ్ స్ఫూర్తితో సినిమా టైటిల్స్ రిజిస్టర్ చేసుకునేందుకు పోటీ పడుతున్నారు. కేవలం రెండు రోజుల్లోనే 30కి పైగా దరఖాస్తులు వచ్చాయి. ఆపరేషన్ తరువాత ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఐఎంపీపీఏ), ఇండియన్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (ఐఎఫ్‌టీపీసీ), వెస్ట్రన్ ఇండియా ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (డబ్ల్యూఐఎఫ్పీఏ)లకు సినిమా టైటిల్స్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తులు పెరిగాయి. ఈ మెయిల్ ద్వారా ఇప్పటికే 30కి పైగా టైటిల్ అప్లికేషన్లు అందగా, ఈ సంఖ్య 50-60 వరకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. 'ఇది భారతదేశం గర్వించదగ్గ విషయం. అందుకే ఈ కథను సినిమా తీయాలని చాలామంది అనుకుంటున్నారు' అని ఐఎంపీపీఏ కార్యదర్శి అనిల్ నగ్రాత్ తెలిపారు. ఒక వ్యక్తి ఎన్ని టైటిల్స్‌కైనా దరఖాస్తు చేసుకోవచ్చని, అయితే మొదట దరఖాస్తు చేసుకున్న వ్యక్తికే టైటిల్ కేటాయిస్తామని తెలిపారు. గతంలో కార్గిల్, ఉరీ, కుంభమేళాలకు కూడా ఇలాగే టైటిల్ అప్లికేషన్లు అధికంగా వచ్చాయి. టైటిల్ నమోదుకు దరఖాస్తు రుసుము రూ.300 ప్లస్ జీఎస్టీ, అత్యవసర ప్రాతిపదికన అయితే రూ.3,000 ప్లస్ జీఎస్టీగా నిర్ణయించారు. ఒక్కసారి టైటిల్ వచ్చిన తరువాత సినిమా తీసేందుకు మూడేళ్ల కాలపరిమితి ఉంటుంది. మూడేళ్లలో సినిమా రెడీ కాకపోతే టైటిల్ తీసేసుకుంటారు. ఈ పేరుతో ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రేషన్ కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తోపాటు మరో ఐదు సంస్థలు కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్ అండ్ ట్రేడ్‌మార్క్‌ను సంప్రదించాయి. అయితే దేశానికి గర్వకారణమైన విషయంతో తాము వ్యాపారం చేయబోమని, తమ ఉద్యోగి పొరపాటున చేశారని చెప్పిన రిలయన్స్.. దరఖాస్తును వెనక్కి తీసుకుంది.

మరో జెట్ విమానాన్ని కోల్పోయిన అమెరికా

దుబాయ్: ఎర్ర సముద్రంలోని యూఎస్ఎస్ హారీ ఎస్ ట్రూమన్ విమాన వాహన నౌకపై మోహరించిన మరో ఫైటర్ జెట్ సముద్రంలో ప్రమాదవశాత్తూ పడిపోయింది. అధునాతన ఎఫ్/ఏ-18 సూపర్ హార్నెట్ రకం విమానం ల్యాండయ్యే క్రమంలో జరిగిన పొరపాటుతో షిప్‌పై నుండే స్టీల్ వైర్ తాళ్లకు హుక్ కాలేదని, ఫలితంగా జారి సముద్ర జలాల్లో పడిపోయిందని ఓ అధికారి చెప్పారు. అందులోని ఇద్దరు పైలట్లను హెలికాప్టర్ సాయంతో రక్షించామని, ఘటనలో వారిద్దరూ గాయపడ్డారని వివరించారు. ఈ జెట్ ఖరీదు రూ.513 కోట్లు. ఇదే షిప్‌పై సరిగ్గా ఇలాంటి విమానమే ఏప్రిల్‌లో ప్రమాదవశాత్తూ నీటిలో పడిపోవడం తెల్సిందే. గతేడాది డిసెంబర్‌లో అమెరికాకే చెందిన యూఎస్ఎస్ గెట్టిస్‌బర్గ్ నౌక గైడెడ్ మిస్సైల్ ప్రయోగించి మరో ఎఫ్/ఏ-18ను పొరపాటున కూల్చివేసింది. ట్రూమన్ విమాన వాహక నౌక ఫిబ్రవరిలో ఈజిప్టులోని పోర్ట్ సయీద్‌లో వాణిజ్య నౌకను ఢీకొట్టింది. ఎర్ర సముద్ర జలాల్లో పశ్చిమ దేశాల వాణిజ్య నౌకలపై హౌతీల దాడులు పెరిగిపోయిన నేపథ్యంలో ఇప్పటికే ఉన్న యూఎస్ఎస్ కార్ల్ విన్సన్‌కు తోడుగా అమెరికా ప్రభుత్వం యూఎస్ఎస్ హారీ ట్రూమన్‌ను ఇక్కడికి పంపించింది.

సోఫియాను చూసి కూడానా..

సైన్యంలో మహిళల శాశ్వత నియామకాలపై 2020లో సుప్రీం కీలక తీర్పు

- సోఫియా ఖురేషీ ట్రాక్ రికార్డునే ఉదాహరణగా చూపిన న్యాయస్థానం

న్యూఢిల్లీ: పాక్‌లోని ఉగ్రవాదుల అణచివేతకు భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పేరు దేశంలో ఎంతగా ప్రాచుర్యంలోకి వచ్చిందో.. ఆ ఆపరేషన్ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న మహిళా సైనికాధికారులు సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్ పేర్లు కూడా అంతగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. ముఖ్యంగా కల్నల్ సోఫియా ఖురేషీ గొప్పతనం గురించి ఐదేళ్ల క్రితమే దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రస్తావించింది. సైన్యంలో మహిళా అధికారుల శాశ్వత నియామకానికి (పర్మనెంట్ కమిషన్) సంబంధించిన కేసులో ఈమె ట్రాక్ రికార్డును న్యాయస్థానం ఉదాహరణగా చూపటం విశేషం. ఆడవాళ్లన్న కారణంతో సైన్యంలో పర్మనెంట్ కమిషన్ (పీసీ)కు అనర్హులుగా నిర్ధారించటం చట్టవ్యతిరేకమని 2020 ఫిబ్రవరి 17న సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఆ కేసులో మహిళల పీసీకి వ్యతిరేకంగా సైన్యం, కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్లపై నాడు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఎక్సర్‌సైజ్ ఫోర్స్ 18 పేరుతో భారతదేశం నిర్వహించిన అతిపెద్ద అంతర్జాతీయ మిలిటరీ ఎక్సర్‌సైజ్‌లో భారత కంటింజెంట్‌కు న్యాయకత్వం వహించిన మొదటి మహిళ లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషీ. 2006లోనే ఆమె కాంగోలో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళంలో సేవలందించారు. ఆ సమయంలో కాల్పుల విరమణకు అక్కడి దేశాలను ఒప్పించటంతోపాటు మానవతా సాయంలో కూడా ఆమె కీలక పాత్ర పోషించారు. తన శక్తియుక్తులతో అక్కడ శాంతి సాధనకు కృషిచేశారు. సైన్యంలో పురుషులతోపాటు భుజంభుజం కలిపి పనిచేస్తున్న మహిళలకు.. వారి శరీర నిర్మాణాన్ని సాకుగా చూపి పీసీకి అనర్హులుగా ప్రకటించటం సరికాదు'అని సుప్రీంకోర్టు నాటి తీర్పులో పేర్కొంది.

కోర్టులను దుర్వినియోగపర్చడమే

అత్తింటిపై కేసు పెట్టిన మహిళపై సుప్రీం మండిపాటు

న్యూఢిల్లీ: వేరుగా ఉంటున్న భర్త, అతడి కుటుంబీకులపై పెట్టిన కేసుపై నిరాధార ఆరోపణలు చేసిన ఓ మహిళపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనంటూ జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం గురువారం ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది. బిహార్ మాజీ గవర్నర్ కుటుంబంలోకి 2019లో కోడలిగా వెళ్లిన పిటిషనర్ తనను శారీరకంగా హింసించారంటూ భర్త, అతడి కుటుంబసభ్యులపై అస్పష్ట ఆరోపణలు చేయడమే తప్ప అందుకు తగిన ఆధారాలను చూపించలేకపోయారని తప్పుబట్టింది. ఆమె ఫిర్యాదు, మేజిస్ట్రేట్ ఎదుట ఇచ్చిన వాంగ్మూలాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని, ఇదే నిర్ణయాన్ని తెలిపిన అలహాబాద్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తమ వద్దకు రావడం న్యాయ ప్రక్రియను దుర్వినియోగ పర్చడమేనని మండిపడింది. ఈ కేసులో తాము సీఆర్‌పీసీలోని 482 సెక్షన్ కింద అసాధారణ అధికారాన్ని ఉపయోగించడానికి తగు కారణం కనిపించడం లేదని కూడా ధర్మాసనం స్పష్టం చేసింది. భర్త, అత్తమామలకు ఫ్యామిలీ కోర్టు జారీ చేసిన సమన్లను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది.

30% మంది బాలికలపై.. 13% మంది బాలురపై..

భారత్‌లో 18 ఏళ్ల లోపే లైంగిక వేధింపులు

న్యూఢిల్లీ: 2023 నాటికి భారత్‌లో 18 ఏళ్లలోపు బాలికలు 30శాతం మంది, బాలురు 13శాతం మంది లైంగిక వేధింపులకు బలయ్యారు. ఇక ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఐదుగురు బాలికల్లో ఒకరు, ఏడుగురు బాలురలో ఒకరు 18 ఏళ్లు నిండకముందే లైంగిక హింసకు గురవుతున్నారు. 1990 నుంచి 2023 మధ్య కాలంలో 200 దేశాల్లో చిన్నారులపై లైంగిక హింస ఎక్కువైంది. ఈ విషయాన్ని లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం వెల్లడించింది. అమెరికాలోని వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో ఉన్న ఇనిస్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ అండ్ ఎవాల్యుయేషన్ ఈ పరిశోధన నిర్వహించింది. దక్షిణాసియాలో బాలికల కేసులు అత్యధికంగా నమోదయ్యాయని, బంగ్లాదేశ్‌లో 9.3 శాతం ఉంటే.. భారత్‌లో 30.8 శాతం కేసులు నమోదయ్యాయని అధ్యయనం తెలిపింది. ఆఫ్రికాలో 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలురలో లైంగిక హింస ఎక్కువగా ఉందని పేర్కొంది. ఇక ప్రపంచంలోని 70శాతం మంది ప్రజలు 18 ఏళ్లలోపు టీనేజర్లుగానే లైంగిక హింసకు గురయ్యారని తెలిపింది. లైంగిక వేధింపుల పర్యవసానాలు మానసిక అనారోగ్యాన్ని పెంచడంతోపాటు దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేశాయని వెల్లడించింది. లైంగిక హింస లేని ఆరోగ్యవంతమైన బాల్యాన్నినివ్వడానికి, లైంగిక హింసకు గురైన వారికి జీవితాంతం అండగా నిలిచేందుకు మరిన్ని సేవలు, వ్యవస్థలు ఉండాలని అధ్యయనం పిలుపునిచ్చింది.

కొలంబియా వర్సిటీలో పాలస్తీనా అనుకూల ఆందోళనలు

80 మంది విద్యార్థుల అరెస్టు

వాషింగ్టన్: కొలంబియా యూనివర్సిటీలో మరోసారి పాలస్తీనా అనుకూల ఆందోళనలు వెల్లువెత్తాయి. విద్యార్థుల బృందం ముసుగులు ధరించి.. కొలంబియా విశ్వవిద్యాలయంలోని బట్లర్ లైబ్రరీలోకి రీడింగ్ రూమ్‌లో ఆందోళన చేపట్టింది. దీంతో బుధవారం సాయంత్రం 80 మందిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. వీరి వీసా స్థితిని సమీక్షిస్తున్నామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు. గొప్ప దేశమైన అమెరికాలో హమాస్ అనుకూల వ్యక్తులను ఇకపై స్వాగతించబోమని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కొలంబియా యూనివర్సిటీలో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ముసుగులు ధరించిన నిరసనకారులు బట్లర్ లైబ్రరీలోని రెండో అంతస్తులో ఉన్న రీడింగ్ రూమ్‌లోకి ప్రవేశించారు. టేబుల్స్‌పై నిలబడి నినాదాలు చేశారు. రీడింగ్ రూమ్‌లోని బుక్‌షెల్ఫ్‌లపై పాలస్తీనా జెండాలు, ఇతర బ్యానర్లను వేలాడదీశారు. ఫ్రేమ్ చేసిన చిత్రాలపై 'కొలంబియా కాలిపోతుంది'అని కొంతమంది నిరసనకారులు రాశారు. దీంతో విద్యార్థులు వెళ్లిపోవాలంటూ వర్సిటీ తాత్కాలిక ప్రెసిడెంట్ క్లైర్ షిప్‌మన్ కోరారు. వారు నిరాకరించడంతో సెక్యూరిటీకి సమాచారం అందించారు. వర్సిటీ యాజమాన్యం ఫిర్యాదుతో వర్సిటీలోకి వచ్చిన పోలీసులు.. 80 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆందోళనకారులు భవనంలోకి దూసుకెళ్లడంతో అధికారులిద్దరికి గాయాలయ్యాయని వర్సిటీ తెలిపింది.

కోర్టులేమైనా పుష్పాలనుకుంటున్నారా?

బీజేపీ ఎంపీ సివిల్ వార్ వ్యాఖ్యలపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారణకు స్వీకరించిందుకు బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే.. సుప్రీంకోర్టు, ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్‌ఖన్నాపై చేసిన వ్యాఖ్యలపై అత్యున్నత ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. కోర్టులేమైనా తేలిగ్గా వాడిపోయే పువ్వుల్లాగా సున్నితమైనవి అనుకుంటున్నారా? అని మండిపడింది. వక్ఫ్ వ్యతిరేక పిటిషన్లను విచారించటం ద్వారా సుప్రీంకోర్టు దేశంలో రాజకీయాన్ని ప్రోత్సహిస్తోందని, దేశంలో అంతర్యుద్ధం వస్తే అందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నానే బాధ్యత వహించాల్సి ఉంటుందని దూబే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయనపై కోర్టు ధిక్కరణ చర్యలు తీకోవాలని పిటిషన్ దాఖలైంది. సీజేఐ జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఆ పిటిషన్‌ను తిరస్కరిస్తూ.. దూబే తీరుపై తీవ్రంగా స్పందించింది. 'దూబే వ్యాఖ్యలు కుట్రపూరితంగా, సుప్రీంకోర్టు అధికారాన్ని తక్కువచేసి చూపేలా ఉన్నాయనటంలో ఎలాంటి సందేహం లేదు. ఆయన వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యం. అంతేకాదు.. సుప్రీంకోర్టుకు, న్యాయమూర్తులకు దురుద్దేశాలు ఆపాదించేలా ఉన్నాయి. అయినా, ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల్లో న్యాయవ్యవస్థ విశ్వసనీయతను, విశ్వాసాన్ని తగ్గిస్తాయని మేం అనుకోవటంలేదు. ఇలాంటి వ్యాఖ్యలతో స్థాయి తగ్గటానికి కోర్టులు త్వరగా వాడిపోయే పుష్పాలు కాదు'అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

కాలుష్య నియంత్రణ మండళ్లలో పోస్టుల ఖాళీపై సుప్రీం సీరియస్

నాలుగు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు ధిక్కరణ నోటీసులు

న్యూఢిల్లీ: కాలుష్య నియంత్రణ మండళ్లలో పోస్టులను భర్తీ చేయకుండా వదిలేయాన్ని సుప్రీంకోర్టు సీరియస్‌గా తీసుకుంది. దయనీయ పరిస్థితులకు ఇది అద్దం పడుతోందని వ్యాఖ్యానించింది. ఢిల్లీతోపాటు చుట్టుపక్కల రాష్ట్రాలైన యూపీ, హరియాణా, రాజస్తాన్ చీఫ్ సెక్రటరీలకు ధిక్కరణ నోటీసులు పంపింది. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీలోగా ఈ పోస్టులను భర్తీ చేయాలంటూ 2024 ఆగస్టులోనే తాము ఆదేశాలు జారీ చేసినా ఎందుకు పట్టించుకోలేదంటూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం నిలదీసింది. ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ 55 శాతం ఖాళీ పోస్టులతో నామమాత్రంగా మారడంపై షాక్ కలిగిస్తోందని వ్యాఖ్యానించింది. 1971 కోర్టు ధిక్కరణ చట్టం ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో తెలపాలంటూ ఆయా రాష్ట్రాల అధికారులను ఆదేశించింది. ఢిల్లీ చీఫ్ సెక్రటరీని ఈ నెల 19వ తేదీన స్వయంగా తమ ఎదుట హాజరు కావాలని ఆదేశించిన ధర్మాసనం..మిగతా మూడు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు జూలై 18న వర్చువల్‌గా విచారణలో పాల్గొనాలంది.

హైకోర్టుల్లో ఖాళీలపై సుప్రీం ఆందోళన

సిఫారసులను కేంద్రం వెంటనే ఓకే చేయాలని సూచన

న్యూఢిల్లీ: దేశంలోని హైకోర్టుల్లో పెద్ద సంఖ్యలో న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అదే సమయంలో, వివిధ హైకోర్టుల్లో 7 లక్షలకు పైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయంది. అలహాబాద్ హైకోర్టులో మంజూరైన జడ్జీల పోస్టులు 160 కాగా ప్రస్తుతం 79 మంది మాత్రమే పనిచేస్తున్నారని, ఇక్కడ 2.7 లక్షల క్రిమినల్ కేసులు పేరుకుపోయాయంటూ ఉదహరించింది. పెండింగ్ కేసుల భారం తగ్గించుకునేందుకు ఖాళీలను తక్షణమే పూర్తి చేయాల్సిన అవసరముందని పేర్కొంది. జడ్జీల నియామకాల కోసం కొలీజియం ప్రతిపాదించిన పేర్లపై వెంటనే ఆమోద ముద్ర వేయాలని గురువారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. 2023లో పంపిన నాలుగు ప్రతిపాదనలు, 2024లో అందజేసిన 13 ప్రతిపాదనలను కేంద్రం ఇప్పటికీ ఆమోదించలేదని ఇటీవల సుప్రీంకోర్టు పేర్కొనడం తెల్సిందే.

దేశంలో మొట్టమొదటి అమెరికా వర్సిటీ క్యాంపస్

న్యూఢిల్లీ: దేశంలో మొట్టమొదటిసారిగా అమెరికా వర్సిటీ ఒకటి క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. షికాగోలోని ఇలినాయీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్ ఏర్పాటుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) అనుమతి మంజూరు చేసింది. ముంబైలో ఏర్పాటయ్యే ఈ క్యాంపస్ 2026 నుంచి కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్, బిజినెస్ వంటి డిమాండున్న విభాగాల్లో గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను ప్రారంభించనుంది. షికాగో వర్సిటీ క్యాంపస్‌లో మాదిరిగానే విద్యాపరంగా కఠినమైన, అనుభవ పూర్వక, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఉండే పాఠ్యాంశాలను బోధిస్తామని ఇలినాయీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రెసిడెంట్ రాజ్ ఎచంబడి తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఎంపిక చేసే బోధనాసిబ్బంది, ఇలినాయీ టెక్ అమెరికా క్యాంపస్‌ల నుంచి విజిటింగ్ ప్రొఫెసర్లు కూడా ఉంటారన్నారు. కాగా, యూకేకు చెందిన సౌతాంప్టన్ యూనివర్సిటీ ఈ ఏడాదిలోనే భారత్‌లో క్యాంపస్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తోంది. ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్, వొల్లొన్‌గాంగ్ వర్సిటీలు ఇప్పటికే గుజరాత్‌లో పనిచేస్తున్నాయి.

ఫిరోజ్‌పూర్‌లో చొరబాటుదారు కాల్చివేత

అమృత్‌సర్: దేశంలోకి దొంగచాటుగా ప్రవేశించేందుకు యత్నించిన పాకిస్తానీ చొరబాటుదారుడిని కాల్చి చంపినట్లు బీఎస్ఎఫ్ గురువారం తెలిపింది. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో ఉన్న అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి బుధవారం అర్ధరాత్రి ఘటన చోటుచేసుకున్నట్లు వివరించింది. చీకటి మాటున సరిహద్దులు దాటేందుకు యత్నిస్తుండగా గుర్తించి, కాల్పులు జరిపామంది. మృతదేహాన్ని పంజాబ్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపింది.

బంగ్లా సరిహద్దుల్లో రాత్రి కర్ఫ్యూ

షిల్లాంగ్: భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని మేఘాలయలో రాత్రి కర్ఫ్యూ విధించారు. రాష్ట్రంలో మొత్తం 444 కిలోమీటర్ల సరిహద్దుకు గాను 40 కిలోమీటర్ల మేర కంచె నిర్మాణం చేపట్టలేదు. తెరిచి ఉన్న సరిహద్దుల వద్ద అనుమానాస్పద కదలికలపై సమాచారం అందినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దీంతోపాటు, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చొరబాట్లు, స్మగ్లింగ్ కార్యకలాపాలను నిలువరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు గురువారం తెలిపింది. అంతర్జాతీయ సరిహద్దులకు 200 మీటర్ల పరిధిలో రాత్రి 8 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ కొనసాగుతుందని వెస్ట్ జయింతియా జిల్లా యంత్రాంగం తెలిపింది. ఈ సమయంలో అనధికారికంగా గుమికూడటం, ర్యాలీలు, ఆయుధాలతో సంచరించడాన్ని నిషేధించారు.

సైన్యానికి పార్లమెంటరీ కమిటీల అభినందనలు

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తోపాటు పీవోకేలో ఉగ్ర లక్ష్యాలపై దాడులు చేపట్టిన మన బలగాలను పార్లమెంటరీ పబ్లిక్ అకౌంట్స్(పీఏసీ) అభినందనలు తెలిపింది. 2025-26కు గాను కొత్తగా ఏర్పాటైన కమిటీ మొట్టమొదటి భేటీ ఈ మేరకు గురువారం ఒక తీర్మానం ఆమోదించినట్లు కమిటీ చైర్ పర్సన్ కేసీ వేణుగోపాల్ చెప్పారు. పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రిత్వ శాఖకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సైతం ఇదేవిధమైన తీర్మానాన్ని ఆమోదించింది.

లాలు యాదవ్ విచారణకు రాష్ట్రపతి అనుమతి

న్యూఢిల్లీ: ఆర్‌జేడీ చీఫ్, కేంద్ర మాజీ మంత్రి లాలు ప్రసాద్ యాదవ్(76)ను ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం మనీ లాండరింగ్ ఆరోపణలపై విచారణ జరిపేందుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత-2023లోని సెక్షన్218 కింద రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. రైల్వే శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో ఈ కుంభకోణం జరిగిందని ఈడీ ఆరోపిస్తోంది. ఇందులో బిహార్ మాజీ సీఎం లాలు, ఆయన కుమారుడు, మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ ఇతర కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందంటూ గతేడాది చార్జిషీటు దాఖలు చేసింది. అంతకుముందు లాలు కుటుంబానికి సన్నిహితుడు అమిత్ కట్యాల్, ఇతర కుటుంబసభ్యులపై ఈడీ చార్జిషీటు వేసింది. ఈ రెండు చార్జిషీట్లను పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

కేరళలో నిఫా వైరస్ కేసు

మలప్పురం: కేరళలోని మలప్పురం జిల్లాలో నిఫా వైరస్ కేసొకటి బయటపడింది. జిల్లాలోని వలంచేరికి చెందిన మహిళకు నిఫా సోకినట్లు నిర్ధారణయిందని ఆరోగ్య మంత్రి వీణా జార్జి తెలిపారు. పెరింతల్‌మన్నాలోని ఆస్పత్రిలో ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోందన్నారు. కొన్ని వారాలుగా జ్వరంతో బాధపడుతున్న ఆమె దగ్గు, శ్వాసలో సమస్యలు కూడా ఉన్నాయన్నారు. శాంపిళ్లను పుణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపగా నిఫా సోకినట్లు తేలిందని వివరించారు.

యూకేతో వాణిజ్య ఒప్పందం కుదిరింది: డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: యూకే ప్రభుత్వం తమతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గురువారం ఆయన వైట్ హౌస్‌లో మాట్లాడుతూ..పరస్పర లాభదాయకం, న్యాయబద్ధం అనేవి అంతర్జాతీయ వాణిజ్యంలో కీలక సూత్రాలని పేర్కొన్నారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు యూకేలో ప్రవేశించేందుకు మరింత స్వేచ్ఛ లభించనుందని వ్యాఖ్యానించారు. అమెరికా సరుకులకు యూకేలో కస్టమ్స్ ప్రక్రియ సైతం సత్వరమే ఉంటుందని చెప్పారు. ఒప్పందం పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ట్రంప్ వివరించారు. ఇటీవలే భారత్- యూకే వాణిజ్య ఒప్పందం ఖరారవడం తెల్సిందే.

కల్హణుడు ఏ కాశ్మీర్ రాజుకు సమకాలీనుడు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

తొలి మధ్యయుగం

తొలి మధ్యయుగ భారతదేశ చరిత్రలో ఉత్తర భారతదేశాన్ని 36 రాజపుత్ర వంశాలు పాలించాయి. వీటిలో ప్రతీహారులు, పరమారులు, చౌహాన్‌లు, సోలంకీలతోపాటు మరికొన్ని రాజ వంశాలు కూడా ప్రఖ్యాతి చెందాయి. ఈ రాజవంశాలు తమ పాలన ద్వారా ఉత్తర భారత సంస్కృతికి, వాస్తు శిల్ప కళలకు అమూల్య సేవలందించాయి.

చాందేలులు: వీరు ఘూర్జర ప్రతీహారుల తర్వాత జేజకభుక్తి (బుందేల్‌ఖండ్) ప్రాంతాన్ని పాలించారు. వీరు శాసనాల్లో తమను చంద్రవంశ క్షత్రీయులుగా పేర్కొన్నారు. వీరి రాజధాని ఖజురహో. క్రీ.శ. 9 నుంచి 14వ శతాబ్దం వరకు పాలించారు. వీరి కాలంలో దాదాపు 80 ఆలయాలను నిర్మించారు. వాటిలో 30కి పైగా ఆలయాలు నేటికీ నిలిచి ఉన్నాయి.

నన్నుక: చాందేల వంశాన్ని స్థాపించినవాడు. చాందేలుల వంశంలో తొలిరాజుగా నన్నుకను పేర్కొంటారు.

వాక్పతి: నన్నుక అనంతరం రాజ్యానికి వచ్చిన వాడు వాక్పతి. తన సమకాలీన పాల వంశరాజు దేవపాలుడితో, ప్రతీహార రాజు భోజుడితో ఇతడు పలు యుద్ధాలు చేశాడు.

జయశక్తి: వాక్పతి కుమారుడు జయశక్తి. ఇతడు తన తండ్రి అనంతరం రాజ్యానికి వచ్చాడు. ఇతడి పేరు మీదుగానే ఈ రాజ్యాన్ని జేజకభుక్తి రాజ్యం అని పిలిచేవారు.

యశోవర్మన్: జయశక్తి అనంతరం విజయశక్తి, రాహిలుడు అనే రాజుల తర్వాత యశోవర్మన్ రాజ్యానికి వచ్చాడు. తన దండయాత్రల ద్వారా అనేక ప్రాంతాలను జయించి చాందేలులను ఒక గొప్పశక్తి రూపొందించాడు. తన రాజధాని ఖజురహోలో ఇతడు చతుర్భుజ స్వామి అనే విష్ణు ఆలయాన్ని నిర్మించాడు. దీన్నే లక్ష్మణ ఆలయం అని కూడా పిలుస్తారు.

ధంగ: ఇతడు 50 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ కాలంపాటు చాందేల రాజ్యాన్ని పాలించాడు. ఇతడి పాలనలో చాందేలులు తిరుగులేని శక్తిగా ఎదిగారు. ఇతడి రాజ్యం విదిష నుంచి గ్వాలియర్ వరకు, వారణాసి నుంచి నర్మద వరకు విస్తరించింది. ధంగ హయాం వాస్తుకళలకు పేరొందింది. రాజధాని ఖజురహోలో ఇతడు విశ్వనాథ, పార్శ్వనాథ ఆలయాలను నిర్మించాడు. ఇతడి కాలంలో పంజాబ్‌పై గజనీరాజు సబక్తజిన్ దాడి చేశాడు. ఈ దాడి నుంచి హిందూ షాహీరాజు జయపాలుడిని రక్షించేందుకు ధంగ కొన్ని రాజ్యాల కూటమిని ఏర్పరిచి ఈ దాడిని ఎదుర్కొన్నాడు.

గండ: తన తండ్రిలాగే ఇతడు కూడా విదేశీ దండయాత్రలను ఎదుర్కొనేందుకు పంజాబ్ షాహీరాజుల కూటమిల్లో చేరాడు. ఇతడి కాలంలో క్రీ.శ. 1008లో మహ్మద్ గజనీ పంజాబ్‌పై దాడి చేశాడు. ఖజురహోలో గండ రెండు దేవాలయాలను నిర్మించాడు. అవి – దేవి జగదాంబి ఆలయం (వైష్ణవాలయం), చిత్రగుప్త ఆలయం (సూర్య దేవాలయం).

విద్యాధర: ఇతడు తన సమకాలీనులైన కాలచూరి రాజులను, పరమార రాజులను ఓడించి రాజ్యాన్ని మరింత విస్తరించాడు. ఇతడి పాలనా కాలంలో మహ్మద్ గజనీ క్రీ.శ. 1019, 1022లో రెండుసార్లు చాందేల రాజ్యంపై దాడి చేశాడు. ఖజురహోలోని దేవాలయాలన్నింటిలోకి తలమానికమైన కందరియ మహాదేవ ఆలయాన్ని విద్యాధరుడే నిర్మించాడు.

మదనవర్మన్: విద్యాధరుడి అనంతరం విజయపాల, దేవవర్మన్, కీర్తివర్మన్ మొదలైన బలహీన రాజుల పాలన అనంతరం మదనవర్మన్ రాజ్యానికొచ్చాడు. ఇతడు త్రిపురి పాలకులైన కాలచూరి రాజులను, పరమార రాజులను, గహద్వాలులను ఓడించాడు. కానీ ఇతడు మూడో పృథ్వీరాజు చౌహాన్ చేతిలో ఓడిపోయాడు.

పరమార్థి దేవ: ఇతడి కాలంలో కుతుబుద్దీన్ ఐబక్ వీరి రాజ్యంపై దాడి చేసి మహోబా, కళింజర్ మొదలైన ప్రాంతాలను ఆక్రమించాడు. పరమార్థి దేవ అనంతరం త్రిలోక్య వర్మన్, వీరవర్మన్ అనే రాజులు పాలించారు. కానీ క్రీ.శ. 1309లో అల్లా ఉద్దీన్ ఖిల్జీ కల్యాణీ చాళుక్య రాజ్యాన్ని ఢిల్లీ సామ్రాజ్యంలో విలీనం చేశాడు.

గహద్వాలులు:
వీరు తాము సూర్య చంద్ర వంశాలకు చెందిన వారమని, యయాతి వారసులమని పేర్కొన్నారు. కానీ వీరిని రాష్ట్రకూటుల శాఖకు చెంది నవారిగా చరిత్రకారులు భావించారు.

యశో విగ్రహ: ఇతడు గహద్వాల వంశస్థాపకుడు.

చంద్రదేవ: ఇతడిని స్వతంత్ర గహద్వాల రాజ్య స్థాపకుడిగా భావిస్తారు. ఇతడు పలు ప్రాంతాలను ఆక్రమించి బనారస్‌ను తన రెండో రాజధానిగా చేసుకున్నాడు. ముస్లింల దాడులను ఎదుర్కొనేందుకు తన ప్రజల నుంచి తురుష్కదండన అనే పన్ను విధించాడు.

గోవిందచంద్ర: చంద్రదేవ అనంతరం కొద్దికాలం మదనపాలుడు పాలించాడు. తర్వాత అతడి కుమారుడు గోవిందచంద్ర రాజ్యానికొచ్చాడు. ఇతడిని ఈ వంశంలో అందరికంటే గొప్పవాడిగా పరిగణిస్తారు. ఇతడు పాల, చేధి, చాందేల రాజులను ఓడించాడు. గజనీరాజు మూడో మసూద్‌షా సైనికుల దాడిని తిప్పికొట్టాడు. కాశ్మీర్ రాజు జయసింహుడితో, గుజరాత్ పాలకుడు సిద్ధరాజుతో స్నేహ సంబంధాలను కలిగి ఉన్నాడు. ఇతడి ఆస్థానంలోనే లక్ష్మీధరుడు (యుద్ధమంత్రి) కృత్యకల్పతరు/ కల్పద్రుయ అనే గ్రంథాన్ని రచించాడు.

ఇతడి ఆస్థానంలోని మరో కవి దామోదరశర్మ ఉక్తి-వ్యక్తి-ప్రకరణం అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించాడు. గోవిందచంద్ర రాణి కుమారదేవి సారనాథ్‌లో బౌద్ధ విహారాన్ని నిర్మించింది.

విజయచంద్ర: తన తండ్రిలాగే ఇతడు కూడా వాయవ్యం నుంచి జరిగే విదేశీ దాడులను విజయవంతంగా ఎదుర్కొన్నాడు. విజయచంద్రుడి విజయాల గురించి విజయప్రశస్తి అనే గ్రంథాన్ని శ్రీహర్షుడు రచించాడు.

జయచంద్రుడు: పృథ్వీరాజరాసో గ్రంథం లో ఇతడి కుమార్తె రాణి సంయుక్తకు, మూడో పృథ్వీరాజ్‌కు మధ్య గల ప్రేమాయణం గురించి వివరించారు. పృథ్వీరాజ్‌తో ఇతడికి బద్ధ వైరముంది. ఇతడి కాలంలోనే ఘోరీ మహ్మద్... చౌహాన్ రాజ్యాన్ని అంతం చేశాడు. చివరికి 1193–94లో ఘోరీ... కనౌజ్‌పై దాడి చేసి జయచంద్రుడిని వధించి గహద్వాల రాజ్యాన్ని ఆక్రమించాడు. కానీ జయచంద్రుడి కుమారుడు హరిశ్చంద్రుడిని తన సామంతుడిగా చేసుకొని గహద్వాల రాజ్యాన్ని తిరిగి అప్పగించాడు.

జయచంద్రుడి ఆస్థానంలోని ప్రముఖ సంస్కృత కవి శ్రీహర్షుడు. ఇతడు నైషధ చరితం, ఖండన ఖండ ఖాద్య అనే గ్రంథాలను రచించాడు. చివరికి ఇల్‌టుట్‌మిష్ కాలంలో ఈ రాజ్యం ఢిల్లీ సామ్రాజ్యంలో విలీనమైంది.

పాలవంశం: తొలి మధ్య యుగంలో తూర్పు భారత దేశాన్ని పాలించిన వంశాల్లో పాలవంశం ప్రముఖమైంది. తొలుత పాటలీపుత్రం, తర్వాత మాంఘీర్ రాజధానులుగా పాలరాజులు బెంగాల్, బీహార్, ఒరిస్సా మొదలైన ప్రాంతా లను క్రీ.శ. 8వ శతాబ్దం నుంచి 11వ శతాబ్దం వరకు పాలించారు. భారతదేశంలో బౌద్ధ మతాన్ని ఆదరించిన చివరి రాజవంశంగా పాలవంశాన్ని పేర్కొనవచ్చు. వీరు వజ్రయాన మతాన్ని గొప్పగా ఆదరించారు. వీరి కాలంలోనే ఈ మతం టిబెట్‌కు కూడా వ్యాప్తి చెందింది.

గోపాల: గౌడ శశాంకుడి తదనంతరం బెంగాల్‌లో మత్స్యన్యాయం రాజ్యమేలింది. దాదాపు 100 సంవత్సరాలు సాగిన ఈ రాజకీయ అనిశ్చితిని అంతం చేసి గోపాల క్రీ.శ.750లో పాలరాజ్యాన్ని స్థాపించాడు. ఇతడిని ప్రజలే తమ రాజుగా ఎన్నుకున్నారు. గోపాలుడు తన రాజ్యంలో శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించాడు.

బౌద్ధమతాన్ని ఆదరించాడు. ఓదంతపురి విహారాన్ని నిర్మించాడు.

ధర్మపాల: కనౌజ్ కోసం జరిగిన త్రిరాజ్య యుద్ధాల్లో పాల్గొన్న మొదటి పాలరాజు ధర్మపాల. కనౌజ్ ఆక్రమణ కోసం ప్రతీహారులతో, రాష్ట్రకూటులతో ఇతడు యుద్ధాలు చేశాడు.

ప్రతీహార సామంతుడు ఇంద్రాయుధుడిని ఓడించి కనౌజ్‌ను ఆక్రమించాడు. కానీ ప్రతీహార రెండో నాగభటుడు ఇతడిని మాంఘీర్ యుద్ధంలో ఓడించాడు. ధర్మపాలుడు కూడా గొప్ప బౌద్ధ మతాభిమాని. ఇతడు విక్రమపుర, సోమపుర బౌద్ధ విశ్వ విద్యాలయాలను స్థాపించాడు. అంతేకాకుండా గుప్తుల కాలంలో స్థాపించిన నలంద విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరించి దాని నిర్వహణకు రెండు వందల గ్రామాలను దానంగా ఇచ్చాడు. బౌద్ధ బిక్షువుల కోసం దాదాపు 50 మత సంస్థలను స్థాపించాడు. ఇతడి ఆస్థానంలో హరిభద్రుడు అనే గొప్ప బౌద్ధ పండితుడు ఉండేవాడు.

మాదిరి ప్రశ్నలు

1. ఖజురహో దేవాలయాల గురించి తొలి సారిగా ప్రస్తావించిన విదేశీ చరిత్ర కారుడు/ రచయిత?
   1) సులేమాన్, అల్‌మసూదీ
   2) అల్‌బెరూనీ, ఇబ్నబతూతా
   3) అబ్దుల్ రజాక్, అబ్దుల్ రహీం
   4) వి.ఎ. స్మిత్, రాబర్ట్ సీవెల్
2. పంజాబ్ హిందూషాహీరాజు ఆనంద పాలుడి కూటమిలో చేరి మహ్మద్ గజనీ దాడిని ఎదుర్కొన్న చాందేల రాజు?
   1) ధంగ 2) గండ
   3) జయపాల 4) యశోవర్మన్
3. ఖజురహోలోని కందరీయ మహాదేవ ఆలయ నిర్మాత?
   1) విద్యాధర 2) గండ
   3) ధంగ 4) నన్నుక
4. కుతుబుద్దీన్ ఐబక్ దాడిని ఎదుర్కొన్న చాందేల రాజు?
   1) త్రిలోక్య వర్మన్ 2) మదన వర్మన్
   3) పరమార్థి దేవ 4) వీరవర్మన్
5. ఖజురహో దేవాలయాలను ఏ వాస్తు శిల్ప కళాశైలికి పరాకాష్ఠగా భావిస్తారు?
   1) ద్రావిడ 2) నగర
   3) వెస్సార 4) ఇండో–పర్షియన్
6. తొలిసారిగా హిందీలో శాసనాలను జారీ చేసినవారు?
   1) చౌహాన్‌లు 2) చాందేలులు
   3) గహద్వాలులు 4) ప్రతీహారులు
7. కామసూత్ర శిల్పాలతో దేవాలయాలను నిర్మించినవారు?
   1) చాందేలులు 2) చోళులు
   3) పరమారులు 4) పాలరాజులు
8. కనౌజ్ రాజధానిగా పాలించిన రాజ వంశాలు?
   1) మౌఖరీలు
   2) మౌఖరీలు, ప్రతీహారులు
   3) మౌఖరీలు, ప్రతీహారులు, గహద్వాలులు
   4) ఎవరూ కాదు
9. తురుష్క దండన అనే పన్నును విధించిన రాజు?
   1) మూడో పృథ్వీరాజ్ చౌహాన్
   2) గహద్వాల జయచంద్ర
   3) చంద్రదేవ 4) ఆనంద పాలుడు
10. లక్ష్మీధరుడు కృత్యకల్పతరు గ్రంథాన్ని ఎవరి ఆస్థానంలో రచించాడు.
    1) సిద్ధరాజ జయసింహ
    2) గోవింద చంద్ర
    3) పృథ్వీరాజ 4) జయచంద్ర
11. బంగారు నాణేలను జారీ చేసిన ఏకైక గహద్వాల రాజు?
    1) గోవిందచంద్ర 2) జయచంద్ర
    3) విజయచంద్ర 4) యశోవిగ్రహ
12. నైషధ చరితం గ్రంథకర్త?
    1) శ్రీహర్షుడు 2) శ్రీనాథుడు
    3) లక్ష్మీధరుడు 4) జయచంద్రుడు
13. మహ్మద్‌ఘోరీ ఏ యుద్ధంలో గహ ద్వాలులను అంతం చేశాడు?
    1) మొదటి తరైన్ 2) రెండో తరైన్
    3) బనారస్ యుద్ధం
    4) చాందావార్ యుద్ధం
14. కల్హణుడు ఏ కాశ్మీర్ రాజుకు సమకాలీనుడు?
    1) హర్ష
    2) క్షేమగుప్త
    3) అవంతీవర్మన్
    4) లలితాదిత్య ముక్తాపీడ
15. దిలికపుర (ఢిల్లీ) నగరాన్ని నిర్మించిన రాజ వంశం?
    1) చౌహాన్‌లు 2) ప్రతీహారులు
    3) గహద్వాలులు 4) తోమారులు
16. **మహ్మద్ ఘోరీని మౌంట్ అబూ యుద్ధంలో ఓడించిన రాజు?**
    1) మొదటి భీమ 2) రెండో మూలరాజ
    3) విగ్రహరాజ- 4 4) పృథ్వీరాజ- 3
17. గుజరాత్‌పై జరిగిన ఇల్టుట్‌మిష్ దాడిని తిప్పికొట్టినది?
    1) రెండవ భీమ 2) మొదటి భీమ
    3) మొదటి నాగభటుడు
    4) రెండో నాగభటుడు
18. **మౌంట్ అబూలోని విమల దేవాలయ నిర్మాతలు?**
    1) చౌహాన్‌లు 2) సోలంకీలు
    3) పరమారులు 4) గహద్వాలులు
19. సోలంకీలు నిర్మించిన సూర్య దేవాలయం ఉన్న ప్రాంతం ఏది?
    1) మార్తాండ్ 2) కోణార్క్
    3) మధుర 4) బరోడ
20. గజనీ మహ్మద్ ధ్వంసం చేసిన సోమనాథ్ దేవాలయాన్ని పునర్నిర్మించినవారు?
    1) రెండవ భీమ 2) రెండవ మూలరాజ
    3) విగ్రహరాజ 4) సామంతరాజ
21. అజ్మీర్ నగర నిర్మాత?
    1) 4వ-విగ్రహరాజ 2) 1వ- అజయరాజ
    3) 2వ- అజయరాజ
    4) 3వ - పృథ్వీరాజ

సమాధానాలు:
1) 2; 2) 2; 3) 1; 4) 3; 5) 2; 6) 2; 7) 1; 8) 3; 9) 3; 10) 2; 11)1; 12) 1; 13) 4; 14) 1; 15) 4; 16) 2; 17) 1; 18) 2; 19) 3; 20)1; 21) 3.

ఉష్ణరక్త జీవికి ఉదాహరణ?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

- **ఎగిరే పక్షుల శరీరం పడవ ఆకారంలో ఉంటుంది.**
- **వీటి ఎముకలు గుల్లగా ఉంటాయి. వీటిలో వాయుసంచులు ఉంటాయి.**
- **బయాలజీ అనే పదాన్ని కనుగొన్నది 'లామార్క్'.**
- **సరీసృపాల్లోని గుండె గదుల సంఖ్య 'మూడు'. కానీ మొసలిలో నాలుగు గదుల గుండె ఉంటుంది.**

జీవశాస్త్ర పరిచయం

జీవశాస్త్రం (బయాలజీ) అనే పదం బయోస్ (జీవం), లాగస్ (అధ్యయనం) అనే గ్రీకు పదాల నుంచి ఉద్భవించింది. అరిస్టాటిల్ (క్రీ.పూ. 384–322) అనేక జీవశాస్త్ర ప్రాథమిక భావనలు ఇచ్చారు. అందువల్ల ఆయనను 'జీవశాస్త్ర పితామహుడు' అంటారు.

జీవశాస్త్రంలో రెండు విభాగాలుంటాయి

1. జంతు శాస్త్రం (జువాలజీ – జోవన్ అంటే జంతువు, లాగోస్ అంటే అధ్యయనం)
2. వృక్షశాస్త్రం (బోటనీ – బొటానె అనే మాటకు మొక్క అని అర్థం)

- మొక్కలు స్వయం పోషకాలు. అంటే తమ ఆహారాన్ని తామే తయారుచేసుకుంటాయి. కిరణజన్య సంయోగక్రియలో సూర్యరశ్మి సమక్షంలో కార్బన్ డై ఆక్సైడ్, నీరు కల వడం వల్ల పిండిపదార్థం లేదా కార్బో హైడ్రేట్ ఏర్పడుతుంది. ఈ చర్యకు అవసరమైన క్లోరోఫిల్ (పత్రహరితం) మొక్కల్లో ఉంటుంది. శిలీంద్రాల్లో పత్రహరితం ఉండదు. అవి సేంద్రియ పదార్థాలపై ఆధారపడి జీవిస్తాయి.
- జంతువులు ఆహారం కోసం ఇతర జీవులపై ఆధారపడతాయి. అందువల్ల వీటిని పర పోషకాలు (Heterotrophs) అంటారు.
- కుళ్లుతున్న సేంద్రియ పదార్థాలపై ఆధారపడే జీవులు 'పూతికాహారులు(Saprophytes)' ఇవి కళేబరాలపై ఆధారపడి జీవిస్తాయి.
- ఆహారం లేదా ఆవాసం లేదా రెండింటి కోసం ఇతర జీవుల శరీరాన్ని అంటిపెట్టుకునే జీవులను 'పరాన్నజీవులు' అంటారు.
- అతిథేయి శరీరం బయటకు అంటి పెట్టుకునేవి బాహ్య పరాన్నజీవులు ఉదా: జలగ. అతిథేయి లోపలి భాగాల్లో నివసించేవి అంతర పరాన్న జీవులు
  ఉదా: ఆస్కారిస్ (ఏలికపాము)
- సహజీవనంలో రెండు రకాల జీవులు పరస్పర సహకారం అందించుకుంటాయి.

పోషణ: ఏ జీవుల ప్రధాన లక్షణం జీవనక్రియలు జరుపుకోవడం. ఈ క్రియల్లో జీర్ణక్రియ ఒకటి. శక్తి కోసం జీర్ణక్రియ అవసరం.

- ఏకకణ జీవులైన ప్రాథమిక జీవుల్లో జీర్ణవ్యవస్థ ప్రత్యేకంగా అభివృద్ధి చెంది ఉండదు.
- ఏకకణ జీవుల్లో కణాంతర జీర్ణక్రియ ఉంటుంది.

కణం: జీవి ప్రాథమిక ప్రమాణం కణం. దీన్ని రాబర్ట్ హుక్ గుర్తించాడు.

కణజాలం: ఒకే విధమైన నిర్మాణం కల్గి, ఒకే పనిని నిర్వర్తించే కణాల సమూహాన్ని కణజాలం అంటారు. భిన్న కణజాలాలు కలిసి అవయవం ఏర్పడుతుంది.

వ్యవస్థ: భిన్న అవయవాలు కలిసి ఒకే పనిని నిర్వర్తిస్తే దాన్ని 'అవయవ వ్యవస్థ' అంటారు. జీవి శరీరంలో జీర్ణ, శ్వాస, విసర్జన, ప్రత్యుత్పత్తి, నాడీ, రక్తప్రసరణ, అంతస్రావ వ్యవస్థలుంటాయి.

జంతువులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.
1. వెన్నెముక లేని జీవులు
2. వెన్నెముక ఉన్న జీవులు

వెన్నెముక లేని జీవులను 9 వర్గాలుగా విభజించారు.

- **ప్రోటోజోవా:** ప్రోటో అంటే ప్రాథమిక, జోవన్ అంటే జంతువులు అని అర్థం.
- **పొరిఫెరా:** పొరి అంటే పోరస్ (రంధ్రాలు ఉన్న), ఫెరిన్ అంటే కల్గి ఉండేవి అని అర్థం. రంధ్రాలు కల్గిన జీవులు. ఉదా: స్పంజికలు
- **సీలెంటరేటా:** ఆయికులాస్ ఎంటిరాన్ పదాల కలయికతో సీలెంటరేటా వచ్చింది. ఆయికులాస్ అంటే గొట్టం, ఎంటిరాన్ ఆహారనాళం అని అర్థం. వీటిలో గొట్టం లాంటి ఆహారనాళం ఉంటుంది. ఇవి ద్విస్తరిత (డిప్లోబ్లాస్టిక్) జీవులు. ఉదా: హైడ్రా.
- **ప్లాటీ హెల్మింథిస్:** ప్లాట్ అంటే బల్లపరుపు, హెల్మింథ్స్ అంటే పురుగులు అని అర్థం. ఇవి బల్లపరుపు శరీర నిర్మాణం కల్గిన జీవులు. ఇవి పరాన్నజీవులు.
  ఉదా: టీనియా సోలియం(బద్దెపురుగులు)
- **నిమాటి హెల్మింథిస్:** ఇవి గుండ్రటి పురుగులు. ఎక్కువగా పరాన్నజీవులు.
  ఉదా: ఏలిక పాము (ఆస్కారిస్)
- **అనెలిడా:** అన్యులస్ అంటే వలయాకార ఖండితాలు అని అర్థం. ఈ జీవుల్లో ఇలాంటి అవయవ వ్యవస్థలుంటాయి. సీలోం (శరీర కుహరం) ఉంటుంది.
  ఉదా: వానపాము, జలగ.
- **ఆర్థ్రోపొడా:** ఆర్థ్రాస్ అంటే కీళ్లు కలిగిన పోడియం – కాళ్లు. కీళ్లు కల్గిన (ఖండితాలున్న) కాళ్లు ఉండటం వీటి లక్షణం. బాహ్య అస్థిపంజరం కల్గిన కీటకాలుంటాయి.
  ఉదా: బొద్దింక, ఈగ, దోమ.
- **మొలస్కా:** మెత్తని శరీరం కల్గినది అని అర్థం. దీంట్లో కర్పరాలుంటాయి.
  ఉదా: ఆల్చిప్ప, నత్త.
- **ఇఖైనోడెర్మేటా:** ఇఖినస్ అంటే ముళ్లు, డర్మా అంటే చర్మం. చర్మంపై ముళ్లు కల్గిన జీవులు అని అర్థం. ఉదా: సముద్ర నక్షత్రం.

వెన్నెముక ఉన్న జీవులు:

వీటిని నాలుగా రకాలుగా విభజించారు.

- **చేపలు:** జలచరాలు. శీతల రక్త జీవులు (పరిసర ఉష్ణోగ్రత మారినప్పుడు రక్తం ఉష్ణోగ్రత మారుతూ ఉంటుంది). వీటిలో రెండుగదుల గుండె ఉంటుంది. ఇవి చాలా వరకు అండోత్పాదకాలు.
- **ఆంఫిబియా (ఉభయచరాలు):** నేలపైనా, నీటిలోనూ నివసిస్తాయి. ఇవి కూడా శీతల రక్తజీవులు. 3 గదుల గుండె ఉంటుంది. ఇవి అండోత్పాదకాలు.
- **సరీసృపాలు:** ఇవి నేలపై పాకే జీవులు. శీతల రక్తజీవులు. 3 గదుల గుండె (2 కర్ణికలు, అసంపూర్తిగా విభజితమైన జఠరిక) ఉంటుంది. ఇవి అండోత్పదకాలు.
  ఉదా: పాము, బల్లి, మొసలి.
- **పక్షులు:** ఉష్ణరక్త జీవులు. అంటే రక్తం ఉష్ణోగ్రత పరిసర ఉష్ణోగ్రతలో మారకుండా స్థిరంగా ఉంటుంది. 4 గదుల గుండె ఉంటుంది. ఇవి ఈకలు కల్గిన జీవులు, అండోత్పదకాలు.
- **క్షీరదాలు:** పాలిచ్చే శిశుత్పాదకాలు. నాలుగు గదుల గుండె ఉంటుంది. ఉష్ణరక్త జంతువులు. ఉదా: ఆవు, మేక, కుక్క, మానవుడు.

మాదిరి ప్రశ్నలు

1. బయాలజీ అనే పదానికి సంబంధించి కిందివాటిలో సరైన జత ఏది?
   1) గ్రీకు – అరిస్టాటిల్
   2) గ్రీకు – లామార్క్
   3) ఫ్రెంచ్ – లామార్క్
   4) ఏదీకాదు
2. 'జీవశాస్త్ర పితామహుడు' అని ఎవరిని పేర్కొంటారు?
   1) లామార్క్ 2) థియోప్రాస్టస్
   3) అరిస్టాటిల్ 4) ప్లేటో
3. బొటానె అనే మాటకు అర్థం?
   1) విత్తనం 2) వేరు
   3) మొక్క 4) ఫలం
4. కిందివాటిలో ఏ గ్రీకు పదానికి జంతువు అనే అర్థం ఉంది?
   1) బొటానె 2) జోవన్
   3) లాగస్ 4) బయోస్
5. బయోస్, లాగస్ అనే పదాల నుంచి బయాలజీ ఉద్భవించింది. కిందివాటిలో వీటి అర్థాలు వరుసగా..
   1) అధ్యయనం, మొక్కలు
   2) జంతువులు, శాస్త్రం
   3) మొక్కలు, జంతువులు
   4) జీవం, అధ్యయనం
6. మొక్కలు, జంతువుల పోషణకు సంబం ధించి కిందివాటిలో సరైన ప్రవచనం?
   1) మొక్కలు పరాన్నజీవులు, జంతువులు పరపోషకాలు
   2) జంతువులు పరపోషకాలు, మొక్కలు స్వయం పోషకాలు
   3) మొక్కలు పూతికాహారులు, జంతువులు పరాన్నజీవులు
   4) జంతువులు పరపోషకాలు, మొక్కలు పరపోషకాలు
7. జలగ ఏ రకానికి చెందిన జీవి?
   1) పూతికాహార జీవి
   2) అంతర పరాన్న జీవి
   3) స్వయంపోషకం
   4) బాహ్య పరాన్న జీవి
8. ఏ రకమైన జీవులు కుళ్లుతున్న సేంద్రియ పదార్థాలపై ఆధారపడి జీవిస్తాయి?
   1) పరాన్నజీవులు
   2) పూతికాహారులు
   3) సహభోజకులు 4) పరపోషకాలు
9. ప్రొటోజోవా వర్గానికి చెందిన ఏకకణ జీవుల్లో ఈ రకానికి చెందిన జీర్ణక్రియ జరుగుతుంది?
   1) కణబాహ్య జీర్ణక్రియ
   2) అసంపూర్ణ జీర్ణక్రియ
   3) కణాంతర జీర్ణక్రియ
   4) ఎక్స్ట్రా కార్పోరియర్ జీర్ణక్రియ
10. ఏలికపాము, బద్దెపురుగు, స్పంజికలు వరుసగా ఏ వర్గాలకు చెందుతాయి?
    1) ప్లాటిహెల్మింథిస్, నిమాటి హెల్మింథిస్, పొరిఫెరా
    2) నిమాటి హెల్మింథిస్, ప్లాటిహెల్మింథిస్, మొలస్కా
    3) ప్లాటిహెల్మింథిస్, ఇఖైనోడెర్మేటా, ప్రోటోజోవా
    4) నిమాటి హెల్మింథిస్, ప్లాటిహెల్మిం థిస్, పొరిఫెరా
11. ఆల్చిప్ప ఏ వర్గానికి సరైన ఉదాహరణ?
    1) మొలస్కా 2) ఇఖైనోడెర్మేటా
    3) పొరిఫెరా 4) అనెలిడా
12. ఇఖైనోడెర్మేటా జీవుల ప్రధాన లక్షణం?
    1) రంధ్రాలు కల్గి ఉండటం
    2) శరీరత్వచం రెండు పొరలతో ఉండటం
    3) శరీరంపై ముళ్లు ఉండటం
    4) ఖండితాలు కల్గిన కాళ్లు ఉండటం
13. కిందివాటిలో సరైన ప్రవచనం ఏది?
    1) అమీబా బహుకణ జీవి
    2) హైడ్రా ద్విస్తరిత జీవి
    3) బొద్దింక అనెలిడా వర్గానికి చెందింది
    4) బద్దెపురుగు పరాన్నజీవి కాదు
14. ఉష్ణరక్త జీవికి ఉదాహరణ?
    1) కప్ప 2) చేప
    3) మొసలి 4) ఆవు
15. సరీసృపాలకు చెందిన నాలుగు గదుల గుండె ఉన్న జీవి?
    1) బల్లి 2) మొసలి
    3) పావురం 4) తాబేలు

సమాధానాలు
1) 2; 2) 3; 3) 3; 4) 2; 5) 4; 6) 2; 7) 4; 8) 2; 9) 3; 10) 4; 11) 1; 12) 3; 13) 2; 14) 4; 15) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన కోల్‌కతా షిప్ రిపేర్ యూనిట్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్(మెకానికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో డిగ్రీ (మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** 12.05.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **స్టైపెండ్:** నెలకు మొదటి ఏడాది రూ. 46,000,రెండో ఏడాది రూ.48,000, మూడో ఏడాది రూ.50,000,నాలుగో ఏడాది రూ.52,000, ఐదో ఏడాది రూ.54,000.
- **ఎంపిక విధానం:** పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.05.2025.
- **వెబ్‌సైట్:** https://cochinshipyard.in/

ట్రిపుల్ ఐటీ అలహాబాద్‌లో ఎంబీఏలో ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ట్రిపుల్ ఐటీ),అలహాబాద్‌లో.. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం సీట్ల సంఖ్య:** 95.
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు క్యాట్/గ్మాట్ /సీమ్యాట్/ మ్యాట్/ జీమ్యాట్ స్కోరు సాధించి ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఐమ్యాట్(ఐఐఐటీ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ టెస్ట్), గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.05.2025.
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** 02.06.2025.
- **ఇంటర్వ్యూ తేది:** 02.06.2025, 03.06.2025.
- **ఫలితాలు వెల్లడితేది:** 06.06.2025.
- **వెబ్‌సైట్:** https://mba.iiita.ac.in/

పల్నాటి యుద్ధంలో పాల్గొన్న కాకతీయ రాజు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఏపీ హిస్టరీ



మాదిరి ప్రశ్నలు

1. హాలుడు రచించిన గాథాసప్తశతిలో కృష్ణుడు గురించి ఏమని పేర్కొన్నారు?
   1) సుందరుడు 2) మోహనాంగుడు
   3) మధుమథనుడు 4) రతివల్లభుడు
2. శాతవాహన యుగంలో 'శ్రేణి ధర్మం' అంటే?
   1) యుద్ధ సమయంలో కాల్బలం పాటించవలసిన నియమాలు
   2) శాతవాహన రాజు రాజ్యపాలనలో పాటించవలసిన నియమాలు
   3) నికాయసేణు సభ్యులు పాటించవలసిన నియమాలు
   4) శాతవాహన రాణి కి తన రాజుపట్ల ఉండే బాధ్యత
3. ఆంధ్రుల ప్రశంస దేనిలో కనిపిస్తుంది?
   ఎ) ఐతరేయ బ్రాహ్మణం
   బి) మార్కండేయ పురాణం
   సి) రామాయణం
   1) ఎ,బి 2) బి,సి
   3) ఎ,సి 4) పైవన్నీ
4. శాతవాహన యుగంలో సుగంధ ద్రవ్యాలను తయారుచేసే వారిని ఏ పేరుతో వ్యవహరించేవారు?
   1) గధికులు 2) సేల వధకులు
   3) చంకుకారులు 4) తిలపిష్టకులు
5. శాతవాహనులు కర్ణాటక ప్రాంతానికి చెందిన వారని వి.ఎస్. సుక్తాంకర్ దేని ఆధారంగా చెప్పాడు?
   1) నాసిక్ శాసనం
   2) హిరహడగల్లి శాసనం
   3) నానాఘట్ శాసనం
   4) భట్టిప్రోలు శాసనం
6. కింది వాటిలో సరైన జత ఏది?
   ఎ) దక్షిణాపథపతి - మొదటి శాతకర్ణి
   బి) దక్షిణాపథేశ్వరుడు-వాసిష్టీపుత్ర పులోమావి
   సి) దక్షిణాపథ సామ్రాట్టు- వాసిష్టీపుత్ర శాంతమూలుడు
   1) ఎ,బి 2) ఎ మాత్రమే
   3) ఎ,సి 4) పైవన్నీ
7. నాగార్జున కొండలో బౌద్ధ విహారాన్ని నిర్మించిన ఎహువల శాంతమూలుని సోదరి?
   1) శాంతిశ్రీ 2) హర్మ్యశ్రీ
   3) షష్టిశ్రీ 4) కొడబలిసిరి
8. శాసనాలు వీర పురుషదత్తుడిని ఏ పేరుతో పేర్కొంటున్నాయి?
   1) మాఢరీపుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
   2) వాసిష్టీపుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
   3) గౌతమీపుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
   4) శాంతిశ్రీ పుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
9. కింది వాటిలో సరైన జత ఏది?
   ఎ) గోరంట్ల శాసనం - అత్తివర్మ
   బి) మట్టిపాడు తామ్ర శాసనం - దామోదర వర్మ
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ,బి 4) ఎ,బి కాదు
10. క్రీ.శ.130 ప్రాంతంలో భారతదేశాన్ని సందర్శించిన టాలెమీ కృష్ణాముఖద్వారంలోని ఏ ప్రాంతం వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధి చెందిందని చెప్పాడు?
    1) ఘంటసాల 2) భట్టిప్రోలు (పిటింద్ర)
    3) ధరణికోట 4) నాగార్జున కొండ
11. ఇక్ష్వాకుల కాలంనాటి శిల్పాలలో 'మాంధాత శిల్పం' అతి ముఖ్యమైంది. ఈ శిల్పం ఎక్కడ లభించింది?
    1) జగ్గయ్యపేట 2) నాగార్జున కొండ
    3) అమరావతి 4) ఘటప్రభ
12. 'త్రిపురమర్త్య మహేశ్వర'గా కీర్తి పొందిన వేంగీ చాళుక్యుల రాజు?
    1) ఒకటో విజయాదిత్యుడు
    2) రెండో విజయాదిత్యుడు
    3) మూడో విజయాదిత్యుడు
    4) నాల్గో విజయాదిత్యుడు
13. త్రికాలయోగి సిద్ధాంత దేవునికి రామతీర్థంలో 'రామకొండ' అనే గుహాలయాన్ని నిర్మించి ఇచ్చిన రాజు?
    1) రెండో విజయాదిత్యుడు
    2) రాజరాజనరేంద్రుడు
    3) చాళుక్య భీముడు 4) విమలాదిత్యుడు
14. బెజవాడలో జైన సన్యాసుల కోసం 'నడుంబి వసతి' అనే బసదిని నిర్మించిన రాణి?
    1) రుద్ర భట్టారిక
    2) ఉపాసిక బోధిశ్రీ 3) చల్లవ్వ
    4) అయ్యణ మహాదేవి
15. జతపరచండి.
    జాబితా-I
    a) బెజవాడ శాసనం
    b) చీపురుపల్లి శాసనం
    c) కందుకూరి శాసనం
    d) విప్పర్ల శాసనం
    జాబితా-II
    i) గుణగ విజయాదిత్యుడు
    ii) కుబ్జ విష్ణువర్ధనుడు
    iii) రెండో యుద్ధమల్లుడు
    iv) జయసింహ వల్లభుడు
    1) a-i, b-ii, c-iii, d-iv
    2) a-iii, b-ii, c-i, d-iv
    3) a-iii, b-i, c-iv, d-ii
    4) a-ii, b-iv, c-i, d-iii
16. 'శబ్దచంద్రిక', శబ్దరత్నాకరం' అనే నిఘంటువులను రచించింది?
    1) నన్నయ్య భట్టు 2) కేతన
    3) వామనభట్టు 4) శ్రీనాథుడు
17. తెలుగులో కావ్య లక్షణాలు కనిపిస్తున్న అతి పురాతన గ్రంథం? (పండితుల అభిప్రాయం ప్రకారం)
    1) మహాభారతం 2) కుమార సంభవం
    3) ఆంధ్ర మహాభాగవతం
    4) నిర్వచనోత్తర రామాయణం
18. కింది వారిలో 'చండ చాళుక్యులు' అని ఎవరిని పిలిచేవారు ?
    1) వేంగీ చాళుక్యులు 2) బాదామి చాళుక్యులు
    3) కళ్యాణి చాళుక్యులు 4) రెడ్డి రాజులు
19. కింది వాటిలో పాత రాతి యుగానికి చెందిన ప్రదేశం?
    1) పాతపాడు 2) కీసరవల్లి
    3) నందికనుమ 4) ఉట్నూరు
20. ఆంధ్ర దేశంలో అతి ప్రాచీన బౌద్ధ స్తూపం ఎక్కడ ఉంది?
    1) అమరావతి 2) నాగార్జున కొండ
    3) భట్టిప్రోలు 4) ఘంటసాల
21. 'దేశభాషలందు తెలుగు లెస్స' అని వ్యాఖ్యానించినవారు?
    ఎ) నికోలో కొంటి బి) శ్రీకృష్ణదేవరాయలు
    సి) సి.పి. బ్రౌన్
    డి) వినుకొండ వల్లభామాత్యుడు
    1) ఎ,బి 2) బి,సి 3) బి,డి 4) ఎ,సి
22. మోటుపల్లి అభయవర్తక శాసనాన్ని అమలుపరచడానికి గణపతిదేవుడు ఎవరిని నియమించాడు?
    1) జాయపసేనాని 2) రేచర్ల రుద్రుడు
    3) గంగయ్య సేనాని 4) సిద్ధయ్య దేవుడు
23. 'సాగర గౌతమీ సవిల సంగమ సకల జలదుర్గ సాధన రఘురామ' బిరుదువహించిన రెడ్డి రాజు?
    1) ప్రోలయ వేమారెడ్డి
    2) అనవేమారెడ్డి 3) పెదకోమటి వేమారెడ్డి
    4) కొమరగిరి రెడ్డి
24. సవరం ఎల్లయ్య అనే రాజ్య పౌరుడు ఏ రెడ్డి రాజును చంపాడు?
    1) రాచవేమారెడ్డి 2) కొమరగిరి రెడ్డి
    3) అనవోతారెడ్డి 4) ప్రోలయ వేమారెడ్డి
25. పెదకోమటి వేమభూపతి రచించిన గ్రంథం?
    1) నృత్య రత్నావళి 2) గీతా రత్నావళి
    3) వేమభూపాల చరితం
    4) శృంగార దీపిక
26. పల్నాటి యుద్ధంలో పాల్గొన్న కాకతీయ రాజు?
    1) గణపతి దేవుడు
    2) రెండో ప్రతాపరుద్రుడు
    3) రుద్రదేవుడు
    4) ఎవరూ కాదు
27. నిమ్నకులాల వారికి ఆలయ ప్రవేశం కల్పించడం కోసం బ్రహ్మనాయుడు నిర్మించిన ఆలయం?
    1) రుద్రేశ్వర ఆలయం
    2) ప్రసన్న కేశవాలయం
    3) చెన్నకేశ్వర ఆలయం
    4) రామప్ప దేవాలయం
28. బ్రహ్మ సమాజ కార్యకలాపాల్లో మచిలీపట్నంలో ప్రముఖ పాత్ర వహించింది?
    1) కోకా వెంకటరత్నం
    2) కందుకూరి వీరేశలింగం
    3) రఘుపతి వెంకటరత్నం నాయుడు
    4) దేశిరాజు పెదబాపయ్య
29. 1898లో రాజా ఆర్.వి. కృష్ణారావు ప్రారంభించిన 'సరస్వతి' అనే పత్రిక కోసం కొంతకాలం పనిచేసిన వ్యక్తి?
    1) చిలకమర్తి లక్ష్మీనరసింహం
    2) న్యాపతి సుబ్బారావు
    3) కందుకూరి వీరేశలింగం
    4) కొక్కొండ వెంకటరత్నం
30. మహిళలకు సమానత్వం, శాస్త్రీయ విద్యా విధాన ఆవశ్యకత గురించి వివరించిన 'హిత సూచిని' గ్రంథ రచయిత?
    1) కందుకూరి వీరేశలింగం
    2) పరవస్తు వేంకట రంగాచార్యులు
    3) ఏనుగుల వీరాస్వామి
    4) స్వామినేని ముద్దు నరసింహం
31. రఘుపతి వెంకటరత్నం నాయుడు ఆంధ్ర బ్రహ్మోపాసన మందిరాన్ని ఎక్కడ నెలకొల్పాడు?
    1) మచిలీపట్నం 2) కాకినాడ
    3) రాజమండ్రి 4) సికింద్రాబాద్
32. దత్తమండలాలకు థామస్ మన్రోను ప్రధాన కలెక్టర్‌గా ఎప్పుడు నియమించారు?
    1) 1879 అక్టోబర్ 4
    2) 1800 అక్టోబర్ 4
    3) 1801 అక్టోబర్ 4
    4) 1807 అక్టోబర్ 4
33. కమ్యూనిస్ట్ పార్టీ మొదటిసారిగా 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే నినాదాన్ని ఇచ్చింది?
    1) 1952 2) 1950
    3) 1948 4) 1946
34. ఆంధ్రదేశంలో ప్రారంభించిన స్వరాజ్య పార్టీ శాఖ అధ్యక్షుడు?
    1) వి.రామదాసు
    2) ఉన్నవ లక్ష్మీనారాయణ
    3) మద్దూరి అన్నపూర్ణయ్య
    4) దర్శి చెంచయ్య
35. 'చెన్నపట్నం స్వదేశీ సంఘం' కింది ఏ శిస్తు వసూలు పద్ధతిని సూచించింది?
    1) శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి
    2) రైత్వారీ పద్ధతి
    3) గ్రామవారీ పద్ధతి
    4) ఏదీకాదు
36. కింది వారిలో 1879లో జరిగిన రంపా తిరుగుబాటుకు నాయకత్వం వహించనివారు?
    1) రమాభూపతి దేవుడు
    2) తమ్మన్న దొర
    3) పులికంటి సాంబయ్య
    4) అంబుల్ రెడ్డి
37. బ్రిటిష్ వారు అనుసరించిన పన్నుల విధానాన్ని ఉద్దేశించి 'ఉప్పుకు పన్ను, పప్పుకు పన్ను' అని వ్యాఖ్యానించింది?
    1) కొండా వెంకటప్పయ్య
    2) గరిమెళ్ల సత్యనారాయణ
    3) బసవరాజు అప్పారావు
    4) త్రిపురనేని రామస్వామి చౌదరి
38. గాంధీజీ ఆస్థాన కవిగా ఎవరిని పేర్కొంటారు?
    1) పట్టాభి సీతారామయ్య
    2) తుమ్మల సీతారామమూర్తి
    3) వావిలాల గోపాలకృష్ణయ్య
    4) జమలాపురం కేశవరావు
39. ఆంగ్ల విద్యావ్యాప్తికి ఏర్పడిన అనువైన పరిస్థితుల గురించి దాసు శ్రీరామకవి ఏ కావ్యంలో పేర్కొన్నాడు?
    1) ఆంధ్రనాడు 2) తెలుగుదేశం
    3) ఆంధ్రదేశం 4) తెలుగునాడు
40. ఆంధ్రదేశంలో మొదటి బాలికా పాఠశాలగా దేనిని పేర్కొంటారు?
    1) విక్టోరియా బాలికా పాఠశాల
    2) రెవరెండ్ నోబెల్ పాఠశాల
    3) వివేకవర్ధిని బాలికా పాఠశాల
    4) రాజమండ్రి బాలికా పాఠశాల
41. 1879లో జరిగిన రంపా తిరుగుబాటుకు ప్రధాన కారణమైన చిగురు పన్నును ఎవరిపై విధించారు?
    1) కల్లుతీసే గిరిజనులపై
    2) పోడు వ్యవసాయం చేసే గిరిజనులపై
    3) నేత కార్మికులపై
    4) పశువుల కోసం కోసే గడ్డిపై
42. ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణంలో ఆర్థర్ కాటన్‌కి సహకరించిన భారతీయ అధికారి?
    1) కెప్టెన్ ఓర్ 2) వీనం వీరన్న
    3) కావలి బొర్రయ్య
    4) దామెర్ల వెంకటాద్రి
43. జతపరచండి.
    జాబితా-I
    a) బొబ్బిలి యుద్ధం
    b) చందుర్తి యుద్ధం
    c) కొండూరు యుద్ధం
    d) వందవాసి యుద్ధం
    జాబితా-II
    i) 1757
    ii) 1758
    iii) 1759
    iv) 1760
    1) a-i, b-ii, c-iii, d-iv
    2) a-ii, b-i, c-iii, d-iv
    3) a-i, b-ii, c-iv, d-iii
    4) a-i, b-iii, c-ii, d-iv
44. కావలి సోదరులు అంటే ఎవరు?
    1) వెంకటాద్రి, అయ్యప్ప
    2) దామోదర్, బాలకృష్ణ
    3) బొర్రయ్య, బాలకృష్ణ
    4) బొర్రయ్య, వెంకట రామస్వామి
45. కింది వాటిలో సరికాని జత ఏది?
    ఎ) ఆంధ్ర నేతాజీ - పర్వతనేని వీరయ్య చౌదరి
    బి) ఆంధ్ర వాల్మీకి-వావికొలను సుబ్బారావు
    సి) ఆంధ్ర గాంధీ-వావిలాల గోపాలకృష్ణయ్య
    1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
    3) సి మాత్రమే 4) ఎ,బి

సమాధానాలు

1) 3	2) 3	3) 4	4) 1	5) 2
6) 4	7) 4	8) 1	9) 3	10) 2
11) 1	12) 3	13) 4	14) 4	15) 2
16) 3	17) 2	18) 1	19) 3	20) 3
21) 3	22) 4	23) 2	24) 1	25) 4
26) 3	27) 3	28) 3	29) 1	30) 4
31) 2	32) 2	33) 4	34) 1	35) 3
36) 1	37) 2	38) 2	39) 4	40) 1
41) 1	42) 2	43) 1	44) 4	45) 1

What is the total distance between..



Bank Exams

Reasoning

Model Questions

Directions (Q.No.1-5): Study the following information carefully and answer the questions given below.

Certain number of people was seated in a linear row facing north. One of them was seated at the end. Information about some of them is known. There were not more than 13 people. At least six people were seated between P and U where P was to the right of U. V was to the immediate right of S. T was seated second from the right end of the row. The number of people to the left of Q was more than twice the number of people to the right of Q. Only one person was seated between R and S. There were not more than 5 people sitting between R and Q. R was not seated adjacent to U. No three people mentioned were sitting together.

1. How many people were seated in the row?
   a) 8 b) 12 c) 10 d) 11
   e) Cannot be determined
2. Who was seated second to the left of R?
   a) P b) Q c) U
   d) No body e) Data insufficient
3. How many people were seated between Q and S?
   a) 3 b) 5 c) 7 d) 8
   e) Cannot be determined
4. What is the position of T with respect to U?
   a) Second to the right
   b) Tenth to the right
   c) Fourth to the left
   d) Immediate right
   e) Immediate left
5. How many people were seated to the left of S?
   a) 6 b) 4 c) 9
   d) 3 e) 7

Directions (Q.No.6-10): Study the following information carefully and answer the questions given below.

Eight persons A, B, C, D, E, F, G and H went to a conclave. It was seen that each person was of a different age. The partial sequence of their ages is as follows:

___ > ___ > F > ___ > ___ > ___ > ___
(39) (27) (23)
D > ___

They were seated in a straight row facing the North. The partial arrangement is shown below:

___ B ___ ___ ___ ___ ___ G
(25) (36)

The numbers shown in the brackets denote age.

» The person aged 31 was seated 3rd to the left of the one who was aged 27.
» B was aged more than G.
» The person who was 39 years old was seated 2nd to the left of F
» E was the 2nd eldest person and was seated to the immediate right of C.
» The person aged 23 was to the immediate right of the one who was aged 22
» A was seated 3rd to the left of the one who was 19 years old
» D was not the eldest.

6. What was the age of the person who was at the extreme left end of the row?
   a) 31 b) 19 c) 22
   d) 39 e) Cannot be determined
7. What was the difference between the age of A and C?
   a) 1 year b) 2 years
   c) 3 years d) 4 years
   e) 9 years
8. Who among the following was seated to the immediate left of D?
   a) A b) E c) F
   d) B e) H
9. Who among the following was the 3rd youngest person?
   a) D b) B c) C
   d) A e) F
10. If all the digits at odd positions in the number "324846237" are changed to previous digit in the number series and all the digits at even positions are changed to next digit in the number series, then which digit appears more than twice in the number thus formed?
    a) More than one such digit is there
    b) 7 c) 2 d) 3
    e) No such digit is there

Directions (Q.No.11-15): Study the information carefully and answer the questions given below.

Six people were born in different years with the current base is taken as 2018. None of them is older than 90 years old. They like different colours Red, Orange, Green, Blue, Black and Yellow.

A was born in the year 1981. The difference of age between A and C is 23 years. B's age is sum of the digits of the year in which C was born. The one who likes Blue colour is 6 years elder to B. The one who likes green colour is just younger than F. F's age is either the last two digits or reverse of the last two digits of the year in which the person who likes Blue colour was born. The difference between the age of D and the one who likes Green colour is 25 years. D is older than E. F is not the eldest. The one who likes Red colour is just elder than the one who likes Black colour. C does not like Orange colour.

Note - If mentioned the last two digits or reverse of the last two digits of the year in which a person is born can be the age of some other person. (Like A is born in 1943 and age of b is denoted by the last two digits of the birth year of A. Then B's age will be either 34 or 43).

11. Who among the following likes Orange colour?
    a) A b) D c) E
    d) B e) None of these
12. Who among the following is the eldest?
    a) A b) D c) C
    d) E e) None of these
13. Which of the following combination is true?
    a) A - 1981 - Black
    b) B - 2012 - Blue
    c) C - 2006 - Yellow
    d) F - 1958 - Black
    e) None of these
14. Which of the following statement is correct?
    a) A is three years younger than the one who likes Black
    b) C is the eldest
    c) E likes Blue colour
    d) E is born before A
    e) All are correct
15. In which of the following year F was born?
    a) 1995 b) 1958
    c) 1956 d) 2004
    e) None of these

Directions (Q.No.16-20): Study the following information carefully and answer the questions given below.

Eight persons P, Q, R, S, T, U, V, W are sitting around a rectangular table but not necessarily in the same order. Those who are sitting next to each have different distance from each other. Each of them facing towards the center. Some of them are sitting at the corners while some are sitting on the side of the table. The area of the rectangular table is $540m^2$. The length of the table is 7m more than the breadth of the table. R sits at one of the corners of the table. T sits second to the left of R. P is sitting at a distance of 14m from T. Only two persons sit between P and Q. The distance between R and U is twice of the distance between R and V. W faces R. P sits immediate right of W and at a distance of 13m, Neither Q nor S is an immediate neighbour of R. The distance between R and U is 2m more than the distance between P and T. U is not an immediate neighbour of T. The distance between Q and W is equal to the distance between R and U. The distance between Q and S is half of the distance between V and T. T does not sit at the corner of the table.

16. What is the total distance between V and W?
    a) 40 m b) 15 m c) 24 m
    d) 39 m e) 49 m
17. Who among the following sits second to the left of Q?
    a) T b) W c) V
    d) P e) R
18. Which of the following is not true regarding U?
    a) U sits second to the left of S
    b) The distance between U and V is 24 m
    c) W sits third to the right of U
    d) P is an immediate neighbour of U
    e) All are correct
19. How many persons sits between T and U when counted from the left of U?
    a) Three b) One c) No one
    d) Four e) Two
20. What is the position of P with respect to S?
    a) Third from the right
    b) Second from the left
    c) Second from the right
    d) Fourth from the left
    e) None of these

Directions (Q.No.21-23): Study the following data carefully and answer the following given questions.

In a family, there are ten members A, B, J, K, L, N, P, Q, R and T. J is married to K. R is daughter of P. T is wife of N. A is paternal aunt of B. K is paternal aunt of R. Q is niece of A. N is son of J. T has two daughter. L is mother of R. Q and B are grand-daughter of J. Each child has either both their parents alive or none alive.

21. How many female members are there in the family?
    a) 5 b) 6 c) 7 d) 3 e) 4
22. Which of the following is true?
    a) J is brother of P
    b) T is sister of R
    c) Q is mother of R
    d) A is sister of L
    e) R is niece of K
23. How many generations and couples are there in the family?
    a) 2, 3 b) 3,3 c) 3,2
    d) 1, 3 e) 2, 1

KEY

1) b	2) c	3) a	4) b	5) b
6) d	7) d	8) c	9) d	10) d
11) d	12) b	13) d	14) c	15) b
16) d	17) e	18) d	19) e	20) c
21) c	22) e	23) b		